కదులుతున్న ప్రైవేటు బస్సులో

మహిళపై రేప్!

హైదరాబాద్‌లో ఘోరం

నిందితుడు ఆ బస్సు అదనపు డ్రైవరే

వెనక సీట్లో బిడ్డతో కలిసి నిద్రించిన మహిళ

ప్రయాణికులు గాఢనిద్రలో ఉండగా

నోట్లో బెడ్‌షీట్ కుక్కి అఘాయిత్యం

12

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 31-7-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 106 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి మ. 3.56 తదుపరి ద్వాదశి; నక్షత్రం: రోహిణి ఉ. 10.13 తదుపరి మృగశిర; వర్జ్యం: మ. 3.51-5.28; దుర్ముహూర్తం: ఉ. 11.55-12.46; అమృతఘడియలు: ఉ. 7.02-8.35, రా. 1.31-3.08; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.57; సూర్యాస్తమయం: 6.44 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కాంస్యం గెలుచుకున్న అనంతరం మనుతో కలిసి స్వర్ణ, రజత పతక విజేతలతో సెల్ఫీ తీసుకుంటున్న సరబ్‌జోత్‌సింగ్

అద్వితీయ మను

యువ షూటర్ మను భాకర్ ఖాతాలో రెండో పతకం

10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ డబుల్స్‌లో సరబ్‌జోత్‌తో కలిసి కాంస్యం

ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన భారత తొలి అథ్లెట్‌గా ఘనత

యువ షూటర్ మను మళ్లీ అద్భుతం చేసింది. రెండోసారి ఆమె 'గురి' అదిరింది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు రెండో పతకాన్ని తానే అందించింది. ఇప్పటికే 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ వ్యక్తిగత విభాగంలో కాంస్యం గెలుచుకున్న మను, అదే ఈవెంట్ మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ సత్తాచాటింది. సహచర షూటర్ సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి కాంస్యం సాధించింది. స్వాతంత్ర్యం తర్వాత ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన భారత అథ్లెట్‌గా మను రికార్డు సృష్టించింది. 1900వ సంవత్సరంలో పారిస్ వేదికగానే జరిగిన విశ్వక్రీడల్లో ఆంగ్లో ఇండియన్ నార్మన్ ప్రిచార్డ్ 200 మీటర్ల స్ప్రింట్, 200 మీటర్ల హర్డిల్స్‌లో రెండు రజత పతకాలు గెలిచాడు. ఇప్పటికే రెండు పతకాలతో ఊపు మీదున్న మను.. మూడో ఈవెంట్‌ను ఆగస్టు 2న ఆడనుంది. పారిస్‌లో నాలుగోరోజు పోటీల్లో మను-సరబ్‌జోత్ కాంస్య పతకంతో చరిత్ర సృష్టిస్తే.. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఫేవరెట్ జోడీ సాత్విక్-చిరాగ్ మరో విజయంతో తమ గ్రూపులో టాపర్‌గా నిలిచింది. మన హాకీ జట్టు వరుసగా రెండో విజయాన్ని అందుకోగా.. టేబుల్ టెన్నిస్‌లో మనికా బాత్రా ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించి పతకానికి చేరువైంది.

9



త్రివర్ణ పతాకంతో సరబ్‌జోత్ సింగ్, మను భాకర్

కొండ చరియలు సృష్టించిన బీభత్సం







సహాయక చర్యల్లో సిబ్బంది

మృత్యు విలయం

విరిగిపడిన కొండచరియలు.. వరద బీభత్సం.. వయనాడ్‌లో 133 మంది దుర్మరణం

65 కుటుంబాలు భూస్థాపితం!

వందలాది మందికి గాయాలు..

శిథిలాల కింద ఇంకా 250 మంది!

చలియార్ నదిలో కొట్టుకొచ్చిన మృతదేహాలు

శవాల దిబ్బగా చురుల్‌మల?

టీ-ఎస్టేట్‌లో 600 మంది అసోం, పశ్చిమ బెంగాల్ కార్మికుల గల్లంతు

ఓ రిసార్ట్‌లో చిక్కుకున్న 100 మంది

మదర్సా, మసీదుల్లో వైద్య శిబిరాలు

సహాయక చర్యల్లో త్రివిధ దళాలు, ఎన్డీఆర్ఎఫ్

ఇంతటి విషాదాన్ని ఎన్నడూ చూడలేదు: కేరళ సీఎం పినరయి

ప్రధాని మోదీ, రాహుల్ దిగ్భ్రాంతి

వయనాడ్, జూలై 30: 'గాడ్స్ ఓన్ కంట్రీ' కేరళ.. ప్రకృతి ప్రకోపానికి గురైంది.! పశ్చిమ కనుమల నడుమ.. తేయాకు తోటలు, ఏపుగా పెరిగిన రబ్బరు చెట్లు, చూపరులను ఆకట్టుకునే కొబ్బరి చెట్లతో ఆహ్లాదంగా ఉండే వయనాడ్‌పై విపత్తు విరుచుకుపడింది.! తెరపినివ్వకుండా కురుస్తున్న వర్షాలు.. బురదతో కూడిన వరద.. విరిగిపడ్డ కొండ చరియలు.. వెరసి సోమవారం అర్ధరాత్రి వయనాడ్‌కు కాళరాత్రిగా మారింది. పదుల సంఖ్యలో ఇళ్లు కొండ చరియల ధాటికి నేలమట్టమయ్యాయి. నిద్రలోనే 133 మంది పౌరుల ప్రాణాలు తిరిగి రాని అనంతలోకాలకు చేరుకున్నాయి. మరో 128 మంది క్షతగాత్రులయ్యారు. కొండ చరియల బీభత్సం ఒకవైపు.. వరదతో ఉప్పొంగిన నదులు మరోవైపు.. వరద ఉధృతికి శరీర భాగాలు తెగిపడి కిలోమీటర్ల దూరానికి కొట్టుకుపోతున్న మృతదేహాలు ఇంకోవైపు..! మృత్యుదేవత కరాళ నృత్యం చేస్తోందా? అన్నట్లు ఎక్కడ చూసినా మృతదేహాలు.. హాహాకారాలు.. ఆస్పత్రుల్లో బంధుమిత్రుల ఆర్తనాదాలు..! ఈ విపత్తులో వందల మంది గల్లంతయ్యారు. మరణాల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదముందని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. సహాయ చర్యల కోసం త్రివిధ దళాలు రంగంలోకి దిగాయి. ఎన్డీఆర్ఎఫ్, పారామిలటరీ, స్వచ్ఛంద సేవకులు రంగంలోకి దిగారు. ఈ విపత్తుపై రాజకీయ పార్టీలకు అతీతంగా యావత్ భారతం స్పందించింది. ప్రధాని నరేంద్ర మోదీ కేరళ సీఎం పినరయి విజయన్‌కు ఫోన్ చేసి, ధైర్యం చెప్పారు. కేరళ సర్కారు రెండ్రోజులపాటు సంతాపదినాలను ప్రకటించింది. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(పీఎస్సీ) పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు

మిగతా 2వ పేజీలో...



హెలికాప్టర్ ద్వారా బాధితుడి తరలింపు..



వరదలో కొట్టుకొచ్చిన జీపు

కాపాడండి ప్లీజ్

శిథిలాల కింద నుంచి బాధితుల ఫోన్‌కాల్స్

బ్లడ్ బ్యాంకుల వద్ద బారులు తీరిన దాతలు

కేరళ పాలిట చీకటి మాసాలు

జూలై, ఆగస్టు నెలల్లో అతి పెద్ద విపత్తులు

అరేబియా సముద్రం వేడెక్కడం, భూతాపం, పర్యావరణ మార్పులే కారణం

2

'ఎనీవేర్'.. భూముల చోర్!

అటు చుక్కల భూములు.. ఇటు జనం ఆస్తులు

వారికి తెలీకుండానే అడ్డగోలుగా కొట్టేసిన వైసీపీ

ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ముసుగులో భారీ భూదందా

ఎనీవేర్ రిజిస్ట్రేషన్! ఒక ప్రాంతంలో ఉన్న ఆస్తిని మరో ప్రాంతంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించిన విధానం! కానీ, ప్రజల చేతుల్లోని భూములను వైసీపీ పెద్దలు, ఆ పార్టీ స్థానిక నాయకులు తమ పేర్ల మీదకు బదలాయించుకునేందుకు ఈ విధానాన్ని యథేచ్ఛగా వాడేశారు. నిషేధ జాబితాలోని ప్రభుత్వ భూములను, అసైన్డ్ భూములను, దేవదాయ భూములనే గత ప్రభుత్వ పెద్దలు లాగేసుకున్నారని అనుకున్నారు. కానీ, జనం భూములు, ఆస్తులు సైతం 'ఎనీవేర్' ముసుగులో కొల్లగొట్టారని ఇప్పుడిప్పుడే బయటకు వస్తోంది. దీంతో జనం ఎక్కడికక్కడ రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై దండెత్తుతున్నారు.

నాడు 8 నెలల్లోనే 2 లక్షల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్.. ఇవన్నీ జనం భూములే

చంద్రబాబు హయాంలో 'ఎనీవేర్' ఏర్పాటు

ఒకచోట భూమికి మరోచోట రిజిస్ట్రేషన్‌కు వీలు

అభ్యంతరాల వెల్లడికి నాడు 48 గంటల సమయం

ఆ టైం గంటకు తగ్గించి 'ఎనీవేర్'కు జగన్ తూట్లు


వేల ఎకరాలను యథేచ్ఛగా దోచేసిన వైసీపీ పెద్దలు

ప్రభుత్వం మారగానే ఒక్కొక్క బాగోతం బయటకు

విశాఖ, విజయవాడ, తూర్పుగోదావరి నుంచి పుంఖానుపుంఖాలుగా జనం నుంచి ఫిర్యాదులు

మాజీ సీఎస్ జవహర్‌రెడ్డిపై విచారణకు డిమాండ్

అక్రమాలు సరిదిద్దకపోతే అరాచక వాతావరణమే



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానాన్ని గత ఐదేళ్లు అడ్డదిడ్డంగా వాడేశారు. జనాల భూములకు చెందిన 2 లక్షల డాక్యుమెంట్లకు నాటి ప్రభుత్వ పెద్దలు 8 నెలల్లో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసేసుకున్నారు. ఇవన్నీ ఎనీవేర్‌ను ఉపయోగించుకుని చేసిన అక్రమాలే. ఇప్పుడిప్పుడే తమ భూమి తమకు తెలీకుండా వేరేవాళ్ల చేతుల్లోకి వెళ్లిపోయిందని తెలుసుకున్న బాధితులు.... రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. దూరంగా ఉన్న వారు మెయిల్స్ ద్వారా, ఫోన్ కాల్స్ ద్వారా రిజిస్ట్రేషన్ శాఖ

మిగతా 12వ పేజీలో...

1.70 లక్షల ఎకరాలు కొట్టేశారు

పెద్దిరెడ్డి ముఠా చేతిలో 20 వేల ఎకరాలు

ఒక్క పులిచర్లలోనే 970 ఎకరాలు స్వాహా

పెద్దిరెడ్డి భార్య పేరుతో హైవే పక్కన ఐదెకరాల ఆక్రమణ

రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆరోపణ

'సెబ్'తో కుమ్మేశారు

ఇసుక, మద్యంలో దోపిడీకి నాడు స్కెచ్

యథేచ్ఛగా దందాలు సాగేలా ఏర్పాటు

12

15 రోజులు.. 7 వేల ఫిర్యాదులు!

టీడీపీ నేతలకు వినతుల వరద

వీటిలో 4 వేలు భూసమస్యలపైనే

టీడీపీ ఆఫీసుపై దాడి.. ముగ్గురు పోలీసులపై వేటు

11



బాబోయ్ జ్వరాలు

ప్రతి గ్రామంలోనూ జ్వరపీడితులు

ముందస్తు చర్యల్లో గత ప్రభుత్వ వైఫల్యం

కనీసం బ్లీచింగ్ పౌడరూ ఇవ్వని వైనం

పీహెచ్‌సీల్లో మందుల కొరత

సరఫరాలో పూర్తిగా విఫలం

రాష్ట్రంలో బోదకాలు వ్యాధి విస్తరణ

తీవ్ర నిర్లక్ష్యంగా అధికారులు

11



వలంటీర్లపై వ్యాఖ్యల కేసులో

పవన్ కల్యాణ్‌కు ఊరట

11

జగన్ సర్కారు పెట్టిన కేసులో తదుపరి చర్యలు నిలిపేసిన హైకోర్టు

సుప్రీం తీర్పునకు విరుద్ధంగా కేసు.. గత ప్రభుత్వంలో ఇలాంటివెన్నో

అన్నిటిపై కొత్త సర్కారు పునఃపరిశీలన.. నిర్ణయాన్ని నివేదిస్తాం: ఏజీ



12

ఓటాన్ అకౌంట్‌పై ఆర్డినెన్స్

మరో 4 నెలల వ్యవధి కోసం నేడు జారీ?

షార్ట్ సర్క్యులేషన్ విధానంలో కేబినెట్ ఆమోదానికి

96 వేల కోట్లకు ఆమోదముద్ర వేసే చాన్స్



నిండు కుండలా శ్రీశైలం

10 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

883.90 అడుగులకు చేరిన నీటిమట్టం

శ్రీశైలంలో కొనసాగుతున్న వరద ఉధృతి

ఇన్‌ఫ్లో 4,13,178.. ఔట్‌ఫ్లో 3,32,453 క్యూ.

11

మంగళవారం రాత్రి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 10 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం


వయనాడ్‌లో ఇళ్ల మధ్యల్లో నేలను కోసుకుంటూ బురద ప్రవాహం


దుంగల సాయంతో బురద ప్రవాహాన్ని దాటుతున్న రెస్క్యూ బృందాలు

మృత్యు విలయం


మృతదేహాన్ని తరలిస్తున్న సహాయ సిబ్బంది

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించింది. వారం రోజులపాటు నాలుగు జిల్లాల్లోని విద్యా సంస్థలకు సెలవులను ప్రకటించింది. వరద బాధితుల కోసం పునరావాస కేంద్రాలను, కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. మరో వైపు భారత వాతావరణ శాఖ మరో రెండ్రోజులపాటు 8జిల్లాలకు రెడ్‌అలెర్ట్ జారీ చేసింది. భారీ నుంచి అతి భారీ వర్షాలుంటాయని హెచ్చరించింది.

అర్ధరాత్రి విరుచుకుపడ్డ కొండచరియలు

కేరళ వ్యాప్తంగా గత నాలుగైదు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఎగువన కురుస్తున్న వర్షాలతో వయనాడ్ ప్రాంతానికి.. ముఖ్యంగా చాలియార్ నదికి వరద ఉధృతి పెరిగింది. సోమవారం అర్ధరాత్రి సరిగ్గా 1.30 సమయంలో వరద బీభత్సానికి కొండ చరియలు విరిగిపడ్డాయి. ముండక్కై గ్రామాన్ని తుడిచిపెట్టేశాయి. ఆ గ్రామంలో 65 కుటుంబాలు నివసిస్తుండగా.. ఆ ఇళ్లలో నివసిస్తున్న వందల మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ప్రభుత్వం వెంటనే పోలీసులను రంగంలోకి దింపింది. వర్షం, వరద, దట్టమైన పొగమంచు కారణంగా.. సహాయక బృందాలు ఆ ప్రాంతానికి చేరుకోవడంలో ఆటంకాలేర్పడ్డాయి. "మంగళవారం ఉదయం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌తోపాటు.. త్రివిధ దళాలు రంగంలోకి దిగాయి. వైమానిక దళం హెలికాప్టర్లతో చిక్కుకుపోయిన వారిని గుర్తించి, రక్షించే ప్రయత్నం చేశాయి. కేరళలో స్థానిక యువకులతో ఏర్పాటు చేసిన 'సివిల్ డిఫెన్స్ ఫోర్స్' కూడా చురుగ్గా సహాయక చర్యల్లో పాల్గొంటోంది" అని కేరళ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ శాఖ ప్రిన్సిపల్ డైరెక్టర్ వి.సాంబశివరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వయనాడ్ ఘటన నేపథ్యంలో కేరళ సర్కారు తెలుగువాడైన సాంబశివరావును స్పెషల్ ఆఫీసర్‌గా నియమించింది. కాగా.. నౌకాదళం గజ ఈతగాళ్లను రంగంలోకి దింపగా.. ఎన్డీఆర్ఎఫ్‌తో పాటు ఆర్మీ, టెరిటోరియల్ ఆర్మీ జవాన్లు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం శిథిలాలను తొలగించడం ప్రారంభించాక.. నిమిష నిమిషానికి.. గంట గంటకూ మృతదేహాలు బయటపడ్డాయి. మంగళవారం రాత్రి కడపటి వార్తలందేసరికి 133 మంది మృతిచెందినట్లు అధికారులు ప్రకటించారు. మరో 250 మంది వరకు శిథిలాల కిందే ఉన్నట్లు అనుమానిస్తున్నారు. మరోవైపు.. ముండక్కై గ్రామానికి ఆనుకుని ఉన్న చాలియార్ నదిలో 31 మృతదేహాలు కొట్టుకుని పోయాయి.

సహాయక శిబిరంపైనా బండరాళ్లు

తొలుత తెల్లవారుజామున 3 గంటల సమయంలో సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. ముండక్కైలోని కొందరు స్థానికులను ఓ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సహాయక శిబిరానికి తరలించారు. అయితే.. తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఈ పాఠశాలపైనా కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ స్కూల్ పరిసరాల్లోని ఇళ్లు, దుకాణాలు సైతం బురదలో కొట్టుకుపోయినట్లు అధికారులు తెలిపారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా సహాయక చర్యలకు ఆటంకాలేర్పడుతున్నాయని, మంగళవారం మధ్యాహ్నం మరోమారు కొండచరియలు విరిగిపడ్డాయని చెప్పారు. ముండక్కై, మెప్పాడిలో వరదలో కొట్టుకుపోయిన వారిని గుర్తించేందుకు వైమానిక దళానికి చెందిన డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. ఆర్మీ, పోలీసులు శిథిలాల కింద జాగిలాలతో గాలింపు చేపట్టారు.

తాత్కాలిక ఆస్పత్రులు..

విపత్తు వేళ క్షతగాత్రులకు వైద్యం అందించడానికి అధికారులు చూరాల్‌కొండలోని మదర్సాలు, మసీదుల్లో తాత్కాలిక క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. వయనాడ్ పాలిటెక్నిక్ కాలేజీలో కూడా తాత్కాలిక ఆస్పత్రి కొనసాగుతోందని అధికారులు చెప్పారు. వయనాడ్, కోళిక్కోడ్ ఫోరెన్సిక్ నిపుణులతో మెప్పాడి, నీలంబూర్‌లో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కడపటి వార్తలందేసరికి 104 మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయినట్లు ప్రకటించారు.

రెడ్ అలెర్ట్

రానున్న రెండ్రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయంటూ భారత వాతావరణ శాఖ(ఐఎండీ) కేరళలోని ఎనిమిది జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ జాబితాలో ఇడుక్కి నుంచి కాసర్గోడ్ మధ్యలో అన్ని జిల్లాలు ఉన్నాయి. శబరిమల ఉన్న పథనంతిట్ట, అలప్పుళ, కోటాయం, ఎర్నాకుళం జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్, తిరువనంతపురం, కొల్లాం జిల్లాలకు యెల్లో అలెర్ట్ ప్రకటించింది. ఈదురు గాలుల హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో పైకప్పులు బలంగా లేని ఇళ్లలో ఉండకూడదని పేర్కొన్నాయి. ప్రమాద బాధితుల కోసం కేరళ సర్కారు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. 1077, 1070 టోల్‌ఫ్రీ నంబర్లు, 9497900402, 0471-2721566 నంబర్లకు ఫోన్ ద్వారా సంప్రదించాలని అధికారులు కోరారు. రాత్రి కడపటి వార్తలందేసరికి త్రివిధ దళాలు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు 481 మందిని కాపాడినట్లు వివరించారు.

ఎన్నడూ చూడని ఘోర విషాదం: పినరయి

కేరళలో ఎన్నడూ చూడనంతలా ఘోరమైన విషాదాన్ని వయనాడ్‌లో చూశామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వీలైనంత ఎక్కువ మంది ప్రాణాలను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. "వయనాడ్ జిల్లాలో యుద్ధప్రాతిపదికన 45 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశాం. అక్కడ 3,096 మందికి వసతి కల్పించాం. కేంద్రాల్లో ఆహారం, 20 వేల లీటర్ల తాగునీటిని అందుబాటులో పెట్టాం" అని వెల్లడించారు. "ప్రాణాలు కోల్పోయినవారికి నివాళులర్పిస్తున్నాను. ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ, అమిత్‌షా, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, పశ్చిమబెంగాల్ గవర్నర్ సీవీ ఆనందబోస్ నాకు ఫోన్ చేసి, సాయాన్ని ప్రకటించారు" అని వ్యాఖ్యానించారు. ప్రజలు కూడా సీఎం సహాయ నిధికి విరాళాలు ఇచ్చి, క్షతగాత్రుల కుటుంబాలను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. కేరళకు చెందిన ఓ బ్యాంకు రూ.50 లక్షలు, తమిళనాడు సీఎం రూ.5 కోట్లు, సియాల్ రూ.2కోట్ల చొప్పున సాయం ప్రకటించాయన్నారు.

ప్రధాని మోదీ దిగ్ర్భాంతి

వయనాడ్ దుర్ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలకు అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఫోన్ చేసి, పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్లు వివరించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు రాహుల్ పిలుపు

విపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ దుర్ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వయనాడ్ లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన ఆయన.. క్షేత్రస్థాయిలో సహాయక చర్యల్లో పాల్గొనాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. విజయన్‌తో, జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కేంద్ర మంత్రులతో మాట్లాడి.. వయనాడ్‌కు అన్ని విధాలా సాయమందేలా చర్యలు తీసుకుంటామన్నారు. వయనాడ్ ఘటనపై లోక్‌సభలో అత్యవసర తీర్మానానికి కాంగ్రెస్ ఎంపీ వేణుగోపాల్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

600 మంది గల్లంతు!

వయనాడ్ ముండక్కై ప్రాంతంలో ఉన్న తేయాకు, కాఫీ, యాలకుల తోటల్లో పనిచేసేందుకు వచ్చిన పశ్చిమబెంగాల్, అసోం కార్మికుల జాడ తెలియడం లేదని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి హారిసన్ మలయాళీ ప్లాంటేషన్ లిమిటెడ్‌లో 600 మంది పశ్చిమబెంగాల్, అసోం కార్మికులు పనిచేస్తున్నారని, వారి యోగక్షేమాలు తెలియడం లేదని ఆ కంపెనీ జనరల్ మేనేజర్ బెనిల్ జోన్స్ అన్నారు. ఇదే ప్రాంతంలో ఉన్న ట్రీవ్యాలీ రిసార్ట్‌లో సుమారు 100 మంది చిక్కుకుపోయారు.

శవాల దిబ్బగా చురుల్‌మల?

ముండక్కైలో కొండచరియలు బీభత్సం సృష్టించగా.. ఉప్పొంగుతున్న చాలియర్ నది ఒకవైపు.. వరద మూడువైపులా కలిపి.. చురుల్‌మల గ్రామాన్ని నీళ్లు చుట్టేశాయి. త్రివిధ దళాలు మంగళవారం సాయంత్రానికి గానీ అక్కడకు చేరుకోలేకపోయాయి. ఉదయం నుంచే హెలికాప్టర్లు, డ్రోన్లతో గాలింపు చేపట్టినా.. చురుల్‌మల ప్రాంతంలో దట్టమైన పొగమంచు కారణంగా సహాయక చర్యలు సాధ్యపడలేదు. నౌకాదళానికి చెందిన రివర్ క్రాసింగ్ టీమ్ రంగంలోకి దిగి.. మంగళవారం సాయంత్రం అక్కడకు చేరుకుంది. అధికారిక వర్గాల ప్రకారం చురుల్‌మలలో ఎక్కడ చూసినా మృతదేహాలే కనిపించాయని తెలిసింది.



సాయానికి క్యూ

వరద బాధితులకు అవసరమైన రక్తం ఇచ్చేందుకు.. దాతలు బ్లడ్ బ్యాంకుల వద్ద బారులు తీరారు. మెప్పాడి విమ్స్ వైద్య కళాశాల, బతేరీ తాలూకా ఆస్పత్రి, కాల్‌పేట ప్రభుత్వ ఆస్పత్రి.. అన్ని చోట్లా ఇవే దృశ్యాలు కనిపించాయి. రక్తదానం ఒక్కటే కాదు.. ఆహారం, తాగునీరు, దుస్తులు అందించడం ద్వారా ఈ సంక్షోభ సమయంలో బాధితులకు కేరళ ప్రజలు అన్నివిధాలా అండగా నిలుస్తున్నారు.

శవాల నది

- 25 కిలోమీటర్ల మేర చలియార్ నదిలో కొట్టుకుపోయిన 31 మృతదేహాలు
- ప్రవాహం ధాటికి తెగిపడ్డ అవయవాలు

మలప్పురం: తీరం పొడవునా ఆహ్లాదకరమైన ప్రకృతి సౌందర్యంతో.. చల్లటి నీటితో అలరారే చలియార్ నది వయనాడ్ విలయం నేపథ్యంలో కన్నీటి కాసారంగా మారింది! ఈ ఉత్పాతంలో ముండక్కై ప్రాంతంలో చనిపోయిన 31 మంది మృతదేహాలు.. చలియార్ నదిలో 25 కిలోమీటర్ల మేర కొట్టుకుపోయి మలప్పురం జిల్లా నీలంబూర్‌కు సమీపంలోని పోతుకల్లు వద్దకు చేరుకున్నాయి. అక్కడ రెస్క్యూ టీములు ఆ మృతదేహాలను వెలికితీశాయి. అయితే.. ప్రవాహ ఉధృతికి మృతదేహాల శరీరభాగాలు ముక్కలుముక్కలుగా ఊడిపోయాయి! వరదనీటి ఉధృతి ఇంకా తగ్గకపోవడంతో.. మరిన్ని మృతదేహాలు చలియార్ నదిలో కొట్టుకొచ్చే ప్రమాదం ఉందని రెస్క్యూటీములు అంచనా వేస్తున్నాయి. నదిలో నీటి స్థాయులు క్రమక్రమంగా పెరుగుతుండడంతో.. స్థానిక ప్రజలు ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో సోమవారం ఉదయం నుంచి నదిలో నీటిమట్టంపై ఒక కన్ను వేసి బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటాక.. తెల్లవారుజామున రెండు గంటల సమయంలో వయనాడ్ వైపు నుంచి చలియార్ నదిలో గ్యాస్ సిలిండర్లు, చెక్కదుంగలు కొట్టుకురావడం గమనించారు. వెంటనే ఆ విషయాన్ని అధికారులకు తెలియజేశారు. మంగళవారం ఉదయం నుంచి నదిలో గాలించడం మొదలుపెట్టగా 26 మృతదేహాలు, వాటితాలూకూ శరీర భాగాలు దొరికాయి.

ప్లీజ్ మమ్మల్ని కాపాడండి..

శిథిలాల కింద నుంచి బాధితుల ఫోన్‌కాల్స్

చిమ్మచీకట్లో కొండచరియలు విరిగిపడి.. నీరు, బురద కలిసి ప్రవాహమై విరుచుకుపడడంతో ఆ ధాటికి చాలా ఇళ్లు కూలిపోయాయి! చాలామంది బాధితులు శిథిలాల కింద చిక్కుకుపోయి.. బయటకు వచ్చే మార్గం లేక.. తమ ఆత్మీయులకు ఫోన్లు చేసి ప్రాణాలు కాపాడాలంటూ ప్రాధేయపడ్డారు. ఇలాంటి ఫోన్ సంభాషణలను స్థానిక టీవీలు ప్రసారం చేస్తున్నాయి. చూరాల్మాలా ప్రాంతంలోని ఓ మహిళ తమ వారికి ఫోన్ చేసి ఇల్లు మొత్తం కూలిపోయిందని.. తాము శిథిలాల్లో ఉన్నామని.. తమను బయటకు తీయాలని, తమ ప్రాణాలు కాపాడాలని కోరుతున్న ఆడియో వైరల్ అవుతోంది. ఈ విషాద ఘటనలో గాయపడిన ఓ వృద్ధుడు తన భార్య ఆచూకీ గల్లంతైందని ఆందోళన వ్యక్తంచేశాడు. "మేం మా ఇంట్లో నిద్రిస్తుండగా.. తెల్లవారుజామున పెద్ద శబ్దం వినిపించింది. పెద్ద పెద్ద కొండరాళ్లు, చెట్లు విరిగి మా ఇంటి పైకప్పుపై పడ్డాయి. వరదనీరు మా ప్రాంగణంలోకి ప్రవేశించింది" అని ఆ వ్యక్తి వాపోయాడు.

హిమాచల్‌ప్రదేశ్‌లో ఆకస్మిక వరదలు

- కొట్టుకుపోయిన పాదచారుల వంతెన, షెడ్లు

షిమ్లా, జూలై 30 : హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో మంగళవారం ఉదయం మేఘ విస్ఫోటంతో వచ్చిన ఆకస్మిక వరదలతో ఒక పాదచారుల వంతెన, మూడు తాత్కాలిక షెడ్లు కొట్టుకుపోయాయి. కులు జిల్లా తోష్‌నాలాలో ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాలేదు. ప్రజలు నదులు, కాలువలకు దూరంగా ఉండాలని కులు డిప్యూటీ కమిషనర్ తొరల్ ఎస్. రవీష్ సూచించారు. అలాగే కాలువల పక్కన తాత్కాలిక నిర్మాణాలు చేపట్టవద్దని కోరారు. వర్షాకాలంలో ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టకూడదని, దీన్ని ఉల్లంఘించినవారిపై చర్యలు తప్పవన్నారు. బుధ, గురువారాల్లో ఈ రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని స్థానిక వాతావరణ కార్యాలయం హెచ్చరించింది. రానున్న నాలుగైదు రోజులు రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు బాగా కురుస్తాయని తెలిపింది. కులు, సోలన్, సిర్మార్, షిమ్లా, కినార్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో కొండచరియలు విరిగి పడడంతో పాటు ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ రాష్ట్రంలో ఈ ఏడాది జూన్ 27 నుంచి రుతుపవనాలతో వర్షాలు మొదలయ్యాక జరిగిన పలు ఘటనల్లో 62 మంది మృత్యువాత పడ్డారని అధికారిక సమాచారం.


వృద్ధురాలిని కాపాడుతున్న దృశ్యం


తాడు సహాయంతో బాధితుల తరలింపు

కేరళ పాలిట చీకటి మాసాలు

- జూలై, ఆగస్టు నెలల్లో అతి పెద్ద విపత్తులు

తిరువనంతపురం: జూలై-ఆగస్టు నెలలు కేరళ పాలిట చీకటిమాసాలనే పేరు ఉంది. ఎందుకంటే.. ఆ రాష్ట్రంలో నమోదైన విపత్తుల్లో అతి పెద్దవి ఈ రెండు నెలల్లో సంభవించినవే. ఇటీవలి ఉదాహరణలే తీసుకుంటే.. 2020 ఆగస్టు 6న ఇడుక్కిజిల్లాలోని పెట్టిముడిలో ఇదే తరహాలో భారీవర్షాలకు కొండచరియలు విరిగిపడి 70 మంది ప్రాణాలు కోల్పోయారు. అంతకుముందు.. 2019 ఆగస్టు 8న మలప్పురం, వయనాడ్, కోళికోడ్ జిల్లాల్లోని కవలప్పర, పుదుమాల, విలంగాడ్ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి 76 మంది చనిపోయారు. వారిలో 16 మంది మృతదేహాలు ఇప్పటికీ దొరకలేదు. 2021లో ఇడుక్కి జిల్లాలో రెండు చోట్ల కొండచరియలు విరిగిపడి 21 మంది చనిపోయారు. ఇక.. 2018 ఆగస్టులో కేరళను తీవ్ర విషాదంలో ముంచెత్తిన వరదలపై ఒక సినిమా కూడా వచ్చిన సంగతి తెలిసిందే. ఆ వరదల్లో 483 మంది చనిపోయారు. 15 మంది మృతదేహాలు దొరకలేదు. ఆ వరదల దెబ్బకు.. 14 జిల్లాల పరిధిలో పది లక్షల మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆ ఏడాది వర్షపాతం సాధారణం కంటే 23% అధికంగా ఉండడంతో రిజర్వాయర్లన్నీ నిండిపోయాయి! దీంతో కేరళలోని 54 డ్యాముల్లో 35 డ్యాములను తెరిచి నీటిని వదిలేశారు. ఒకేసారి అన్ని డ్యాములను తెరవడం ఆ రాష్ట్ర చరిత్రలోనే అది మొదటిసారి. ఆ సమయంలో కేరళలో దాదాపు 5000 చిన్న, పెద్ద కొండ చరియలు విరిగిపడినట్టు ఒక అంచనా. కేరళలో ఏడుపదులు దాటిన వృద్ధులంతా కథలు కథలుగా చెప్పేది.. 1974 విలయం గురించే! ఆ ఏడాది జూలై 26ను ఒక భయానక రాత్రిగా వారు అభివర్ణిస్తుంటారు. ఆ రోజు మధ్యాహ్నం ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉండడంతో కొండచరియలు విరిగిపడి 33 మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ ప్రణాళిక 2016 ప్రకారం.. ఆ రాష్ట్రంలో 1961-2016 నడుమ కొండచరియలు విరిగిపడి మరణించిన వారి సంఖ్య 295. కాగా.. అడవుల నిర్మూలన, పర్యావరణ మార్పు, పెరుగుతున్న భూతాపం, అరేబియా ఉపరితల జలాలు వేడెక్కడం వంటివాటివల్లే 2018, ఆ తర్వాత సంవత్సరాల్లో కేరళలో ప్రకృతి విపత్తులు ఎక్కువగా సంభవిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. కేరళలో మొత్తం 14 జిల్లాలు ఉండగా.. వాటిలో ఒక్క అలప్పుజ తప్ప మిగతా 13 జిల్లాలూ వరదలు, కొండచరియలు విరిగిపడే ముప్పును ఎదుర్కొంటున్నవేనని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. అరేబియా సముద్రం వేడెక్కుతుండడంతో.. కేరళలోని పలు ప్రాంతాల్లో డీప్ క్లౌడ్ సిస్టమ్స్ ఏర్పడి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయని.. కొండ చరియలు విరిగిపడడానికి కారణమవుతున్నాయని కొచ్చిన్ వర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ అట్మాస్ఫియరిక్ రాడార్ రిసెర్చ్ డైరెక్టర్ అభిలాష్ తెలిపారు.


శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు ప్రయత్నిస్తూ...

బురద ప్రవాహంలో 5 గంటలు



పెద్ద పెద్ద రాళ్లను, బురదను తోసుకుంటూ.. దూసుకుంటూ.. ప్రళయంలా ముంచెత్తుతున్న వరద ప్రవాహం! ఆ వెల్లువ ధాటికి తట్టుకుని నిలబడడం చాలా కష్టం!! కానీ.. వయనాడులో ప్రకృతి విలయానికి కేంద్రస్థానమైన ముండక్కైలో ఒక వ్యక్తి మాత్రం నడుములోతు బురదనీటిలో కూరుకుపోయి.. బండరాళ్ల మధ్య ఇరుక్కుని.. బయటపడే దారి లేక.. ఐదు గంటలపాటు ప్రాణాలు అరచేతపట్టుకుని అక్కడే ఉండిపోయాడు! అక్కడికి వచ్చిన సహాయక సిబ్బందిని చూసి.. చేతులు ఊపుతూ తన ప్రాణాలు కాపాడాలంటూ పెద్దగా కేకలు పెట్టాడు. సహాయ సిబ్బంది రెండు గంటలపాటు శ్రమించి అతణ్ని ఎట్టకేలకు కాపాడి బురదనీటిలోంచి బయటకు తీసుకొచ్చారు. అయితే.. ముండక్కై ప్రాంతాన్ని మిగతా ప్రాంతాలతో కలిపే బ్రిడ్జి కొట్టుకుపోవడంతో అతడిని అక్కణ్నుంచీ మెప్పాడిలోని ఆస్పత్రికి తరలించలేకపోయారు.

కొండ చరియల ప్రమాదాన్నీ పసిగట్టవచ్చు


- నేల రకం, నేలలో తేమ, కొండవాలు సమాచారాన్ని క్రోడీకరిస్తే సాధ్యమే
- ప్రభుత్వాలకు శాస్త్రవేత్తల సూచన





న్యూఢిల్లీ, జూలై 30: దేశంలో భారీ వర్షాలను ముందుగానే గుర్తించి హెచ్చరించే వ్యవస్థలు ఉన్నట్లే కొండచరియలు విరిగిపడే ప్రమాదాన్ని కూడా ముందుగానే గుర్తించి హెచ్చరించే వ్యవస్థలను రూపొందించాలని శాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు. కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి మాధవన్ రాజీవన్ మాట్లాడుతూ, "ప్రతీ భారీ వర్షం కొండచరియలు విరిగిపడే పరిస్థితికి దారి తీయదు. కొండ చరియలు విరిగిపడే విపత్తును గుర్తించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరం. కష్టమే కానీ సాధ్యమే" అన్నారు. కొండ చరియలు విరిగిపడే ఘటనల్లో నేలరకం, నేలలో తేమ, వాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. వీటికి సంబంధించి మనకు తెలిసిన సమాచారం మొత్తాన్ని ఒక వ్యవస్థలో కూర్చడం ద్వారా ఎలాంటి పరిస్థితుల్లో కొండ చరియలు విరిగిపడతాయో ముందుగానే గుర్తించి ప్రాణనష్టం నివారించవచ్చని చెప్పారు. కేరళ విపత్తు నిర్వహణ నిపుణుడు శ్రీకుమార్ మాట్లాడుతూ, "120 మిల్లీమీటర్లకు మించి వర్షపాతం 2-3 రోజులపాటు విడవకుండా కురిస్తే కేరళలోని కొండ వాలుల్లో చరియలు విరిగిపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి" అన్నారు. వయనాడులో కొండచరియలు విరిగి పడే అవకాశమున్న ప్రాంతాలు ఎక్కువని చెప్పారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం మినహా మనం చేయగలిగింది ఏమీ లేదన్నారు. అలాంటి ప్రాంతాల్లో వర్షాకాలంలో తాత్కాలికంగా ఉండటానికి సురక్షిత షెల్టర్లు నిర్మించాలని సూచించారు. కేరళలోని కొండల్లో సగానికి పైగా ఇరవై డిగ్రీలకు మించిన వాలు కలిగి ఉన్నాయని, భారీ వర్షాలు వచ్చినపుడు ఇవన్నీ ప్రమాద భరితమేనని పర్యావరణ శాస్త్రవేత్త రాక్సీ మాథ్యూ కోల్ చెప్పారు.

లోకం తీరు



అణుశక్తి స్వావలంబన!

కీలక దశలోకి కల్పక్కం 'ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్'.. ఇంధనం నింపి పరీక్షించటానికి అనుమతి

» విజయవంతమైతే రష్యా తర్వాత మన దేశంలోనే ఈ తరహా రియాక్టర్

న్యూఢిల్లీ, జూలై 30: దేశంలోనే అత్యాధునిక, అత్యంత సంక్లిష్టమైన 'ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ (పీఎఫ్‌బీఆర్) సాకారం దిశగా మరో ముందంజ పడింది. తమిళనాడులోని కల్పక్కంలో నిర్మిస్తున్న ఈ అణుకేంద్రంలో అణు ఇంధనాన్ని నింపి, నియంత్రిత శృంఖల చర్యను ప్రారంభించటానికి అణుశక్తి నియంత్రణ బోర్డు అనుమతి మంజూరు చేసింది. దేశ స్వయంసమృద్ధ అణుశక్తి కార్యక్రమంలో ఇదొక మైలురాయి అని ఈ సందర్భంగా బోర్డు చైర్మన్ దినేశ్ శుక్లా పేర్కొన్నారు. పీఎఫ్‌బీఆర్ పూర్తయితే ప్రపంచంలోనే ఈ తరహా అణుశక్తి కేంద్రం ఉన్న రెండోదేశంగా భారత్ నిలుస్తుంది. ప్రస్తుతం రష్యా వద్ద మాత్రమే ఇటువంటి న్యూక్లియర్ రియాక్టర్ ఉంది. పీఎఫ్‌బీఆర్ నిర్మాణం వెనుక 20 ఏళ్లకుపైగా కృషి ఉంది. ఈ అణు కేంద్రాన్ని నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 'భారతీయ నభికియ విద్యుత్ నిగమ్ లిమిటెడ్ (భవనీ) అనే సంస్థను 2003లో ఏర్పాటు చేసింది. నాటి నుంచీ పీఎఫ్‌బీఆర్ నిర్మాణ ప్రక్రియ కొనసాగుతోంది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో 200కుపైగా దేశీయ పరిశ్రమలు పాలుపంచుకున్నాయి. ఈ ఏడాది మార్చి 4వ తేదీన ప్రధాని మోదీ పీఎఫ్‌బీఆర్‌ను సందర్శించారు.


మార్చి 4న పీఎఫ్‌బీఆర్‌ను పరిశీలిస్తున్న మోదీ

థోరియంను వాడగలిగితే తిరుగుండదు

పీఎఫ్‌బీఆర్.. 500 మెగావాట్ల శీతల ద్రవ సోడియం రియాక్టర్. నిర్మాణం పూర్తయిన తర్వాత దీంట్లో విద్యుదుత్పత్తి కోసం తొలుత యురేనియం-ప్లుటోనియం సమ్మిళిత ఆక్సైడ్ ఇంధనాన్ని వినియోగిస్తారు. తర్వాత థోరియం ద్వారా యురేనియం-233ని సృష్టించి ఇంధనంగా వాడాలన్నది ప్రణాళిక. మన దేశంలో యురేనియం నిల్వలు పరిమితంగా ఉన్నాయి. ప్లుటోనియం ప్రకృతిలో దొరకదు. ఇక, థోరియం విషయానికొస్తే, దేశంలో థోరియం నిల్వలు విస్తారంగా ఉన్నాయి. థోరియంను అణు ఇంధనంగా ఉపయోగించుకోగలిగితే, విద్యుదుత్పత్తికి సంబంధించి దేశం పూర్తి స్వావలంబనను సాధించగలుగుతుంది. అందుకే థోరియంను 'ఇంధన అక్షయపాత్ర'గా మన శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లలో హై ఎనర్జీ ఫాస్ట్ న్యూట్రాన్లను వినియోగిస్తారు. అందుకే, వీటికి ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లనే పేరు వచ్చింది. పీఎఫ్‌బీఆర్‌లో ఇంధనాన్ని నింపటం ద్వారా భారత్, అణుశక్తి కార్యక్రమం రెండో దశలోకి ప్రవేశించినట్లవుతుంది. థోరియం నిల్వలను ఉపయోగించుకోగలిగితే మూడో దశ మొదలవుతుంది.

అణువ్యర్థాలను తగ్గించే అత్యాధునిక రియాక్టర్

పీఎఫ్‌బీఆర్ అత్యాధునిక అణు రియాక్టర్. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే ఇది దానంతట అదే నిలిచిపోతుంది. దేశంలోని ఇతర అణు కేంద్రాల్లో తొలిదశలో ఉపయోగించిన ఇంధనాన్ని దీంట్లో తిరిగి వాడవచ్చు. తద్వారా అణువ్యర్థాలను గణనీయంగా తగ్గించవచ్చు. అణువ్యర్థాలను ఎలా వదిలించుకోవాలన్న సంక్లిష్ట సమస్యను కూడా ఈ మేరకు పరిష్కరించవచ్చు. పీఎఫ్‌బీఆర్ విజయవంతమైతే కల్పక్కంలోనే మరో రెండు ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లను నిర్మించాలన్న యోచనతో కేంద్రం ఉంది.

పంచాయతీ స్థాయిలో రోజువారీ వాతావరణ సూచనలు!

న్యూఢిల్లీ, జూలై 30: గ్రామ పంచాయతీ స్థాయిలో రోజువారీ వాతావరణ సూచనలు అందించే నూతన గ్రామీణ ప్రాజెక్టుకు కేంద్రం శ్రీకారం చుట్టనుంది. భారత వాతావరణ విభాగం, ఎన్జీవో కిసాన్ సంచార్‌తో కలిసి కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ వీటిని ప్రారంభించనుంది. బ్లాక్ స్థాయి నుంచి గ్రామపంచాయతీ స్థాయి వరకు రోజు వారీ వాతావరణ వివరాలను అందించే ఏర్పాటు చేయనున్నారు. ఈ సమాచారాన్ని అందించే బాధ్యతలను 2.69 లక్షల స్థానిక సంస్థలకు అప్పగించనున్నట్టు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ వర్గాలు తెలిపాయి. తద్వారా రైతులకు ఎప్పటికప్పుడు స్థానిక వాతావరణ పరిస్థితులు తెలుస్తాయని, దీంతో వారికి సాగు విషయంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నాయి. ఈ ఏడాది జనవరిలోనే భారత వాతావరణ విభాగం 'పంచాయతీ మౌసమ్ సేవ' పోర్టల్‌ను ప్రారంభించింది. బ్లాక్(మండల) స్థాయిలో వాతావరణ పరిస్థితిని ఎప్పటికప్పుడు అందిస్తోంది. దీనిని మరింత విస్తరించడం ద్వారా దేశవ్యాప్తంగా 6లక్షలకు పైగా గ్రామాల్లో రైతులకు మేలు చేసేందుకు ప్రయత్నిస్తోంది.

కుక్కల దాడిలో 30లక్షల మందికి గాయాలు

న్యూఢిల్లీ, జూలై 30: దేశంలో గతేడాది 30.5 లక్షల మంది వీధి కుక్కల దాడికి గురైనట్టు కేంద్రం వెల్లడించింది. వీరిలో 286 మంది మరణించినట్టు తెలిపింది. సమగ్ర వ్యాధి నిఘా కార్యక్రమం కింద ఈ వివరాలను సేకరించినట్టు కేంద్ర పశు సంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ మంగళవారం లోక్‌సభలో లిఖితపూర్వకంగా తెలిపారు. 46.54 లక్షల మందికి యాంటీ రాబీస్ టీకాలు ఇచ్చినట్టు పేర్కొన్నారు. పశువ్యాధుల నివారణకు కేంద్రం అన్ని రాష్ట్రాలకు నిధులు అందజేస్తోందని, వీటిని రాబిస్ వ్యాధి నివారణకు కూడా ఉపయోగించుకోవచ్చన్నారు.

సాయం కాదు... ఆంధ్ర, బిహార్‌లకు మోసం

» బడ్జెట్‌లో పెట్టిన నిధులు ఇప్పట్లో ఇవ్వరు: జైరాం రమేశ్

న్యూఢిల్లీ, జూలై 30: కేంద్ర బడ్జెట్‌లో ఏపీ, బిహార్‌లకు కేటాయించిన నిధులను కొన్నేళ్ల వరకు మోదీ ప్రభుత్వం ఇవ్వదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. కేవలం నిధుల ప్రకటన చేసి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రెండు రాష్ట్రాల్లోని ఎన్డీయే మిత్రపక్షాలను మోసగించారని మంగళవారం 'ఎక్స్'లో ఆరోపించారు. ఈ కేటాయింపులు పతనమయ్యే బ్యాంకు ఇచ్చే పోస్ట్ డేటెడ్ చెక్కుల వంటివని ఎద్దేవాచేశారు. ఈ రెండు రాష్ట్రాలకు ఇచ్చిన ఆర్థిక ప్యాకేజీలతో కేంద్రానికి 20-30 వేల కోట్ల భారం పడుతుందని మీడియాలో వచ్చిన ఓ కథనాన్ని ఆయన షేర్ చేశారు. బడ్జెట్‌లో మిత్రపక్షాలను నిర్మల మోసం చేశారన్నారు.

కేజ్రీవాల్‌ను వెంటనే విడుదల చేయాలి

న్యూఢిల్లీ, జూలై 30: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో జైల్లో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కన్వీనర్ కేజ్రీవాల్‌ను వెంటనే విడుదల చేయాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆప్ పిలుపు మేరకు కూటమిలోని పార్టీలకు చెందిన పలువురు నేతలు మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విపక్షాల గొంతు నొక్కేస్తోందని ఆరోపించారు. ఢిల్లీ ప్రభుత్వ అధికారాల్లోనూ కేంద్రం జోక్యం చేసుకుంటోందని, రాజిందర్‌నగర్‌లో ముగ్గురు సివిల్స్ అభ్యర్థుల మరణానికి ఇదే కారణమని విమర్శించారు. హరియాణా, జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు.

ప్యాంగాంగ్ సరస్సు వద్ద చైనా బ్రిడ్జి పూర్తి

న్యూఢిల్లీ, జూలై 30: భారత సరిహద్దులోని ప్యాంగాంగ్ సరస్సు వద్ద చైనా సైనిక కార్యకలాపాలను ముమ్మరం చేసింది! ప్యాంగాంగ్ సరస్సు ఉత్తర, దక్షిణ ఒడ్డులను కలిపే వంతెనను పూర్తిచేసిన చైనా దాన్ని వినియోగంలోకి కూడా తీసుకొచ్చింది. సరిహద్దులో బలగాలను, సామగ్రిని త్వరగా తరలించడానికి అనువైన ఈ వంతెనతోపాటు దానికి అనుబంధంగా ఉన్న రోడ్లు కూడా వాడుకలో ఉన్నాయని అమెరికాకు చెందిన బ్లాక్ స్కై అనే సంస్థ తీసిన ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేశాయి. ఈ కొత్త వంతెన అందుబాటులోకి రావడం వలన ప్యాంగాగ్ నది ఉత్తర, దక్షిణ ఒడ్డులను కలిపే దూరం 50 నుంచి 100 కిలోమీటర్ల మేర తగ్గనుంది.

కులమేదో తెలియని వ్యక్తి కులగణన అంటున్నారు!

న్యూఢిల్లీ, జూలై 30: బడ్జెట్‌పై చర్చ సందర్భంగా కులగణన అంశం మంగళవారం లోక్‌సభలో తీవ్ర వాదోపవాదాలకు దారి తీసింది. చివరకు అది వ్యక్తిగత దూషణల స్థాయికి వెళ్లింది. బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీల మధ్య పెద్ద వివాదమే నెలకొంది. తొలుత అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ "తన కులమేదో తెలియని వ్యక్తి కూడా కులగణన గురించి మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. ఇందుకు రాహుల్ గాంధీ తీవ్రంగా అభ్యంతరం చెప్పారు. "ఆదివాసీలు, దళితులు, వెనకబడిన వర్గాల వారి సమస్యలను లేవనెత్తేవారిని దూషిస్తారు. ఈ తిట్లను సంతోషంగా భరిస్తా. మీరు ఎంతగానైనా అవమానపరచండి. కానీ కులగణనపై పార్లమెంటు ఆమోదం పొంది తీరుతాం" అని చెప్పారు. అయితే తర్వాత, "కులాల గురించి ఏమీ తెలియని వారే కులగణనపై మాట్లాడుతున్నారని అన్నాను" అని అనురాగ్ వివరణ ఇచ్చారు.

హౌరా-ముంబై రైలు పట్టాలు తప్పి ఇద్దరి మృతి

రాంచీ, కోల్‌కతా, జూలై 30: ఝార్ఖండ్‌లో మంగళవారం రైలు ప్రమాదం సంభవించింది. హౌరా- ముంబై మెయిల్ రైలు పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, మరో 22 మంది గాయపడ్డారు. ఈ దుర్ఘటన మంగళవారం తెల్లవారుజామున 3.45 గంటల సమయంలో చక్రధర్‌పూర్ డివిజన్‌లో జరిగింది. 18 బోగీలు పట్టాలు తప్పాయని రైల్వే అధికారులు వెల్లడించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్ర గాయాలపాలైన వారికి రూ.5 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ.1 చొప్పున రైల్వే ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఘటనా స్థలానికి దగ్గర్లోనే ఓ గూడ్స్ రైలు కూడా పట్టాలు తప్పిందని అధికారులు తెలిపారు. కాగా, ఈ ఏడాది జూన్, జూలై నెలల్లోనే 3 రైలు ప్రమాదాలు జరిగి 17 మంది చనిపోయారు. 100 మందికి పైగా గాయపడ్డారు.


రాష్ట్రం పేరు ప్రస్తావించకుంటే నిధులివ్వనట్లేనా?



» తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకే వేల కోట్లు కేటాయించాం: నిర్మల

న్యూఢిల్లీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్ ప్రసంగంలో ఏదైనా రాష్ట్రం పేరు ప్రస్తావించనంత మాత్రాన ఆ రాష్ట్రానికి కేటాయింపులు జరపనట్లు కాదని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బడ్జెట్ కేటాయింపుల్లో రెండు రాష్ట్రాలకే ప్రాధాన్యం ఇచ్చారని, మిగిలిన రాష్ట్రాల పేర్లు బడ్జెట్ ప్రసంగంలోనే లేవని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆమె తిప్పికొట్టారు. 2024-25 కేంద్ర బడ్జెట్‌పై లోక్‌సభలో ఆమె సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ సారథ్యంలోని విపక్ష 'ఇండియా కూటమి' తీరు సరికాదన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాల పేర్లను ప్రస్తావించారా అని నిలదీశారు. 2004-05 నుంచి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాల పేర్లు ప్రస్తావించలేదని గుర్తుచేశారు. ప్రస్తుత బడ్జెట్‌లో బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు మాత్రమే నిధులు కేటాయించారన్న విపక్ష సభ్యుల విమర్శలను తప్పుబట్టారు. తెలంగాణ సహా దేశంలోని అనేక రాష్ట్రాలకు వేలకోట్ల రూపాయలు ఇచ్చామని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మోటుమర్రి-విష్ణుపురం సెక్షన్‌లో రైల్వే డబ్లింగ్ పనులకు నిధులు కేటాయించామన్నారు. భద్రాచలం, డోర్నకల్ సెక్షన్‌లో రూ.770 కోట్లతో రైల్వే ప్రాజెక్టులకు నిధులు ఇచ్చాం.. మొత్తంగా ఏపీ, తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.1596 కోట్లు కేటాయించామన్నారు. కేరళలో జాతీయ రహదారుల ప్రాజెక్టులకు రూ.9,667 కోట్లు కేటాయించాం. జాతీయ స్థాయిలో శాఖల వారీగా వేల కోట్ల నిధులు ప్రతిపాదిస్తామన్నారు. బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాలకు నిధులు కేటాయించామని, ఏ రాష్ట్రానికి వంచన జరగలేదని పేర్కొన్నారు. అలాగే బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంగా నిర్వహించే హల్వా కార్యక్రమాన్ని ఆర్థిక మంత్రి సమర్థించారు. అది సుదీర్ఘకాలంగా వస్తోన్న సంప్రదాయమని గుర్తుచేశారు. 2013-14లో యూపీఏ హయాంలోనూ ఈ కార్యక్రమం జరిగిందన్నారు. అప్పుడెందుకు ఈ కార్యక్రమాన్ని రద్దు చేయలేదని రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం ప్రవేశపెట్టిన రూ.48.21 లక్షల కోట్ల బడ్జెట్‌ను లోక్‌సభ ఆమోదించింది. అలాగే కేంద్ర పాలిత ప్రాంతం జమ్ము కశ్మీర్ బడ్జెట్‌ను కూడా లోక్‌సభ ఆమోదించింది.

మత మార్పిడి జరిపితే 20 ఏళ్లు జైలు



» ఒక్కోసారి జీవితఖైదు కూడా విధించొచ్చు

» నేరం రుజువైతే 10 లక్షల వరకు జరిమానా

» యూపీలో మత మార్పిడి నిషేధ చట్టానికి కోరలు.. సవరణ బిల్లు తెచ్చిన యోగి సర్కార్

లఖ్‌నవూ, జూలై 30: మత మార్పిడి నిషేధ చట్టాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మరింత కఠినతరం చేసింది. మత మార్పిడికి పాల్పడిన నిందితుడికి భారీగా జరిమానా, బెయిల్ దొరకడం కష్టతరం, జీవిత ఖైదు విధించేలా చట్టసవరణను మంగళవారం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపాదించింది. ఇప్పటివరకు బాధిత కుటుంబం చేసిన ఫిర్యాదు మేరకు మత మార్పిడి నిరోధక చట్టాన్ని పోలీసులు ప్రయోగిస్తున్నారు. అయితే, యోగీ ఆదిత్యానాథ్ ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణ ఆమోదం పొందితే మత మార్పిడికి సంబంధించి ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. మతం మారకపోతే ప్రాణాలు తీస్తామనే పద్ధతిలో తీవ్ర బెదిరింపులకు పాల్పడిన సందర్భంలో నిందితుడికి యావజ్జీవం కూడా విధించే అవకాశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులో (ఉత్తరప్రదేశ్ చట్టవ్యతిరేక మత మార్పిళ్ల నిషేధ బిల్లు-2024(సవరణ) ఉంది. అలాగే, జరిమానాను రూ.10 లక్షల వరకు విధించవచ్చు. బెయిల్ పొందటం గతంతో పోల్చితే చాలా కష్టంగా ఉంటుంది. ఇప్పుడున్న చట్టం ప్రకారం, చిన్నపిల్లలను, దివ్యాంగులను, మానసిక సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులను, మహిళలను, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారి మత మార్పిడికి ప్రయత్నించిన వ్యక్తి శిక్షార్హుడు. అలాంటి వ్యక్తికి ఇప్పటివరకు గరిష్ఠంగా రూ.లక్ష వరకు జరిమానా, జైలుశిక్ష కనిష్ఠంగా ఐదేళ్లు, గరిష్ఠంగా 14 ఏళ్లు విధిస్తున్నారు. చట్ట సవరణ బిల్లు ప్రకారం, గరిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్షను కూడా విధించవచ్చు. మత మార్పిడి అవసరాల కోసం విదేశీ సంస్థలు లేక నిషేధించిన సంఘాల నుంచి నిధులు అందుకున్నట్టు రుజువైతే, 14 ఏళ్ల వరకు జైలుశిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తారు. బెదిరించి, ప్రాణాంతక ఒత్తిడికి గురిచేసి మత మార్పిడి జరిపిన కేసుల్లో నిందితుడికి 20 ఏళ్లకు పైగా జైలుశిక్ష విధిస్తారు. ఒక్కొక్కసారి యావజ్జీవం కూడా పడవచ్చు. కోర్టు తన విచక్షణాధికారం ఉపయోగించి బాధితులకు 5లక్షల వరకు పరిహారం కూడా ఇప్పించవచ్చునని చట్ట సవరణ బిల్లులో స్పష్టం చేశారు.

అత్తమామలపై కత్తితో దాడి

» అత్త మృతి, మామకు తీవ్రగాయాలు

» ఏమీ తెలియనట్టు మామను కేజీహెచ్‌లో చేర్పించిన అల్లుడు


లక్ష్మి, పైడిరాజు

చోడవరం, జూలై 30: కుటుంబ కలహాల నేపథ్యంలో అత్తమామలపై అల్లుడు కత్తితో దాడి చేయగా అత్త మృతిచెందగా, మామ తీవ్ర గాయాలపాలై ప్రాణాపాయ స్థితిలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం అడ్డూరుకు చెందిన మామిడి పైడినాయుడు(32)కు అదే గ్రామానికి చెందిన సానబోయిన పైడిరాజు, లక్ష్మి కుమార్తె పూర్ణ సంధ్యతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో పిల్లలతో సహా పూర్ణ సంధ్య పుట్టింట్లో ఉంటోంది. పైడినాయుడు తన భార్య, అత్తమామలతో తరచూ గొడవ పడుతుండడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. వారు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం పైడినాయుడు అత్తవారింటికి వెళ్లి గొడవపడ్డాడు అత్త సానబోయిన లక్ష్మిని కత్తితో దారుణంగా పొడవడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. అడ్డొచ్చిన మామ పైడిరాజుపైనా కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. అతడి కేకలకు చుట్టుపక్కలవారు అక్కడకు చేరడంతో ఏమీ తెలియనట్టు పైడినాయుడు తన అత్త మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచి, తీవ్ర గాయాలపాలైన తన మామను తానే విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లాడు. కత్తిపీటపై పడడంతో తీవ్ర గాయాలపాలైనట్టు వైద్యాధికారులకు తెలిపాడు. వైద్యులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సోమవారం రాత్రి అడ్డూరు చేరుకుని పైడిరాజు ఇంటి తలుపులు బలవంతంగా తెరిపించడంతో లోపల అత్త లక్ష్మి మృతదేహం కనిపించింది. మృతురాలి కుమార్తె పూర్ణ సంధ్య ఫిర్యాదు మేరకు సీఐ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, సంధ్య మైనర్‌గా ఉన్నప్పుడే పైడినాయుడు ప్రేమ పేరుతో లోబరుచుకున్నాడని, ఆ తరువాత పెళ్లికి ముఖం చాటేయడంతో ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు మూడేళ్ల క్రితం పోక్సో కేసు నమోదు చేశారని, పెద్దల జోక్యంతో సంధ్యను పెళ్లాడాడని చెబుతున్నారు. తన భార్య, అత్తమామలను హత్య చేస్తానంటూ పైడినాయుడు గ్రామంలో పలువురికి చెప్పినట్టు స్థానికులు తెలిపారు.

అక్రమాల అధికారి డిప్యుటేషన్ రద్దు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

» తెలంగాణలోని మాతృశాఖకు ప్రతాప్‌రెడ్డి

» పరిశ్రమల డైరెక్టర్‌కు ఏపీటీపీసీ ఎండీ బాధ్యతలు

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల శాఖలో అక్రమాల అధికారిగా పేరున్న పి.ప్రతాప్‌రెడ్డి డిప్యుటేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఆయనను తెలంగాణలోని మాతృశాఖ (పరిశ్రమలు)కు తిరిగి పంపేసింది. ప్రస్తుతం ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీగా ప్రతాప్‌రెడ్డి నిర్వహిస్తున్న బాధ్యతలను పరిశ్రమల శాఖ డైరెక్టర్ సి.శ్రీధర్‌కు అప్పగించింది. 'అక్రమాల అధికారికి మళ్లీ అందలం' శీర్షికన ఈ నెల 27న 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనంపై ప్రభుత్వం స్పందించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన డిప్యుటేషన్ ఉత్తర్వులను సమీక్షించిన అనంతరం ప్రతాప్‌రెడ్డి డిప్యుటేషన్‌ను రద్దు చేస్తూ మంగళవారం తాజా ఉత్తర్వులు విడుదల చేసింది. బుధవారం నుంచే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొంది. కాగా, పరిశ్రమల శాఖలో ప్రతాప్‌రెడ్డి చేసిన అవినీతి, అక్రమాలపై సీఐడీ విచారణ జరిపించాలని దళిత ఇండస్ట్రియల్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు అసోసియేషన్ ప్రెసిడెంట్ మామిడి సుదర్శన్ లేఖ రాశారు. ఏపీఐఐసీలో ఈడీగా, ఏపీటీపీసీ ఎండీగా, రామాయపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవోగా పనిచేసిన కాలంలో ఆయన అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో లంచం తీసుకుని పదుల సంఖ్యలో కన్సల్టెంట్లను నియమించుకున్నారని, వారికి నెలకు రూ.2లక్షల చొప్పున జీతాలు చెల్లించి ప్రజాధనాన్ని దోచిపెట్టారని పేర్కొన్నారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఏపీటీపీసీ వాహనాల్లోనే ఆయన వైసీపీ అభ్యర్థులకు డబ్బులు చేరవేశారని తెలిపారు. ప్రతాప్‌రెడ్డి వ్యవహారంపై కొందరు టీడీపీ నాయకులు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు గుర్తుచేశారు. ఇంటెలిజెన్స్ వైఫల్యం కారణంగా ప్రతాప్‌రెడ్డి అవినీతి, అక్రమాలపై పూర్తి సమాచారం అందకపోవడంతో ఆయనపై చర్యలు తీసుకోవాల్సిన కొత్త ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించి ఇటీవలే మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవోగా నియమించి అందలమెక్కించిందని వివరించారు. ఇప్పటికైనా వాస్తవాలను గుర్తించిన ప్రభుత్వం.. ప్రతాప్‌రెడ్డి అవినీతి, అక్రమాలపై సీఐడీ విచారణ జరిపించాలని సుదర్శన్ డిమాండ్ చేశారు.

పాఠశాల విద్యలో ప్రక్షాళన మొదలు

» సర్వీసెస్ జేడీ రామలింగంపై బదిలీ వేటు

» టీచర్ల అక్రమ బదిలీల వ్యవహారంలో ఆరోపణలు

» త్వరలో డైరెక్టరేట్‌లో మరిన్ని బదిలీలు

» డీఈవోలనూ బదిలీ చేసే అవకాశం

అమరావతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో ప్రక్షాళన మొదలైంది. డైరెక్టరేట్‌లో సర్వీసెస్ జేడీగా ఉన్న మువ్వా రామలింగంపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆయనకు ఎలాంటి పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ బాధ్యతలను డైరెక్టర్ వి.పార్వతికి అప్పగించారు. గత ప్రభుత్వంలో జరిగిన టీచర్ల అక్రమ బదిలీల వ్యవహారంలో రామలింగంపై ఆరోపణలున్నాయి. సర్వీసెస్ జేడీగా ఉంటూ బదిలీల వ్యవహారంలో ఆయనే చక్రం తిప్పారనే విమర్శలు అప్పట్లోనే వచ్చాయి. అప్పటి ప్రభుత్వం సుమారు 2,400 మంది టీచర్లకు అడ్డగోలుగా సిఫారసు బదిలీల పేరిట ఆర్డర్లు జారీచేసింది. ఎన్నికలకు ముందు చేసిన వాటిలో 917 మంది బదిలీలను అప్పటి సీఎం జగన్ రాటిపై చేయక పోవడంతో కొత్త ప్రభుత్వం వాటిని రద్దుచేసింది. కానీ.. అంతకుముందు బదిలీలు అడ్డగోలుగా జరిగిపోయాయి. ఇందులో రామలింగం పాత్ర ఉందని పలువురు మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికలకు ముందు రామలింగం సచివాలయంలో పాఠశాల విద్యాశాఖ సంయుక్త కార్యదర్శితో కలిసి అక్రమ బదిలీల్లో జోక్యం చేసుకున్నారు. ప్రభుత్వం భారీగా అక్రమ బదిలీలు చేయడంతో ఈ ఇద్దరు అధికారులు కలిసి సుమారు 30 మంది టీచర్ల బదిలీలు సొంతంగా చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఒక్కో టీచర్ నుంచి రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలు వసూలు చేశారు. ఈ బదిలీల వ్యవహారంలో రామలింగం అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు పూర్తిగా సహకరించారు. అప్పటి కమిషనర్ సురేశ్‌కుమార్‌ను పక్కనపెట్టి మరీ బొత్స కార్యాలయం రామలింగం ద్వారా బదిలీలు చేయించింది. ఈ క్రమంలో మంత్రి కార్యాలయంతో అంటకాగిన అంశం విమర్శలకు దారితీసింది. ప్రభుత్వం మారిన వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు పెరిగాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ఇప్పుడు బదిలీ వేటు వేసింది. ఫిర్యాదుల ఆధారంగా ఆయనపై విచారణకు ఆదేశించనుంది. ఆయనపై గతంలోనూ అనేక ఆరోపణలున్నాయి. అన్నిటినీ కలిపి విచారణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు పాఠశాల విద్యాశాఖలో మరిన్ని మార్పులు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. కీలక పోస్టుల్లో ఉన్న వారిని మార్చనుంది. డైరెక్టరేట్, ఎస్‌సీఈఆర్‌టీ, సమగ్రశిక్ష, ఇతర విభాగాల్లోనూ మార్పులు చేయనుంది. అలాగే కొందరు డీఈవోలనూ మార్చాలని భావిస్తోంది. సమర్థవంతంగా పనిచేసే అధికారులకు కీలక స్థానాలు అప్పగించాలని ప్రభుత్వం నుంచి అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో గత ప్రభుత్వంలో అధికారుల పాత్ర, సమర్థత ఆధారంగా బదిలీలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

అమరావతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఓపెన్ స్కూల్ సొసైటీ నోటిఫికేషన్ జారీచేసింది. బుధవారం (జూలై 31) నుంచి ఆగస్టు 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. ఆగస్టు 28 తర్వాత నుంచి సెప్టెంబరు 4 వరకు దరఖాస్తు చేసుకునే వారు రూ.200 ఫైన్ చెల్లించాలని తెలిపింది. ఏపీఓపెన్ స్కూల్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది.

8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

» షెడ్యూల్ విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. ఇప్పటివరకూ తల్లిదండ్రుల కమిటీల పేరుతో ఉన్న వాటిని ఇకపై స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలుగా పేరు మార్చింది. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాల అభివృద్ధి బాధ్యతలను ఈ కమిటీలకు అప్పగించాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించడంతో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఈ ఉత్తర్వులు జారీచేశారు. ఆగస్టు 1న ఈ ఎన్నికలకు నోటిఫికేషన్, అదే రోజున ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారు. 8న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కమిటీ సభ్యుల ఎన్నిక, మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక, 2 గంటలకు వారితో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. అదే రోజు మొదటి మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.

ఇంజనీరింగ్‌లో మిగిలిపోయిన 18,951 సీట్లు

» తుది విడతలో 17,575 సీట్లు కేటాయింపు


అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కన్వీనర్ కోటాలో తుది విడత కౌన్సెలింగ్ ముగిసింది. మంగళవారం విద్యార్థులకు సీట్లు కేటాయించగా 17,575 మంది కొత్తగా సీట్లు సాధించారు. అయినా ఇంజనీరింగ్‌లో ఇంకా 18,951 సీట్లు విగిలిపోయాయి. ఈ వివరాలను సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గుమ్మల గణేశ్‌కుమార్ విడుదల చేశారు. కన్వీనర్ కోటాలో మొత్తం 1,39,254 సీట్లు అందుబాటులో ఉండగా, వాటిలో 1,20,303 సీట్లు భర్తీ అయ్యాయి. యూనివర్సిటీల కాలేజీల్లో 828, ప్రైవేటు కాలేజీల్లో 17,999, ప్రైవేటు యూనివర్సిటీల్లో 124 సీట్లు మిగిలాయి. అలాగే తుది విడత కౌన్సెలింగ్‌లో 26,162 మంది విద్యార్థులు ఒక కాలేజీ నుంచి మరొక కాలేజీకి మారారు. ఆగస్టు 3లోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని గుమ్మల గణేశ్‌కుమార్ స్పష్టం చేశారు.

రైతుల పేరుతో బ్యాంకు రుణాలు పొంది ఎగవేత

» గోదాము యజమాని, బ్యాంకు మేనేజర్ ఆస్తుల అటాచ్

విశాఖపట్నం, జూలై 30(ఆంధ్రజ్యోతి): గోదాములో రైతులు ఉత్పత్తులు నిల్వ చేశారంటూ 76 మంది పేర్లతో బ్యాంకు నుంచి రుణాలు తీసుకొని ఎగ్గొట్టిన గోదాము యజమానిపైనా, సహకరించిన కెనరా బ్యాంకు మేనేజర్ ఆస్తులను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. దీనికి సంబంధించి విశాఖపట్నంలోని మనీ లాండరింగ్ ప్రత్యేక కోర్టులో హైదరాబాద్‌కు చెందిన ఈడీ అధికారులు ఈ నెల 27న ప్రాసిక్యూషన్ పిటిషన్ వేశారు. సోమి వేర్‌హౌస్ నిర్వహించే ఎం.ప్రతాప్‌రెడ్డి రైతుల పాస్ పుస్తకాలు సంపాదించి, వారి పంట ఉత్పత్తులు తన గోదాములో నిల్వ చేసినట్టు పత్రాలు సృష్టించాడు. వాటిని కెనరా బ్యాంకులో తనఖా పెట్టి మేనేజర్ ఎన్.శ్రీనివాసులు సాయంతో 76 మంది పేరిట రూ.5.73 కోట్ల రుణం తీసుకున్నాడు. వారిలో 59 మంది పేరిట ఆస్తులేమీ లేవు. దీనిని గుర్తించిన బ్యాంకు అధికారులు ప్రతాప్‌రెడ్డి నుంచి రూ.4.5 కోట్లు వసూలు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన హైదరాబాద్ సీబీఐ అధికారులు బ్యాంకు మేనేజర్‌కు రూ.30 లక్షలు లంచంగా ఇచ్చినట్టు తేల్చారు. ప్రతాప్‌రెడ్డికి చెందిన రూ.1.23 కోట్ల ఆస్తులను, మేనేజర్‌కు చెందిన రూ.30 లక్షల ఆస్తులను అటాచ్ చేసినట్టు ఈడీ అధికారులు కోర్టుకు తెలిపారు.

సికెల్‌సెల్ ఎనీమియాతో బీటెక్ విద్యార్థిని మృతి


హేమ

చింతపల్లి, జూలై 30: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలో బీటెక్ విద్యార్థిని సికెల్ సెల్ ఎనీమియాతో మృతి చెందింది. కడశిల్ప గ్రామానికి చెందిన గోపీనాయక్ కోటి కుమార్తె హేమ (22) ఈ ఏడాది బీటెక్ పూర్తి చేసింది. ఆమె కొంతకాలంగా సికెల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతోంది. రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆమెను కేజీహెచ్‌కు తరలించగా మంగళవారం మృతి చెందింది.

ఏమిటీ సికెల్‌సెల్ ఎనీమియా?

సికెల్‌సెల్ ఎనీమియా జన్యుపరమైన లోపం కారణంగా వస్తుందని వైద్యులు చెబుతున్నారు. బాధితుల్లో ఎర్ర రక్త కణాల ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. ఆరోగ్యవంతులైన మనుషుల్లో ఎర్ర రక్త కణాలు గుండ్రంగా ఉంటాయి. వాటి జీవిత కాలం 120 రోజులు. అయితే సికెల్‌సెల్ ఎనీమియా బాధితుల్లో ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారంలో ఉంటాయి. 25 రోజులకే నశిస్తాయి. అయితే ఈ కణాలు నశించినంత వేగంగా కొత్త ఎర్రరక్త కణాలు ఉత్పత్తి కాకపోవడంతో ఈ వ్యాధి ఉన్నవారు రక్తహీనతకు గురవుతారు. సికెల్ సెల్ ఎనీమియా బాధితులు 15 రోజులకొకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉంటే రక్తం మార్పించుకోవాలి. ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలతోపాటు వైద్యాధికారి సూచించిన జాగ్రత్తలు పాటించాలి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నిట్ నెం.2/టి.ఓ./2024-25, తేది: 25.07.2024
పశ్చిమగోదావరి జిల్లాలో 1 పని కొరకు, ఏలూరు జిల్లాలో 5 పనుల కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. అంచనా విలువ: రూ.448.00 లక్షలు. టెండరు షెడ్యూళ్ళను ది.01.08.2024, సా.3 గం.ల నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. తదుపరి వివరాలను http://tender.apeprocurement.gov.in లో చూడవచ్చును.
సం/- పర్యవేక్షక ఇంజనీర్, (ర.భ), ఏలూరు సర్కిల్, ఏలూరు
DIPR R.O.NO.13783/CL/ADVT/1/1/2021-22, తేది: 30.07.2024

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నిట్ నెం.01-06/టిప్/ఇ-ప్రొక్యూర్మెంట్/2024-25 తేది: 29.07.2024
గుంటూరు వారి కార్యాలయ పరిధిలో 15 ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ ద్వారా గ్రామ త్రాగునీటి సౌకర్యాల కల్పనకు సంబంధించిన 6 పనులకు అంచనా విలువ: రూ.164.30 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్లు తేది.03.08.2024 నుండి అందుబాటులో ఉంచబడును. ఇతర వివరాలను www.apeprocurement.gov.in లో చూడగలరు.
సం/- కార్యపాలక ఇంజనీరు, గ్రామీణ నీటి సరఫరా & పారిశుధ్య డివిజన్, గుంటూరు
DIPR RO.No. 13787/CL/ADVT/1/1/2021-22 తేది: 30.07.2024

GOVERNMENT OF INDIA
DEPARTMENT OF SPACE
CMG, SDSC - SHAR SRIHARIKOTA - 524124
Brief E-TENDER NOTICE : CORRIGENDUM-I
No: e-Tender Notice No.CMG/C/CON 248709-(I) Dt:29.07.2024
Refer to Tender No CMG/C/CON 248709 dated 01.07.2024 Name of work: "Construction of LCC/MCC facility, Technical Service Building, Base fire station & 50 Cum GLR at SSLV Launch complex, (SLC), Tiruchendur & Sathankulam Taluk, Tuticorin District (Civil, PH, Electrical & AC works)" (Est. cost Rs. 2029 Lakhs). **Sale period extended up to 06.08.2024**. Interested tenderers may visit www.isro.gov.in or www.tenderwizard.com/ISRO for details.
Sd/- GROUP HEAD, CMG/SDSC SHAR

OFFICE OF THE COMMISSIONER OF CUSTOMS
(PREVENTIVE COMMISSIONERATE)
55-17-3, C-14, 2nd Floor, Road No.2, Industrial Estate, Autonagar, Vijayawada – 520 007, Phone : 0866-2551261, Fax : 0866-2551156
C.No.II/25/36/2023-Accts Date: 29-07-2024
पेंशन अदालत के लिए सार्वजनिक सूचना / PUBLIC NOTICE FOR PENSION ADALAT
Pension Adalat will be held by the Commissioner of Customs, Customs Commissionerate (Preventive), Vijayawada on 06.08.2024 at 04:00 PM at the Office of the Commissioner of Customs, 2nd Floor, Conference Hall, Customs Commissionerate (Preventive), Auto Nagar, Vijayawada to redress grievances of all Pensioners retired from Customs Commissionerate (Preventive), Vijayawada. You may submit your grievances to the Nodal Officer as detailed below:-
Additional Commissioner of Customs,
Customs Commissionerate (Preventive)
2rd Floor, Stalin Corporate Building,
Auto Nagar, Vijayawada
Email: cpcvja.accts@gmail.com
The last date for submission of grievances by the pensioners is 02.08.2024.
Issues like compassionate appointment, pay anamoly, legal cases, and policy issues will not come under purview of PENSION ADALAT.
For any difficulty, you may visit our office personally, email us at the above mentioned address.
Sd/- Commissioner

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇది సరికాదు...!

గతకాలపు ప్రణాళికాసంఘం మీద కూడా అప్పట్లో రాజకీయ విమర్శలు రాకపోలేదు కానీ, దానిని చరిత్రలో కలిపేసి నీతి ఆయోగ్ తెచ్చిన తరువాత దీని చుట్టూ సాగుతున్న రాజకీయం మరీ భరించలేనంతగా ఉంది. శనివారం నాటి నీతి ఆయోగ్ సమావేశానికి పదిరాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతంనుంచి ప్రాతినిధ్యం లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. రాష్ట్రాల అభివృద్ధి, కేటాయింపులు, కోటాలూ వాటాలూ ఇత్యాది కీలకమైన అంశాలను నిర్ణయించే ఓ ముఖ్యమైన సమావేశానికి విపక్షపాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇలా గైర్హాజరు కావడానికి వారు చెబుతున్న ప్రధాన కారణం ఇటీవలి బడ్జెట్ కేటాయింపుల్లో తమకు ఉద్దేశపూర్వకంగా తీరని అన్యాయం చేశారని. మిగతావారిలాగా కాక మమతాబెనర్జీ ఈ సమావేశానికి హాజరైనారు కానీ, ఆ తరువాత బాయ్ కాట్ చేశారు. తనను ఐదునిముషాలు మాత్రమే మాట్లాడనిచ్చారని, బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని చెప్పబోతుండగా మైక్ కట్‌చేశారని ఆమె ఆరోపించారు. నీతి ఆయోగ్ సమావేశాలను విపక్షాలు రాజకీయం చేస్తున్నాయన్న బీజేపీ విమర్శ పూర్తిగా కొట్టిపారేయలేనిది. మమత మాదిరిగానే ఆ సమావేశానికి హాజరై కూడా వారు తమ ఆగ్రహాన్నో, అసమ్మతినో వ్యక్తపరిస్తే సరిపోయేది. అది జరగకపోగా, విపక్షపార్టీకి చెందిన ఒకే ఒక్క నాయకురాలు సమావేశానికి హాజరై తాను మాట్లాడుతూంటే మైక్ కట్‌చేశారని ఆరోపించడం ఆశ్చర్యకరమైన విషయం. లోపల ఏమి జరిగిందో తెలియదుకానీ, ఆమె చేసిన పలు ఆరోపణలను ఖండిస్తూ ఓ పూర్తిభిన్నమైన వివరణ ఒకటి ఆ తరువాత ప్రభుత్వం నుంచి వెలువడింది. నీతి ఆయోగ్ ను రద్దుచేసి, ప్రణాళికా సంఘాన్ని పునరుద్ధరించాలని మమత ఎందుకు డిమాండ్ చేశారన్నది అటుంచితే, ఈ రాజకీయ వైరంలో ఈ సంస్థ ప్రతిష్ఠ క్రమంగా దిగజారిపోతున్నమాట నిజం.

పశ్చిమబెంగాల్ ఉత్తరప్రాంతాలను ఈశాన్య ప్రాంత అభివృద్ధిశాఖ పరిధిలోకి తీసుకురావాలని బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు, కేంద్రమంత్రి సుకాంత ముజుందార్ ఇటీవల చేసిన ప్రతిపాదన తృణమూల్‌కు తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. ప్రతీకారంగా మమత ఈ సమావేశానికి హాజరై ఏకంగా నీతి ఆయోగ్ రద్దునే డిమాండ్ చేశారని అంటారు. బెంగాల్ ఉత్తరాది ప్రాంతాలకు ఈశాన్యంతో చాలా సామీప్యం ఉంటుందని, అవి అభివృద్ధి చెందాలంటే కేంద్రప్రభుత్వ అధీనంలోని తన మంత్రిత్వశాఖలోకి రావాలని ఆ బీజేపీ నాయకుడు ప్రధానికి స్వయంగా ప్రతిపాదించడం సహజంగానే వివాదాన్ని రేపింది. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సగానికి సగం సీట్లను గెల్చుకున్నది ఉత్తర బెంగాల్ నుంచే. దానిని రాష్ట్రంగానో, కేంద్రపాలిత ప్రాంతంగానో చేయాలని బీజేపీ నాయకులు అప్పుడప్పుడు డిమాండ్ చేస్తూ, తమకు అనాదిగా అన్ని విధాలా అన్యాయం జరుగుతున్నదన్న ఆ ప్రాంతవాసుల భావనను సజీవంగా ఉంచుతూ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తుంటారు. మమతను గద్దెదించడం అసాధ్యమని తేలిపోవడంతో రాష్ట్రాన్ని నిలువునా చీల్చే దిశగా బీజేపీ కుట్రపన్నుతోందని టీఎంసీ దీనితో భగ్గుమన్నది. రాష్ట్రాన్ని చీల్చే ఆలోచన మాకు లేదు కానీ, రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఉత్తరబెంగాల్‌కు తీవ్రమైన అన్యాయం జరుగుతున్నమాట వాస్తవమని సువేందు అధికారి ఓ వివరణ ఇచ్చారు. పశ్చిమబెంగాల్‌కు కేంద్ర బడ్జెట్లో ఎంత అన్యాయం జరిగిందో చెప్పి, మీ రాజకీయం కోసం మా రాష్ట్రాన్ని చీల్చుతారా అని హెచ్చరించేందుకు నీతి ఆయోగ్ సమావేశాన్ని మమత ఉపయోగించుకున్నారు.

గతకాలపు ప్రణాళికా సంఘంలో లోపాలు లేవని ఎవరూ అనడం లేదు. కానీ, రాష్ట్రాలతో సంప్రదింపులు, వివిధరకాల కేటాయింపుల విషయంలో దాని నిర్ణయాలకు, సూచనలకు ఎంతోకొంత విలువ ఉండేది. ఇప్పుడు పెత్తనమంతా ఆర్థికశాఖదే కనుక, నీతి ఆయోగ్ ఓ సలహాసంఘంగా మిగిలిపోయింది. సహకార సమాఖ్య విధానానికి దారులు పరుస్తుందని తెచ్చిన వ్యవస్థ కేంద్ర సర్కారు చేతులో కీలుబొమ్మని విమర్శలు ఎదుర్కొంటోంది. నీతి ఆయోగ్‌ను రద్దుచేసి, ప్రణాళికాసంఘాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్ ఎలాగూ ఇప్పట్లో నెరవేరేది కాదు కానీ, దాని పనిపద్ధతులను మెరుగుపరచి, రాష్ట్రాలతో విస్తృతమైన సంప్రదింపులతో, వాటి అధికభాగస్వామ్యంతో దానిని తీర్చిదిద్దడం ముఖ్యం. బీజేపీ, విపక్షాలు తమ రాజకీయ యుద్ధాన్ని ఇక్కడివరకూ తేవడం సముచితం కాదు. రాజ్యాంగబద్ధ సంస్థలను గౌరవించకుండా రాజకీయ ప్రయోజనాలకు వేదికగా ఉపయోగించుకోవడం ప్రజలు హర్షించరు.

రక్షకుడే రక్షణ కోసం ప్రాకులాడటమా?

రక్షకులకు రక్షణ కావాల్సి వచ్చిందా? చిత్రమైన సమస్య! పేపర్లలోనూ, చానెళ్లలోనూ చూశాం. పోలీసులను రక్షకభటులని పిలుస్తారు. పోలీసు స్టేషనును రక్షకభట నిలయం అంటారు. ప్రభుత్వం మారగానే కొందరు పోలీసు అసోసియేషన్ ప్రతినిధులు, పూర్వ పోలీసు అధికారి, ప్రస్తుతం రాజకీయ నాయకులుగా ఉన్న ఒకరిని పార్టీ ఆఫీసులో కలిసి "దయచేసి ఏమీ అనుకోవద్దు! గత ప్రభుత్వం ఉన్నప్పుడు వారు చెప్పినట్లు చేయటం తప్పయిపోయింది! తొడలు కొట్టి ప్రజలను బెదరకొట్టాం, మీసాలు మెలేసి గుడ్లురిమి చూసి అదరగొట్టాం! ఏవో తెలియక చేసిన పనులు! కొత్త ప్రభుత్వంలోని పెద్దలతో మాట్లాడి మా మీద ఎలాంటి చర్యలూ లేకుండా చూడండి! మమ్మల్ని క్షమించండి! ఇక బుద్ధిగా ఉంటాం, మమ్మల్ని రక్షించండి" అని వేడుకున్నారట! పోలీసు అసోసియేషన్‌లో ముఖ్యమైన ఆఫీస్ బేరర్స్ అని వారిని పేర్కొన్నారు.

పోలీసు అసోసియేషన్ తరఫున వారు అలాంటి విన్నపం చేసారా? లేక తప్పులు చేసిన అందరి పోలీసుల తరఫున వారు అలాంటి విజ్ఞప్తి చేసారా అన్న విషయంలో క్లారిటీ లేదు! ఏది ఏమైతేనేం రక్షకభటులు రక్షణ కోరవల్సిన దయనీయ పరిస్థితి! అయితే వారికి ట్రయినింగ్‌లో చెప్పే ఉండవచ్చు చట్టాన్ని అతిక్రమిస్తే సామాన్యులే కాదు, చివరకు పోలీసులనయినా చట్ట ప్రకారం శిక్షించడం తప్పదని!

నిజానికి పోలీసువారు అసోసియేషన్ ఏర్పరచుకోవటానికి కేంద్ర ప్రభుత్వం 1979లో రాజ్యాంగ సవరణ చేసింది! అదయినా కేవలం వారి విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఉద్యోగ సమస్యలను పై అధికారుల ద్వారా ప్రభుత్వాలకు చెప్పుకోవటానికి మాత్రమే. ఇతర సంఘాల మాదిరి ప్రభుత్వాలకు నోటీసులు ఇవ్వటం, ధర్నాలు చేయటం వంటి వాటికి అనుమతి లేదు. కేవలం అంతర్గత సమస్యలను ఉన్నతాధికారుల ద్వారా పరిష్కరించుకోవటానికి మాత్రమే అసోసియేషన్ ఏర్పాటుకు అప్పుడు అనుమతి ఇచ్చారు. కానిస్టేబుల్ నుంచి ఇన్‌స్పెక్టర్ హోదావరకు ఒకటి, డీఎస్పీ నుంచి రాష్ట్రంలోని గెజిటెడ్ హోదా కలిగిన పోలీసు అధికారులకు ఒకటి, ఐపీఎస్ వారికి వేరే అసోసియేషన్, మొత్తం మూడు అసోసియేషన్లు రాష్ట్రంలోని పోలీసులకు ఉండే అవకాశం ప్రభుత్వం కల్పించింది!



ఉద్యోగరీత్యా పోలీసులకు చట్టాలు అపరిమితమైన అధికారాలు ఇచ్చాయి! అధికారం వినియోగించుకొనే విషయంలో కానిస్టేబుల్ నుంచి డీజీపీ స్థాయి వరకూ రాజ్యాంగం ఏ భేదమూ లేకుండా అదే అధికారాన్ని చట్టపరంగా సంక్రమించేట్లు చేయటం వేరే ఎంత పెద్ద ఉద్యోగం చేసేవారికైనా ఇవ్వలేదు! అరెస్టు చేయటం అనేది పోలీసుకు విధినిర్వహణలో చట్టం సమకూర్చిన ఒక గొప్ప బాధ్యత!

పరిమితులతో కూడిన సంఘాలను ఏర్పరుచుకొనే వెసులుబాటును పోలీసు వారికి ఇవ్వటానికి కారణం ఉంది! పని ఒత్తిడి వల్ల వారు వ్యక్తిగతంగా కొన్నిసార్లు పై అధికారులకు తమ ఇబ్బందులను, జీతభత్యాల వ్యవహారాల్లోని వ్యత్యాసాలను, గృహ, వైద్య విషయాల లాంటి వాటిల్లో వారికి కలుగుతున్న అసౌకర్యాలను తొలగించుకొనే అవకాశం ఈ సంఘాలు ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోవటానికి వెసులుబాటు కల్పించే లక్ష్యంతో ఏర్పరిచారు. విధినిర్వహణ పక్కన పెట్టి ఈ సంఘాలు విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ, చట్టాలను అతిక్రమించి రాజకీయంగా అధికారంలో ఉన్నవారికి కొమ్ముకాయటానికి మాత్రం కాదు!

ఉద్యోగరీత్యా పోలీసులకు చట్టాలు అపరిమితమైన అధికారాలు ఇచ్చాయి! అధికారం వినియోగించుకొనే విషయంలో కానిస్టేబుల్ నుంచి డీజీపీ స్థాయి వరకూ రాజ్యాంగం ఏ భేదమూ లేకుండా అదే అధికారాన్ని చట్టపరంగా సంక్రమించేట్లు చేయటం వేరే ఎంత పెద్ద ఉద్యోగం చేసేవారికైనా ఇవ్వలేదు! అరెస్టు చేయటం అనేది పోలీసుకు విధి నిర్వహణలో చట్టం సమకూర్చిన ఒక గొప్ప బాధ్యత! ఆ బాధ్యతను దుర్వినియోగం చేస్తే అదే చట్టం తప్పక శిక్షిస్తుంది! యూనిఫాంలో ఉన్న పోలీసు ఒక పౌరుడే! యూనిఫాం లేని పౌరుడు కొన్ని సందర్భాలలో పోలీసే! ఆ ఎరుకతో పౌరులు – పోలీసులూ ప్రవర్తించాలి. పోలీసు మరింత బాధ్యతతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాలి. వృత్తిరీత్యా పోలీసు చట్టానికి మాత్రమే బాధ్యుడు! ప్రభుత్వానికీ బాధ్యుడే! చట్టరీత్యా ప్రభుత్వాలు ఆదేశాలు ఇచ్చినప్పుడు క్రమశిక్షణతో అమలుచేయక తప్పదు. ఆ విధంగా ప్రభుత్వానికి బాధ్యుడు.

ఇంగ్లండులో ఒక సందర్భంలో అప్పటి ప్రధానమంత్రి టోనీబ్లెయిర్, ఆయన భార్య – పోలీసు స్టేషన్‌కు వెళ్ళి తాగుబోతుగా మారి పోలీసులకు చిక్కిన మైనర్ కొడుకును – పౌరులుగా స్టేషనులో హామీతోబాటు జామీనుపత్రం ఇచ్చి విడిపించుకున్న సంఘటన ప్రపంచవ్యాప్తంగా పేపర్ల హెడ్‌లైన్స్‌ను ఆకర్షించింది! ఆ ప్రధానమంత్రి ప్రవర్తన – గొప్ప అధికారంలో ఉన్న పౌరుడి బాధ్యతను నిర్వచిస్తుంది! అదే సమయంలో పోలీసుకు చట్టం ఇచ్చిన అధికారాన్ని కూడా నిర్వచిస్తుంది! అధికారాలను, బాధ్యతలను సక్రమంగా ప్రజాస్వామ్య పరిధిలో నిర్వహించటానికి ఈ ఉదాహరణ మచ్చుతునకగా చరిత్రలో నిలిచిపోయింది!

బందోబస్తు చేస్తున్న ఒక యువ పోలీసు అధికారి కొత్తగా అధికార పీఠం ఎక్కిన యువ ముఖ్యమంత్రిని చూస్తూ "ఆహా! ఏమి అదృష్టం! ఇరవై ఎనిమిదేళ్ళకే ముఖ్యమంత్రి అయ్యారు! పదవి అంటే అదీ" అని విభ్రమంతో అన్నాడట! పక్కనే వున్న వయసుమళ్ళిన ఒక హెడ్‌కానిస్టేబుల్ అది విని "సార్! మీరు ఏమీ అనుకోకపోతే నిప్పు లాంటి నిజం ఒకటి చెబుతాను. మీరు అన్నట్లు ఆయన చిన్న వయసులోనే ముఖ్యమంత్రి అయ్యారు. కానీ ఆ పదవి అయిదేళ్ళు మాత్రమే! మళ్ళీ ఇంకోసారి ఎన్నికలలో గెలవకపోతే ఆయన సామాన్య రాజకీయ నాయకుడిగానే మిగిలిపోక తప్పదు! అదే వయసులో ఉన్న మీరు పోలీసు ఉన్నత పదవి పొందారు? కానీ మీ అధికారం, హోదాతో మీరు సక్రమంగా చట్ట ప్రకారం విధులు నిర్వహిస్తే ముప్పయి ఏళ్ళు నిరాఘాటంగా ఉంటారు! ఇప్పుడు చెప్పండి సార్ ఎవరిది అదృష్టమో!?" అన్నాడట!

ఒక హోదాను మరొక హోదాతో పోల్చటం భావ్యం కాదు. హెడ్‌కానిస్టేబుల్ పోల్చటంలో అదృష్టాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నాడు. కానీ పోలీసు వృత్తిని ఆ వృత్తిలో ఉన్నవారే తక్కువచేసి, ఆత్మాభిమానంతో పాటు బాధ్యతను పక్కనపెట్టి సమాజానికి సేవ చేయకుండా, చట్టప్రకారం బాధ్యతలను నిర్వర్తించకుండా, చట్టాలను అతిక్రమించి, అధికారంలో ఉన్నారు కదా అని కొందరికే అక్రమ రక్షణ కవచంగా మారి, చివరకు తమకూ తమ ఉద్యోగాలకూ రక్షణ లేకుండా చేసుకోవటం స్వయంకృతాపరాధమే కదా! గొప్ప అధికారాన్ని చిన్న స్వప్రయోజనాల కోసం పణంగా పెట్టి రక్షణ కోరటం సబబా? చట్టం ఒప్పుకోదు కదా!

• రావులపాటి సీతారాంరావు

రుణ భారంతో భారత్ వికసితమయ్యేనా?

భారతదేశం దృష్టి ఇప్పుడు కేంద్ర స్థాయి నుంచి రాష్ట్రాల పైకి మళ్లింది. లోక్‌సభ ఎన్నికల్లో బిహార్, ఏపీ, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, హర్యానా, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, గుజరాత్‌లో వచ్చిన ఫలితాలు కేంద్రంలో రాజకీయ సమీకరణాలను మార్చాయి. బిహార్, ఏపీలో వచ్చిన ఫలితాల ఆధారంగానే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగింది. ఇతర రాష్ట్రాల్లో బీజేపీ అనుకున్న ఫలితాలను సాధించలేకపోయింది. మధ్యప్రదేశ్‌తో పాటు ఒకటి రెండు రాష్ట్రాల్లోనే గత ఎన్నికల ఫలితాలను బీజేపీ పునరావృతం చేయగలిగింది. లోక్‌సభ ఎన్నికలు జరిగిన కొద్ది రోజుల్లోనే వివిధ రాష్ట్రాల్లో 13 అసెంబ్లీ సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లో కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు లేదని తేలింది. లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరాఖండ్, హిమాచల్‌లో మొత్తం సీట్లు గెలుచుకున్న బీజేపీ అసెంబ్లీ ఉపఎన్నికల వరకు వచ్చేసరికి నాలుగు సీట్లు కోల్పోయింది. ఇక ఈ ఏడాది అక్టోబర్, నవంబర్‌లో హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాలు, వచ్చే ఏడాది జరిగే ఢిల్లీ, బిహార్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గట్టి పోరాటమే జరపాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ దేశంలో ఏ ఎన్నికలు జరిగినా తానొక్కడే అన్నట్లుగా ముందుండి నిలిచి ప్రచారం చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీపైనే ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాల్సిన గురుతర బాధ్యత ఉన్నది.



ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కంటే 59 సీట్లు తక్కువ గెలుచుకున్న ఇండియా కూటమిలో రోజురోజుకూ ఉత్సాహం పెరుగుతున్నదనడంలో సందేహం లేదు. ఎన్డీఏ కూటమితో పోలిస్తే 1.9 శాతం మాత్రమే తక్కువ ఓట్లు గెలుచుకున్న ఇండియా కూటమి నేతలు పార్లమెంట్‌లోనూ, వెలుపలా సంఘటిత కార్యాచరణను ప్రదర్శిస్తున్నారు. తొలి సమావేశాల్లోనే ఇండియా కూటమి సంఘటితంగా రాహుల్‌గాంధీని లోక్‌సభా పక్ష నేతగా ఎన్నుకోవడం, కలిసికట్టుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని అడ్డుకోవడం, ఇటీవల నీతిఆయోగ్ సమావేశాలను బహిష్కరించడం కీలక పరిణామాలు. ఇక ద్వితీయ సమావేశాల్లో కూడా ప్రతిపక్షాలు ఇదే దూకుడును ప్రదర్శించాయి. సమయం దొరికితే చాలు ప్రజల మధ్యకు వెళుతున్న కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీలో కొత్త ఉత్సాహం కనపడుతోంది. గతంలో అరుదుగా లోక్‌సభకు వచ్చి మాట్లాడే రాహుల్‌గాంధీ ఇప్పుడు సమయం దొరికితే చాలు సభలో ప్రతిస్పందిస్తున్నారు. తాజాగా మోదీ, అమిత్ షా, మోహన్ భాగవత్, అజిత్ దోవల్, అదానీ, అంబానీ ఈ ఆరుగురినీ ఆయన కౌరవ నేతలుగా పోల్చి వారు రచించిన పద్మవ్యూహంలో దళితులు, బీసీలు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, మహిళలు, రైతులు, మధ్యతరగతి తదితరులంతా అభిమన్యుల్లా చిక్కుకున్నారని రాహుల్ అభివర్ణించడం లోక్‌సభలో సంచలనం సృష్టించింది. ఉద్దేశపూర్వకంగానే ఆయన బీజేపీని సంపన్నులు, అగ్రవర్ణాల అనుకూల ప్రతినిధిగా, ఇండియా కూటమిని సామాన్యుల, మధ్యతరగతి వర్గాల ప్రతినిధిగా అభివర్ణించి తమ రాజకీయ పోరును సైద్ధాంతిక పోరుగా మార్చేందుకు సమర్థంగా ప్రయత్నించారు.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈ లోక్‌సభ ఫలితాల తర్వాత అనేకమంది దృష్టి రాహుల్‌గాంధీపై మళ్లిందనడంలో అతిశయోక్తి లేదు. రాహుల్ రెండు ప్రసంగాలకూ సోషల్ మీడియాలో అత్యంత ప్రాచుర్యం లభించింది. ఆయన ప్రసంగాలపై టీవీల్లో ప్రైమ్ టైమ్‌లో చర్చలు సాగుతున్నాయి. లోక్‌సభలో రాహుల్ లేచి నిలబడ్డప్పుడల్లా బీజేపీ నేతలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి కనపడుతోంది. ఒకప్పుడు నరేంద్రమోదీని ఆకాశానికెత్తిన చేతన్ భగత్ లాంటి రచయితలు కూడా రాహుల్‌గాంధీని ప్రశంసించడం మొదలుపెట్టారు. రాహుల్ వ్యక్తిత్వంలో, హావభావాల్లో, ప్రసంగాల్లో పరిపూర్ణ పరివర్తన కనపడుతోందని, ప్రజలు ఆయన చెప్పేది వింటున్నారని, బీజేపీ స్వయంకృతాపరాధాల వల్లే రాహుల్‌కు ప్రజాదరణ పెరుగుతోందని చేతన్ భగత్ విశ్లేషించారు.

> కేంద్ర ప్రభుత్వ అప్పు రూ. 185.27 లక్షల కోట్లు దాటింది. అది జీడీపీలో దాదాపు 57 శాతానికి చేరుకున్నదని తాజా బడ్జెట్ పత్రాలు సూచిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, బిహార్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తిలో 20 శాతానికి మించి అప్పులు చేశాయని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ వివరించింది. ఆర్థిక లోటు, రుణాల విషయంలో రాష్ట్రాలతో పాటు కేంద్రం కూడా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోతే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడం అసాధ్యం.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

చేతన్ భగత్ భావిస్తున్నట్లు రాహుల్ ఇదే విధంగా సరైన ఎత్తుగడలు వేస్తే తన లక్ష్యాన్ని సాధించే అవకాశాలున్నాయి కాని అందుకు చాలా దూరం ఉన్నది. కాని ఇండియా కూటమి టేకాఫ్ మూడ్‌లో ఉందన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఇక 2029 వరకు జరిగే ఎన్డీఏ ప్రతి అడుగూ ఆచితూచి వేయాల్సి ఉంటుంది. ఇండియా కూటమి నేతలే కాదు, బీజేపీ నేతలు కూడా మోదీ కదలికలను ఆసక్తితో గమనిస్తున్నారని చెప్పక తప్పదు.

ఈ పరిస్థితుల్లో 2047 కల్లా దేశాన్ని అభివృద్ధి చేయాలని నిర్దేశించడం ద్వారా మోదీ సర్కార్ ఈ రాజకీయ పోరునుంచి ప్రజల దృష్టి మళ్లించగలదా అన్నది అనుమానమే. నేతలు భావి లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికలను, కార్యాచరణను నిర్దేశించుకోవడంలో తప్పేమీ లేదు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇలాంటి లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయడంలో అందరికన్నా ముందున్నారు. ఆయన 1998లోనే విజన్–2020 పేరిట లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. దాని ఫలితాలు కూడా కనపడ్డాయి.

ఇప్పటి వరకూ నరేంద్రమోదీ ప్రసంగాలు, ప్రకటనలు, హావభావాలు ఎంతో చర్చనీయాంశాలయ్యాయి. అయితే దేశంలో మారుతున్న పరిస్థితుల్లో వికసిత్ భారత్–2047 లక్ష్య నిర్దేశాన్ని ప్రజలు ఎంత సీరియస్‌గా తీసుకుంటారన్నది చర్చనీయాంశం. 2023 ఆగస్టు 15న ఎర్రకోటపై మోదీ ప్రసంగించే నాటికి దేశంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని ఎవరూ ఊహించలేదు. ఆయన తన స్వంత మనుగడకోసం ప్రయత్నిస్తూనే తాను ఏర్పర్చుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుంది. ఇందుకోసం దీర్ఘకాలిక లక్ష్యాలతో పాటు స్వల్పకాలిక లక్ష్యాలను కూడా విధించుకోవల్సి ఉంటుంది. కాని స్వల్పకాలిక లక్ష్యాలే నెరవేర్చలేనప్పుడు దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించగలమా అన్నది ప్రశ్న. ఉదాహరణకు 2022 కల్లా అందరికీ ఇళ్లు నిర్మిస్తామని 2015లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. కాని ఇప్పటికీ ప్రభుత్వం ఈ లక్ష్యానికి చేరువలో కూడా రాలేకపోయింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు బిహార్, ఈశాన్య రాష్ట్రాలు ఇళ్ల నిర్మాణంలో 50 శాతం లక్ష్యాన్ని కూడా సాధించలేకపోయాయి. ఐక్యరాజ్యసమితి దశాబ్దంన్నర క్రితం నిర్ణయించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల విషయంలో కూడా భారతదేశం 167 దేశాల్లో 109వ శ్రేణిలో ఉందని ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి రెండు రోజుల క్రితం పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సమయంలో వెల్లడించారు.

అందువల్ల ఏ లక్ష్యాన్ని విధించుకున్నా అది ప్రసంగాల వల్ల సాధ్యం కాదు. ముఖ్యమంత్రుల సమావేశం కోసం నీతిఆయోగ్ ప్రకటించిన ఆధారపత్రం కేంద్రం, రాష్ట్రాలు సమిష్టిగా పనిచేస్తేకానీ వికసిత్ భారత్ లక్ష్యం పూర్తి కాదని స్పష్టం చేసింది. ప్రధానంగా మూలధన పెట్టుబడులు రాష్ట్రాల్లోనే పెరగాలని ఈ పత్రం తెలిపింది. 2047 కల్లా 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఏర్పడాలంటే ఇప్పుడున్న 3.36 ట్రిలియన్ డాలర్ల కంటే 9 రెట్లు జీడీపీ పెరగాలని, ఇప్పుడున్న 2392 డాలర్ల తలసరి వార్షికాదాయం 8 రెట్లు పెరగాలని ఈ పత్రం ప్రకటించింది. అభివృద్ధి చెందిన దేశాల తలసరి ఆదాయానికీ, మన దేశ తలసరి ఆదాయానికి హస్తిమశకాంతరం ఉన్నది. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, మధ్యప్రదేశ్, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ – ఈ 8 రాష్ట్రాలే భవిష్యత్తులో ఎంతో కొంత లక్ష్యాన్ని సాధించగలవే కాని మిగతా రాష్ట్రాలు సమీప దూరంలో కూడా లేవని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

పేదరికాన్ని తగ్గించడం కాదు, అసలు పేదరికమే లేకుండా చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నీతిఆయోగ్ సమావేశంలో ప్రకటించడం వినసొంపుగానే ఉంది. జీ–20 దేశాల్లోనూ, బ్రిక్స్ దేశాల్లోనూ అతి పేద దేశంగా ఉన్న భారత్ ఈ లక్ష్యం సాధించాలంటే అసమానతలు, నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు అతి వేగంగా చర్యలు తీసుకోవాలని రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు చెప్పారు. భారత్‌లో 15–24 ఏళ్ల మధ్య వయసులో ఉన్న ప్రతి అయిదుగురిలో ఒకరు నిరుద్యోగి అని అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకటించింది. అందువల్ల అభివృద్ధి వేగాన్ని పెంచడమే కాదు, ఈ అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా ఉండాలని, అధిక సంఖ్యలో ఉపాధి కల్పన జరగాలని 14వ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు గోవింద్‌రావు అభిప్రాయపడ్డారు. దేశంలో 44 శాతం మంది వ్యవసాయంపై, 42 శాతం మంది చిన్నా చితక సంస్థలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నిరుద్యోగులకు అవసరమైన నైపుణ్యాలు కల్పించడం కూడా ఒక సవాలే.

ఆర్థిక లోటు, జీడీపీలో రుణ శాతం తగ్గించడం అతి పెద్ద సవాలు. మొత్తం కేంద్ర ప్రభుత్వ అప్పు రూ. 185.27 లక్షల కోట్లు దాటగా, అది జీడీపీలో దాదాపు 57 శాతానికి చేరుకున్నదని తాజా బడ్జెట్ పత్రాలు సూచిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, బిహార్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తిలో 20 శాతానికి మించి అప్పులు చేశాయని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ వివరించింది. ఆర్థిక లోటు, రుణాల విషయంలో రాష్ట్రాలతో పాటు కేంద్రం కూడా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోతే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడం అసాధ్యం.

అందరికీ నాణ్యమైన ఇళ్లతో పాటు నాణ్యమైన సేవలు, 24 గంటలు స్వచ్ఛమైన నీరు, విద్యుత్ సరఫరా, హై స్పీడ్ బ్రాడ్ బ్యాండ్, బ్యాంకింగ్ సౌకర్యాలు, అందరికీ భరించదగ్గ ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవలు, అర్థవంతమైన విద్య, అందరికీ నైపుణ్యం, అందరికీ పుష్కలంగా ఉపాధి, యాజమాన్య అవకాశాలు, పట్టణ ప్రాంతాలతో సమానంగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా మెరుగైన జీవన ప్రమాణాలు, నగరాల్లో ప్రపంచ స్థాయి వ్యాపార, ఆర్థిక కేంద్రాలు, ఉత్పత్తి, సేవలు, లాభసాటి వ్యవసాయంతో పాటు అసలు పేదరికమే లేని దేశంగా మారినప్పుడే వికసిత్ భారత్–2047 లక్ష్యాన్ని సాధించినట్లవుతుందని నీతిఆయోగ్ స్వయంగా పేర్కొంది. గతంలో అసాధ్యమైన కలల ప్రపంచాన్ని తలపించే ఉటోపియన్ సోషలిజం గురించి మాట్లాడేవారు. ఇప్పుడు ఉటోపియన్ కాపిటలిజం గురించి మన నేతలు మాట్లాడడంలో ఆశ్చర్యం లేదు. ప్రజలను స్వప్నాల్లో ఉంచినప్పుడే కదా వారు విజయవంతం అయ్యేది! అయితే అసలు వాస్తవాలు సామాన్యుడి జీవితాల్లో ప్రతిబింబిస్తాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

'మా గాడ్ బాబాసాహెబ్.. గాడ్‌ఫాదర్ బాబు'

జీవితమంతా పేదరికం.. ఎటుచూసినా వివక్ష.. అణచివేత.. అన్యాయం.. అంటరానితనం.. ఆకలి.. దిక్కులేని బతుకులు.. శతాబ్దాల దాష్టీకానికి చరమగీతం పాడుతూ దళిత జనోద్ధరణకు బాబా సాహెబ్ అంబేద్కర్ దిక్కయి నిలిచాడు. రాజ్యాంగబద్ధంగా హక్కులు ప్రసాదించాడు. అవి అమలు చేసే నేతలు, పార్టీలు తమ చెప్పుచేతల్లోని దళితులకే పదవులు కట్టబెట్టారు. డబ్బున్న దళితనేతలనే చేరదీశారు. వారి వారసులకే పదవులు పందేరం చేశారు. దశాబ్దాల రాజకీయ వివక్ష నుంచి దళితులకు స్వాతంత్ర్యం ఇచ్చింది తెలుగుదేశం పార్టీ. 'అన్న' నందమూరి తారకరామారావు ఆరంభించిన తెలుగుదేశం–దళిత తేజంను చంద్రబాబు కొనసాగించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దళితజాతి మూలాల నుంచి, మారుమూల దళిత



పల్లెల నుంచీ.. అసలు సిసలు దళిత ప్రతినిధులను ఏరికోరి తెచ్చి మరీ సీట్లు ఇచ్చి గెలిపించుకున్నారు. దళితజాతి అభ్యున్నతికి పాటుపడాలి అంటూ మాపై జాతి రుణం తీర్చుకునే బాధ్యత పెట్టారు.

అనంతపురం జిల్లా, సింగనమల మండలం, అలంకరాయునిపేటలో ఎస్సీ (మాదిగ) కులానికి చెందిన చిన్న రైతు కుళ్లాయప్ప కొడుకు ఎమ్మెల్యే అవుతాడని కలలో కూడా నా తండ్రి ఊహించి ఉండడు. ప్రజాస్వామ్య దేవాలయంలో 'ఎంఎస్ రాజు అను నేను..' అని ప్రమాణం చేసే అర్హత కల్పించింది బాబాసాహెబ్ అంబేద్కర్ అయితే.. అవకాశం ఇచ్చింది టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు. అణగారిన వర్గాలకు రాజకీయ అవకాశాలు దక్కినప్పుడే ప్రజాస్వామ్యం పరిపుష్టం అవుతుందని పోరాడిన బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాన్ని చంద్రబాబు ఆచరణలో పెట్టడంతో నాలాగే 2024 ఎన్నికల్లో 24 మంది ఎస్సీలం శాసనసభ్యులుగా గెలిచాం. మా దగ్గర డబ్బు లేదు. మా తాతలు, తండ్రులు కనీసం వార్డు మెంబర్లు కూడా కాదు. మా వెనుకా ఎవరూ లేరు. మా ముందూ ఎవరూ లేరు. మా ముందు నిలిచింది అంబేద్కర్ మహాశయుడు. నేనున్నానంటూ మా వెనక నిలిచింది చంద్రబాబు. ఫాదర్లు తప్పించి గాడ్‌ఫాదర్లు లేని తొలిసారి ఎన్నికైన దళిత ఎమ్మెల్యేలం మేమంతా. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ చేరుకుని అక్కడ అంబేద్కర్ ఘాట్ చైతన్యభూమిలో అంబేద్కర్ మహాశయునికి ఘననివాళులు అర్పించాం. బాబాసాహెబ్ మాట, బాబు బాటలో పయనిస్తూ.. ఎన్నుకున్న ప్రజలకు, అణగారిన వర్గాలకు సేవచేస్తామని ప్రతిజ్ఞ చేశాం.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశం. ఈ దేశ రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ అణగారిన వర్గాల హక్కుల కోసం ఎనలేని కృషి చేశారు. దేశ సామాజిక వ్యవస్థలో అసమానతలు అంతమొందించేందుకు తన జీవితాంతం పనిచేశారు. సామాజిక వ్యవస్థలో సమూల మార్పు కోసం ఎవరో ఒకరు ప్రయత్నం చేయాలని భావించిన అంబేద్కర్ 'బోధించు–సమీకరించు–పోరాడు' అని నినదించారు. అణగారిన వర్గాలకు విద్య, విజ్ఞాన, రాజకీయ రంగాల్లో ప్రవేశించే అర్హత రాజ్యాంగం ద్వారా కల్పించారు. రాజ్యాంగం అమలైన దశాబ్దాల తరువాత కూడా అసమానతలు పొడసూపుతూనే ఉన్నాయి. ఈ సమయంలోనే అణగారిన వర్గాలకు అండగా తెలుగుదేశం పార్టీ జెండాని నిలిపారు మహానాయకుడు నందమూరి తారకరామారావు. అణగారిన వర్గాల అభ్యున్నతికి అహరహం శ్రమిస్తున్న చంద్రబాబు దళిత బహుజనుల సామాజిక, ఆర్థిక, రాజకీయ వికాసానికి ఎనలేని కృషి చేస్తున్నారు. దళితజాతి ప్రగతి కోసం గళం ఎత్తండి.. నిలదీయండి.. నినదించండి.. అంటూ యువ దళిత సైన్యాన్ని తయారు చేశారు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్.

మడకశిర నుంచి నేను, పూతలపట్టు నుంచి సామాన్య జర్నలిస్ట్ అయిన మురళీ మోహన్, పార్వతీపురం శాసనసభ్యులుగా ఎటువంటి రాజకీయ నేపథ్యంలేని విద్యావంతుడు బోనెల విజయ్‌చంద్ర, నందికొట్కూరు నుంచి సామాన్య టీడీపీ కార్యకర్త అయిన జయసూర్య, కోడుమూరు నుంచి నిరుపేద దళితుడు దస్తగిరి, గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకటరాజు, తిరువూరు నుంచి కొలికపూడి శ్రీనివాస్ ఎన్నికై సగర్వంగా శాసనసభలో ప్రమాణస్వీకారం చేశామంటే.. అది అంబేద్కర్ ఇచ్చిన హక్కు– తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు ప్రసాదించిన వరం. మా కంటే ముందు మా దళిత తేజాలు పార్లమెంటు స్పీకర్‌గా జీఎంసీ బాలయోగి, అసెంబ్లీ స్పీకర్‌గా ప్రతిభా భారతిలకు పట్టం కట్టింది తెలుగుదేశం పార్టీయే, చంద్రబాబుగారే.

○ ఎంఎస్ రాజు
మడకశిర ఎమ్మెల్యే

తెలుగు భాష, సంస్కృతులపై అభిమానం పెంచాలి

గౌరవనీయ ఉపముఖ్యమంత్రి వర్యా,


సినిమా నేపథ్యం ఉన్న దివంగత ఎంజీఆర్, ఎన్టీఆర్‌లు అధికారంలోకి వచ్చిన తర్వాత, తమిళానికి, తెలుగుకు ఎంతో సేవ చేసి ఘనకీర్తిని పొందారు. మీకూ తెలుగుపై అభిమానం ఉంది. మీరు తెలుగు సాహిత్యం బాగా చదివినవారు, కళా హృదయం ఉన్నవారు, అశేష జనావళిని ప్రభావితం చేయగల వ్యక్తిగత ఆకర్షణ ఉన్నవారు, అన్నిటికీ మించి మంచి చేయాలనే తపన ఉన్నవారు. ఎన్టీఆర్ స్థాపించిన పార్టీతో చేయి కలిపి అధికారంలోకి వచ్చారు.

తెలుగు సినిమా ఎన్నడూ లేనంతగా ఉత్థానావస్థలో ఉంది. విశ్వవ్యాప్తంగా మన కథలకు, కథనానికీ, సంగీతానికీ, సాహిత్యానికీ, నృత్యానికీ ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ లభిస్తోంది. అయితే, తెలుగు భాష మాత్రం, మన రాష్ట్రాల్లోనే క్షీణిస్తోంది. ఇదొక విడ్డూరం.

తెలుగు చదవగలిగినవారు తక్కువై పోతుండబట్టి, తెలుగు సినిమా పాటలను యూట్యూబ్‌లో ఆంగ్లంలో రాస్తున్నారు. రేపు చిన్న తెలుగు పదాలు కూడా పలకలేకో, పలికితే ఎబ్బెట్టుగా అనిపించో, ఆంగ్ల పదాలే వాడతారు. భవిష్యత్తులో తెలుగు వాడుక భాష కాక, కేవలం పుస్తక భాషగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. భాష మరణిస్తే దాని తాలూకు సంస్కృతి, సంప్రదాయాలు మరణిస్తాయి. ఈ సమస్యకు పరిష్కారం ఇప్పుడైనా కనుక్కోకపోతే, పరిస్థితి తిరిగి కోలుకోలేనంతగా విషమిస్తుంది. ఎందుకంటే, అంతరిస్తున్న జీవజాతుల జాబితాలో 'తెలుగు మాస్టారు' ఎపుడో చేరిపోయారు. అయితే దీన్ని భాషా సమస్యగా కంటే మనస్తత్వానికి సంబంధించిన సమస్యగా చూడాలి. ఆంగ్లం రాకపోవడం తెలుగువారిలో ఆత్మన్యూనతను పెంచుతోంది. ఎన్ని తప్పులతో మాట్లాడినా ఆంగ్లంలో మాట్లాడితే అదొక ప్రతిష్ఠ. మన జీవితాలలో ఆంగ్లం అవసరమే. యువతకి ప్రపంచ వ్యాప్తంగా అవకాశాలు కల్పించడం కోసం, రాష్ట్ర పునర్నిర్మాణం జరుగుతున్న ఈ తరుణంలో, తెలుగేతరులతో లావాదేవీలు నడపడానికి, ఆర్థిక, మానవ వనరులను ఆకర్షించడానికి, ముఖ్యంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయటానికి ఆంగ్ల భాష తప్పనిసరి.

అంతమాత్రాన ఆంగ్ల భాషా నైపుణ్యాన్ని తెలుగు శిథిలాల మీద నిర్మించుకోవలసిన అవసరం లేదు. కూర్చున్న కొమ్మను ఎవరైనా నరుక్కుంటారా? రెండు తరాలుగా ఈ తప్పిదం జరుగుతున్నది. ఫలితంగా దుష్పరిణామాలు చక్రవృద్ధి చెందుతున్నాయి. ఇంతకు ముందు చెప్పినట్టు చిన్న చిన్న తెలుగు పదాలు కూడా అందరూ మర్చిపోతున్నారు. తాము చదువుకున్నవారమని తద్వారా సమాజంలో తమ ఉన్నత స్థానాన్ని సూచించడానికి ఆంగ్లంతో ముడి వేసుకుంటున్నారు. ఈ ముడిని విప్పాలి. ఎంత చదువుకున్నా, ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నా తెలుగు రాకపోతే నామోషి కలగాలి. సమాజంలో ఉన్నత వర్గాలలో ఈ నామోషి మొదలైతే, అది క్రమేపీ కింది వర్గాల వరకూ వస్తుంది. ఇందుకు సమాజంలో విస్తారంగా తెలుగు భాష, సంస్కృతులపై అభిమానం పెంచే కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టాలి. రాష్ట్ర ఖజానా ఖాళీ అని తెలుసు, కానీ విధాన నిర్ణయాలు తీసుకోవడానికి, వాటి అమలుకు పెద్దగా డబ్బు అవసరం లేదు.

> ఎంత చదువుకున్నా, ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నా తెలుగు రాకపోతే నామోషి కలగాలి. సమాజంలో ఉన్నత వర్గాలలో ఈ నామోషి మొదలైతే, అది క్రమేపీ కింది వర్గాల వరకూ వస్తుంది. ఇందుకు సమాజంలో విస్తారంగా తెలుగు భాష, సంస్కృతులపై అభిమానం పెంచే కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టాలి.



తెలుగు ఉపాధ్యాయులకి ఇతర ఉపాధ్యాయుల కంటే వేతనం ఎక్కువ ఇవ్వాలి. ఇది వారిలో ఆత్మవిశ్వాసం పెంచుతుంది. తెలుగు చదవకున్నా ఉత్తీర్ణులని చేస్తారులే అనుకునే దశ నుండి, ఉత్తీర్ణతకు ఆకర్షణీయంగా ఉండే విధంగా, అంటే స్కోరింగ్ సబ్జెక్టుగా తెలుగును రూపొందించాలి. విద్యా విధానంలో భాష, సాహిత్యం, కళలపై అభిమానం పెంచాలి.

ప్రపంచవ్యాప్తంగా సెలబ్రిటీలు (మీతో సహా) సింహభాగం కళా రంగానికి చెందినవారే అవడం యాదృచ్ఛికం కాదు. తమిళనాడులో సినిమాలకు తమిళ పేర్లే పెడితే రాయితీలు ఇచ్చినట్టు, తెలుగు సినిమాలకు తెలుగు పేర్లు పెడితేనే రాయితీలు ఇవ్వాలి. కర్ణాటక ప్రభుత్వం కన్నడ విషయంలో చేసినట్టు, ఫలకాల మీద వ్యాపార సంస్థల పేరు తెలుగులో పెద్దగా ఉండాలనే నియమం పెట్టాలి. రాష్ట్రంలో ఉండే ఉద్యోగాలకు తెలుగు తప్పనిసరి చేయాలి. తెలుగు సినీ హీరోలు, దిగ్దర్శకులు తెలుగు భాషపై తమ అభిమానం చాటాలి. వారికి తెలుగు రాకపోయినా నేర్చుకుంటున్నాం అని చెప్తే, యువత ప్రభావితులవుతారు. మీ ట్విట్టర్ ఖాతాలో చదవడానికి రోజుకో తెలుగు పుస్తకం సూచిస్తే, అది ఎనలేని ప్రభావం చూపుతుంది.

ఏదైనా మార్పు చేయాలనుకుంటే, ఒక ముఖ్య ఘటనను ఆసరాగా చేసుకోవాలని ప్రవర్తన శాస్త్రం చెప్తోంది. దీనినే ఆ శాస్త్రం 'ఫ్రెష్ స్టార్ట్ ఎఫెక్ట్' అంటుంది. మీరు అపూర్వ ప్రజాభీష్టం మీద అధికారంలోకి వచ్చారు. ప్రభుత్వం ఇంకా కొత్తదే. విస్తారమైన మార్పు మొదలెట్టడానికి ఇది మంచి సమయమే కాదు, సరైన సందర్భం కూడా. ఎందుకంటే, ఇంతకు ముందు లేని సాంకేతిక సానుకూలతలు ఇప్పుడు కొన్ని ఉన్నాయి. ప్రస్తుతం అందరి చేతుల్లో మొబైల్ ఫోన్ ఉంది. సామాజిక సంభాషణలు, వ్యాపార లావాదేవీలన్నీ ఇప్పుడు ఫోన్‌లో జరుగుతున్నాయి. తెలుగు కీబోర్డ్, స్పీచ్–టు–టెక్స్ట్, ఆటో కరెక్ట్, ఏఐ ఇంకా మెరుగై, తెలుగు భాష వినియోగాన్ని సులభతరం చేస్తాయి. సామాన్య ప్రజలు తమ దైనందిన జీవితాలలో నిమగ్నులై ఉంటారు. చాలా వరకు స్వలాభం దాటి ఆలోచించలేరు. ఇది ఆసరాగా చేసుకుని లాభపడదామనుకునేవాడు రాజకీయ నాయకుడు. ఇది తెలుసుకుని సమాజాన్ని, జాతినీ పరిరక్షించేవాడు రాజనీతిజ్ఞుడు.

■ దాసు కిరణ్
దాసుభాషితం సీఈవో



పట్టుబడ్డ గంజాయి ప్యాకెట్లు, నిందితులు

గంజాయి గొలుసు

ఒక్కొక్కరికి నలుగురు ఖాతాదారులు

- వెలుగులోకి వస్తున్న 'వాసన'
- యాంటీ నార్కోటిక్ సెల్ అదుపులో 17 మంది
- విశాఖకు చెందిన ఇద్దరు కీలక సరఫరాదారుల అరెస్టు
- 46 కిలోల గంజాయి స్వాధీనం
- నిందితుల్లో ఇద్దరు మైనర్లు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఇద్దరూ ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నారు. గ్రామంలో కూలి పనులకు వెళ్తుండేవారు. ఇద్దరిలో ఒకడు ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ ఒక రెస్టారెంట్‌లో పనిచేస్తూ అప్పుడప్పుడు ఇంటికి వస్తుండేవాడు. ఇంట్లో వారికి ఎంతోకొంత డబ్బులు ఇచ్చి వెళ్తుండేవాడు. మరొకడు గ్రామంలోనే కూలి పని చేస్తుండేవాడు. అతడి ఖర్చులు మాత్రం సంపాదించిన దానికి సంబంధం లేకుండా ఉండేవి. ఈ ఇద్దరూ సంపాదిస్తున్న డబ్బులన్నీ కాయకష్టం మీద అనుకుంటే పొరపాటే. ఉపాధి ముసుగులో గంజాయిని సరఫరా చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. ఇద్దరూ చెరొక ప్రాంతంలో పనిచేస్తున్నా వారు సరఫరా చేస్తున్న గంజాయి మొత్తం విజయవాడ కేంద్రంగానే ఉంటోంది. ఇలా గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరు కీలక వ్యక్తులతోపాటు కొనుగోలు చేసిన 17 మందిని విజయవాడ యాంటీ నార్కోటిక్ సెల్ అధికారులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నారు. వారి నుంచి మొత్తం 46 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దానికి సంబంధించిన వివరాలను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, తూర్పు డీసీపీ గౌతమి శాలీ, టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ ఆర్.శ్రీహరిబాబు, ఇన్‌స్పెక్టర్లు ఐవీ నాగేంద్ర, ఎస్.రమేష్, శ్రీధరకుమార్, నాగశ్రీనివాస్‌తో కలిసి మంగళవారం వెల్లడించారు.

ఆదాయాన్ని బట్టి టీం

విశాఖపట్నం జిల్లా కొయ్యూరుకు చెందిన పోలేజి సాయి, కాకాని దేవరాజు అలియాస్ పండు ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నారు. తర్వాత విద్యాభ్యాసం మానేశారు. గ్రామంలో కూలి పనులు చేసుకుంటుండేవారు. ఈ క్రమంలోనే గంజాయి రుచి మరిగారు. దీనిపై ఆదాయాన్ని రుచి చూసిన ఇద్దరూ సరఫరాదారులుగా ఎదిగారు. కొన్ని సంవత్సరాలు కొయ్యూరు కేంద్రంగా గంజాయిని సరఫరా చేస్తున్నా సాయి ఏనాడూ పోలీసులకు చిక్కలేదు. జిల్లా సరిహద్దులు దాటి గంజాయిని సరఫరా చేయడం మొదలుపెట్టిన వారు విజయవాడలో శాశ్వత ఖాతాలను ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కొక్కరు నలుగురు నుంచి ఆరుగురి వరకు ఖాతాదారులుగా మార్చుకున్నారు. సాయి కొద్దిరోజుల క్రితమే ఉపాధి పేరుతో హైదరాబాద్‌కు మారాడు. అక్కడ ఒక రెస్టారెంట్‌లో పనిచేస్తున్నారు. దేవ రాజు మాత్రం కొయ్యూరులోనే వ్యవసాయ కూలీగా పని చేస్తున్నారు. ఈ ఇద్దరూ కలిసి విజయవాడలో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఖాతాదారులను ఏర్పాటు చేసుకున్నారు.

మరికొంత మంది ఖాతాదారులు

ఈ గంజాయిని అందరూ బస్సులు, రైళ్లు, మోటారు సైకిళ్లపై ఇక్కడికి తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారు. సాయి, దేవరాజు నుంచి గంజాయిని కొనుగోలు చేస్తున్నవారిలో మైనర్లు, రౌడీషీటర్లు ఉన్నారు. విజయవాడ అయోధ్యనగర్‌కు చెందిన మల్లపోగు శివనాగ మహేష్‌పై సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. అతనితోపాటు సత్యనారాయణపురానికి చెందిన ధూళి వెంకటేష్, అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన జజ్జనం నరేష్ అలియాస్ మెకానిక్ నరేష్, గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన డి.వెంకంరాజా అలియాస్ నాని, విజయవాడ క్రీస్తురాజపురానికి చెందిన శీలం చరణ్... సాయి నుంచి దఫదఫాలుగా గంజాయిని కొనుగోలు చేశారు. ఈ ఐదుగురిపై గవర్నరుపేట పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.

విచారణలో అసలు నిజాలు వెలుగులోకి..

ఐదుగురిని విచారిస్తున్న సమయంలో సరఫరాదారుడు సాయి పేరు వెలుగులోకి వచ్చింది. దీంతో అతడి పేరును కేసులో చేర్చారు. కాకాని దేవవరాజు అలియాస్ పండు మాత్రం కొయ్యూరులో వ్యవసాయ కూలీ. కొన్నాళ్ల క్రితం 300 కిలోల గంజాయిని విక్రయిస్తూ కొయ్యూరు పోలీసులకు చిక్కాడు. గంజాయిపై ఆదాయం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉండడంతో ఆ పని మాత్రం మానలేదు. కృష్ణాజిల్లా పెనమలూరుకు చెందిన కొమ్మూరు సాయికిరణ్‌పై పటమట పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. అతడితోపాటు వానం అరవింద్ అలియాస్ ఆర్వీ, సయ్యద్ అలీం అలియాస్ అలీ, కోట నాగదుర్గాప్రసాద్, మండవల్లికి చెందిన కమ్మగంటి నిఖిల్, ఓ మైనర్ కలిసి పండు నుంచి కొన్నాళ్లుగా గంజాయిని కొనుగోలు చేస్తున్నారు. వారిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. వారు కాకుండా కొత్తపేటకు చెందిన పిల్లా సాయికుమార్ అలియాస్ కలువుకొట్టు నానిపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీకి చెందిన కుంటముల్ పవన్ కల్యాణ్, చిట్టినగర్‌కు చెందిన ఒక మైనర్‌పై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ముగ్గురు సాయి, పండు నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్టు తేలింది. ఒక్కొక్కరు మూడు నుంచి నాలుగు కిలోల గంజాయిని కొనుగోలు చేసి విజయవాడకు తీసుకొచ్చేవారు. ఈ గంజాయిని వ్యసనపరులకు విక్రయించేవారు. మొత్తం ఈ 17 మందిని అరెస్టు చేసి మంగళవారం కోర్టులో హాజరుపరిచారు.

బ్యాంకు నుంచి రుణం తీసుకుని ఎగ్గొడితే అది మోసం!

అదే రుణాన్ని భూమి తనఖా పెట్టి తీసుకుంటే అది సక్రమం! రుణం కట్టకపోతే బ్యాంకు అధికారులు భూమిని జప్తు చేయడమో స్వాధీనం చేసుకోవడమో జరుగుతుంది. ఇక రుణం జోలి రారు.

ఈ సూత్రమే ఆ అక్రమార్కులకు వరమైంది. ఎవరూ కొనని భూమికి ఆకాశమంత ధర కట్టి భారీగా రుణం తీసుకుని ఎగ్గొడితే కట్టాల్సిన రుణంలో నాలుగో వంతు ధర కూడా లేని ఆ భూమిని బ్యాంకు అధికారులు స్వాధీనం చేసుకుని వదిలేశారు.

అక్రమార్కులకు ప్రయోజనం చేకూరింది. రుణానికి రుణం వచ్చింది. ఎవరూ కొనని భూమిని ఊహకు కూడా అందని ధరకు పోయింది. అక్రమం కాస్తా సక్రమం అయింది. అక్రమార్కులు, బ్యాంకర్లు కలిసి నీకింత.. నాకింత అని వాటాలు వేసుకుని పంచుకుతిన్నారు.
ఈ మోసం మచిలీపట్నంలోని జవ్వారుపేట కేడీసీసీబీ బ్రాంచిలో జరిగింది.



అధికారులు వేలం వేసిన భూమి

రుణ మాయ

అక్రమార్కులతో కలిసి కేడీసీసీబీ అధికారుల దొంగాట

- రూ.10 లక్షల భూమికి రూ.1.75 కోట్ల రుణం
- వడ్డీతో కలిపి రూ.4.10 కోట్ల బకాయి
- భూమి కొనేందుకు వేలంలో ఎవరూ రాని వైనం
- బకాయి కింద బ్యాంకుకు భూమి స్వాధీనం
- రుణగ్రహీతలతో బ్యాంకు అధికారుల కుమ్మక్కు
- విచారణలో అక్రమం బట్టబయలు
- ఇదే బాటలో మరో 10 స్థలాల జమకు సిద్ధం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం జవ్వారుపేట బ్రాంచిలో జోగి కుమార్ సాయి మరో ఆరుగురు పెడన - బంటుమిల్లి రోడ్డులోని సర్వే నంబరు 662/4సీలోని 65 సెంట్లును హామీగా చూపి ఐదేళ్ల క్రితం రూ.1.75 కోట్లు రుణం తీసుకున్నారు. వ్యవసాయ భూమి అయిన దీన్ని ఇంటి స్థలం కింద గజాల్లో చూపి ఈ రుణం తీసుకున్నారు. కప్పలదొడ్డి పైడమ్మ ఆలయం సమీపంలోని డోర్ నంబరు 1/68గా చూపి గజం రూ.10,600 విలువ ఉన్నట్టు రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి సర్టిఫికెట్ తీసుకున్నారు. గజాల్లో భూమి మొత్తం విలువ రూ.3.33 కోట్లుగా చూపారు. వాస్తవంగా అప్పట్లో అక్కడ భూమి విలువ ఎకరా రూ.10 లక్షల్లోపే ఉంది. ఆ ప్రాంతంలో వ్యవసాయ భూమిపై కేవలం రూ.3.90 లక్షల రుణం ఇవ్వాల్సి ఉండగా రూ.1.75 కోట్లు రుణం పొందారు. దీనిపై అప్పట్లోనే విచారణ జరగ్గా బ్యాంకు అధికారుల ప్రమేయాన్ని గుర్తించి వేటు వేశారు.

ఎవరూ కొనని భూమి బ్యాంకుకు స్వాధీనం

సర్వే నంబరు 662/4సిలోని 65 సెంట్ల భూమిని ఇటీవల బ్యాంకు అధికారులు వేలం వేశారు. దాన్ని 3146 గజాలుగా చూపుతూ వేలం పాట నిర్వహించారు. కానీ వేలం పాటలో ఎవ్వరూ పాల్గొనలేదు. దీంతో బ్యాంకు ఆ భూమిని ఖరీదు కట్టి స్వాధీనం చేసుకుంది. దానికి బ్యాంకు అధికారులు కట్టిన ధర అక్షరాలా రూ.4.10 కోట్లు. ఇప్పటికీ అక్కడ ఎకరా భూమి రూ.కోటిలోపే ఉంది. అలాంటిచోట 65 సెంట్లకు రూ.4.10 కోట్లు ఖరీదు కట్టడం ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

తప్పులను కప్పిపుచ్చుకునేందుకు మళ్లీ తప్పు

వ్యవసాయ భూమిని గజాల్లో చూపి కోట్లాది రూపాయలు రుణం తీసుకుని ఎగ్గొట్టిన వ్యవహారంలో రుణగ్రహీతలు.. వారితో కుమ్మక్కయిన బ్యాంకు అధికారులపై క్రిమినల్ కేసులు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అప్పట్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని చూపేందుకు మళ్లీ బ్యాంకు అధికారులు మరోసారి తప్పుడు మార్గంలో అడుగులు వేస్తుండటం గమనార్హం. అప్పట్లో తాము ఇచ్చిన రూ.1.75 కోట్ల రుణాన్ని వడ్డీతోసహా బ్యాంకుకు జమ చేశామని చెప్పుకొనేందుకు ఆ 65 సెంట్లకు రూ.4.10 కోట్లు ఖరీదు కట్టి బ్యాంకుకు అంటగట్టడం గమనార్హం. ఈ స్థలం విషయంలో సక్సెస్ అయితే ముందు ముందు ఇదే తరహా అక్రమాలకు కారణమైన మరో 10 స్థలాలను ఇదే రీతిన బ్యాంకుకు అంటగట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫలితంగా బ్యాంకుకు నష్టం వాటిల్లి అంతిమంగా ఖాతాదారులపై ఆ ప్రభావం పడుతుంది. ఈ వ్యవహారంలో బ్యాంకు సీఈవో, జీఎం మొదలు ఉన్నతాధికారులు అందరూ పాత్రధారులే. దీనిపై తక్షణం కలెక్టర్, జేసీ దృష్టి సారించాల్సిన అవసరం ఉందని బ్యాంకు ఖాతాదారులు కోరుతున్నారు.

కృష్ణాడెల్టాకు 10 టీఎంసీలు విడుదల చేయాలి

కృష్ణానది యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలి

- కాంట్రాక్టు పద్ధతిలో లస్కర్లను నియమించాలి
- పంట కాలువలు, డ్రెయినేజీల్లో తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు పూర్తిస్థాయిలో చేయాలి
- ఐఏబీ సమావేశంలో మంత్రి కొల్లు, శాసనసభ్యుల తీర్మానం

6లో..





ఇటీవల పట్టుబడిన లారీలు


ఆగని ఇసుక అక్రమం

జోరుగా తెలంగాణకు తరలింపు

కేసులు నమోదు చేస్తున్నా కొనసాగుతున్న రవాణా

జగ్గయ్యపేట రూరల్, జూలై 30 : జిల్లా నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. పోలీసులు వివిధ ప్రాంతాల్లో వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నా అక్రమార్కులు మాత్రం ఏదో ఒక ప్రాంతం నుంచి ఇసుక తరలించేస్తున్నారు. మండలం నుంచి తెలంగాణాకు వెళ్లేందుకు అనేక మార్గాలుండటంతో అక్రమార్కుల చూపు ఇటువైపు పడింది. ఆయా సరిహద్దు గ్రామాల పేరుతో వే బిల్లులు తీసుకుని తెలంగాణాకు వెళ్తున్నారు. ముక్త్యాల, బూదవాడ, అన్నవరం, గరికపాడు ద్వారా జాతీయ రహదారి నుంచి నల్గొండ జిల్లాకు తక్కెళ్లపాడు, రామచంద్రునిపేట, గండ్రాయి, మల్కాపురం ద్వారా ఖమ్మం జిల్లాలోకి వాహనాలు వెళ్తున్నాయి. అప్పుడప్పుడు జాతీయ రహదారిపై నుంచి కూడా నేరుగా వెళ్తున్నాయి. గతంలో నందిగామ నుంచి తెలంగాణాకు వెళ్లాలంటే మధిర, వత్సవాయి మండలాల నుంచి వెళ్లేవి. మధిర, బోనకల్లు పోలీసులు ఉక్కుపాదం మోపుతుండటంతో వారు జగ్గయ్యపేట మండలం నుంచి తెలంగాణాకు ఇసుక తరలించేందుకు సిద్ధమవుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో సబ్ డివిజన్ పరిధిలో నియవించిన అధికారులు ఇప్పుడు కూడా ఉండటంతో అక్రమార్కులకు వరంగా మారిందని, ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి, చిల్లకల్లు ఎస్ఐ సతీష్ అక్రమార్కుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నా వారు మాత్రం తమ పంథాను వీడటం లేదు. ఇప్పటికే చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌లో మూడు టిప్పర్లు, రెండు లారీలు, ఐదు ట్రాక్టర్‌లతో వాటికి సంబంధించి డ్రైవర్‌లు, యజమానులు 17 మందిపై ఓల్టా కేసులు నమోదు చేసినా అక్రమ రవాణా జరుగుతోంది. ఒక్కో వాహనానికి 20 టన్నులకుపైగా లోడ్ చేసుకుని 40 కి.మీల మేర జాతీయ రహదారిపై వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి.



నేనిక్కడే ఉంటా!

సీసీఎల్ఏ నుంచి వచ్చి రెండేళ్లయినా సొంతగూటికి వెళ్లని అధికారి

- రెవెన్యూలో ఎక్స్‌టెన్షన్ రగడ
- గన్నవరం తహసీల్దార్ మొండిపట్టు
- సీసీఎల్ఏ నుంచి వచ్చిన ఆయనకు పొడిగింపు
- ఏపీఆర్ఎస్ఏ దగ్గర తహసీల్దార్ల గగ్గోలు
- రెగ్యులర్ తహసీల్దార్లకు అన్యాయం జరుగుతోందని పంచాయితీ
- సీతానగరం, రాజానగరం, గన్నవరంలలో తహసీల్దార్‌గా విధులు

మరో ఏడాది కొనసాగేందుకు ప్రయత్నాలు

సీసీఎల్ఏ నుంచి వచ్చే వారెవరైనా సరే.. క్షేత్ర స్థాయిలో రెండేళ్లు పనిచేసిన తర్వాత తిరిగి సీసీఎల్ఏకు వెళ్లిపోవాలి. ఓ అధికారి మాత్రం సీసీఎల్ఏకు రిపోర్టు చేయటం లేదు. సీటు వదలను పొమ్మంటున్నారు. ఇక్కడి నుంచి కదిలేదని మొండికేస్తున్నారు. ఆయనే.. ఎన్నికల ముందు తూర్పు గోదావరి జిల్లా నుంచి కృష్ణాజిల్లా గన్నవరం మండలం వచ్చిన తహసీల్దార్. ఆయన్ను రిలీవ్ చేసినా.. ఇక్కడి నుంచి కదలటం లేదు. మరో ఏడాది ఇక్కడే కొనసాగేందుకు ఎక్స్‌టెన్షన్ కోసం సీసీఎల్ఏకు దరఖాస్తు చేసుకునేందుకు ఆయన సిద్ధమయ్యారని తమకు అన్యాయం జరుగుతోందని రెగ్యులర్ రెవెన్యూ తహసీల్దార్లు ఆందోళన బాట పట్టారు. ఏపీ రెవెన్యూ సర్వీసు అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) దగ్గర ఈ తహసీల్దార్ వ్యవహారాన్ని ఏకరువు పెడుతున్నారు. రెగ్యులర్ తహసీల్దార్లకు ఇబ్బందికరంగా మారే ఈ అంశాన్ని సీసీఎల్ఏ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లేందుకు ఏపీఆర్ఎస్ఏ నాయకులు కూడా సిద్ధమౌతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : ప్రస్తుతం గన్నవరం మండలంలో పనిచేస్తున్న తహసీల్దారే ఈ వివాదానికి కేంద్ర బిందువుగా నిలిచారు. ఆయన ఎన్నికల ముందు తూర్పు గోదావరి జిల్లాలో పనిచేసేవారు. ఎన్నికల బదిలీల కారణంగా ఆయన గన్నవరం మండలానికి వచ్చారు. ఇతర జిల్లాల నుంచి కృష్ణాజిల్లాకు వచ్చిన తహసీల్దార్లంతా వరుసగా రిలీవ్ అవుతున్నా గన్నవరం తహసీల్దార్ మాత్రం రిలీవ్ కాలేదు. సీసీఎల్ఏలో గతంలో పనిచేసిన ఈ అధికారి రెండేళ్ల బయట తహసీల్దార్‌గా పనిచేయాల్సి ఉండటంతో తూర్పు గోదావరి జిల్లా వచ్చారు. ఆ జిల్లాలోని సీతానగరంలో ఏడాది పాటు తహసీల్దార్‌గా పనిచేశారు. ఆ తర్వాత రాజానగరంలో ఏడాదిన్నరపైగా పనిచేశారు. రాజానగరంలో పనిచేస్తుండగానే ఆయన రెండేళ్ల పీరియడ్ ముగిసిపోయింది. కానీ సీసీఎల్ఏకు విజ్ఞప్తి చేసుకుని మరో ఏడాది గడువు పొందారు.

ఇతర రెవెన్యూ అధికారుల ఆందోళన

వాస్తవానికి గడువు పెంచకూడదు. నిబంధనలకు విరుద్ధంగా గడువు పెంచినా ఎన్నికల నేపథ్యంలో కృష్ణాజిల్లా గన్నవరం మండలం వచ్చారు. గన్నవరం మండలంలో పనిచేసిన కాలంతో ఆయన మూడో ఏడాది కూడా పూర్తయింది. అదనంగా మరో ఏడాది సమయం తెచ్చుకున్న గడువు కూడా ముగిసింది. ఈ క్రమంలో ఆయన మళ్లీ ఇక్కడే ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మిగిలిన తహసీల్దార్లు ఆరోపిస్తున్నారు. మూడేళ్లు కావటంతో ఆయన ఇక్కడి నుంచి సీసీఎల్ఏకు రిపోర్టు చేసి ఉంటే వివాదం అయ్యేది కాదు. ఇంకా తహసీల్దార్‌గా కొనసాగుతూ ఉండటంతో మిగిలిన రెగ్యులర్ తహసీల్దార్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీఎల్ఏ కూడా ఇటీవలే తక్షణం వచ్చి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించినట్టుగా తెలుస్తోంది. ఇతర డిపార్ట్‌మెంట్ల నుంచి వచ్చి పాతుకుపోయిన వారితో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని రెగ్యులర్ తహసీల్దార్లు గొడవ చేస్తున్నారు. డిప్యూటీ కలెక్టర్ల స్థాయిలో కూడా ఇదే రకమైన ఆందోళన నెలకొంది. ఇతర డిపార్ట్‌మెంట్ల నుంచి వచ్చి ఆర్డీవోలుగా పనిచేస్తున్నవారు కూడా ఇక్కడ ఉన్నారు. ఇలాంటి అస్తవ్యస్త పరిస్థితులన్నీ కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్నాయని, తక్షణం వీటికి సంబంధించి ప్రభుత్వం ప్రక్షాళన చేయాల్సిందిగా రెవెన్యూ వర్గాల నుంచి అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ప్రతి పీఎస్‌కు డ్రగ్ టెస్టింగ్ కిట్

- పట్టుబడిన వెంటనే పరీక్ష

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : మందు తాగి వాహనాలు నడిపితే గుర్తించడానికి బ్రీత్‌ఎనలైజర్ ఉంటుంది. అలాగే గంజాయి తాగి కిక్‌లో పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తున్న వ్యసనపరుల్లో శరీరంలోని మత్తు శాతం ఎంత ఉందో గుర్తించడానికి డ్రగ్ టెస్టింగ్ కిట్ వస్తోంది. ఈ డ్రగ్ టెస్టింగ్ కిట్లను పోలీసులకు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఈ విషయాన్ని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మంగళవారం వెల్లడించారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఈ కిట్లను అందుబాటులో ఉంచబోతున్నట్టు పేర్కొన్నారు.
ట్రాఫిక్ పోలీసులు మద్యంమత్తులో వాహనాలు నడుపుతున్న వారిలో నిషా లెక్కను తేల్చడానికి బ్రీత్ ఎనలైజర్‌ను ఉపయోగిస్తారు. స్ట్రాతో ఊదినప్పుడు వారి శరీరంలో మత్తు శాతం ఎంత ఉందో బ్రీత్ ఎనలైజర్‌లో స్క్రీన్‌పై కనిపిస్తుంది. 30 ఎంజీ దాటి నిషా ఉంటే కేసు నమోదు చేస్తారు. త్వరలో గంజాయి, డ్రగ్స్ తీసుకున్న వారి శరీరంలో ఎంత మత్తు శాతం ఉందో తేల్చడానికి ఈ డ్రగ్ టెస్టింగ్ కిట్స్ ఇవ్వబోతున్నారు. ప్రస్తుతం గంజాయి తీసుకున్న వారిని పట్టుకున్నప్పుడు పరీక్షల కోసం ప్రైవేటు డీఅడిక్షన్ సెంటర్లకు పంపుతున్నారు. ఈ పరీక్షలు చేసినందుకు ఆయా కేంద్రాలు రూ.150 నుంచి రూ.200 వరకు వసూలు చేస్తున్నాయి. సాధారణంగా ఈ డబ్బులను పట్టుబడిన వారి నుంచి ఇప్పిస్తున్నారు. తమ వద్ద డబ్బుల్లేవని చెప్పినప్పుడు పోలీసులు ఆ మొత్తాన్ని చెల్లిస్తున్నారు. గంజాయి వ్యసపరులను పట్టుకున్నప్పుడు ప్రత్యేకంగా ఒక కానిస్టేబుల్, హోంగార్డును ఇచ్చి పరీక్షలకు పంపాల్సి వస్తోంది. ఈ సుదీర్ఘ ప్రక్రియకు స్వస్తి చెప్పి వెంటవెంటనే ఫలితాన్ని ఇచ్చే మార్గాన్ని పోలీసు శాఖ ఎంచుకుంది. గంజాయి సేవించి పట్టుబడిన వారి కిక్ లెక్కను తేల్చడానికి డ్రగ్ టెస్టింగ్ కిట్స్ ఇవ్వమే మేలని భావిస్తోంది. త్వరలోనే ఈ కిట్లు అన్ని పోలీసు స్టేషన్లను చేరబోతున్నాయి.

డిప్యూటీ తహసీల్దార్లకు ఎఫ్ఏసీ బాధ్యతలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారికి తహసీల్దార్లుగా పోస్టింగ్ ఇచ్చేవరకు డిప్యూటీ తహసీల్దార్లకు, తహసీల్దార్ల ఎఫ్ఏసీ బాధ్యతలను రెండు జిల్లాల కలెక్టర్లు అప్పగించారు. ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి వచ్చి ఉమ్మడి కృష్ణాజిల్లాలో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్లను రిలీవ్ చేశారు. కృష్ణాజిల్లాలో రెండు రోజుల కిందటే ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. దీంతో రెండు జిల్లాల్లోనూ తాత్కాలికంగా డిప్యూటీ తహసీల్దార్లే తహసీల్దార్ల బాధ్యతలను కూడా నిర్వహిస్తారు.



పార్లమెంట్ వేదికగా..

జల్‌జీవన్ మిషన్‌లో జిల్లాకు ప్రాధాన్యమివ్వండి

» విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్ : జలజీవన్ మిషన్‌లో ఎన్టీఆర్ జిల్లాకు ప్రాధాన్యమివ్వాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో జల్‌జీవన్ మిషన్ కింద 2.67 లక్షల మంది అర్హులున్నారని, గత ప్రభుత్వ హయాంలో 59శాతం మందికి మాత్రమే కుళాయి కనెక్షన్లు ఇచ్చారన్నారు. నాడు నిర్లక్ష్యం కారణంగా కార్యక్రమం పురోగతి సాధించలేదన్నారు. ఈ పథకానికి సంబంధించి రెగ్యులర్ నిర్వహణ ఆడిట్‌ను నిర్వహించాలన్నారు. నాణ్యత పాటించకపోవడం వల్ల పథకంలో కలుషిత నీరు వస్తోందన్నారు. దీనివల్ల జిల్లాలో 300మంది డయేరియాకు గురయ్యారని తెలిపారు. ఎ.కొండూరు జగ్గయపేట తదితర ప్రాంతాల్లో పలువురు మృతిచెందారని స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎన్టీఆర్ జిల్లాకు ఆడిట్ల విషయంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ఐరన్‌ఓర్ బ్లాక్ కేటాయింపులు జరిగాయా..

» బందరు ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం : ఐరన్‌ఓర్ బ్లాక్‌ల కేటాయింపునకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేయాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళవారం జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ ఇస్పాత్‌నిగమ్ లిమిటెడ్ (ఆర్‌ఐఎన్‌ఎల్)కు రిజర్వేషన్ మార్గం ద్వారా ఇనుప ఖనిజం బ్లాక్ కోసం ఒడిసా ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపిందా.. ఇనుప ఖనిజం బ్లాక్ కేటాయింపు ప్రస్తుత పరిస్థితిని వివరించాలని కోరారు. కేంద్ర ఉక్కుమంత్రిత్వశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సమాధానమిస్తూ ఒడిసాలోని కియోంజర్ జిల్లా మలాంగ్తోలి, ఖండధర్‌లోని ఏదైనా ఒక ఇనుపఖనిజ బ్లాక్‌ను ఆర్‌ఐఎన్‌ఎల్‌కు కేటాయించాలని నిబంధనల ప్రకారం 2019 డిసెంబరు 19వతేదీన ప్రతిపాదన చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గడ్‌లలో కూడా ఇనుపఖనిజాల బ్లాక్‌లను కేటాయించాలని ఆర్‌ఐఎన్‌ఎల్ అభ్యర్థనను పంపిందన్నారు. ఇప్పటివరకు ఎక్కడా ఇనుపఖనిజం బ్లాక్‌లను ఆర్‌ఐఎన్‌ఎల్‌కు కేటాయించలేదని కేంద్రమంత్రి తెలిపారు.

కృష్ణా డెల్టాకు 10 టీఎంసీలు ఇవ్వండి

» సాగు, తాగునీటి తక్షణావసరాలకు సాగర్ జలాలు విడుదల చేయాలి
» కృష్ణానది యాజమాన్యబోర్డు విజయవాడలో ఏర్పాటు చేయాలి
» కాంట్రాక్టు పద్ధతిన లస్కర్లను నియమించాలి
» పంటకాల్వలు, డ్రెయిన్లలో తూడు, డెక్క తొలగించాలి
» ఐఏబీ సమావేశంలో మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యేల తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, హాజరైన అధికారులు

మచిలీపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా డెల్టాలో సాగు, తాగునీటి అవసరాలకోసం నాగార్జునసాగర్ ప్రాజెక్టునుంచి 10 టీఎంసీల నీటిని తక్షణమే విడుదల చేయాలని సాగునీటి సలహామండలి సమావేశం(ఐఏబీ)లో తీర్మానించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో ఐఏబీ సమావేశం కలెక్టర్ డీకే బాలాజీ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో కృష్ణాడెల్టాలో ప్రస్తుత ఖరీఫ్‌సీజన్‌లో సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించే అంశంపై మంత్రి రవీంద్ర, జిల్లాకు చెందిన శాసనసభ్యులు, నీటిపారుదలశాఖ, వ్యవసాయశాఖ అధికారులు చర్చించారు. పులిచింతలలో ఒక్క టీఎంసీ మాత్రమే నీరు ఉండటంతో సాగర్ నుంచి 10టీఎంసీల నీటిని విడుదల చేయాలని, ఈ మేరకు కృష్ణా ట్రిబ్యునల్‌కు లేఖ రాయాలని నిర్ణయించారు. పట్టిసీమ నుంచి వచ్చే 6వేల క్యూసెక్కులు, కృష్ణా ఉపనదులనుంచి వచ్చే నీటిని వంతులవారీగా కృష్ణాడెల్టాలోని అన్ని ప్రధానకాలువలకు విడుదల చేయాలని శాసనసభ్యులు నిర్ణయించారు.

కాలువల నిర్వహణ చేయించండి : రవీంద్ర

ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటకాలువలు, డ్రెయినేజీలలో కాలువల నిర్వహణ(ఓఅండ్ఎం) పనులు సక్రమంగా చేయించాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రూ.26కోట్ల అంచనాలతో రూపొందించిన పనులకు కాంట్రాక్టర్లు 40శాతం లెస్‌తో టెండర్లు వేశారని, దీంతో కాలువల్లో గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులను ఎంతమేర నాణ్యతతో చేస్తారని ఆయన ప్రశ్నించారు. తక్కువ మొత్తానికి టెండర్లు వేసిన కాంట్రాక్టర్లతో నూటికి నూరుశాతం పనులను చేయిస్తే, తర్వాత ఏడాది కాంట్రాక్టర్లు జాగ్రత్త పడతారన్నారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో కాలువల నిర్వహణకు సుమారు రూ.100కోట్లను ఖర్చుచేసినట్టు లెక్కలు చూపినా, పనులు సక్రమంగా చేయలేదన్నారు. డ్రెయినేజీలలో కిక్కిస, గుర్రపుడెక్క పేరుకుపోయి నీటిప్రవాహనికి అడ్డంకిగామారి పంటచేతికొచ్చే సమయంలో రైతులు నష్టపోయారన్నారు. నాటి పాలకుల తీరుతో పులిచింతలలో 40టీఎంసీలకు నేడు ఒక్క టీఎంసీ నీరు మాత్రమే అందుబాటులో ఉందన్నారు. పట్టిసీమ నీటిని డెల్టాలోని అన్ని ప్రాంతాలకు అందించాలని నీటిపారుదలశాఖ అధికారులకు సూచించారు.

సాగుకు ఇబ్బందులు లేకుండా చూడాలి : బుద్ధప్రసాద్

నియోజకవర్గాలలో సాగునీటి కొరత, డ్రెయినేజీలు పూడుకుపోయి రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యేలు వివరించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ, వైసీపీ ఐదేళ్ల పాలనలో దివిసీమ ప్రాంతానికి సాగునీటిని విడుదల చేయకపోవడంతో కోడూరు మండలంలో 5వేల ఎకరాల్లో సాగు జరగలేదన్నారు. అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల నిర్మాణాలకు అంచనాలు రూపొందించినా పనులు ప్రారంభించలేదని, పులిగడ్డ ఆక్విడెక్టుకు కనీస మరమ్మతులు చేయలేదని తెలిపారు. ప్రస్తుతం కేఈబీ కాలువకు కేవలం 500క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారని, ఈ కాలువ ఆయకట్టులోని 1.50 లక్షల ఎకరాలకు ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. కృష్ణా నదీగర్భంలో ఉన్న యడ్లంక, ఎదురుమొండి దీవులు భారీవరదల సమయంలో కోతకు గురవుతున్నాయని, నీటి ప్రవహాన్ని మళ్లించేందుకు శాస్త్రీయంగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. విజయవాడ నుంచి మోపిదేవివరకు కృష్ణా కరకట్ట భారీవాహనాలు నడపడంతో ధ్వంసమైందని, కరకట్ట అభివృద్ధికి ఎలాంటి ప్రతిపాదనలు చేశారని అధికారులను ప్రశ్నించారు.

నిర్లక్ష్యం చేస్తే.. విజిలెన్స్ విచారణ : కామినేని శ్రీనివాస్

కైకలూరు నియోజకవర్గంలో తాగునీటి చెరువులను ఇంతవరకు నింపలేదని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గంలో 1.08లక్షల ఎకరాల్లో చేపలచెరువులు ఉన్నాయని, కృష్ణానది నుంచి సముద్రంలోకి నీటిని వృధాగా వదిలేశారు తప్ప చేపలచెరువులకు విడుదల చేయలేదన్నారు. నియోజకవర్గంలో డ్రెయినేజీలలో కిక్కిస, గుర్రపుడెక్క పేరుకుపోయాయని, కాంట్రాక్టర్లు 40శాతంకు పైగా తక్కువకు టెండర్లు వేశారని, పనులు సక్రమంగా చేయకుంటే తానే విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తానని అన్నారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఐనంపూడి, బీమనది, కొమరవోలు డ్రెయినేజీలలో పూడికతీత పనులు సక్రమంగా చేయడం లేదన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సాగునీటిని సక్రమంగా అందించాలని కోరారు.

నీటి విడుదల పెంచాలి : కాగిత

శివారు ప్రాంతంలో ఉన్న పెడన నియోజకవర్గానికి సాగునీటిని అందించకుండా నీటిపారుదలశాఖ అధికారులు జాప్యం చేస్తున్నారని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మల్లేశ్వరం వంతెన వద్ద బంటుమిల్లి కెనాల్‌లో ప్రస్తుతం 2.07 పాయింట్ల నీటిమట్టం ఉందని, 4.0పాయింట్లు ఉంటే కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లోని పొలాలకు నీరందుతుందన్నారు. పెదతుమ్మిడి డ్రెయిన్‌లో కిక్కిస తొలగించేందుకు రూ.36 లక్షలతో టెండర్లు పిలిచారని, ఇంత తక్కువకు కాంట్రాక్టర్లు పనులు ఎలాచేయిస్తారని అన్నారు. ఉమ్మడిజిల్లా సాగునీటి సంఘాల మాజీ అధ్యక్షుడు ఆళ్లగోపాలకృష్ణ, వి.భవానీప్రసాద్, బి.శివరామకృష్ణ, సత్యనారాయణ, కొండలరావు తదితరులు రైతుల ఇబ్బందులను, డ్రెయినేజీలలో పూడికతీత చేయకపోవడంతో పంటలు మునిగిపోతున్న వైనాన్ని వివరించారు. సాగునీటి సంఘాలను పునరుద్ధరించాలని, నీటితీరువా వసూలు రెండేళ్లుగా నిలిచిపోయిందని, రైతులనుంచి నీటితీరువాను కట్టించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బందికి పూడికతీత పనుల పర్యవేక్షణ బాధ్యత

కాలువల నిర్వహణ, పర్యవేక్షణ పనులను సచివాలయాల్లో ఇంజనీరింగ్ సిబ్బందికి అప్పగించనున్నట్టు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కాంట్రాక్టర్లు పనులు చేశారా లేదా స్వయంగా పరిశీలన చేసి ఆ తరువాతనే బిల్లులు చేస్తానని, రైతుల ప్రయోజనాలకోసం రాజీ పడే ప్రసక్తేలేదన్నారు. నీటిపారుదల విభాగం ఎస్ఈ ప్రసాద్ మాట్లాడుతూ, పట్టిసీమ ద్వారా వచ్చేనీటిని వంతులవారీగా డెల్టాలోని ప్రధానకాలువలకు విడుదల చేస్తామని తెలిపారు.

తీర్మానాలు

- కృష్ణా రివర్‌మేనేజ్‌మెంట్ బోర్డు ద్వారా నాగార్జునసాగర్ ప్రాజెక్టునుంచి కృష్ణాడెల్టాకు 10 టీఎంసీల నీటిని విడుదల చేయాలి.
- కృష్ణానది యాజమాన్యబోర్డు ప్రధాన కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలి. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో లస్కర్లను నియమించాలి. గన్నవరం నియోజకవర్గంలో పోలవరం కుడికాలువ 137.290వ కిలోమీటరు నుంచి ఏలూరుకాలువను అనుసంధానం చేస్తూ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రతిపాదనల మేరకు కాలువ నిర్మాణానికి సంబంధించి రూ.32కోట్లతో అంచనాలను రూపొందించి టెండర్లు పిలవాలి.

తొలిరోజు 99 శాతం పంపిణీకి చర్యలు

» పింఛన్ల పంపిణీపై సీఎస్ వీసీలో
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 30 : ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల మొత్తాన్ని ఆగస్టు 1, గురువారం లబ్ధిదారుల ఇళ్ల వద్ద అందించే ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ సృజన, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఎల్‌డీఎం కె.ప్రియాంకతో కలిసి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అత్యంత ప్రతిష్టాత్మక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన అధికారులతో మాట్లాడారు.



తొలిరోజే 99 శాతం..

ఉదయం 6 గంటలకు పింఛన్ పంపిణీని ప్రారంభించి ప్రక్రియ సాఫీగా సాగేలా చూడాలన్నారు. తొలి రోజే 99 శాతం మేర పూర్తిచేసేందుకు కృషి చేయాలన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఇందుకు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో 2,34,143 మంది లబ్ధిదారులకు రూ.98.80 కోట్లు అందించాల్సి వుందని, పింఛన్ల పంపిణీకి ప్రభుత్వ ఉద్యోగులతో మ్యాప్ చేయడం జరిగిందన్నారు. ఎ.కొండూరు మండలంలో 7,485, చందర్లపాడులో 10,017, జి.కొండూరులో 8,728, గంపలగూడెంలో 11,583, ఇబ్రహీంపట్నంలో 4,845, జగ్గయ్యపేట (అర్బన్)లో 4,910, జగ్గయ్యపేటలో 10,338, కంచికచర్లలో 10,363, కొండపల్లి (అర్బన్)లో 5,305, మైలవరంలో 9,734, నందిగామలో 8,048, నందిగామ (అర్బన్)లో 4,298, పెనుగంచిప్రోలులో 8,580, రెడ్డిగూడెంలో 7,284, తిరువూరులో 6,865, తిరువూరు (అర్బన్)లో 3,430, వత్సవాయిలో 9,693, వీరులపాడులో 8,841, విజయవాడ (అర్బన్)లో 68,224, విజయవాడ రూరల్‌లో 17,277, విస్సన్నపేట మండలంలో 8,295 పింఛన్లు వున్నట్లు వివరించారు. 31వ తేదీ సాయంత్రంలోగా బ్యాంకుల నుంచి నగదును విత్‌డ్రా చేసి, పంపిణీ ప్రక్రియను సరళీకృతం చేసేలా డినామినేషన్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. పింఛన్ల పంపిణీ తీరును ఎప్పటికప్పుడు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని కలెక్టర్ సృజన పేర్కొన్నారు.

విజయవాడ టు తిరుపతి

ఏపీటీడీసీ ప్రత్యేక ప్యాకేజీ

» తిరుపతి బాలాజీ, పద్మావతి అమ్మవారి దర్శనం
» ఏసీ స్లీపర్ బస్సు సౌకర్యం.. వసతి, భోజనాలు
» బెంజిసర్కిల్ నుంచి బయలుదేరనున్న బస్సులు





(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ ప్రాంత వాసులతో పాటు అమరావతి రాజధాని ప్రాంత ప్రజలకు అందుబాటు ధరలో తిరుమల వెంకన్న దర్శనం చేసుకునేందుకు విజయవాడ నుంచి తిరుపతికి డైలీ ప్రత్యేక ప్యాకేజీని కల్పిస్తూ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అడుగులు వేసింది. ఏసీ స్లీపర్ బస్సులో ప్రయాణం.. వసతి, భోజనాలు, దర్శనం వంటివన్నీ ఏపీటీడీసీ సమకూరుస్తుంది. రెండు రోజుల టూర్‌లో భాగంగా విశాఖపట్నం నుంచి బయలుదేరే ఏసీ స్లీపర్ బస్సులకు విజయవాడలో పాయింట్ ఇవ్వటంతో ప్రత్యేక ప్యాకేజీ అమల్లోకి వచ్చింది. ప్రతిరోజూ రాత్రి 11 గంటలకు విజయవాడ బెంజిసర్కిల్ నుంచి యాత్ర ప్రారంభమౌతుంది. బెంజి సర్కిల్ వద్ద ఫ్లైవోవర్ పిల్లర్ నెంబర్ 4 దగ్గర ఏపీటీడీసీకి చెందిన ఏసీ స్లీపర్ బస్సు హాల్ట్ ఉంటుంది. యాత్రికులు ఇక్కడికి రావాల్సి ఉంటుంది. తెల్లవారుఝామున 6 గంటలకు బస్సు తిరుమల చేరుతుంది. అక్కడ స్థానికంగా వసతి కల్పిస్తారు. తర్వాత.. బ్రేక్‌ఫాస్ట్, 10 గంటలకు స్వామివారి దర్శనం చేయిస్తారు. అనంతరం భోజన ఏర్పాట్లు చూస్తారు. తర్వాత తిరుచానూరు పద్మావతి అమ్మవారి దర్శనం, రాత్రి 7 గంటలకు డిన్నర్ ఉంటుంది. తిరిగి అర్ధరాత్రి తిరుపతి నుంచి బస్సు బయలుదేరి మరుసటి రోజు ఉదయం విజయవాడ చేరుకుంటుంది.

- ప్యాకేజీ ధరలు పెద్దలకు రూ. 3,970, పిల్లలకు రూ.3,670 చొప్పున నిర్ణయించారు. ఇది ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటుందని ఏపీటీడీసీ చెబుతోంది. విజయవాడ నుంచి తిరుపతికి ఆసక్తి కలవారు 9848007025, 9440251775, 0866-2571393 నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.



దుర్గగుడి ఆలయ గోపుర స్వర్ణతాపడానికి విరాళమిస్తున్న గోపాల్ యాదవ్

దుర్గగుడి గోపుర స్వర్ణతాపడానికి రూ.లక్ష విరాళం

వన్‌టౌన్, జూలై 30 : ఇంద్రకీలాద్రిపై దుర్గగుడి ఆలయ స్వర్ణతాపడం నిమిత్తం తెలంగాణాలోని నల్గొండజిల్లా భూదాన్‌పోచంపల్లికి చెందిన మేరుగు గోపాల్ యాదవ్ మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేసి రూ. లక్ష చెక్కును ఈఈ కోటేశ్వరరావుకు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్ర, పక్కన కొనకళ్ల నారాయణ

మానవ అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 30 : రాష్ట్రంలో ఎక్కడైనా మానవ అక్రమ రవాణా జరిగితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. హిందూ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవరం జరిగింది. కార్యక్రమానికి రవీంద్ర అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో 2019-2024 మధ్య దాదాపు 34 వేలమంది మహిళలు, చిన్న పిల్లలు అదృశ్యమయ్యారన్నారు. ఆడపిల్లలపై అఘాయిత్యాలు, వేధింపులను ఎట్టి పరిస్థితిల్లో సహించేది లేదన్నారు. రాష్ట్రంలో నైపుణ్య గణన జరుపుతామని, నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యారంగంలో వినూత్న మార్పులు వస్తున్నాయన్నారు. మచిలీపట్నంకు రూ.70 వేల కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్టు రాబోతోందన్నారు. ఓడరేవు శరవేగంతో నిర్మిస్తున్నారని, దాంతోపాటు అనుబంధ పరిశ్రమలు వస్తాయని, యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య మాట్లాడుతూ, సినిమాల్లో అవకాశాలు ఇప్పిస్తామని చెప్పి మోసగించి అక్రమ రవాణా జరుగుతోందన్నారు. డీసీపీవో మోనిషా మాట్లాడుతూ, ఎవరికైనా సమస్య వస్తే 1098కి ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు, డీఈవో తాహెరా సుల్తానా, ఎస్సీ సంక్షేమ శాఖాధికారి షాహెద్ బాబు, డీఎస్పీ నాగరాజు, హిందూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.కుటుంబరావు, పద్మావతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, పద్మావతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భారతి, న్యాయవాది మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్, జూలై 30 : ఈ ఏడాది సెప్టెంబరు 5న జరగనున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన ఉపాధ్యాయులు ఆగస్టు 10వ తేదీలోగా దరఖాస్తులు పంపాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పాఠశాల విద్యావిభాగం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ఉత్తమ ప్రధానోపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయులు, పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు ఎస్‌ఎఫ్‌టీడ బ్యూ ద్వారా అవార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు. మార్గదర్శకాలకు అనుగుణంగా ఆగస్టు 10 వతేదీ సాయంత్రంలోగా ఉపవిద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని ఉపాధ్యాయులనుంచి దరఖాస్తులు సిఫారసు చేయాలన్నారు. సిఫారసులేని దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరన్నారు. దరఖాస్తు నమూనాలు సంబంధిత తనిఖీ అధికారుల వద్ద లభిస్తాయన్నారు.

కూలింగ్ కెనాల్లో మృతదేహం

ఇబ్రహీంపట్నం, జూలై 30 : ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్లో మంగళవారం గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 30 ఏళ్ల వయస్సు ఆరు అడుగుల ఆరు అంగుళాల ఎత్తు కలిగిన యువకుడు ప్యాంటు, టీషర్టు ధరించి ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

» కృష్ణా జిల్లా జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం టౌన్, జూలై 30 : యువతకు ఉపాధి కల్పించే దిశగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రణాళిక రూపొందించాలని కృష్ణా జిల్లా జేసీ గీతాంజలి శర్మ సూచించారు. జేసీ ఛాంబర్‌లో మంగళవారం జిల్లా వృత్తి నైపుణ్య అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 10, ఇంటర్, డిగ్రీ, డిపొమా, ఇంజనీరింగ్ కోర్సులు చేసిన వారిని గుర్తించి నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 2వ తేదీ లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరనాయక్, ఆర్.వెంకట్రావు, సీతారామ్, విక్టర్‌బాబు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాపై అసత్య ప్రచారం

» పెద్దిరెడ్డి పీఏకు ఇల్లు అద్దెకు మాత్రమే ఇచ్చా
» కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు, జూలై 30 : ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తనపై అసత్య ప్రచారం చేయటం తగదని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లో తన ఇంటిని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏ శశిధర్‌కు అద్దెకు మాత్రమే ఇచ్చానని, ఇతర అంశాలతో ఎలాంటి సంబంధం లేదని, దీనిపై ఎలాంటి విచారణకైనా సిద్ధమేనని కైలే అనిల్‌కుమార్ అన్నారు. వల్లూరుపాలెంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్‌లో పెద్దిరెడ్డి పీఏ కోసం పోలీసులు వస్తే అతను లేడని, దాంతో తనకు ఫోన్‌చేస్తే వెళ్లి తాళం ఇచ్చి సహకరించానన్నారు. ఎమ్మెల్యే వర్ల నిమ్మకూరు, కోసూరు గ్రామాల్లో రూ. కోటిన్నర మట్టిని అమ్ముకున్నారని కైలే ఆరోపించారు. పాములలంక బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పామర్రు, పాములలంక ప్రజలకు ఇళ్ల స్థలాలిస్తే వర్ల కుమార్ రాజాకు సన్మానం చేస్తానని చెప్పారు.



యోగసనాలు వేస్తున్న కలెక్టర్ బాలాజీ తదితరులు

క్రీడా రంగానికి ప్రాధాన్యత

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, జూలై 30 : జిల్లాలో క్రీడా రంగానికి తగిన ప్రాధాన్యత కల్పించాని, క్రీడాకారులను ప్రోత్సహించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ కన్వెన్షన్‌హాలులో యోగా శిక్షణా తరగతుల్లో కలెక్టర్ పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం ప్యారిస్ ఒలింపిక్స్ క్రీడలను పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఏర్పాటు చేసిన ఒలింపిక్స్ ఫోటో బోర్డుతో సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఒలింపిక్స్‌లో మన క్రీడాకారులు రాణించి పతకాలుసాధించి దేశ ప్రతిష్టను ఇనుమడింపచేయాలని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలో క్రీడాకారులను అన్నివిధాలా ప్రోత్సహిస్తామన్నారు. నాగాయలంకలో అసంపూర్తిగా ఉన్న క్రీడా శిక్షణా అకాడమీ భవనాన్ని పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఝాన్సీలక్ష్మి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి శ్రీనివాసరావు, జిల్లా సహకార శాఖాధికారి చంద్రశేఖర్, సమాచార పౌరసంబంధాల శాఖ డీడీ వెంకటేశ్వర ప్రసాద్, వ్యవసాయ శాఖ ఏడీ పార్థసారథి, యోగా గురువులు మద్దాల చింతయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

» ఎన్టీఆర్ జిల్లా జేసీ నిధి మీనా



కృష్ణలంక, జూలై 30 : జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) పటిష్ట అమలుకు రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జేసీ నిధి మీనా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జేసీ, రెవెన్యూ, పౌరసరఫరాలు తదితర శాఖల అధికారులతో నిత్యావసర సరుకుల ధరల పర్యవేక్షణ, నియంత్రణ, పీడీఎస్-ర్యాపిడ్ శాంపిల్ సర్వే నిర్వహణ విధి విధానాలపై మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా నిధి మీనా మాట్లాడుతూ, బియ్యం, కంది పప్పు, వంట నూనె వంటి నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణలో వుండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) అమలు తీరు, సరుకుల నాణ్యత తదితరాలపై లబ్ధిదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకొనేందుకు సర్వే చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, హాస్టళ్లకు సంబంధించిన సమాచారం సేకరించి నివేదికలు సమర్పించాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో జి.మోహన్‌బాబు, పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, డీఈఓ యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ జె.సుజాత, తదితరులతో పాటు ఎంఈఓలు, సీడీపీఓలు, హాస్టల్ వార్డెన్లు, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

భారతీనగర్ : ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలి వున్న డిప్లొమా సీట్ల భర్తీకి బుధవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్‌ఆటోమొబైల్, సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, మెటలర్జికల్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మార్కులిస్ట్, టీసీ, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గల స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ ఒరిజినల్స్‌తో పాటు మూడు సెట్ల జిరాక్స్, ఆరు పాస్‌పోర్ట్ ఫోటోలతో కళాశాలకు హాజరుకావాలని తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతో వ్యాధుల నియంత్రణ

» డీఎం అండ్ హెచ్‌వో సుహాసిని

కృష్ణలంక, జూలై 30 : సీజనల్ వ్యాధుల వ్యాప్తి నివారణలో భాగంగా ఎ.కొండూరు, గంపలగూడెం, ఊటుకూరు, తెల్లదేవరపల్లి, రెడ్డిగూడెం, రాజుగూడెం, చౌటపల్లి, చంద్రాల పరిధిలో ప్రతిరోజు ఆరోగ్య బృందాలు ఇంటింటిని సందర్శించి జ్వరం కేసులు నమోదు చేస్తూ ప్రాథమిక చికిత్స అందించడం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారిణి ఎం.సుహాసిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు తొలగించడం, లార్వా గుర్తింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఏబేట్ చల్లించడం, ఫాగింగ్ చేయడం, క్లోరినేషన్, నీటి నమూనా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. తిరువూరులో జ్వరం కేసులు నమోదైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి అధ్వర్యంలో జూలై 31 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు జరిగే పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఉదయం 6 నుంచి 10 గంటల వరకూ విధిగా పాల్గొనాలని ఆదేశించినట్టు చెప్పారు.


లింగ నిర్ధారణ చేయడం నేరం

» డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి

గుడివాడ : లింగనిర్ధారణ ఎంపిక నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడానికి చర్యలు చేపట్టినట్టు కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. మంగళవారం స్థానిక హోమియోపతి రీజనల్ రిసెర్చ్ ఇన్సిస్ట్యూట్‌లోని స్కానింగ్ సెంటర్, రమేశ్ ఆసుపత్రిలోని స్కానింగ్ కేంద్రాల రెన్యూవల్ నిమిత్తం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లను తప్పనిసరిగా పిసిపిఎన్‌డిటి చట్టం పరిధిలో నమోదు చేయాలన్నారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అవసరమైతే ఐఎంఏ గుర్తింపు రద్దు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో తక్కువ లింగనిష్పత్తి గల ప్రాంతాలను గుర్తించి క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. స్కానింగ్ కేంద్రాలకు సంబంధించిన అనుమతులన్నీ ఖచ్చితంగా ఉండాలన్నారు. స్కానింగ్ కేంద్రాల వద్ద గర్భిణుల అనుమతిని తీసుకుని మాత్రమే స్కానింగ్ నిర్వహించాలన్నారు. వారి సంబంధీకులు స్కానింగ్ కేంద్రాలకు వెళ్లి లింగ నిర్ధారణ చేయించుకోవాలని చూస్తే కఠినచర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాబోధకుడు బి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

గుడ్లవల్లేరు: కౌతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గీతాబాయి తనిఖీ చేశారు. ఇటీవల గుడివాడ ఏరియా ఆసుపత్రిలో మాతృ మరణానికి సంబంధించి మృతురాలి వివరాలు వైద్యులను, ఏఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ వివరాలు తెలుసుకొన్నారు. దోమల వల్ల వ్యాప్తి చెందే డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై పలుసూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కాన్పుల వివరాలు, రికార్డులను ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ బి.శ్రావ్య డాక్టర్ మాధవి, హెచ్ఈ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	104, 113, 124
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

లయోలా కళాశాలలో రక్తదాన శిబిరం



భారతీనగర్, జూలై 30: ఆంధ్రా లయోలా కళాశాల సెయింట్ ఇగ్నేషియస్ పండుగ సందర్భంగా కళాశాల మల్టీపర్పస్ హాల్‌లో ఎన్ఎస్ఎస్, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించాయి. ఈ శిబిరంలో కళాశాల విద్యార్థులు పాల్గొని 112 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఫాదర్ పి.ఆర్.జాన్, ప్రిన్సిపాల్ ఫాదర్ పి.కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ జి.కిరణ, కె. ప్రభుదాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్. దయాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత శివాలయంలో నందీశ్వరుడికి అభిషేకం రేపు

వన్‌టౌన్, జూలై 30: స్థానిక భ్రమరాంబామల్లేశ్వరస్వామి దేవస్థానం (పాత శివాలయం)లో ఆగస్టు ఒకటో తేదీ గురువారం త్రయోదశి తిథిని పురస్కరించుకుని సాయంత్రం 4 గంటలకు నందీశ్వరుడి విగ్రహానికి ప్రదోషకాల సమయంలో మహన్యాసపూర్వక అభిషేకాన్ని నిర్వహించనున్నారు.ఈమేరకు ఆలయ ఈవో కానూరి సురేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభిషేకంతో పాటు పంచహారతులు, తీర్థ ప్రసాద వితరణలు ఉంటాయని, భక్తులు సద్వినియోగ పరచుకోవాలని కోరారు.

ఉప్పలపాటి రామచంద్రరాజుకు ఘన నివాళి



ఉప్పలపాటి రామచంద్రరాజు చిత్రపటానికి నివాళి సమర్పించిన సీపీఐ నాయకులు

వన్‌టౌన్, జూలై 30: విజయవాడలో కమ్యూనిస్ట్ పార్టీ విస్తరణలో పశ్చిమ మాజీ ఎమ్మెల్యే ఉప్పలపాటి రామచంద్రరాజు పాత్ర ఎనలేనిదని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. వన్‌టౌన్ లెనిన్ భవన్‌లో మంగళవారం రామచంద్రరాజు 21వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులు, పార్టీ శ్రేణులు ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నీతి నిజాయితీకి, నిస్వార్థతకు రామచంద్రరాజు మారు పేరన్నారు. తన ఆస్తిని పూర్తిగా విక్రయించి ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు ఉపకార వేతనాలు అందచేసినట్లు తెలిపారు. నాయకులు మూలి సాంబశివరావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, పలువురు పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ భౌతికకాయానికి వెంకన్న నివాళి




హైదరాబాద్‌లో సూర్యనారాయణ భౌతికకాయం వద్ద నివాళి సమర్పించిన బుద్ధా వెంకన్న

వన్‌టౌన్ జూలై 30: సూపర్ స్టార్ కృష్ణ బావమరిది ఉప్పలపాటి సూర్యనారాయణ భౌతికకాయాన్ని హైదరాబాద్ మూవీటవర్స్‌లో టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బుద్ధా వెంకన్న మంగళవారం దర్శించి నివాళులు సమర్పించారు.


ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వెలిబుచ్చి, కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

RUNNING VERY SUCCESSFULLY at NAVRANG A/c



(IN TELUGU 3D) DAILY 4 SHOWS
11-45 AM, 3-00 PM
6-45 PM, 9-45 PM
Advance Booking Open Online "Book My Show"

నేడే చూడండి
అప్సర సినిమా



రోజూ 4 ఆటలు :
11-30AM, 02-30PM,
6-30PM, 9-30PM
www.justickets.in
www.bookmyshow.com

ఆగస్టు 2న బ్రహ్మాండమైన విడుదల



విజయవాడ	- నవరంగ్
పాయకపురం	- తారా స్క్రీన్స్
విజయవాడ-1	- సాయిరాం స్క్రీన్స్
వుయ్యూరు	- సాయి మహల్
గుడివాడ	- ఎబిఆర్ సినిమాస్
మచిలీపట్నం	- పివిఆర్
అవనిగడ్డ	- రామకృష్ణ
పామర్రు	- గగన్‌మహల్
ఇబ్రహీంపట్నం	- స్వర్ణ సినీమ్యాక్స్

CONTACT : 98660 10970

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రామలింగేశ్వరనగర్, జూలై 30: విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెన్స్ నిమిత్తం బుధవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, రామలింగేశ్వరనగర్ విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ రామాలయం ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ.సుధాకర్ తెలిపారు. చినరామాలయం, పెదరామాలయం ప్రాంతాలు, గరికపాటి వారి వీధి, కాలుకట్ట, జాస్తీ వీధి, ఆశ్రమం వీధి, గంగానమ్మ గుడి ఏరియా, జీకే టవర్స్, వెంకట్ హైట్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

» బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999
AJB-194789

PLOT FOR SALE

» విజయవాడ, బందరు రోడ్డు దగ్గరలో గోసాలలో CRDA Approved Open Plots అందుబాటు ధరలలో కలవు. సంప్రదించండి. సెల్ : 92477 70999
AJB - 086048

WANTED

» మచిలీపట్నం, బైపాస్‌రోడ్ లోని కృష్ణవేణి ITI కాలేజీలో పనిచేయుటకు B.Tech ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్ / మెకానికల్ / కంప్యూటర్ సైన్స్ చదివిన వారు కావలెను. కాలేజి ఆవరణలో ఉచిత వసతి కలదు. 98486 79360
AJB - 182197

» BR CONCEPTS is hiring for Telecallers and HR recruiters For more details please call to 88866 42960, 61,62,63,64,65,66, 67,68,69,70,71,72,73. Address: 2nd floor above union bank, near Autonagar checkpost, Vijayawada.
AJB -182440

» VJA, భవానిపురం కొరియర్ నందు డెలివరీ బాయ్స్ (P/F) కావలెను మరియు ఆఫీసు నందు పనిచేయుటకు ఆఫీసు అసిస్టెంట్ కావలెను. సంప్ర: 92995 52535
AJB -194787

లీజు / అద్దెకు

» శ్రీ అవినాష్, విశ్రాంతి మందిర్, 2వ లైను, 4వ క్రాస్ రోడ్డు, జవహర్ ఆటోనగర్, విజయవాడ, రన్నింగ్‌లోఉన్న లాడ్జి 9 రూములు, హాల్, ఫర్నిచర్, టీవీలతో సహా సంప్ర: 99519 01540
AJB-194747

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మింటబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5% Extra
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ॥290/-
కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట, పెనమలూరు : 99854 11868.
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733.
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240



కేదారేశ్వరపేట ఐదోలైన్ మొదట్లోనే డ్రెయిన్‌పై అధ్వానంగా ఉన్న రోడ్డు





ఐదో లైన్‌లోని వెలగపూడి లక్ష్మణదత్తు స్కూలు ఎదురుగా, అదే లైన్‌లోనే మరోచోట...

కేదారేశ్వరపేట ఐదోలైన్ రోడ్డు అధ్వానం

స్థానికులు, పాదచారుల వెతలు
పట్టించుకోని అధికారులు

పాతరాజరాజేశ్వరి పేట, జూలై 30 : స్థానిక 34వ డివిజన్ కేదారేశ్వరపేట ఐదో లైన్‌లో నెలకొన్న రోడ్డు సమస్యలతో స్థానికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నెలల తరబడి ఉన్న ఈ సమస్య ఎప్పుడు పరిష్కారం అవుతుందో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కేదారేశ్వరపేట ఐదో లైన్ మొదట్లోనే రోడ్డు అధ్వానంగా దర్శనమిస్తుంది. ఆ ప్రాంతంలో డ్రెయిన్‌పై కల్వర్టు ఏర్పాటు చేశారు. కానీ ఆ ప్రాంతంలో రోడ్డు సరిగా నిర్మించకపోవడంతో కంకర తేలి తరచూ వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అదే లైన్‌లో ఉన్న వెలగపూడి లక్ష్మణ దత్తు ప్రాథమిక పాఠశాల ముందు కూడా రోడ్డు గోతులమయమై ఉంది. ఆ రోడ్డులో ప్రయాణించాలంటే అటు స్థానికులు, పాదచారులే కాకుండా స్కూలు విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఐదో లైన్ నుంచి 6,7,8 లైన్‌లకు వెళ్లే రోడ్డులో ఏర్పడిన సమస్యతో ఏళ్లగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు గోతులమయమై ప్రమాదకరంగా ఉంది. రోడ్డు సమస్యలతో పలు బాధలు పడుతున్నామని ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకునే నాథుడు లేడని స్థానికులు, పాదచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే రోడ్డు సమస్యను పరిష్కరించి తమకు ఉపశమనం కలిగించాలని కోరుతున్నారు.

నగరానికి మణిహారంగా

టవర్‌లైన్ రోడ్డు తీర్చిదిద్దుతాం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె

పటమట, జూలై 30 : తూర్పులోని టవర్‌లైన్ రోడ్డు నగరానికి మణిహారంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. గత టీడీపీ హయాంలోనే ఈ రోడ్డును అభివృద్ధి చేశామని, వైసీపీ ప్రభుత్వం ఈ రోడ్డును అసలు పట్టించుకోలేదని ఆరోపించారు. మంగవారం రామ్మోహన్ 10వ డివిజన్ విజయనగర్ కాలనీ డాన్ బాస్కో స్కూల్ పక్కన పర్యటించారు. స్థానికుల సమస్యలను గద్దె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరానికి తూర్పు పరిధిలో హైటెన్షన్ వైర్ల రోడ్డు ఒక మణిహారంగా ఉంటుందన్నారు. కేవలం రూ.30 లక్షలు వ్యయం చేస్తే ఈ రోడ్డు పంట కాల్వ రోడ్డుకు అనుసంధానం చేయవచ్చునని తెలిపారు. అప్పట్లో ఎంపీ నిధులు మంజూరు చేయిస్తే ఆ నిధులు ఖర్చు చేయకుండా మున్సిపల్ కమిషనర్‌పై వైసీపీ నాయకులు ఒత్తిడి తెచ్చారన్నారు. కరెంట్ లైన్ల వలన ఇళ్లకు విద్యుత్ షాక్ వస్తోందని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారని, విద్యుత్ అధికారులతో మాట్లాడి ఈ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. స్థానిక కార్పొరేటర్ దేవినేని అపర్ణ, పొన్నం శ్రీనివాసరావు, ముమ్మనేని ప్రసాద్, మన్నే జయప్రకాష్, గుప్తా , కోనేరు రాజేష్, బెజవాడ నజీర్‌లు పాల్గొన్నారు.

నగరంలో కెనాల్ బోటింగ్‌ను సిద్ధం చేయాలి

నగర కమిషనర్ ధ్యానచంద్ర



బోటులో ప్రయాణిస్తున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

వన్‌టౌన్, జూలై 30: పర్యాటకులను ఆకర్షించే విధంగా నగరంలో కెనాల్ బోటింగ్‌ను సిద్ధం చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన బోటుపై కాల్వల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని బందరు, రైవస్, ఏలూరు కాల్వ గట్లను సుందరీకరించి బోటింగ్ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

కాల్వల రెండు గట్లను కూడా ఆహ్లాదకరంగా తీర్చి దిద్దేందుకు గ్రీనరీని పెంచాలన్నారు. కాల్వల్లో చెత్త వేయకుండా నిరోధించేందుకు డ్రోన్లను వినియోగించాలని, కాల్వల్లో చెత్త వేస్తున్నవారిని గుర్తించి జరిమానా వసూలు చేయాలని ఆదేశించారు. కాలువల్లో ప్రవహించే నీటిని దిగువ ప్రాంతాలు, పరిసర ప్రాంతాల ప్రజలు తాగునీటిగా వినియోగిస్తున్నారన్నారు. దీంతో నీరు కలుషితంగా కాకుండా చూడాలన్నారు. ఇందుకు ఫ్లోటింగ్ పైపులను ఏర్పాటు చేసి వలల ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను కట్టడి చేసి, కన్వేయర్ బెల్టుల ద్వారా వ్యర్థాలను బయటకు తీసుకురావచ్చునని ఈమేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్ట్ విభాగం అదనపు కమిషనర్ కేవీ సత్యవతి, బయాలజిస్ట్ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలానుగుణంగా బోధనా పద్ధతులు మార్చుకోవాలి

● వ్యక్తిత్వ వికాస నిపుణుడు రోహిత్



వన్‌టౌన్ జూలై 30: అధ్యాపకులు కాలానుగుణంగా తమ బోధనా పద్ధతులను మార్చుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు రోహిత్ అన్నారు. ఐటీసీ సంస్థ భాగస్వామ్యంతో కేబీఎన్ కళాశాల ఐక్యూఏసీ, కంప్యూటర్ల విభాగాలు సంయుక్తంగా తరగతి గదిలో బోధనా నైపుణ్యాల అంశంపై కాలేజీలో నిర్వహించిన మూడు రోజుల అధ్యాపకుల శిక్షణ కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, విద్యారంగంలో అనేక సాంకేతిక పరమైన మార్పులు వస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో బోధన విధానంలోను ఇంకా మార్పులు రావాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. అధ్యాపకులకు సమకాలీన అంశాలపై పట్టు ఉన్నపుడే విద్యార్థులకు సరిగ్గా బోధించగలుగుతారన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, ఐక్యూఏసీ కో- ఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి, కంప్యూటర్ల విభాగాధిపతి పి. రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో నైపుణ్యం పెంచుకోవాలి

నాస్కామ్ ఢిల్లీ మేనేజర్ ఉత్తమ్ కుమార్

లబ్బీపేట, జూలై 30: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీలలో నిపుణుల అవసరం ఉందని నాస్కామ్ ఢిల్లీ మేనేజర్ ఉత్తమ్ కుమార్ అన్నారు. నలంద కళాశాలలో మంగళవారం ఆర్టిఫిషియల్ అసెండ్ ప్రోగ్రామ్‌లో భాగంగా నాస్కామ్, యాక్సెంచర్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఈ అంశాల్లో నైపుణ్యాలు ఎలా పెంపొందించుకోవాలో, నాస్కామ్ అందించే కోర్సులను సెల్ఫ్ పేస్డ్ లెర్నింగ్ ద్వారా నేర్చుకోవాలని తెలిపారు. డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవిష్యత్తులో ఎలాంటి ఉద్యోగాలు రాబోతున్నాయో అందుకు విద్యార్థులు ఎలా సన్నిద్ధం కావాలో ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ నాస్కామ్‌తో ఎంఓయు చేసుకుని యాక్సెంచర్ ద్వారా విద్యార్థులకు అందించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అసెండ్ ప్రోగ్రామ్ ద్వారా వివిధ సర్టిఫికెట్స్ పొందటానికి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.

నాస్కామ్ రీజనల్ హెడ్ బి.ప్రవీన్ కుమార్, కంప్యూటర్స్ సైన్స్ హెచ్‌వోడీ పి.భవాని, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి, బి.ప్రదీప, బీఎస్సీ, ఏఐ, కంప్యూటర్‌సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఐడియల్ స్కూల్‌లో చిన్నారుల గ్రీన్ డే సెలబ్రేషన్స్



కృష్ణలంక, జూలై 30: కృష్ణలంకలోని సుధాకర్స్ ఐడియల్ స్కూల్‌లో జేకేజీ, ఎస్‌కేజీ చిన్నారులు గ్రీన్ డే సెలబ్రేషన్స్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల ఆకులు, పండ్లు, కాయగూరల వేషధారణలతో చిన్నారులు స్ట్రీట్ వాక్ చేశారు. పర్యావరణాన్ని సంరక్షించాలని పచ్చటి ఆకుకూరలు, కాయగూరలు తినడం ద్వారా మానసికోల్లాసం కలగడంతో పాటు ఆరోగ్యంతో వుంటారని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తెలిపారు. ప్రిన్సిపాల్ ఆర్.కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు కనకమహాలక్ష్మి, సంధ్య, అనూష, శిరీష, గాయత్రి, శ్రీదేవి, నాగమణి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి తైక్వాండోలో రాజారామ్మోహన్‌రాయ్ విద్యార్థులకు పతకాలు



విజయవాడ స్పోర్ట్స్, జూలై 30 : నగరంలో ఆంధ్రా లయోలా కళాశాలలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో గుణదలలోని రాజారామ్మోహన్‌రాయ్ పాఠశాల విద్యార్థులు అండర్-11, అండర్-14 విభాగాల్లో సత్తా చాటి పలు పతకాలను వశం చేసుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ వై.మదన్‌మోహన్‌రావు తెలిపారు. ఆగస్టులో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. పి. రేష్మ సాయి, ఎం. భవ్య, పి.కార్తీక్‌లు స్వర్ణాలను, ఈ.ఆకాంక్ష, ఈ. సిద్దార్థ, జే. సాహితి నాగభవానీ, కె.యశస్విని, ఆర్. నీరజ్‌కుమార్‌లు రజతాలను, డి. ప్రవస్తి, వై.సోనాక్షి, బి. అఖిల్, పి. ఆర్యన్ కార్తీక్, పి.మణినాగ దుర్గా శ్రీరామ్, సీహెచ్ శ్రీహర్ష, కె.కార్తీక్‌లు కాంస్యాలను సాధించారని వివరించారు. కోచ్ ఎం.అంకమ్మరావు, విద్యార్థులను ఆయన అభినందించారు.

ఐక్యతతోనే అధికారం సాధ్యం : పూర్ణచంద్రరావు

జగ్గయ్యపేట: ఐక్యత తోనే బలహీన వర్గాలకు అధికార ం సాధ్యమని మాజీ డీజీపీ, బీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ జె.పూర్ణచంద్రరావు అన్నారు. ఉక్కు కళావేదికలో మంగళవారం నిర్వహించిన అధికారం చర్చా వేదికలో ఆయన బీఎస్పీ అధ్యక్షుడు పరంజ్యోతి, అధికార ప్రతినిధి వందనకుమార్ పాల్గొని ప్రసంగించారు. దేశంలో కొన్ని వర్గాలను ఓటుబ్యాంకులుగా పరిగణిస్తూ, రాజకీయ పార్టీలు తమ పబ్బం గడుపుకుంటున్నాయన్నారు. విద్యావేత్త కేవీ రత్నం, వివిధ సామాజిక వర్గాల నుంచి మేధావులు, ప్రతినిధులు పాల్గొని అభిప్రాయాలను తెలిపారు.

తల్లికి వందనం వెంటనే అమలు చేయాలి

భవానీపురం, జూలై 30 : కూటమి హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకాన్ని వెంటనే అమలు చేయాలని గాంధీదేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్.గాంధీ నాగరాజన్ కోరారు. ప్రతి నెలా ప్రజా సమస్యలపై ఆయన చేపట్టే దీక్షల్లో భాగంగా మంగళవారం ఊర్మిళానగర్‌లో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం ఆయన పాదయాత్రగా వెళ్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. బంగారు భారతి, ఆర్ శివరంజని పాల్గొన్నారు.

భవానీపురం నాయీ బ్రాహ్మణ

సేవా సంఘ అధ్యక్షుడిగా కాపారపు శ్రీనివాస్

విద్యాధరపురం, జూలై 30: భవానీపురం నాయీ బ్రాహ్మణ కులవృత్తి సేవా సంఘం అధ్యక్షుడుగా కాపారపు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. భవానీపురం న్యూ పద్మజా హెయిర్ స్టయిల్‌లో మంగళవారం సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఉపాధ్యక్షుడుగా పెద్దపూడి హేమంత్, కార్యదర్శిగా కొడమంచిలి గిరి, సహకార్యదర్శిగా ముంగంటి రాజకుమార్, కోశాధికారిగా సుందపల్లి దాసుతో పాటు మొత్తం 29 మందిని కార్యవర్గానికి ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వహణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ద్రాక్షారపు సూరిబాబు, ఉప్పిడి రాము, న విరి మహేష్ నరసింహారావులు హాజరయ్యారు. ఎన్నిక అనంతరం కొత్త కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

గిరిజనులకు జాబ్ మేళా నేడు

విస్సన్నపేట: పదో తరగతి లేక ఇంటర్ ఉత్తీర్ణులైన, ఇంగ్లీష్ భాష చదవడం, రాయగల నైపుణ్యం గల గిరిజనులు బుధవారం జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి జాన్సన్ దేవరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌కే సెఫ్టీ వింగ్స్ ప్రై లిమిటెడ్, కేవీఎల్ గ్రూప్స్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రాజెక్టు డైరెక్టర్ డీఆర్‌డీఏ గొల్లపూడి కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. గిరిజన నిరుద్యోగులు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

కట్లేరు వద్ద రాకపోకలు నిలిపివేత

గంపలగూడెం, జూలై 30: తోటమూల - వినగడప రహదారిలోని కట్లేరు బ్రిడ్జ్ డైవర్షన్ రహదారిపై గత రాత్రి కురిసిన వర్షానికి పై నుంచి వరద రావడంతో మంగళవారం నుంచి మరోమారు రాకపోకలు నిలిపివేశారు. ఎస్సై శ్రీను రహదారికి ఇరువైపులా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి రాకపోకలు చేయకుండా నిలువరించారు.

మట్టిఖర్చులకు ఆర్థికసాయం

వన్‌టౌన్, జూలై 30: గుండెపోటుతో మరణించిన కేఎల్ రావు నగర్‌కు చెందిన గుడిమెట్ల ఆశమ్మ మట్టి ఖర్చుల నిమిత్తం ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆర్థిక సహాయం అందచేశారు. ఆశమ్మ ఆర్థిక స్థితిని 47వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు నాగోతి రామారావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఎమ్మెల్యే అందించిన ఆర్థిక సహాయాన్ని నాగోతి రామారావు, ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది కలసి మంగళవారం ఆశమ్మ భర్త జాన్ సుందర్‌కు అందజేశారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

గంపలగూడెం, జూలై 30: తెలంగాణ నుంచి 10 మద్యం సీసాల తీసుకువస్తున్న ఉప్పతల రాజు, బండి అంజయ్యలను ఎస్ఈబీ అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు.

ఇబ్రహీంపట్నం : కారులో అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉన్న వ్యక్తులను ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కాంచనపల్లి గ్రామానికి చెందిన యాదగిరి, ఎల్లా గౌడ్, బానావత్ కేష్య, దుంపల రాములు కారులో 9 ఫుల్ బాటిల్స్‌తో పట్టుబడ్డారు. ఎస్సై పాపారావు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.



'క్యాట్'కు వేళాయె!



మేనేజ్‌మెంట్ కోర్సు చదవాలి అనుకునే ప్రతి ఒక్కరూ పేరొందిన కాలేజీల్లో చదవాలనుకుంటారు. అలాంటి మేనేజ్‌మెంట్ కోర్సుల అడ్మిషన్ల తొలి అంచెకు ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో మంచి పర్సంటైల్ సాధించిన అభ్యర్థులు ఆయా అడ్మిషన్లలో ముందు వరుసలో ఉంటారు.

కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)-2024 నోటిఫికేషన్ వెలువడింది. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. దేశ వ్యాప్తంగా 170 నగరాల్లో నవంబరు 24న పరీక్షను నిర్వహించనున్నారు.

ఐఐఎంలు: అహ్మదాబాద్, ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. గతంలో నిర్వహించిన క్యాట్ పరీక్షల ప్రకారం.... మొత్తం 198 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ విభాగాల నుంచి మొత్తం 66 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు 3 మార్కులు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తేదీలు:** ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 13 వరకు
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** నవంబరు 5 నుంచి
- **పరీక్ష తేదీ:** నవంబరు 24
- **ఫలితాల ప్రకటన:** జనవరి 2025
- **వెబ్‌సైట్:** https://iimcat.ac.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/rdmwKnPలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐఈపీఐడీలో డిప్లొమా

సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంట్రప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి 1200 గంటలు చొప్పున మొత్తం 2400 గంటల బోధన ఉంటుంది. ఇండియన్ సైన్ లాంగ్వేజ్, ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో తరగతులు నిర్వహిస్తారు. ప్రాంతీయ భాషల్లో కూడా వివరణ ఇస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ఈ కోర్సులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు నెలకు రూ.2,000ల స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్/హిందీ భాషలో ప్రావీణ్యం తప్పనిసరి. సాధారణ స్థాయిలో వినికిడి సామర్థ్యం ఉండాలి.

ఉద్యోగావకాశాలు: ఈ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థల్లో సైన్ లాంగ్వేజ్ ఇంట్రప్రిటర్స్‌గా చేరవచ్చు. మూగ-చెవిటి పిల్లలకు, సైన్ లాంగ్వేజ్ ఇంట్రప్రిటర్స్‌కు ఇన్‌స్ట్రక్టర్లుగా అవకాశాలు ఉంటాయి.

- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 20
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

SCHOLARSHIP ALERT

Description: Blue Star Foundation aims at supporting and empowering underprivileged undergraduate and diploma students enrolled in Architecture and Engineering programmes at select private or government colleges across India through their flagship initiative, i.e. Mohan T Advani Centennial Scholarship Programme.

Mohan T Advani Centennial Scholarship

Eligibility: First and second-year students enrolled in a degree programme in architecture and engineering, such as Electronics Engineering, Mechanical Engineering, Information Technology (IT), Computer Science (CS), and related STEM fields, excluding Civil Engineering. Applicants must have scored a minimum of 80% in Class 10 and Class 12 for first-year students, and at least 80% in Class 12 and 75% in the 1st year for second-year students. Students enrolled in specified colleges* will be eligible to apply. Applicants' annual family income from all sources must be less than INR 6 lakh. Recipients should not be beneficiaries of any other scholarship.

Prizes & Rewards: For engineering and architecture students: INR 75,000 or 50% of the annual fees (whichever is less)

For Diploma Students: INR 30,000 or 75% of the annual fees (whichever is less)

Last Date to Apply: 20-08-2024

Short Url: www.b4s.in/aj/BSFS2

HOPE Engineering Scholarship

Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students and preference will be given to students with physical disabilities. The applicants must have scored more than 60% marks in Class 12 (science) in the academic year 2023-24. They must be enrolled in the first year of an engineering program at any recognized college in India. The annual family income of the applicants should be less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000

Last Date to Apply: 15-08-2024

Short Url: www.b4s.in/aj/SIHE15

buddy4study.com

మమ్మల్ని సంప్రదించకుండానే చర్యలు తీసుకుంటారా?


నిర్మాతల మండలిపై నడిగర్ సంఘం ఆగ్రహం



వివిధ అంశాలపై తమిళ నిర్మాతల మండలి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుందంటూ 'నడిగర్ సంఘం' ఆగ్రహం వ్యక్తం చేసింది. తమను సంప్రదించకుండా చర్యలు ఎలా తీసుకుంటారని నిలదీసింది. తమిళ నిర్మాతల మండలి సోమవారం సమావేశమై పలు తీర్మానాలు ఆమోదించిన విషయం తెలిసిందే. నటీనటులు, సాంకేతిక నిపుణుల పారితోషికాలు క్రమబద్ధీకరించాలని, ఆగస్టు 16 తర్వాత కొత్త సినిమాల షూటింగ్ చేపట్టకూడదని, నవంబరు ఒకటి నుంచి సినిమా షూటింగ్‌లు నిలిపివేయాలని.. ఇలా ఆరు తీర్మానాలు ఆమోదించింది. ఇలా ఏకపక్షంగా తమిళ నిర్మాత మండలి నిర్ణయాలను తీసుకోవడాన్ని నడిగర్ సంఘం తీవ్రంగా ఖండించింది. . సినీ రంగంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా షూటింగులు నిలిపివేస్తామని తీర్మానం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. పారితోషికాలు సహా ఇతర సమస్యలపై నడిగర్ సంఘం సహా మిగిలిన సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదని అభిప్రాయపడింది. అలాగే ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఈ వ్యవహారంపై తదుపరి చేపట్టాల్సిన చర్యలపై తమ సంఘం కార్యనిర్వాహకుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని నడిగర్ సంఘం ప్రకటించింది.

> **హీరో ధనుష్‌పై తీర్మానం చేయడం సమంజసం కాదని, ఆయనపై నడిగర్ సంఘానికి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని స్పష్టం చేసింది.**


- చెన్నై(ఆంధ్రజ్యోతి)



నవ్య | చిత్రజ్యోతి

పురస్కారాలకు పరిష్కారం దొరికేనా?

అసంతృప్తో, ఆగ్రహమో... 'గద్దర్ పేరుతో సినీ పురస్కారాలు ఇస్తామంటే ముందుకు రారా...' అంటూ ముఖ్యమంత్రి బహిరంగ వేదికపై నుంచి అన్న ఒక్క మాట తెలుగు చలన చిత్ర పరిశ్రమను ఉలిక్కిపడేలా చేసింది. చిత్ర పరిశ్రమలోని సంఘాలు ఆయన ఆహ్వానాన్ని పక్కనపెట్టే ధైర్యం చేశాయా? ఏమీ తెలియనట్లే ఉంటూ తలెగరేసే సాహసం సినీ పెద్దలు చేయగలరా? ముఖ్యమంత్రి మాటల్లోని మర్మం ఏమిటి? అనేదే ఇప్పుడు నడుస్తున్న చర్చ.



సినిమావాళ్ల ప్రభుత్వాలకు చేసుకునే వినతులలో భాగంగానే ఇన్నాళ్లు నంది పురస్కారాల అంశం వార్తల్లో నిలుస్తూ వస్తోంది. అయితే ఇప్పుడు మాత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో వార్తల్లో నిలవడమే ఆసక్తిని కలిగిస్తోంది. నేడో రేపో ఫిల్మ్ అవార్డ్స్ గురించి నోటిఫికేషన్ వస్తుందని అందరూ ఎదురుచూస్తున్న తరుణంలో సీఎం చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరో పక్క ఈ అవార్డుల గురించి చర్చించేందుకు మేం ముఖ్యమంత్రిని కలిసేందుకు ప్రయత్నించాం, కానీ వీలు కాలేదు అనే మాట కొంతమంది సినిమా పెద్దల చెబుతున్నారు.

సినిమా పండుగలా పురస్కారాల వేడుక

నంది పురస్కారాలను చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుంది. ప్రతి ఏటా ఉగాది నాడు నంది పురస్కారాల ప్రదానోత్సవం ఆనవాయితీగా వస్తోంది. ఆ వేడుకను ఇండస్ట్రీ మొత్తం పండుగలా జరుపుకునేది. అయితే 2014లో తెలంగాణ ఏర్పడ్డాక అప్పటి ప్రభుత్వం నంది పురస్కారాల స్థానే 'సింహ' పేరుతో కొత్తగా పురస్కారాలను ఇవ్వనున్నట్లు ప్రకటించింది. నామినేషన్లను సైతం స్వీకరించింది. కానీ దశాబ్ద కాలంలో సినీ ప్రముఖులు ఎన్ని విన్నపాలు చేసినా అది కార్యరూపం మాత్రం దాల్చలేదు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకనో సినీ పురస్కారాలపై ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నంది పురస్కారాలను ఇచ్చే సంప్రదాయాన్ని మళ్లీ కొనసాగించాలంటూ పలు వేదికలపై నుంచి చిత్ర పరిశ్రమ తరపున సినీ సంఘాలు, కొంతమంది సినీ ప్రముఖులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొంత ఒత్తిడి తెచ్చే ప్రయత్నం కూడా చేశారు. జనవరిలో ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణ సభలో 'గద్దర్ అవార్డ్స్' పేరుతో సినీ పురస్కారాలను ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీని అమలుపై అభిప్రాయాలు, సలహాలు అందించాలని చిత్ర పరిశ్రమ పెద్దలను కోరారు. సినీ ప్రముఖులు సైతం ముఖ్యమంత్రి నిర్ణయాన్ని అభినందించి, మద్దతు తెలిపారు. తర్వాత మాత్రం ఎలాంటి కదలికా లేదు. కానీ మంగళవారం నాడు ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో నంది పురస్కారాల అంశం అనూహ్యంగా తెరపైకి వచ్చింది.

గద్దర్ పేరుతో అవార్డులు ఇష్టం లేదా?

ఏకంగా ముఖ్యమంత్రే బహిరంగంగా అసంతృప్తిని వ్యక్తం చేసే దాకా పరిస్థితి వచ్చిందంటే చిత్ర పరిశ్రమలోని సంఘాలు, సినీ ప్రముఖులు ఏం చేసుంటారు అనే చర్చ జరుగుతోంది. సినిమావాళ్లు బయటపడలేదు గానీ గద్దర్ పేరుతో పురస్కారాలను స్వీకరించడం ఇష్టంలేదనే చర్చ అప్పట్లోనే బహిరంగంగా నడిచింది. ఆ కారణంతోనే సినీ ప్రముఖులు సీఎంను కలసి పురస్కారాల విషయంపై సంప్రదింపులు జరపలేదనే మాట వినిపిస్తోంది. పరిశ్రమ నుంచి ఒక కమిటీగా ఏర్పడి ముఖ్యమంత్రిని కలిసే ప్రయత్నం చేయకపోవడం అలాంటి అభిప్రాయాలకు ఊతమిచ్చింది. 'సినిమా వాళ్లే రాలేదు' అని సీఎం అంటే 'ముఖ్యమంత్రి అపాయిట్‌మెంట్ దొరకలేదన్'నేది సినీ పెద్దలు మాట. జరిగిందేదో జరిగిపోయింది, సినీ ప్రముఖులు, ముఖ్యమంత్రి కలసి పురస్కారాల అంశాన్ని ఓ కొలిక్కితేవాలనేదే ఇప్పుడు పరిశ్రమ ఆకాంక్ష.

స్వయంగా పిలిచినా స్పందించలేదు



నంది పురస్కారాలకు మల్లే తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఇవ్వాలనుకుంటోంది. నా అంతట నేనే అడిగినా, ఎవరూ ముందుకు రావడం లేదు. ఇది సరికాదు. పురస్కారాల విషయంలో సినీ పరిశ్రమ మౌనంగా ఉంటోంది. గద్దర్ జయంతి సందర్భంగా డిసెంబర్ 9న సినీ పురస్కారాలను ఇవ్వడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉందని గతంలో చెప్పాను. ఈ విషయాన్ని మరోసారి తెలుగు పరిశ్రమకు గుర్తు చేస్తున్నాను. మీ విజ్ఞప్తి కంటే ముందే ఒక అడుగు ముందుకేసి ప్రకటన చేశాను. ప్రతిపాదనతో రావాలని పరిశ్రమ వర్గాలను కోరాను. కారణాలేమిటో తెలియదు కానీ సినీ ప్రముఖులు ఇప్పటివరకూ ప్రభుత్వాన్ని సంప్రదించలేదు. తెలుగు చిత్ర పరిశ్రమ కృషి, విజయాలకు గౌరవంగా గద్దర్ అవార్డులను ప్రకటించాం. సినీ పరిశ్రమ పెద్దల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరం. ఇప్పటికైనా పరిశ్రమ పెద్దలు ముందుకు వస్తే అందరం కలసి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్దాం.

- ఏ. రేవంత్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి

ఆ బాధ్యత ఫిలిం ఛాంబర్ తీసుకోవాలి



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు చొరవ తీసుకొని సినిమా అవార్డులను పునరుద్ధరించే నిర్ణయం తీసుకోవడం సంతోషకరం. ప్రజా కళాకారుడు గద్దర్ గారి పేరు మీదుగా, ప్రతి ఏటా 'గద్దర్ అవార్డ్స్' తెలంగాణ ప్రభుత్వం తరపున ఇస్తామని వారు ప్రకటించారు. తెలుగు పరిశ్రమ తరపున, ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలి.

- చిరంజీవి

గద్దర్ అవార్డ్స్‌పై అభ్యంతరం లేదు



మేం ముఖ్యమంత్రిని కలిసేందుకు పలుమార్లు ప్రయత్నించాం. కానీ సీఎంఓ నుంచి మాకు పిలుపు రాలేదు. అందువల్లే ముఖ్యమంత్రిని కలవలేకపోయాం. గద్దర్ పేరుతో అవార్డ్స్ తీసుకోవడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. సీఎం ఎప్పుడు పిలిచినా వెళ్లి కలుస్తాం.

- నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

సీఎంను కలిసిన సినీ నటుడు అర్జున్



సీఎం రేవంత్‌రెడ్డిని సినీ నటుడు అర్జున్ మంగళవారంనాడు ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా.. సంత్ శ్రీరామ్‌రావ్ జయంతి సందర్భంగా బుధవారంనాడు నిర్వహిస్తున్న మహా హోమంకు రావాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కోరారు. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్లో కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు.

రాణీగా గర్వపడుతున్నాను



విభిన్నమైన పాత్రలతో కథానాయికగా తనదైన పంథాలో కొనసాగుతున్నారు తాప్సీ. 'ఫిర్ అయా హసీన్ దిల్‌రుబా' చిత్రంతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. గతంలో వచ్చిన 'హసీన్ దిల్‌రుబా' చిత్రానికి ఇది కొనసాగింపు. అందులో ఆమె రాణి అనే గృహిణి పాత్రలో కనిపించారు. ఇప్పుడు రెండో భాగంలోనూ అదే పాత్రలో కనిపించనున్నారు. 'ప్రతినాయక ఛాయలున్న పాత్ర కావడం వల్ల కొంతమందికి నచ్చలేదు. నాకు బాగా నచ్చింది. ఇలాంటి పాత్రను పోషించినందుకు గర్వపడుతున్నాను' అని తాప్సీ పేర్కొన్నారు. ఆగస్టు 9న ఈ చిత్రం ఓటీటీలో విడుదలవుతోంది.



ప్రొడ్యూసర్ టాక్

ప్రతి శుక్రవారం కొన్ని సినిమాలను విడుదల చేయడం తెలుగు చిత్రపరిశ్రమలో ఒక ఆనవాయితీ. ఆ ఒక్కరోజుతోనే చాలా మంది సినిమావాళ్ల జాతకాలు మారిపోతుంటాయి. అందుకే శుక్రవారం కోసం చిత్ర ప్రముఖులతో పాటు ప్రేక్షకులూ ఆశగా ఎదురుచూస్తుంటారు. ఈ శుక్రవారం కూడా అశ్విన్‌బాబు హీరోగా నటించిన 'శివం భజే' చిత్రం గురువారం, రాజ్ తరుణ్ హీరో పాత్ర పోషించిన 'తిరగబడరా సామీ' సినిమా శుక్రవారం విడుదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా చిత్రాల నిర్మాతలు మల్కాపురం శివకుమార్, మహేశ్వరరెడ్డి మూలి మీడియాతో ముచ్చటించారు.

'తిరగబడరా సామీ'లో కంటెంట్ బాగుంటుంది



భార్యాభర్తలు మూడు ముళ్ల బంధానికి ఎలా కట్టుబడి ఉండాలో సినిమాలో చూపించామనీ, కంటెంట్ బాగుంటుందనీ నిర్మాత మల్కాపురం శివకుమార్ చెప్పారు.

- సైలెంట్‌గా ఉన్న వ్యక్తిని వైలెంట్‌గా మార్చేవి పరిస్థితులే. ఈ కథలో అలాంటి పరిస్థితులే ఉంటాయి. ఒక సాధారణ యువకుడు పరిస్థితుల ప్రాబల్యంతో ఎలా మారాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. రాజ్ తరుణ్ అద్భుతంగా నటించాడు.
- ప్రతి సినిమాతో కొత్త వారిని పరిచయం చేయాలన్నది నా ఉద్దేశం. గత సినిమాల్లో లాగానే ఈ చిత్రంతో మాల్వీ మల్హోత్రా హీరోయిన్‌గా పరిచయమవుతోంది.

> **సినిమా అంటే ప్రేమతో చిత్రపరిశ్రమలోకి వచ్చాను. కానీ ఇక్కడ సంపాదించింది ఏమీ లేదు. కాకపోతే మనం బతుకుతూ పదిమందిని బతికించే ఏకైక పరిశ్రమ ఇది. సినిమా సక్సెస్ అయితే దాని మీద ఆధారపడిన ఎన్నో జీవితాలు బాగుంటాయి.**

- మన్నారా చోప్రా ఇందులో నెగెటివ్ ఫీమేల్ లీడ్ చేసింది. ఆ పాత్రకు ఆమె యాప్ట్. సినిమా అంతా ఉంటుంది.
- ఈ సినిమా షూటింగ్ దాదాపుగా జహీరాబాద్‌లో చేశాం. అది మా నేటివ్ ప్లేస్. చాలా సరదాగా వర్క్ జరిగింది.
- దర్శకుడు రవికుమార్ చౌదరి చాలా హార్డ్ వర్క్ చేశారు. చెప్పినదానికంటే అద్భుతంగా తీశారు. వెరీగుడ్ డైరెక్టర్.
- జేడీ చక్రవర్తి, నరేశ్ అగస్త్య , సీరత్‌కపూర్‌తో ఓ సినిమా జరుగుతోంది. శ్రవణ్ అనే కొత్త దర్శకుడిని పరిచయం చేస్తున్నా. అలాగే రాహు కేతు అనే వెబ్ సిరీస్ కూడా చేస్తున్నాం.

ట్రైలర్ చూసి వెంకటేశ్ మెచ్చుకున్నారు



హీరో అశ్విన్‌బాబు, తన పుట్టినరోజు ఆగస్టు ఒకటిన కావడం వల్ల అదే రోజు సినిమా విడుదల చేయడం లేదనీ, అన్ని రకాలుగా అనుకూలంగా ఉండడం వల్ల ఆ రోజు విడుదల చేస్తున్నామనీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. ఆయన చెప్పిన వివరాలు ఇవి.

- మున్ముందు పెద్ద సినిమాలు రాబోతున్నాయి. అందుకే ఈ వారం విడుదల చేయడమే కరెక్ట్ అని నిర్మాతగానే కాకుండా డిస్ట్రిబ్యూటర్‌గా కూడా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను.
- విక్టరీ వెంకటేశ్ మా ట్రైలర్ చూసి మెచ్చుకున్నారు. ఆయనకి, అశ్విన్‌కు క్రికెట్ పరంగా మంచి రిలేషన్ ఉంది. ట్రైలర్ చూసి బాగుందని ఆయన మెచ్చుకున్నారు.
- ఈ సినిమాకు సంగీత దర్శకుడు వికాసే హీరో. 'హిడింబ' చిత్రం చూసి ఆయన్ని తీసుకున్నాం. మంచి పాటలు, అద్భుతమైన ఆర్ఆర్ ఇచ్చారు.
- 'శివం భజే' హిట్ అయితే తమిళంలో రీమేక్ చేస్తాం. ఐవీ కృష్ణమూర్తి టీమ్‌తో ఓ సినిమా ప్లాన్ చేస్తున్నా. కార్తికేయతో కూడా చిత్రం చేయాలనుకుంటున్నాం.

> **కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. ఐదారు జానర్లు కలిపినట్టు ఉంటుంది. అందరినీ ఆకట్టుకొనే అంశాలు చాలా ఉన్నాయి. క్వాలిటీ, కంటెంట్ కోసం అనుకున్న దానికంటే ఎక్కువే ఖర్చు పెట్టాను.**



స్వాతంత్ర్యం వచ్చాక ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన ప్లేయర్ మను భాకర్. అంతకుముందు బ్రిటిష్ ఇండియన్ నార్మన్ ప్రిచర్డ్ 1900 పారిస్ గేమ్స్ లో రెండు రజతాలు సాధించాడు.



ఎయిర్ పిస్టల్ విభాగంలో తొలి పతకం సాధించిన షూటర్‌గా మను భాకర్

1

ఒలింపిక్స్‌లో తొలి టీమ్ మెడల్ సాధించిన షూటింగ్ జోడీగా మను-సరబ్‌జోత్

'అభిమానులను నిరాశపర్చను'

ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధిస్తానని నేనేమాత్రం ఊహించలేదు. ఎవరికైనా ఇక్కడ మెడల్ సాధించాలనే కల ఉంటుంది. కానీ నేను రెండు సాధించాను. అలాగే శుక్రవారం మరో మ్యాచ్ ఆడాల్సి ఉంది. అందులోనూ గెలిస్తే అంతకు మించిన ఆనందం ఏముంటుంది? ఇలాగే ప్రజలంతా నాపై ప్రేమను కురిపించాలి. వారిని నిరాశపర్చనే అనుకుంటున్నా. టోక్యోలో ఓటమి తర్వాత ఈ పతకం విలువ తెలిసొచ్చింది. గతాన్ని వదిలేసి ముందుకు కదిలి ఫలితం సాధించాను.

- మను భాకర్

ఒలింపిక్స్‌లో 'ద్వి'పతక వీరులు

అథ్లెట్	విభాగం	పతకం	ఏడాది
సుశీల్ కుమార్	రెజ్లింగ్	కాంస్యం	2008
సుశీల్ కుమార్	రెజ్లింగ్	రజతం	2012
పీవీ సింధు	బ్యాడ్మింటన్	రజతం	2016
పీవీ సింధు	బ్యాడ్మింటన్	కాంస్యం	2021
మను భాకర్	షూటింగ్	కాంస్యం	2024
మను భాకర్	షూటింగ్	కాంస్యం	2024

మిక్స్‌డ్ టీమ్‌లో కాంస్యం సాధించిన మను భాకర్, సరబ్‌జోత్‌కు శుభాకాంక్షలు. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గా నిలిచిన మను చరిత్ర సృష్టించింది. భవిష్యత్‌లో ఇద్దరికీ మరిన్ని విజయాలు లభించాలి.

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మన షూటర్లు దేశం గర్వించదగ్గ ప్రదర్శన కొనసాగిస్తూనే ఉన్నారు. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం సాధించిన మను, సరబ్‌జోత్‌కు అభినందనలు. ఇద్దరూ అద్భుత నైపుణ్యం, టీమ్ వర్క్‌ను కనబరిచారు. మను అకుంఠిత దీక్ష, అంకితభావంతో రెండో పతకం సాధించింది.

- ప్రధాని నరేంద్ర మోదీ

మనుమాన్వితం

రెండో పతకంతో భాకర్ చరిత్ర

10మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో మూడో స్థానం



సరబ్‌జోత్‌తో కలిసి కాంస్యం కైవసం

అంచనాలు తప్పలేదు.. మను భాకర్ మళ్లీ సాధించింది.. 2016, 2020 ఒలింపిక్స్‌లో ఎంత మంది షూటర్లు బరిలోకి దిగినా ఒక్క పతకానికీ నోచుకోలేకపోయారు. కానీ ఈసారి రెండు రోజుల వ్యవధిలోనే దేశ ప్రజల సంతోషాన్ని మను 'డబుల్' చేసింది. చరిత్రను తిరగరాస్తూ పాల్గొన్న రెండో ఈవెంట్‌లోనూ కాంస్యం పట్టేసింది. సహచర షూటర్ సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి 10మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కొరియా అథ్లెట్లకు షాకిస్తూ మూడో స్థానంలో నిలిచింది. తద్వారా స్వతంత్ర్య భారతావనిలో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన ఏకైక క్రీడాకారిణిగా వహ్వా.. అనిపించుకుంది. మరోవైపు షూటింగ్ టీమ్ ఈవెంట్‌లోనూ దేశానికిదే తొలి పతకం.

పారిస్: కెరీర్‌లో కనీసం ఒక్క ఒలింపిక్ పతకమైనా దక్కించుకోవాలని ప్రతీ అథ్లెట్ తపిస్తుంటాడు. కానీ 22 ఏళ్ల యువ షూటర్ మను భాకర్ అంతకుమించే సాధించింది. రెండు రోజుల వ్యవధిలోనే రెండో కాంస్యంతో ఔరా.. అనిపించింది. నాలుగో రోజు మంగళవారం 10మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ కాంస్య పతక పోరులో మను భాకర్, సరబ్‌జోత్ సింగ్ జోడీ విజేతగా నిలిచింది. ఇది దేశానికి రెండో మెడల్ కాగా.. ఈ రెండింట్లోనూ 22 ఏళ్ల మను భాకర్ పాత్ర ఉండడం విశేషం. ఆదివారం మహిళల 10మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో మను కాంస్యం సాధించిన విషయం తెలిసిందే. మరోవైపు 22 ఏళ్ల సరబ్‌కిది తొలి ఒలింపిక్ మెడల్. ఇక షూటింగ్ విభాగంలో భారత్‌కిది ఆరో పతకం. మరోవైపు ఈ విభాగంలో సెర్బియాకు చెందిన జొరాన అరునోవిచ్-దామిర్ మికెక్ 16-14 తేడాతో తుర్కియే జోడీ సెవ్వాల్ టర్హాన్-యూసుఫ్‌పై గెలిచి స్వర్ణం సాధించింది. ఇదిలావుండగా మను భాకర్ శుక్రవారం జరిగే 25మీ. పిస్టల్ ఈవెంట్‌లోనూ పోటీపడనుంది.

సరబ్‌జోత్ అదుర్స్: కాంస్య పతక ప్లేఆఫ్స్‌లో మను-సరబ్‌జోత్ జోడీ 16-10 తేడాతో కొరియాకు చెందిన ఓహ్ యే జిన్-లీ వొనోహోలను ఓడించింది. ఈ కీలక పోరులో భారత జోడీ సమన్వయంతో ముందుకు సాగింది. ఒకరు వెనుకబడిన వేళ మరొకరు గురి తప్పకుండా పిస్టల్‌ను పేల్చడంతో పతకాన్ని దక్కించుకోగలిగారు. ముఖ్యంగా సరబ్ చివర్లో గురి తప్పని షాట్‌తో అదరగొట్టాడు. ఓపెనింగ్ షాట్‌ను మను 10.2తో దీటుగా ఆరంభించినా, సరబ్‌జోత్ 8.6తో జట్టు 18.8 పాయింట్లతో వెనుకబడింది. అటు కొరియన్స్ 20.5తో దూసుకెళ్లడంతో పాటు 2-0తో వారిదే పైచేయి అయ్యింది. కానీ ఆ తర్వాత పుంజుకున్న సరబ్ 10.5, 10.4, 10 స్కోరు కారణంగా టీమ్ ఆరు పాయింట్లను సొంతం చేసుకోగలిగింది. అటు మను భాకర్ తన తొలి ఏడు షాట్లలో ఇన్నర్ 10ను సాధించి తోడ్పాటునందించింది. వ్యక్తిగత విభాగంలో స్వర్ణం సాధించిన ఓహ్ యే తన నిలకడైన ప్రదర్శనతో తమ జట్టును 2-8 నుంచి 10-14 పాయింట్లకు చేర్చి ఉత్కంఠ పెంచింది. అయితే ఫైనల్ షాట్‌లో యే జిన్ 9, లీ వొనొహో 9.5కి పరిమితమయ్యారు. తీవ్ర ఒత్తిడిలో మను 9.4 స్కోరు చేయగా అటు సరబ్‌జోత్ మాత్రం చక్కటి ఏకాగ్రతతో 10.2 స్కోరుతో కాంస్యాన్ని ఖాయం చేశాడు. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్స్‌లో మొదట ఏ జోడీ 16 పాయింట్లు సాధిస్తుందో వారే విజేతలుగా నిలుస్తారు.

నిరాశపరిచిన పృథ్వీరాజ్: పురుషుల ట్రాప్ అర్హత పోటీల్లో పృథ్వీరాజ్ తొండైమాన్ 21వ స్థానంలో నిలిచాడు. రెండు రోజుల పాటు జరిగిన ఐదు రౌండ్స్‌లో తను 118/125 స్కోరు సాధించాడు. ఈ ఈవెంట్‌లో టాప్-6 మాత్రమే ఫైనల్స్‌కు వెళతారు. అలాగే మహిళల ట్రాప్ ఈవెంట్ తొలిరోజు పోటీల్లో రాజేశ్వరి కుమారి 21, శ్రేయాసి సింగ్ 22వ స్థానాల్లో నిలిచారు.

పతకాల పట్టిక



దేశం	స్వ	ర	కా	మొ
జపాన్	7	2	4	13
చైనా	6	6	2	14
ఫ్రాన్స్	5	8	4	17
ఆస్ట్రేలియా	5	4	0	9
కొరియా	5	3	3	11
అమెరికా	4	8	10	22
బ్రిటన్	3	5	3	11
ఇటలీ	2	4	3	9
కెనడా	2	2	2	6
హాంకాంగ్	2	0	1	3
భారత్	0	0	2	2

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

అంతులేని నిర్వేదం.. అవధుల్లేని ఆనందం

మూడు రోజుల క్రితమే త్రుటిలో చేజారిన పతకం.. చెదిరిన ఒలింపిక్ స్వప్నం.. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరికైనా తీవ్ర నైరాశ్యం ఆవరిస్తుంది. కానీ, రైతుబిడ్డ సరబ్‌జోత్ సింగ్ మాత్రం పడిలేచిన కెరటంలా ఎగిశాడు.. మను భాకర్‌తో కలసి పారిస్ మెగా క్రీడల్లో దేశానికి రెండో పతకాన్ని అందించి సగర్వంగా నిలిచాడు. పాల్గొన్న తొలి ఒలింపిక్స్‌లోనే తొలుత అంతులేని నిర్వేదాన్ని.. ఆనక ప్రపంచాన్నే జయించానన్న సంతోషాన్ని 22 ఏళ్ల వయసులోనే సింగ్ చవిచూశాడు.

ఫుట్‌బాలర్ అవుదామని..: హరియాణాలోని అంబాలా సమీపంలో ధేన్ గ్రామానికి చెందిన జతీందర్ సింగ్, హర్దీప్ కౌర్ దంపతులకు 2001లో సరబ్‌జోత్ జన్మించాడు. తండ్రి చిన్న రైతు. సరబ్..చిన్నప్పుడు ఫుట్‌బాలర్ కావాలనే అనుకొన్నా.. ఏదో గందరగోళంలో ఉండేవాడు. అయితే, 13 ఏళ్ల వయసులో సమ్మర్ క్యాంప్‌లో కొందరు పిల్లలు ఎయిర్ గన్‌తో షూటింగ్ ప్రాక్టీస్ చేయడం చూసి అటువైపు ఆకర్షితుడయ్యాడు. వెంటనే తన తండ్రి వద్దకు వెళ్లి తానూ షూటర్‌నవుతానని చెప్పడంతో ఆయన ఒక్కసారిగా అవాక్కయ్యాడు. పైగా తన ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో ఏం చేయాలో పాలుపోలేదు. అయితే, సరబ్‌జోత్ పట్టువీడక పోవడంతో కొడుకు కల కోసం ఎన్ని కష్టాలనైనా ఎదుర్కోవాలన్న నిర్ణయానికి వచ్చాడు. అమెరికాలో ఉన్న సరబ్‌జోత్ తాత కూడా ఆర్థిక తోడ్పాటునందించడంతో ఇక వెనుదిరిగి చూడలేదు. 2016లో అంబాలోని అభిషేక్ రాణా అకాడమీలో శిక్షణ కోసం రోజూ 35 కిలోమీటర్లు బస్సులో ప్రయాణించి వెళ్లేవాడు. కొద్దిరోజుల్లో మెళకువలు నేర్చుకొన్న సింగ్.. జాతీయ షూటింగ్ పోటీల్లో కాంస్యం సాధించాడు. 2019లో జూనియర్ వరల్డ్ కప్‌లో స్వర్ణ పతకంతో అందరి దృష్టినీ ఆకర్షించాడు. కెరీర్‌లో వడివడిగా ఎదిగిన సింగ్.. 2021లో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో వ్యక్తిగత, టీమ్ ఈవెంట్‌లో పసిడి పతకాలు కొల్లగొట్టాడు. గత ఆసియా క్రీడల్లో టీమ్ స్వర్ణంతోపాటు మిక్స్‌డ్‌లో రజతం సాధించాడు. ఇప్పుడు ఏకంగా ఒలింపిక్ పతకంతో మురిశాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

సిమోన్ బృందానికి స్వర్ణం



పారిస్: స్టార్ జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్ పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణంతో బోణీ కొట్టింది. తనదైన ప్రదర్శనతో అమెరికా జట్టును చాంపియన్‌గా నిలబెట్టింది. బైల్స్, సుని లీ, జోర్డాన్ చిలిస్, జేడ్ క్యారీ, హెల్లీ రివెరాలతో కూడిన అమెరికా జట్టు మహిళల ఆర్టిస్టిక్ టీమ్ ఆల్‌రౌండ్ విభాగం ఫైనల్లో ఓవరాల్‌గా 171.296 స్కోరు చేసి ప్రథమస్థానంలో నిలిచింది. ప్రిలిమినరీ రౌండ్లో గాయంతోనే బరిలోకి దిగిన బైల్స్.. ఫైనల్స్‌లో మాత్రం పూర్తి ఫిట్‌గా కనిపించింది. తుదిపోరులో వాల్ట్, అన్‌ఈవెన్ బార్స్, బ్యాలెన్స్ బీమ్, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ ఈవెంట్లలో పోటీపడి సత్తాచాటింది. ఇటలీకి రజతం, బ్రెజిల్‌కు కాంస్యం దక్కాయి.

పారిస్‌లో నేటి భారతం



షూటింగ్: పురుషుల 50 మీ. రైఫిల్ త్రీ పొజిషన్స్ క్వాలిఫికేషన్స్: ఐశ్వరీ ప్రతాప్‌సింగ్ తోమర్, స్వప్నిల్ కుశాలె (మ. 12.30); మహిళల ట్రాప్ క్వాలిఫికేషన్స్ రౌండ్ 2- శ్రేయాసి సింగ్, రాజేశ్వరీ కుమారి (మ. 12.30).

బ్యాడ్మింటన్: మహిళల సింగిల్స్ గ్రూప్ మ్యాచ్: పీవీ సింధు x క్రిస్టిన్ కూబా (ఎస్తోనియా) (మ. 12.50); పురుషుల సింగిల్స్ గ్రూప్ మ్యాచ్‌లు: లక్ష్యసేన్ x జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా) (మ. 1.40), ప్రణయ్ x డక్ ఫాట్ లె (వియత్నాం) (రాత్రి 11.00).

టేబుల్ టెన్నిస్: మహిళల సింగిల్స్ రౌండ్ 32: ఆకుల శ్రీజ x జియాన్ జెంగ్ (సింగపూర్) (మ. 2.20).

బాక్సింగ్: మహిళల 75 కిలోల ప్రీక్వార్టర్స్: లవ్లీనా x సున్నివా హోఫ్‌స్తాద్ (నార్వే) (మ. 3.50); పురుషుల 71 కిలోల ప్రీక్వార్టర్స్: నిషాంత్ x జోస్ గాబ్రియెల్ (ఈక్వెడార్) (రా. 12.18).

ఆర్చరీ: మహిళల వ్యక్తిగత విభాగం ఎలిమినేషన్ రౌండ్: దీపికా కుమారి x రీనా పర్నాత్ (ఎస్తోనియా) (మ. 3.56); పురుషుల వ్యక్తిగత విభాగం ఎలిమినేషన్ రౌండ్ - తరుణ్‌దీప్ x టామ్ హాల్ (బ్రిటన్) (రా. 9.15).

ఈక్వెస్ట్రియన్: డ్రెస్సేజ్ వ్యక్తిగత గ్రాండ్ ప్రీ: అనూష్ అగర్వాల (మ. 1.30).

అప్పుడు విలన్ అన్నారు: రాణా



శిష్యురాలు మను పతకం సాధించడంతో.. కోచ్ జస్పాల్ రాణా ముఖం ఎనలేని ఆనందంతో వెలిగిపోతోంది. అయితే, టోక్యోలో భాకర్ వైఫల్యానికి తానే కారణమంటూ ఎదురైన దూషణలను గుర్తు చేసుకొని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. అప్పుడు నన్ను విలన్ అన్నవారే.. ఇప్పుడు తన ఇంటర్వ్యూల కోసం ఎగబడుతున్నారని చెప్పాడు. మూడేళ్లుగా జాతీయ రైఫిల్ సంఘం లేదా మరో క్రీడా సంస్థ కానీ తనకు ఒక్క రూపాయి కూడా జీతం చెల్లించలేదన్నాడు. తన పని పూర్తయిందనీ, ఇకపై నెల గడిచేందుకు తాను ఉద్యోగం వెతుక్కోవాల్సి ఉందని తెలిపాడు. 'నేనెవరికీ చెందిన వాడిని కాను. మను నా సాయాన్ని కోరింది. అదే చేశాను. మూడేళ్ల నాకు జీతం అందడం లేదనే విషయం ప్రజలకు తెలియాల'ని రాణా చెప్పాడు.

ఏడు నెలల గర్భంతో బరిలోకి..



ఏడు నెలల గర్భిణి పారిస్ ఒలింపిక్స్‌లో కత్తి చేతబూని పతకం కోసం యుద్ధం చేసింది. ఈజిప్టుకు చెందిన ఫెన్సర్ నడా హఫీజ్ ప్రస్తుతం ఏడు నెలల బిడ్డను కడుపులో మోస్తోంది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన సోషల్ మీడియా ఖాతాలో తెలియజేసింది. 26 ఏళ్ల నడా సోమవారం జరిగిన పోటీల్లో అమెరికా ఫెన్సర్ ఎలిజబెత్ టార్టకోవ్స్కీపై నెగ్గి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించింది. అయితే ఆ తర్వాతి రౌండ్‌లో పరాజయం పాలైంది. వైద్య విద్యను అభ్యసించిన నడా మాజీ జిమ్నాస్ట్ కూడా. నడా ఇప్పటిదాకా మూడుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొంది.

హాకీలో క్వార్టర్స్ చేరినట్టే!

ఐర్లాండ్‌పై భారత్ విజయం



హర్మన్‌ప్రీత్

టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకంతో చరిత్ర సృష్టించిన భారత పురుషుల హాకీ జట్టు పారిస్‌లోనూ పతకం దిశగా దూసుకెళ్తోంది. తమ గ్రూప్-బిలో వరుసగా మూడో మ్యాచ్‌ను ఓటమి లేకుండా ముగించింది. ఆరంభంలో న్యూజిలాండ్‌పై గెలిచి, తర్వాత అర్జెంటీనాతో పోరును డ్రాగా ముగించిన భారత్.. మంగళవారం ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ మరోసారి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకోవడంతో భారత్ 2-0తో ఐర్లాండ్‌ను చిత్తుచేసింది. మ్యాచ్‌లో నమోదైన రెండు గోల్స్‌ను హర్మన్‌ప్రీత్ 13వ, 19వ నిమిషాల్లో చేశాడు. ప్రథమార్థం ముగిసేసరికే 2-0తో ముందంజలో నిలిచిన భారత్.. చివరిదాకా ఆధిక్యాన్ని కాపాడుకొని పైచేయి సాధించింది. రెండు విజయాలు, ఓ డ్రాతో మొత్తం 7 పాయింట్లను ఖాతాలో వేసుకున్న భారత్ ప్రస్తుతం గ్రూప్-బి నుంచి టాపర్‌గా కొనసాగుతోంది. ఈ క్రమంలో మరో రెండు మ్యాచ్‌లు మాత్రమే మిగిలున్న భారత్.. క్వార్టర్‌ఫైనల్ బెర్త్‌ను దాదాపు ఖరారు చేసుకున్నట్టే. ఈ గ్రూప్‌లో వరుసగా మూడో ఓటమితో ఐర్లాండ్ క్వార్టర్స్ రేస్ నుంచి పూర్తిగా నిష్క్రమించగా.. బెల్జియం, ఆస్ట్రేలియా చెరో రెండు విజయాలతో ఆరేసి పాయింట్లతో సంయుక్తంగా రెండోస్థానంలో ఉన్నాయి. రెండు గ్రూప్‌ల నుంచి తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్స్‌కు అర్హత సాధిస్తాయి. తదుపరి పోరులో భాగంగా గురువారం బెల్జియంతో ఆడనున్న భారత్.. గ్రూప్‌లో ఆఖరిదైన ఐదో మ్యాచ్‌ను శుక్రవారం ఆస్ట్రేలియాతో తలపడనుంది.

'టాప్' లేపిన సాత్విక్ జోడీ



అశ్విని జంట ఇంటికి..

బ్యాడ్మింటన్ డబుల్స్‌లో హాట్ ఫేవరెట్ హోదాకు న్యాయం చేస్తూ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జోడీ వరుస విజయాలతో సత్తా చాటుతోంది. ఇప్పటికే క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించిన ఈ భారత జంట.. గ్రూప్-సిలో టాపర్‌ను నిర్ణయించే కీలకమ్యాచ్‌లోనూ అదరగొట్టింది. మంగళవారం జరిగిన పోరులో మూడోసీడ్ సాత్విక్-చిరాగ్ జంట 21-13, 21-13తో ఇండోనేసియాకు చెందిన మహ్మద్ అర్డియాంటో-ఫజర్ అల్ఫియాన్‌ను ఓడించింది. దీంతో ఓటమన్నదే లేని సాత్విక్ ద్వయం గ్రూప్-సిలో టాపర్‌గా నిలిచింది. తొలి మ్యాచ్‌లో గెలిచిన సాత్విక్ జంట.. సోమవారం ఆడాల్సిన రెండో మ్యాచ్‌లో ప్రత్యర్థి జోడీ గాయంతో తప్పుకోవడంతో క్వార్టర్స్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఇక మూడో మ్యాచ్‌లోనూ నెగ్గడంతో భారత ద్వయం ఓటమన్నదే లేకుండా తమ గ్రూప్‌లో టాప్ స్థానాన్ని దక్కించుకుంది. గ్రూప్-సి నుంచి ఇండోనేసియా జోడీ రియాన్-ఫజర్ రెండోస్థానంతో క్వార్టర్స్ చేరింది. క్వార్టర్స్‌లో ఎవరితో ఆడతారనేది బుధవారం తేలనుంది. మహిళల డబుల్స్‌లో భారత ద్వయం అశ్విని పొన్నప్ప-తనీషా క్యాస్ట్రో పోరాటం ముగిసింది. గ్రూప్-సిలో వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓడి నాకౌట్ రేస్ నుంచి నిష్క్రమించింది. గ్రూప్ చివరి మ్యాచ్‌లో అశ్విని జోడీ 15-21, 10-21తో ఆస్ట్రేలియా జంట సెత్యానా-ఏంజెలా చేతిలో ఓటమి పాలైంది.

ప్రియుడితో నైట్ అవుట్.. పోటీల నుంచి గెట్ అవుట్



తన పోటీలకు ముందురోజు ప్రియుడితో కలిసి దొంగచాటుగా బయటికి వెళ్లిన 22 ఏళ్ల బ్రెజిల్ మహిళా స్విమ్మర్‌ను ఇంటికి పంపేశారు. క్రీడాగ్రామం నుంచి బయటకు వెళ్లకూడదనేది క్రీడాకారులందరికి వర్తించే ప్రధాన నియమం. ఆ నియమాన్ని పాటించని బ్రెజిల్ స్విమ్మర్ అనా కరోలినా వియిరాను ఒలింపిక్స్ విలేజ్ నుంచి వెనక్కి పంపించారు. కరోలినా, ఆమె ప్రియుడు గాబ్రియెల్ శాంటోస్‌లిద్దరూ బ్రెజిల్ ఒలింపిక్ స్విమ్మింగ్ రిలే 4x100 మీటర్ల జట్లలోని సభ్యులు. ఈ ఘటనపై ఆమె ప్రియుడు శాంటోస్ క్షమాపణలు కోరడంతో అతడిని మందలింపుతో వదిలేశారు. అయితే కరోలినా మాత్రం అధికారులతో దురుసుగా వ్యవహరించడంతో ఆమెను వెంటనే బ్రెజిల్ విమానం ఎక్కించేశారు. పోటీలకు ముందురోజు నైట్ అవుట్ చేసిన ఈ షూటు ప్రేమికులిద్దరూ తెల్లారి జరిగిన తమ ఈవెంట్ల హీట్స్‌లో ఓడారు.

అయితే ఈ ఉదంతంపై కరోలినా తీవ్రంగా స్పందించింది. 'నా వస్తువులు ఇంకా ఒలింపిక్స్ క్రీడా గ్రామంలోనే ఉన్నాయి. నేను మాత్రం విమానాశ్రయానికి చేరుకొని తిరిగి ప్రయాణమవుతున్నా. నాపై జరుగుతున్న వేధింపుల గురించి కమిటీకి ఫిర్యాదు చేశా కానీ, సమస్య పరిష్కారం కాలేదు. నేను నా లాయర్లతో మాట్లాడుతా.. వాళ్లకి అంతా చెబుతా' అని కరోలినా తెలిపింది.

మనికా రికార్డు



ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్‌లో ప్రీక్వార్టర్స్ చేరుకొన్న తొలి భారత ప్లేయర్‌గా మనికా బాత్రా చరిత్ర సృష్టించింది. రౌండ్-32లో బాత్రా 4-0తో 18వ ర్యాంకర్ ప్రీతిక పవాడే (ఫ్రాన్స్)ను ఓడించింది. ఆరంభం నుంచే దూకుడైన ఆటను ప్రదర్శించిన 28వ ర్యాంకర్ మనికా 11-9, 11-6, 11-9, 11-7తో మ్యాచ్‌ను సొంతం చేసుకొంది. కాగా, ఈ మ్యాచ్‌లో ఓడిన 19 ఏళ్ల ప్రీతిక తల్లిదండ్రులది పాండిచ్చేరి.


బల్‌రాజ్‌కు నిరాశ

రోయింగ్ సింగిల్ స్కల్స్‌లో బల్‌రాజ్ పన్వర్ పతక అవకాశాన్ని చేజార్చుకొన్నాడు. క్వార్టర్‌ఫైనల్స్ హీట్స్-4లో పన్వర్ 7 నిమిషాల 5.10 సెకన్లతో రేస్‌ను ముగించి నాలుగో స్థానంలో నిలిచాడు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికే మెడల్ రౌండ్‌కు అర్హత లభిస్తుంది. దీంతో సెమీఫైనల్స్ సి/డి కేటగిరీకి పడిపోయిన పన్వర్ 13 నుంచి 24 స్థానాల కోసం పోటీపడనున్నాడు.

పంగల్ అవుట్

ఒలింపిక్స్‌లో భారత బాక్సర్ అమిత్ పంగల్ కథ ముగిసింది. 51 కిలోల ప్రీ క్వార్టర్స్‌లో పంగల్ 1-4తో ప్యాట్రిక్ చిన్‌యంబా (జాంబియా) చేతిలో పరాజయం పాలయ్యాడు. మహిళల 57 కిలోల రౌండ్-32లో జాస్మిన్ 0-5తో నెస్తీ పెటక్లో (ఫిలిప్పీన్స్) చేతిలో ఓడింది.

గురి తప్పిన ధీరజ్



భారీ అంచనాలతో బరిలోకి దిగిన తెలుగు ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర తీవ్రంగా నిరాశపరిచాడు. పురుషుల వ్యక్తిగత విభాగంలో ధీరజ్ రెండో రౌండ్‌లోనే అవుటయ్యాడు. మంగళవారం జరిగిన రౌండ్-32లో ధీరజ్ 5-6తో ఎరిక్ పీటర్స్ చేతిలో ఓడాడు. కాగా, మహిళల ఆర్చరీ వ్యక్తిగత విభాగంలో ప్రీక్వార్టర్స్‌కు చేరుకొన్న తొలి భారత ప్లేయర్‌గా భజన్ కౌర్ రికార్డులకెక్కింది. రౌండ్-32లో కౌర్ 6-0తో వియోలెటా(పోలెండ్)పై నెగ్గింది. అంకిత 4-6తో మిస్టోర్ చేతిలో ఓడింది.

భారత్‌కు 'సూపర్' విజయం

- 3-0తో సిరీస్ క్లీన్‌స్వీప్
- స్వల్ప ఛేదనలో లంక తడబాటు



ట్రోఫీతో సూర్య

పల్లెకెలె: నామమాత్రపు మ్యాచే అయినా.. సిరీస్‌లో ఆఖరి పోరు అభిమానులను ఆకట్టుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు చేసిందే 137 పరుగులు. ఈ స్వల్ప ఛేదనలో ఆపసోపాలు పడిన శ్రీలంక చివరి రెండు ఓవర్లలో 9 పరుగులు చేయలేక మ్యాచ్‌ను టై చేసుకుంది. 19వ ఓవర్‌లో రింకూ, 20వ ఓవర్‌లో సూర్య రెండేసి వికెట్లతో అబ్బురపరిచారు. ఇక సూపర్ ఓవర్‌లో మరీ దారుణంగా లంక మూడు బంతులే ఆడి 2/2తో భారత్‌కు బ్యాటింగ్‌ను అప్పగించింది. అటు తొలి బంతినే ఫోర్‌గా మలిచిన సూర్య మ్యాచ్‌ను ముగించాడు. అలాగే సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 20 ఓవర్లలో 9 వికెట్లకు 137 పరుగులు చేసింది. లంక స్పిన్నర్ల ధాటికి 48/5 స్కోరుతో ఇబ్బందిపడిన వేళ.. గిల్ (39), పరాగ్ (26) ఆరో వికెట్‌కు 54 పరుగులు జోడించారు. చివర్లో సుందర్ (25) వేగంగా ఆడాడు. తీక్షణకు మూడు, హసరంగకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో లంక 20 ఓవర్లలో 8 వికెట్లకు 137 పరుగులే చేసింది. కుశాల్ పెరీర (46), కుశాల్ మెండిస్ (43) మాత్రమే రాణించారు. సుందర్, బిష్ణోయ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా వాషింగ్టన్ సుందర్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా సూర్యకుమార్ నిలిచారు.

సంక్షిప్త స్కోర్లు: భారత్: 20 ఓవర్లలో 137/9 (గిల్ 39, పరాగ్ 26, సుందర్ 25; తీక్షణ 3/28, హసరంగ 2/29).

శ్రీలంక: 20 ఓవర్లలో 137/8. (పెరీర 46, కుశాల్ మెండిస్ 43; సుందర్ 2/23, బిష్ణోయ్ 2/38).

రికార్డుస్థాయిలో ఎల్జీబీటీక్యూప్లస్ అథ్లెట్లు

ఈ ఒలింపిక్స్‌లో ఎల్జీబీటీక్యూప్లస్ (లెస్బియెన్, గే, బైసెక్స్‌వల్, ట్రాన్స్‌జెండర్) అథ్లెట్ల రికార్డు స్థాయిలో పాల్గొన్నారు. ఒలింపిక్స్ చరిత్రలోనే అత్యధికంగా ఈసారి 193 మంది ఎల్జీబీటీక్యూప్లస్ అథ్లెట్లు బరిలోకి దిగుతున్నారు. టోక్యో ఒలింపిక్స్‌లో వీరి సంఖ్య 186 కాగా, ఈసారి మరో ఏడుగురు పెరిగారు. సిడ్నీ (2000) ఒలింపిక్స్‌లో వీరి సంఖ్య కేవలం ఐదు మాత్రమే.

ఫ్యాషన్

భలే బెస్పోక్

రెడీమేడ్ జ్యువెలరీకి రోజులు చెల్లి కస్టమ్ మేడ్ జ్యువెలరీ వాడుకలోకొస్తే, తాజాగా 'బెస్పోక్' జ్యువెలరీ ట్రెండ్ ఊపందు కుంటోంది. అనంత్ అంబానీ పెళ్లికి నీతా అంబానీ ధరించిన 'గార్డెన్ ఆఫ్ లవ్' జ్యువెలరీ ఆ కోవకు చెందినదే! ఈ జ్యువెలరీ స్టైల్స్ మీకోసం...



కస్టమ్ మేడ్‌కూ బెస్పోక్‌కూ తేడా ఉంది. అప్పటికే అందుబాటులో ఉన్న నగను తమకు నచ్చినట్టు తయారు చేయించుకోవడం కోసం, నగ లోహం లేదా రాళ్లను మార్చుకోవడాన్ని కస్టమ్ మేడ్ అంటారు. బెస్పోక్ జ్యువెలరీలో డిజైనర్‌తో కలిసి పూర్తిగా, ప్రత్యేకంగా తమ కోసమే నగను సృష్టించుకుంటారు. ఇందుకోసం నగలో ఉపయోగించే లోహం బదులు, జాతి రాళ్లు, నగిషీలు అన్నీ ప్రత్యేకంగానే ఉంటాయి. తాజాగా నీతా అంబానీ ధరించిన బెస్పోక్ జ్యువెలరీ గార్డెన్ ఆఫ్ లవ్ కోసం అరుదైన గులాబీ, నీలం, ఆకుపచ్చ, నారింజ వజ్రాలను పూల తోటను మరిపించేలా ఒక క్రమపద్ధతిలో అలంకరించారు. ఈ నగ తయారీకి అవసర మైన జాతి రాళ్ల సేకరణకు ఏకంగా మూడేళ్ల సమయం పట్టడంతో పాటు, ఒక్కొక వజ్రాన్నీ మలచడానికి కళాకారులకు 4000 గంటల సమయం పట్టడం చెప్పుకోదగిన విశేషం. నగ మధ్యలోని హృదయాకారపు నీలం వజ్రం చుట్టూరా పోర్ట్రెయిట్ కట్ వజ్రాలను పొదిగారు. నెక్లెస్‌లోని ఒక్కొక పువ్వు చుట్టూరా అమర్చిన పోర్ట్రెయిట్ కట్ డైమండ్స్ పువ్వు కోసం ఎంచుకున్న జాతి రాళ్ల రంగులను నలుదిక్కులా వెదజల్లుతూ మిరుమిట్లుగొలిపేలా ఉండడం విశేషం.

మిస్‌మ్యాచ్ ఇయర్ రింగ్స్

రెండు చెవులకూ ఒకే రకమైన స్టడ్స్ మాత్రమే ఎందుకు ధరించాలి? ప్రత్యేకంగా కనిపించడం కోసం వినూత్నమైన స్టైల్‌ను అనుసరించాలనుకున్న నీతా గార్డెన్ ఆఫ్ లవ్ నెక్లెస్‌కు మ్యాచింగ్‌గా ఒక చెవికి పచ్చల స్టడ్, మరో చెవికి వజ్రాల స్టడ్ పెట్టుకుని అవాక్కునిపించింది. 'అదేంటి రెండు రకాల స్టడ్స్ పెట్టుకున్నారు?' అంటూ ఆ స్టైల్ గురించి సోషల్ మీడియాలో అభిమాని అడిగిన ఒక ప్రశ్నకు, 'ఎందుకు పెట్టుకోకూడదు?' అని ఎదురు ప్రశ్నించి ఆలోచనలో పడేలా చేసింది నీతా. నిజానికి ఆమె పెట్టుకున్న నెక్లెస్‌కు, మిస్‌మ్యాచ్ స్టైల్ ఎంతో బాగా సూటయింది.



మెనోపాజ్ మహిళల జీవితంలో సర్వసాధారణమైన దశ. సాధారణంగా నలభైల వయసులో నెలసరి క్రమం తప్పడంతో మొదలై... పూర్తిగా ఆగిపోయేవరకూ కొనసాగే దశను 'పెరిమెనోపాజ్' అంటారు. "పెరిమెనోపాజ్, మెనోపాజ్... ఇవి ప్రతి మహిళ జీవితాన్ని రూపాంతరీకరించే దశలు. భావోద్వేగపరంగానూ, శారీరకంగానూ ఇవి ఎన్నో సవాళ్ళు విసురుతూ ఉంటాయి. అత్యంత సహజమైన వీటి గురించి బహిరంగంగా చర్చించడానికి చాలామంది మహిళలు ఇష్టపడరు. యవ్వనాన్ని గొప్పగా, ఆరాధనీయంగా చూస్తూ, పునరుత్పాదక సామర్థ్యాలు, భౌతిక స్వరూపం ద్వారా మహిళలకు గుర్తింపునిచ్చే ధోరణులు దీనికి ప్రధాన కారణం" అంటారు ఢిల్లీకి చెందిన పోషకాహార నిపుణురాలు, 'న్యూట్రిస్టైల్ బై చాహత్' సంస్థ వ్యవస్థాపకురాలు చాహత్ వాసుదేవ్. అయితే ఈ పరిస్థితుల్లో ఇప్పుడు మార్పు కనిపిస్తోంది. తమ మెనోపాజ్ అనుభవాలను పంచుకుంటూ, తోటి మహిళల్లో అవగాహన పెంచడానికి భారతీయ సెలబ్రిటీలు ముందుకు వస్తున్నారు. వారిలో కొందరు ఏం చెబుతున్నారంటే...

దాపరికం వద్దు

మార్పులను ఆమోదించాల్సిందే...

నాలుగు పదుల వయసు దాటాక హార్మోన్లలో సమతుల్యం లోపించడం, శారీరకమైన మార్పులు అనివార్యం. చర్మం ముడతలు పడడం, బరువు పెరగడం, నియంత్రించుకోలేని ఉద్వేగాలు కలగడం... అన్నిటినీ మనం ఆమోదించాల్సిందే. ఇది మాట్లాడకూడని విషయం కాదు. మెనోపాజ్‌వల్ల జీవితం నిస్సారం అవుతుందనే వాదనను నేను అంగీకరించను. అయితే మహిళలు మరింత ఎక్కువ ఇబ్బంది పడే దశగా దీన్ని పరిగణించాలి. దీన్ని ఎదుర్కోవడానికి సిద్ధపడాలి. ఎక్కువసేపు నడవాలి. వ్యాయామం చేయాలి. ఆరోగ్యంగా ఉండాలి. మెనోపాజ్ చుట్టూ ఉన్న మూస ఆలోచనలకూ, మూఢ నమ్మకాలకూ దూరంగా ఉండాలి.



\- సుధామూర్తి (73)
రాజ్యసభ సభ్యురాలు

ఇప్పటికీ నిర్లక్ష్యమే...

ఒక్క మెనోపాజ్ గురించే కాదు, మహిళల ఆరోగ్యం, శ్రేయస్సు గురించి కూడా చర్చ చాలా అరుదుగా జరుగుతూ ఉంటుంది. విషాదం ఏమిటంటే, దేశంలో చాలామంది మహిళలకు గర్భధారణకు ముందు, గర్భిణిగా ఉన్నప్పుడు, ప్రసవించే సమయంలో, బాలింతగా ఉన్నప్పుడు... ఇలాంటి కీలక సందర్భాల్లో మాత్రమే కాదు... సాధారణ వైద్య, ఆరోగ్య సమస్యలకు కూడా సదుపాయాలు అందుబాటులో లేవు. ఇక మెనోపాజ్ సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మహిళలకు ఇది ఎంతో ప్రాధాన్యమైన అంశం. కానీ ఈ విషయంలో ఇప్పటికీ నిర్లక్ష్య ధోరణే. ఇది మహిళల సమస్య. కాబట్టి మనం దీని గురించి తప్పనిసరిగా మాట్లాడాలి. అవగాహన కల్పించాలి.



\- లారా దత్తా (46), నటి

సంకోచించకండి...

పెరిమెనోపాజ్ దశలో నేను పెద్ద యుద్ధమే చేశాను. పీరియడ్స్ మధ్య విరామం ఎక్కువగా ఉండేది. ఒక్కోసారి పీరియడ్స్ వచ్చినప్పుడు కూర్చోవడం చాలా కష్టంగా ఉండేది. హిమోగ్లోబిన్ బాగా తగ్గిపోవడంతో ఐదు నెలల పాటు ఇంజక్షన్లు చేయించుకున్నాను. అందరికీ ఇవే సమస్యలు ఉంటాయా? అంటే చెప్పలేం. ప్రతి వ్యక్తికీ భిన్నమైన ఇబ్బందులు ఎదురవుతాయి. అయితే భయపడనక్కర్లేదు. మన కుటుంబాల్లో, స్నేహితుల్లో ఈ దశను దాటిన మహిళలుంటారు. వారితో మాట్లాడితే పరిష్కారాలు దొరకవచ్చు. అవసరమైతే వైద్యులను సంప్రదించడానికి సంకోచించకూడదు.



\- నమితా థాపర్ (47)
ఈడీ, ఎమ్‌క్యూర్ ఫార్మా

ధైర్యంగా ఎదుర్కొందాం..

మెనోపాజ్ సమయంలో మహిళలు ఐడెంటిటీ క్రైసిస్‌కు గురవుతారు. స్త్రీత్వం అంటే పునరుత్పాదక సామర్థ్యం అనేది సామాజికంగా స్థిరపడిన నిర్వచనం కాబట్టి.. చాలా దగ్గిర వాళ్ళతో కూడా మెనోపాజ్ గురించి మాట్లాడ డానికి ఇష్టపడరు. కాలక్రమేణా ఎన్నో మార్పులు వస్తున్నాయి. మహిళలు అనేక బాధ్యతలను నిర్వహించాల్సి వస్తోంది. సమాజంలో తమదైన స్థానాన్ని వారు సంపాదించడానికి కష్టపడు తున్నారు. కానీ మీరు పుట్టగానే తల్లి కాదు, భార్య కాదు, కూతురు, సోదరి కూడా కాదు. మీరు మీరే అని గుర్తుంచుకోవాలి. మీకు మీరు ప్రాధాన్యాన్ని ఇచ్చుకోవాలి. మీ శ్రేయస్సు, మీ ఆరోగ్యం... ఇవే ముఖ్యం. మెనోపాజ్ మనం ధైర్యంగా ఎదుర్కోవాల్సిన దశ. ఇందులో దాచిపెట్టుకోవడానికేం లేదు.



\- టిస్కా చోప్రా (50)
నటి, రచయిత్రి



అవి పాటిస్తే మంచిది

ఆరోగ్యం పట్ల నాకు శ్రద్ధ ఎక్కువ. వర్కవుట్స్ చేస్తాను, డైట్ కచ్చితంగా ఫాలో అవుతాను. కానీ ఏడాదిన్నర క్రితం బరువు పెరగడం ప్రారంభిం చాను. ఎందుకనేది నాకు అర్థం కాలేదు. డాక్టర్ దగ్గిరికి వెళ్తే... "పెరిమెనోపాజ్‌లో ఉన్నావు" అని నిర్ధారించారు. ఆ తరువాత దాని గురించి వీడియోలు చూసి, ఆర్టికల్స్ చదివి మరింత తెలుసుకున్నాను. నా స్నేహితురాళ్ళతో, సిస్టర్స్‌తో మాట్లాడాను. ఇక వర్కవుట్స్ చెయ్యడం కష్టం కావడం, ఒత్తిడికి గురవడం లాంటి ఇబ్బందులెన్నో ఎదుర్కొన్నా. మహిళలకు చెప్పేదేంటంటే.. అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోండి. విటమిన్ స్థాయిలు సరిగ్గా ఉండేలా చూసుకోండి. వ్యాయామాలు చేయండి. ఒత్తిడిని తగ్గించుకోండి.



\- షమితా శెట్టి (45)
నటి, ఇంటీరియర్ డిజైనర్

---

150 టన్నుల బంగారం



- గత 3 నెలల్లో అమ్ముడుపోయిన పసిడి ఇది
- వార్షిక ప్రాతిపదికన 5 శాతం తగ్గిన గిరాకీ
- అధిక ధరలే కారణమన్న డబ్ల్యూజీసీ

ముంబై: ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశీయంగా పసిడి గిరాకీ 149.7 టన్నులుగా నమోదైంది. క్రితం సంవత్సరంలో ఇదే కాలానికి అమ్ముడైన 158.1 టన్నులతో పోలిస్తే మాత్రం ఈసారి డిమాండ్ 5 శాతం తగ్గింది. అధిక ధరల కారణంగా స్వర్ణాభరణాల విక్రయాలు మందగించడమే ఇందుకు ప్రధాన కారణమని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తాజా నివేదిక వెల్లడించింది. రిపోర్టులోని మరిన్ని ముఖ్యాంశాలు..

- బంగారం విలువపరంగా, గడిచిన మూడు నెలల్లో విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 17 శాతం పెరిగి రూ.93,850 కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాదిలో ఇదే సమయానికి నమోదైన పసిడి గిరాకీ రూ.82,530 కోట్లుగా ఉంది.
- ఈ ఏప్రిల్-జూన్ క్వార్టర్‌లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం రిటైల్ ధర రూ.74,000 దాటింది. గత మూడు నెలలకు దేశీయంగా మేలిమి బంగారం సగటు ధర (దిగుమతి సుంకం, జీఎస్‌టీ మినహాయించి) రూ.62,700గా నమోదు కాగా.. 2023లో ఇదే సమయానికి సగటు రేటు రూ.52,191గా ఉంది. గత 3 నెలలకు అమెరికన్ కరెన్సీలో ఔన్స్ (31.10 గ్రాములు) సగటు ధర 2,338.2 డాలర్లుగా నమోదైంది. క్రితం ఏడాదిలో ఇదే కాలానికి రేటు 1,975.9 డాలర్లుగా ఉంది.
- ఈ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆభరణాల గిరాకీ వార్షిక ప్రాతిపదికన 17 శాతం తగ్గి 106.5 టన్నులకు పరిమితమైంది. పసిడిలో పెట్టుబడుల డిమాండ్ మాత్రం 46 శాతం వృద్ధితో 43.1 టన్నులకు పెరిగింది. గోల్డ్ రీసైక్లింగ్ 39 శాతం తగ్గి 23 టన్నులుగా నమోదైంది.
- గడిచిన మూడు నెలల్లో దేశంలోకి మొత్తం 196.9 టన్నుల బంగారం దిగుమతైంది. 2023లో ఇదే సమయంతో పోలిస్తే దిగుమతులు 8 శాతం పెరిగాయి.
- ఈ ఏప్రిల్-జూన్ కాలానికి ప్రపంచ వ్యాప్త పసిడి గిరాకీ వార్షిక ప్రాతిపదికన 4.16 శాతం పెరిగి 1,258.2 టన్నులకు చేరుకుంది. ఓవర్ ది కౌంటర్ (ఓటీసీ) లావాదేవీల్లో ఆరోగ్యకరమైన వృద్ధి ఇందుకు దోహదపడింది.

ఈ ఏడాది గిరాకీ 700-750 టన్నులు

ఈసారి బడ్జెట్లో పసిడిపై సుంకాన్ని 6 శాతానికి తగ్గించిన నేపథ్యంలో జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో ఆభరణాల విక్రయాలు మళ్లీ పుంజుకోవచ్చని భావిస్తున్నాం. సెప్టెంబరు నుంచి పండగల సీజన్ ప్రారంభం కానుండటం, ఈసారి వర్షాలు సమృద్ధిగా కురవడమూ బంగారం అమ్మకాల వృద్ధికి దోహదపడగలవని ఆశిస్తున్నాం. బలమైన జీడీపీ వృద్ధి, గ్రామీణ మార్కెట్ పునరుద్ధరణ వంటి అంశాలు ఈ ఏడాది ద్వితీయార్థంలో పసిడి డిమాండ్‌కు మద్దతివ్వగలవు. ఈ ఏడాది మొత్తానికి దేశీయంగా పసిడి గిరాకీ 700-750 టన్నుల స్థాయిలో ఉండవచ్చని అంచనా వేస్తున్నాం.

\- సచిన్ జైన్, డబ్ల్యూజీసీ రీజినల్ సీఈఓ, ఇండియా

బిజినెస్

బీఈ ఓరల్ పోలియో వ్యాక్సిన్‌కు డబ్ల్యూహెచ్ఓ ఓకే

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తాము తయారు చేసిన నోవెల్ ఓరల్ పోలియో వ్యాక్సిన్ టైప్ 2కు (ఎన్ఓపీవీ2) ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రీ క్వాలిఫికేషన్ హోదా ఇచ్చిందని బయోలాజికల్-ఈ (బీఈ) లిమిటెడ్ ప్రకటించింది. బీఈ నుంచి ప్రీ క్వాలిఫైడ్ హోదా పొందిన 10వ వ్యాక్సిన్ ఇది. వ్యాక్సిన్ల ద్వారా సంక్రమించే పెరాలిటిక్ పోలియో (వీఏపీపీ) రిస్క్‌ను తగ్గించడం లక్ష్యంగా ఎన్ఓపీవీ2ని తయారుచేశారు. ఇది వ్యాక్సిన్ ద్వారా సంక్రమించే పోలియో వైరస్ 2 (సీవీడీపీవీ2) వ్యాప్తిని అరికడుతుందని బీఈ తెలిపింది. గతంలో తయారుచేసిన సాబిన్ పోలియో వైరస్ టైప్2 (ఎంఓపీవీ2) వ్యాక్సిన్‌తో పోల్చితే ఇందులో జన్యుపరమైన స్థిరత్వం కల్పించిన కారణంగా తక్కువ రోగనిరోధక శక్తి గల ప్రాంతాల్లో సీవీడీపీవీ2 వ్యాప్తిని అరికడుతుందని పేర్కొంది.

గ్రాన్యూల్స్ లాభంలో మూడింతల వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గ్రాన్యూల్స్ ఇండియా.. జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో రూ.135 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.48 కోట్లు)తో పోల్చితే లాభం ఏకంగా మూడింతలు పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.985 కోట్ల నుంచి రూ.1,180 కోట్లకు పెరిగింది. గత ఏడాది కొన్ని ఆటంకాలు ఎదురయ్యాయని, ఈ ఏడాది వాటిని అధిగమించటంతో మెరుగైన ఫలితాలను నమోదు చేసినట్లు గ్రాన్యూల్స్ సీఎండీ కృష్ణప్రసాద్ చిగురుపాటి తెలిపారు.

డెరివేటివ్స్ ట్రేడింగ్‌తో ఏటా 60,000 కోట్ల నష్టాలు

సెబీ చీఫ్ మాధవి పురి బుచ్

ముంబై: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ- డెరివేటివ్స్) ట్రేడింగ్‌పై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. అధిక స్పెక్యులేషన్‌తో కూడిన ఈ ట్రేడింగ్‌తో వ్యక్తిగత మదుపరులు ఏటా ఎంత లేదన్నా రూ.50,000 కోట్ల నుంచి రూ.60,000 కోట్ల వరకు నష్టపోతున్నట్టు తెలిపారు. ఎన్ఎస్ఈ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ విషయం వెల్లడించారు. ఇంత భారీ నష్టాలు కలిగిస్తున్న డెరివేటివ్స్ ట్రేడింగ్‌ను గతంలోలా పెద్ద సమస్యగా చూడకపోవడంపై ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇవే నిధులను మదుపరులు మంచి పబ్లిక్ ఇష్యూలు (ఐపీఓ), మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పథకాల్లో మదుపు చేస్తే, మంచి లాభాలు ఆర్జిస్తారని బుచ్ అన్నారు. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)- డెరివేటివ్స్‌కు ప్రత్యామ్నాయం కాదని కూడా ఆమె స్పష్టం చేశారు. ఈటీఎఫ్‌ల్లో లిక్విడిటీ, లెవరేజింగ్ పెద్ద సమస్యలన్నారు.



ఇండెక్స్ డెరివేటివ్స్ కట్టడి

మరోవైపు ఇండెక్స్ డెరివేటివ్స్ కట్టడి కోసం సెబీ కొన్ని చర్యలు ప్రతిపాదించింది. ఇందుకోసం లాట్ల కనీస కాంట్రాక్టు పరిమాణం పెంచడం, ఆప్షన్ ప్రీమియంను ముందే వసూలు చేయాలని సూచించింది. ఈ చర్యలతో ఇండెక్స్ డెరివేటివ్స్ స్పెక్యులేషన్‌ను చాలా వరకు కట్టడి చేయవచ్చని తెలిపింది. ఇందుకు సంబంధించి సెబీ ఒక కన్సల్టేషన్ పేపర్‌ను విడుదల చేసింది. ఇందులో వీక్లీ ఇండెక్స్ ఉత్పత్తుల క్రమబద్ధీకరణ, ఇంట్రాడే పొజిషన్ లిమిట్స్ పర్యవేక్షణ, స్ట్రైక్ ప్రైసెస్ క్రమబద్ధీకరణ, సమీప కాంట్రాక్ట్ ఎక్స్‌పైరీ మార్జిన్ పెంపు వంటి అంశాలపై పలు ప్రతిపాదనలు చేసింది. వీటిపై ఆగస్టు 20 వరకు తమ అభిప్రాయాలను తెలియజేయాల్సిందిగా ప్రజలను సెబీ కోరింది. మరోవైపు అక్టోబరు 1 నుంచి ఎఫ్ అండ్ ఓ లావాదేవీలపై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) ప్రభుత్వం పెంచుతున్న సంగతి తెలిసిందే. దీనికి తోడు సెబీ తాజాగా ఈ చర్యలను ప్రతిపాదించడం విశేషం. డెరివేటివ్స్ ట్రేడింగ్ చేసే ప్రతి 10 మంది రిటైల్ మదుపరుల్లో తొమ్మిది మంది నష్టపోతున్నట్టు సెబీ ఇప్పటికే ప్రకటించింది. దీంతో ఈ ట్రేడింగ్‌ను వీలైనంత మేర కట్టడి చేయాలని సెబీ భావిస్తున్నట్టు సమాచారం. అంతేకాకుండా డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో ఉండే ఆటుపోట్లు, నష్టభయాలపై మదుపరులకు అవగాహన కల్పించేందుకు సెబీ గత ఐదేళ్లలో రూ.62 కోట్లు ఖర్చు చేసింది.

క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ ద్వారా రూ.98,681 కోట్లు

లిస్టెడ్ ఈక్విటీ షేర్లపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ) కేంద్ర ప్రభుత్వ ఖజానాకు పెద్ద మొత్తంలోనే సమకూర్చి పెడుతోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ పన్ను ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రూ.98,681 కోట్లు సమకూరాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 15 శాతం ఎక్కువ.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	68,950 ▼	63,200 ▼	89,000 ▼
ముంబై	68,680 ▼	62,911 ▼	81,350 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

31వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	513	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	94	విజయవాడ	97
వరంగల్	94	గుంటూరు	103
కరీంనగర్	94	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	94	చిత్తూరు	100
కర్నూలు	94	నెల్లూరు	100
విశాఖపట్నం	86	అనంతపురం	97
గోదావరి	97		

వికసిత్ భారత్‌లో భాగస్వాములవ్వండి

దేశీయ పరిశ్రమకు మోదీ పిలుపు

న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్ల కాలంలో ప్రపంచంలోనే మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే బాటలో భారత్ బలంగా నిలిచి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. తన మూడో విడత అధికార సమయంలోనే ఈ ఘనత సాధిస్తామన్న విశ్వాసం ఆయన ప్రకటించారు. ప్రపంచ ఇన్వెస్టర్లు భారత్‌ను ఒక పెట్టుబడి గమ్యంగా చూస్తున్నారంటూ వికసిత్ భారత్ ప్రయాణంలో భాగస్వాములయ్యే సువర్ణావకాశాన్ని వదులుకోవద్దని దేశీయ పరిశ్రమ (ఇండియా ఇంక్)కు ఆయన పిలుపు ఇచ్చారు. "వికసిత్ భారత్ బాటలో ప్రయాణం" పేరిట సీఐఐ నిర్వహించిన పోస్ట్ బడ్జెట్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ.. భారతదేశ వృద్ధి గాథకు సంపద సృష్టికర్తలే చోదక శక్తి అన్నారు. భారత్ అనుసరిస్తున్న విధానాలు, కట్టుబాట్లు, సంకల్పం, నిర్ణయాలు, పెట్టుబడులు ప్రపంచ పురోగతికి ఆలంబనగా మారాయని చెప్పారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు రూపొందించాలని, పెట్టుబడి విధానాల్లో స్పష్టత తేవాలని ఇటీవల నీతి ఆయోగ్ సమావేశంలో రాష్ట్రాలకు తాను సూచించినట్టు ప్రధాని గుర్తు చేశారు. జాతి ప్రథమం సూత్రం ఆధారంగానే మోదీ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని, తమకు రాజకీయ సంకుచిత భావాలు లేవని ఆయన స్పష్టం చేశారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో ప్రభుత్వంతో పోటీ పడాలని దేశీయ పరిశ్రమకు ప్రధాని పిలుపు ఇచ్చారు.



రూ.460 లక్షల కోట్లు

- ఆల్‌టైం రికార్డు స్థాయికి మార్కెట్ సంపద

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఆద్యంతం తీవ్ర ఒడుదుడుకులకు లోనైనప్పటికీ, చివరికి 99.56 పాయింట్ల లాభంతో 81,455.40 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. ఒక దశలో సూచీ 459.43 పాయింట్ల వృద్ధితో 81,815.27 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును సైతం నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే, ఇంట్రాడేలో 136 పాయింట్ల వరకు పెరిగినప్పటికీ, చివరికి 21.20 పాయింట్ల లాభంతో 24,857.30 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త గరిష్ఠ ముగింపు స్థాయి. కాగా, బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.460.91 లక్షల కోట్ల (5.50 లక్షల కోట్ల డాలర్లు)కు చేరుకుంది.

ప్రీమియర్ ఎనర్జీస్ ఐపీఓకు సెబీ ఓకే: హైదరాబాద్‌కు చెందిన సోలార్ కంపెనీ ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ రూ.1,500 కోట్ల పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు సెబీ ఆమోదం తెలిపింది.

సాయి లైఫ్ సైన్సెస్ ఐపీఓ పత్రాలు వెనక్కి: హైదరాబాద్ కంపెనీ సాయి లైఫ్ సైన్సెస్ ఐపీఓకు వచ్చేందుకు అనుమతి కోరుతూ దాఖలు చేసిన ముసాయిదా పత్రాలను (డీఆర్‌హెచ్‌పీ) సెబీ తిప్పిపంపింది. సెబీ ఐసీడీఆర్ నిబంధనలు, 2018లోని 7(1) నిబంధనను పాటించని కారణంగా కంపెనీ డీఆర్‌హెచ్‌పీని వెనక్కి పంపినట్లు స్పష్టం చేసింది.

ఉద్దేశపూర్వక ఎగవేతదారుల పని పట్టండి

- బ్యాంకులను కోరిన ఆర్‌బీఐ

ముంబై: ఉద్దేశపూర్వక రుణ ఎగవేతల కట్టడి కోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరో చర్య తీసుకుంది. ఒక వ్యక్తి లేదా సంస్థ తీసుకున్న రుణాన్ని మొండి బకాయి (ఎన్‌పీఏ)గా ప్రకటించిన ఆరు నెలల లోపు.. అది ఉద్దేశపూర్వక ఎగవేతా? లేక నిజంగానే చెల్లించలేక ఎగవేశారా? అనే విషయాన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు తేల్చాలని కోరింది. రూ.25 లక్షలు లేదా అంతకు మించిన అన్ని ఎన్‌పీఏలకు ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి ఒక మాస్టర్ డైరెక్షన్ విడుదల చేసింది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఉద్దేశపూర్వక ఎగవేతదారుల నిర్వచనానికి సంబంధించి ఎలాంటి విచక్షణ లేకుండా నిర్దిష్ట విధానం రూపొందించుకోవాలని కూడా ఆర్‌బీఐ కోరింది.

ఫొటోల ప్రచురణ: ఇక ఉద్దేశపూర్వక ఎగవేతదారుల పేర్లు అందరికీ తెలిసేలా వారి ఫొటోల ప్రచురణ కోసం కూడా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు నిర్దిష్ట విధానం అనుసరించాలని ఆర్‌బీఐ కోరింది. ఈ విధానం కూడా ఆయా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల బోర్డుల ఆమోదం పొంది ఉండాలని స్పష్టం చేసింది. ఒక వ్యక్తి లేదా సంస్థను ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ప్రకటించాక వారి పేర్లను ఆ జాబితా నుంచి తొలగించే వరకు.. వారికి ఏ బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ అదనపు రుణాలు ఇవ్వకుండా కట్టడి చేయాలని కోరింది. మూడు నెలల్లో ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని ఆర్‌బీఐ తెలిపింది.

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి...
ముగ్గురు పోలీసులపై వేటు



- మంగళగిరి రూరల్ సీఐ, ఎస్సైల సస్పెన్షన్
- దాడి విషయం ముందే తెలిసినా నిర్లక్ష్యం
- పైగా టీడీపీ నాయకులపైనే తిరిగి కేసు
- దర్యాప్తులో బయటకు వస్తున్న నిజాలు

గుంటూరు, జూలై 30 : రాష్ట్ర డీజీపీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై నాడు మూకుమ్మడిగా దాడి చేసి విధ్వంసం సృష్టించిన ఘటన వెనుక అడుగడుగునా పోలీసుల వైఫల్యం ఉన్నట్లు విచారణలో స్పష్టమైంది. ఇందుకు బాధ్యులైన అప్పటి మంగళగిరి రూరల్ సీఐ భూషణం, ఎస్‌ఐలు లోకేశ్, క్రాంతి కిరణ్‌లను సస్పెండ్ చేస్తూ మంగళవారం రేంజ్ ఐజీ సర్వశేష్ఠ త్రిపాఠీ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. అదేవిధంగా ఈ ఘటనలో అప్పటి మంగళగిరి ఎస్‌ఐలుగా ఉన్న విజయకుమార్ రెడ్డి, బి.రమేశ్‌బాబులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నారు. ప్రస్తుతం సీఐ భూషణం వీఆర్‌లో ఉండగా, లోకేశ్ ఇంటెలిజెన్స్‌లో, క్రాంతికిరణ్ వీఆర్‌లో ఉన్నారు. నాడు వైసీపీ నేతలు చెప్పిందే వేదంగా పాటించి ఐపీసీని పక్కనబెట్టారన్న ఆరోపణలను ఈ ముగ్గురూ ఎదుర్కొంటున్నారు. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై 2021 అక్టోబరు 19న వైసీపీ గూండాలు దాడికి తెగబడిన విషయం విదితమే. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండగా, పోలీసులు కనీసం చట్ట పరిధిలో వ్యవహరించకుండా ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు పూర్తి నిర్లక్ష్య ధోరణి అవలంబించారన్న విమర్శలు అప్పట్లోనే వచ్చాయి. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరగబోతుందన్న ముందస్తు సమాచారం కార్యాలయ ఇన్‌చార్జ్ వల్లూరు కుమారస్వామి మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు అందించారు. కార్యాలయానికి రక్షణ కల్పించాలని కోరారు. తొలుత మంగళగిరి టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేయగా అది తమ పరిధి కాదని తెలిపారు. మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా, నానా ప్రశ్నలు వేస్తూ అక్కడి సిబ్బంది కాలయాపన చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే వందలాదిమంది వైసీపీ అల్లరి మూకలు, రౌడీషీటర్లు పెద్ద ఎత్తున కార్లలో టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి తెగబడ్డారు. ఇంత జరుగుతున్నా మంగళగిరి రూరల్ పోలీసులు కనీసం అటువైపు కన్నెత్తి చూడలేదు. అప్పట్లో మంగళగిరి రూరల్ స్టేషన్‌లో ఒక సీఐ, నలుగురు ఎస్‌ఐలు ఉన్నారు. ఘటన జరిగిన తరువాత సాయంత్రం టీడీపీ నేతలు పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తిని పార్టీ శ్రేణులు అటకాయించి ప్రశ్నించారు. అయితే, ఆయన ఇంటెలిజెన్స్ విభాగం ఎస్‌ఐ అని, ఆయనపై తెలుగుదేశం పార్టీ నాయకులు హత్యాయత్నానికి పాల్పడ్డారని, కులం పేరుతో దూషించారని తిరిగి టీడీపీ నేతలపైనే మంగళగిరి పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పార్టీ కార్యాలయంపై దాడి ఘటనపై మాత్రం తూతూ మంత్రంగా కేసు నమోదు చేసి ఫైలు పక్కన పడేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయే వరకు ఎవరు కూడా ఆ కేసు గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆనాటి ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించారు. దర్యాప్తునకు ఆదేశించారు.

'వైసీపీ చైతన్య'కు షాక్

- ఏకపక్ష డీఎస్పీలపై ప్రభుత్వం వేటు

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ అయితే దండాలు.. టీడీపీ అంటే దండనలు.. తప్పు ఒప్పులతో సంబంధం లేదన్నట్లు వ్యవహరించిన పలువురు డీఎస్పీలపై ప్రభుత్వం వేటు వేసింది. మెడలో కండువా వేసుకోవడం మినహా అంతకన్నా ఎక్కువగా వైసీపీ విజయం కోసం తాడిపత్రి, రాజంపేటల్లో పనిచేసిన వీఎన్‌కే చైతన్యకు ప్రభుత్వం షాకిచ్చింది. సబ్ డివిజన్ నుంచి తప్పించి డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తుళ్లూరు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్, టీటీడీ విజిలెన్స్ డీఎస్పీలు జి.బాలి రెడ్డి, ఎం.గిరిధర్ రావును కూడా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాల్సిందిగా డీజీపీ ద్వారకా తిరుమల రావు ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం ఏపీఎస్పీ బెటాలియన్ ఎన్‌టీవీ రామ్ కుమార్, సిటీ పోలీస్ లైన్స్‌లో పనిచేస్తున్న డీఎస్పీ సురేంద్రను టీటీడీకి బదిలీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో డీఎస్పీగా పనిచేస్తున్న బి. శ్రీనాథ్‌ను ఇంటెలిజెన్స్‌కు డీజీపీ బదిలీ చేశారు.

అధికారుల మార్పు అనివార్యం!

ఇదిలా ఉండగా రాష్ట్రంలో పలు సబ్ డివిజన్లకు అధికారుల మార్పు అనివార్యం కానుంది. ఐపీఎస్ అధికారుల బదిలీల తర్వాత కసరత్తు చేస్తున్న ప్రభుత్వం ఒకటి, రెండు రోజుల్లో రాష్ట్రంలోని కీలక సబ్ డివిజన్లకు అధికారుల మార్పు, నియామకాలు పూర్తి చేసే అవకాశం ఉంది.

జగన్ పబ్లిసిటీ స్టంట్‌కు రూ.650 కోట్లా?: అచ్చెన్న

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ పబ్లిసిటీ స్టంట్‌కు రూ.650 కోట్లు ఖర్చు చేశారంటూ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'రైతు తన పొలంలో దిష్టి బొమ్మ పెట్టడానికి ఒప్పుకొంటాడు కానీ, పొలం హక్కు పుస్తకాల మీద దిష్టి బొమ్మ పెడితే ఊరుకోడు. సమాధి రాళ్ల మీద ఫొటో వేసుకున్నట్లు, రైతులందరి పొలాల్లో సర్వే రాళ్లపై నీ ఫొటోలు వేయించావు. ప్రజల సొమ్ము రూ.650 కోట్లతో సర్వే రాళ్లపై బొమ్మలు వేసి, పబ్లిసిటీ స్టంట్లు చేసినందుకే జగన్‌ను ప్రజలు ఇంటికి పంపారు' అని అచ్చెన్న పేర్కొన్నారు.

జైళ్ల శాఖ బాధ్యతలు కుమార్ విశ్వజీత్‌కు

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్‌కు రాష్ట్ర జైళ్ల శాఖ డీజీగా ప్రభుత్వం పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించింది. సరిగ్గా ఏడాది క్రితం మహమ్మద్ హాసన్ రెజా పదవీ విరమణ చేసిన తర్వాత అప్పటి హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తాకు గత ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఇటీవల హోంశాఖ నుంచి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా గుప్తా బదిలీ అయ్యారు.

సాగర్ కుడికాల్వలో పూడిక తీయించండి

- మాజీ ఎమ్మెల్యే పుతుంభాక భారతి డిమాండ్


అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలువ మొత్తం పూడిపోయిందని, వెంటనే పూడిక తీయించి రైతులకు సాగు నీరు అందించాలని సీపీఎం నేత, సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే పుతుంభాక భారతి డిమాండ్ చేశారు. మంగళవారం అమరావతి సచివాలయం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ సాగు నీరు అందక రైతులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కాల్వలో గుర్రపు డెక్క, తూటాకు నిండి అడవిలా కనిపిస్తోందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే పంటకాల్వలకు మరమ్మతులు చేయించాలని కోరారు.

1న ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ

- జిల్లా కలెక్టర్లకు సీఎస్ నీరబ్ కుమార్ ఆదేశాలు

అమరావతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆగస్టు 1న ఉదయం 6 గంటలకే చేపట్టడంతో పాటు అదే రోజు 96 శాతం పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం అమరావతి సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఆగస్టు నెలకు సంబంధించి 64 లక్షల 82 వేల 52 వివిధ రకాల పింఛన్ల పంపిణీకి రూ.2,737.41 కోట్లు విడుదల చేశామని, ఈ మొత్తాన్ని బుధవారం మధ్యాహ్నంలోగా డ్రా చేసేందుకు ఎల్డీయంలతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది 1న ఇంటింటికీ వెళ్లి 96 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని, ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు స్వయంగా పాల్గొనాలని ఆదేశించారు.

ఆరోగ్యశ్రీ ఇక లేనట్టేనా?



- కూటమి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి: షర్మిల
- కేంద్రమంత్రి పెమ్మసాని వ్యాఖ్యలపై సందేహం

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలు అనుమానాలు కలిగిస్తున్నాయని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. 'ఆయుష్మాన్ కార్డులే ప్రతి ఒక్కరూ తీసుకోవాలి అంటే ఇక రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ లేనట్టేనా?' అని మంగళవారం ఆమె ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఆయుష్మాన్ పథకమే ఇక అమలు చేయాలనుకుంటున్నారా? కూటమి ప్రభుత్వానికి ఆరోగ్యశ్రీని నిలిపివేసే ఆలోచన ఉందా? అందుకే పథకానికి నిధులివ్వకుండా నిర్వీర్యం చేస్తున్నారా? పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించేందుకు జాప్యమెందుకు చేస్తున్నారు? బిల్లులు చెల్లించాల్సిన ప్రభుత్వమే ఆరోగ్యశ్రీకి బిల్లులు రావడంలేదని చెప్పడం దేనికి సంకేతం?' అని ప్రశ్నల వర్షం కురిపించారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి 10 లక్షల సాయం

చంద్రబాబుకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు
తక్షణం స్పందించారని సీపీఎం మాజీ ఎమ్మెల్యే పుతుంబాక భారతి ప్రశంసలు


సీఎం చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యే భారతి

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి చికిత్స కోసం తక్షణ సాయంగా రూ.10 లక్షలను ముఖ్యమంత్రి చంద్రబాబు అందజేశారు. బాధిత కుటుంబంతో పాటు సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే, సీపీఎం నేత పుతుంభాక భారతి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. గుంటూరు జిల్లా కొల్లూరు మండలం పెసర్లంక గ్రామానికి చెందిన కమ్మెల సాయి ఫణీంద్ర న్యాయవిద్యను పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉండగా ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆయన తండ్రి కౌలు రైతు. చికిత్స చేయించే స్తోమత లేదని, ఆదుకోవాలంటూ పుతుంభాక భారతి ఇటీవల సీఎంకు వినతిపత్రం అందజేయగా, వారం తిరక్కుండానే సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.10 లక్షలు విడుదల చేశారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆ చెక్కును సీఎం ఆమెకు అందజేశారు. దీంతో భారతి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సచివాలయం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం చాలా ఆర్థిక ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నప్పటికీ అడిగిన వెంటనే సీఎం రూ.10 లక్షల సాయాన్ని అందజేసి బాధితుడికి పునర్జన్మ ఇచ్చారని కొనియాడారు. కాగా, రోడ్డు ప్రమాదంతో తన బిడ్డ కోమాలోకి వెళ్లాడని, 9 రోజులు స్పృహలోనే లేడని ఫణీంద్ర తండ్రి వెంకటేశ్వరరావు చెప్పారు. సాయం అందజేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.



రాజధాని నిర్మాణం కోసం తుమ్మల మధుస్మిత అనే మహిళ రూ.4 లక్షలు విరాళంగా ఇచ్చారు. అమెరికాలోని న్యూజెర్సీలో పని చేస్తున్న మధుస్మిత మంగళవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్ అందజేశారు. ఆమెను చంద్రబాబు అభినందించారు. రాజధాని నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

పవన్ సారూ.. మీరే దిక్కు!

- ఇంటిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు
- మాపై దౌర్జన్యం చేశారు.. గొలుసు లాక్కుపోయారు
- పిఠాపురం మహారాజా మేనకోడలు, కుమారుల ఆవేదన
- న్యాయం చేయాలని డిప్యూటీ సీఎంకు వినతి



పిఠాపురం ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురు వీధిలో ఉన్న ఇల్లు, ఇంటిని ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని చెబుతున్న మహారాజా మేనకోడలు విన్నపాల చంద్రలేఖ, కుమారులు

పిఠాపురం, జూలై 30: 'అయిదున్నర శతాబ్దాలుగా ఇదే ఇంటిలో నివాసముంటున్నాం. కోర్టు డిక్రీ ద్వారా మాకు ఇది దఖలు పడింది. ఇప్పుడు మేము ఉంటున్న ఇంటిని తాము కొన్నామంటూ కొందరు వ్యక్తులు వచ్చి ఖాళీ చేయమని బెదిరించడంతోపాటు దౌర్జన్యం చేశారు. వీరి వెనుక కొందరు నాయకులు ఉన్నారు. పోలీసులను ఆశ్రయించినా పట్టించుకోలేదు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాకు న్యాయం చేయాలి. లేకుంటే చావే శరణ్యం' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు పిఠాపురం మహారాజా మేనకోడలు, ఆమె కుమారులు. వీరు పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి మంగళవారం విడుదల చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురుగాగల వీధిలో మహారాజా కోడలు విన్నపాల చంద్రలేఖ(78), తన ఇద్దరు కుమారులు రంగారావు, మాధవరావుతో కలిసి నివాసం ఉంటున్నారు. వీరు 1970 నుంచి ఇదే ఇంట్లో నివాసం ఉంటున్నారు. దీనిపై వివాదం ఏర్పడగా 1974లో కోర్టు ద్వారా డిక్రీ పొందారు. రెండు నెలల క్రితం ఈ ఇంటిని తాము కొనుగోలు చేశామంటూ జిగటాల లక్ష్మి అనే మహిళతోపాటు కొందరు వ్యక్తులు వచ్చి చెప్పి ఖాళీ చేయాలని డిమాండ్ చేశారన్నారు. ఇది తమ ఇల్లు అని, మీకు ఎవరు అమ్మారని ప్రశ్నించగా వినకుండా తమపై రెండు, మూడు సార్లు వచ్చి దౌర్జన్యం చేయడంతోపాటు తమను ఇంటి నుంచి బయటకు లాగి మెడలో చైన్ లాక్కుని పోయారని చంద్రలేఖ, కుమారులు తెలిపారు. వీరికి కొందరు నేతలు సహకారం అందిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై తాము జిల్లా ఎస్పీకి, పిఠాపురం పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తమపై దౌర్జన్యం చేసిన వారికే మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. తమపై ఎస్సీ, ఎస్టీ కేసు పెడతామని బెదిరిస్తున్నారని చెప్పారు. అయిదున్నర దశాబ్దాలుగా తాము ఉంటున్న ఇంటిని బలవంతంగా ఖాళీ చేయించి ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కోరుతూ మహారాజా మేనకోడలు విన్నపాల చంద్రలేఖ, కుమారుడు మాధవరావు వీడియో ద్వారా కోరారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తమకు న్యాయం జరగకుంటే చావే శరణ్యమని వారు తెలిపారు.

ఏపీలో సుస్థిర ప్రభుత్వం: పవన్

డిప్యూటీ సీఎంను కలిసిన యూఎస్ కాన్సుల్ జనరల్


యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌కు జ్ఞాపిక అందిస్తున్న డిప్యూటీ సీఎం

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఏపీలో రాజకీయ స్థిరత్వంతో కూడిన ప్రభుత్వ పాలన ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మంగళవారం మంగళగిరిలోని ఆయన నివాసంలో అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపముఖ్యమంత్రి అయినందుకు అభినందనలు తెలియజేస్తూ జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా లార్సన్ బృందాన్ని పవన్ సత్కరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు, అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టేందుకు ఉన్న అవకాశాలు చర్చకు వచ్చాయని పవన్ తెలిపారు. పెట్టుబడులను ప్రోత్సహించే సానుకూల దృక్పథం తమ ప్రభుత్వంలో ఉందని వారికి వివరించారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు: పవన్

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వన్య ప్రాణులను వేటాడినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు ఉంటాయని ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ హెచ్చరించారు. అటవీ శాఖ ఉద్యోగులపై దాడులు చేసే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. విజయపురిసౌత్ రేంజ్ అటవీశాఖ ఉద్యోగులపై దాడి ఘటనపై మంగళవారం ఆయన పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడారు. దాడి ఘటనపై ఆరా తీశారు. వన్యప్రాణులను వేటాడినా, అక్రమంగా రవాణా చేసినా, అటవీ సంపదకు నష్టం కలిగించినా.. ఎవర్నీ ఉపేక్షించవద్దని, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వలంటీర్లపై వ్యాఖ్యల కేసులో..
పవన్‌కు ఊరట

- జగన్ సర్కారు పెట్టిన కేసులో తదుపరి చర్యలు నిలుపుదల: హైకోర్టు

అమరావతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. వారాహి యాత్రలో గ్రామ-వార్డు సచివాలయ వలంటీర్లపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపిస్తూ జగన్ ప్రభుత్వం గుంటూరు కోర్టులో దాఖలు చేసిన క్రిమినల్ కేసులో తదుపరి చర్యలన్నిటినీ న్యాయస్థానం నిలుపుదల చేసింది. ఫిర్యాదుదారు ఎంఎస్ సిరాజుద్దీన్‌కు నోటీసులు జారీ చేసింది. విచారణను 4వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. వలంటీర్లపై తాను అనుచిత వ్యాఖ్యలు చేశానని, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించాననే ఆరోపణలతో అప్పటి వైసీపీ ప్రభుత్వం గుంటూరు కోర్టులోని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా తనపై నమోదు చేయించిన ప్రైవేటు క్రిమినల్ కేసును కొట్టివేయాలని కోరుతూ పవన్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా.. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. రాజకీయ కక్షతోనే పవన్‌పై అప్పటి ప్రభుత్వం తప్పుడు కేసు నమోదు చేసిందని తెలిపారు. సీఆర్‌పీసీ సెక్షన్ 199(2) కింద కేసు నమోదు సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని, గుంటూరు కోర్టులో విచారణను నిలుపుదల చేయాలని అభ్యర్థించారు. అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. పవన్‌పై క్రిమినల్ కేసు నమోదు.. కేకే మిశ్రా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా నమోదు చేసిన కేసులు అనేకం ఉన్నాయని.. వీటన్నిటినీ పునఃపరిశీలించి, ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందని.. సదరు నిర్ణయాన్ని కోర్టు ముందు ఉంచుతామని.. విచారణను వాయిదా వేయాలని కోరారు. వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. గుంటూరు కోర్టులో విచారణకు సంబంధించి తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేశారు.

కొనసాగుతున్న వరద

- భద్రాచలం వద్ద పెరిగిన గోదావరి
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- ధవళేశ్వరం వద్ద తగ్గుముఖం


పట్టిసీమ ఎత్తిపోతల నుంచి విడుదల చేసిన నీరు

రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి/పోలవరం, జూలై 30: గోదావరి వరద కొనసాగుతోంది. మంగళవారం భద్రాచలం వద్ద స్వల్పంగా పెరుగుదల కనిపించగా.. దవళేశ్వరం బ్యారేజీ వద్ద కాస్త తగ్గుముఖం పట్టింది. దీంతో మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. రాత్రి 7 గంటలకు బ్యారేజీ వద్ద నీటి మట్టం 12.60 అడుగులకు చేరింది. ఇది 11.75 అడుగులకు దిగితే మొదటి ప్రమాద హెచ్చరికను కూడా వెనక్కి తీసుకుంటారు. ప్రస్తుతం బ్యారేజీ నుంచి 11,19,425 క్యూసెక్కులు దిగువకు పోతోంది. వాస్తవానికి సోమవారం రాత్రి వరకూ భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గుతూ వచ్చింది. రాత్రి 9 గంటలకు అది 42.80 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. మంగళవారం ఉదయం 6 గంటల వరకూ అదే నీటిమట్టం కొనసాగింది. కానీ.. ఉదయం 7 గంటలకు అనూహ్యంగా పది పాయింట్లు పెరిగి 42.90 అడుగులకు చేరింది. అక్కడ నుంచి నెమ్మదిగా పెరుగుతూ 43 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. తర్వాత స్వల్పంగా పెరుగుతూ రాత్రి 7 గంటలకు 43.60 అడుగులకు చేరింది. బుధవారానికి వరద తగ్గుముఖం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పోలవరంలో గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. స్పిల్‌వే ఎగువన 32.710 మీటర్లు, దిగువన 24.300 మీటర్లు నమోదైనట్లు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 20 పంపులు, 20 మోటార్లతో 6,726 క్యూసెక్కుల గోదావరి వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు డీఈఈ పెద్దిరాజు తెలిపారు.

జ్వరాల విజృంభణ
ప్రతి గ్రామంలోనూ జ్వరపీడితులు

- ముందస్తు చర్యల్లో గత ప్రభుత్వ వైఫల్యం
- బ్లీచింగ్ పౌడర్ కూడా ఇవ్వలేదు.. పీహెచ్‌సీల్లో మందుల కొరత
- బోదకాలు వ్యాధి విస్తరణ.. రక్త పరీక్షలు చేయని ఆరోగ్యశాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సీజనల్ వ్యాధులు రాష్ట్రాన్ని పిండేస్తున్నాయి. గ్రామాల్లో జ్వరపీడితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. పట్టణాల్లో ఈ సంఖ్య మరింత అధికంగా ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వరపీడితులతో నిండిపోతున్నాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యం, తప్పిదాల వల్ల ఇప్పుడు రాష్ట్రం మొత్తం జ్వరాలతో ఇబ్బందిపడుతోంది. వర్షాకాలం ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. గ్రామాల్లో ముందస్తుగా బ్లీచింగ్ పౌడర్ సరఫరా, ఫాగింగ్ వంటివి నిర్వహించలేదు. డ్రైనేజీల్లో పూడిక తీయడం, గ్రామాల్లో నీరు నిల్వ గుంతలు పూడ్చడం చేయలేదు. దీంతో డయేరియా, డెంగీ వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయి. గత ప్రభుత్వం ఉన్నప్పుడే గుంటూరులో డయేరియాతో కొంత మంది మరణించారు. అయినా మంత్రులు, ఉన్నతాధికారుల్లో స్పందన లేదు. తర్వాత కృష్ణా జిల్లాల్లో డయేరియాతో మరికొంత మంది మరణించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగ్గయ్యపేట, ఎన్టీఆర్ జిల్లాలో కొన్ని చోట్ల డయేరియా కేసులు వెలుగులోకి వచ్చాయి. డయేరియా నియంత్రణకు చర్యలు తీసుకున్నప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రాష్ట్రం మొత్తం డయేరియా కేసులు వెలుగులోకి వచ్చాయి. దోమల నివారణకు ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఇప్పటి వరకూ బ్లీచింగ్ పంపిణీ చేయలేదు. గ్రామాలు, పట్టణాల్లో ఫాగింగ్ చేయలేదు. మరో 15 రోజులు ఇలానే ఉంటే జ్వరపీడితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలో విజయనగరంలో కొంత భాగం, తూర్పుగోదావరి, కర్నూలు జిల్లాల్లో మాత్రమే బోదకాల బాధితులు కనిపిస్తారు. కానీ ప్రస్తుతం ఈ సమస్య మరికొన్ని జిల్లాలకు విస్తరిస్తోంది. శ్రీకాకుళం జిల్లా, లావేరు మండలం, కొత్తకుంకాం, పాతకుంకాం గ్రామాల్లో ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య భారీగా పెరుగుతోంది. లావేరు చుట్టు పక్కల మండలాల్లో కూడా కేసులు వెలుగులోకి వస్తున్నా ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కేసులు వెలుగులోకి వచ్చిన గ్రామాల్లో ఆరోగ్యశాఖ సిబ్బంది రాత్రి పూట పర్యటించి రక్తపరీక్షలు నిర్వహించాలి. అప్పుడే రక్తంలో బోదకాలకు సంబంధించిన పర్నాజీవి కనిపిస్తుంది. రాత్రిపూటే దానిని గుర్తించే అవకాశం ఉంది. ఆరోగ్య సిబ్బంది పగలు వెళ్లి రక్తపరీక్షలు చేసి ఏమీ లేదని చెబుతున్నారు.

నిండు కుండలా శ్రీశైలం

10 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

అమరావతి, విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి), శ్రీశైలం, జూలై 30: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. జూరాల, సుంకేశుల నుంచి వరద ప్రవాహం పెరగడంతో మంగళవారం రాత్రి డ్యామ్ 10 గేట్లను పది అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. సోమవారమే మూడు గేట్లను ఎత్తగా.. మంగళవారం ఉదయం 11:30 గంటలకు మరో రెండు గేట్లు పైకెత్తారు. సాయంత్రం 6 గంటలకు మరో రెండు గేట్లు ఎత్తి మొత్తం 7 గేట్ల ద్వారా నీటిని కిందకు వదిలారు. వరద పెరగడంతో రాత్రి 9.30 గంటలకు మరో మూడు గేట్లను కూడా పైకెత్తారు. జూరాల నుంచి 2,81,698 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 97,945 క్యూసెక్కులు మొత్తం 3,88,460 వరద ప్రవాహం వస్తోంది. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి 4,13,178 క్యూసెక్కుల వరద నీరు చేరింది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 883.90 అడుగులుగా నమోదైంది. 3,32,453 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

నేడు శ్రీశైలం వద్ద సీఎం జల పూజ

శ్రీశైలం జలాశయాన్ని బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించనున్నారు. నిండు కుండలా మారిన కృష్ణమ్మకు హారతి పట్టి పూజ చేయనున్నారు.

తగ్గనున్న వర్షాలు.. రుతుపవన ద్రోణి తూర్పు భాగం మంగళవారం బాలాసోర్ మీదుగా తూర్పు మధ్య బంగాళాఖాతం వరకూ విస్తరించింది. రానున్న రెండు, మూడు రోజుల్లో ఈ ద్రోణి ఉత్తరాది వైపుగా పయనించనుంది. దీనికి తోడు బంగాళాఖాతంలో అల్పపీడనాలేవీ లేవు. రాష్ట్రంపై ఉపరితల ఆవర్తనాలుగానీ, ద్రోణులుగానీ కొనసాగడం లేదు. దీంతో ఆకాశం నిర్మలంగా మారి ఎక్కువచోట్ల పొడి వాతావరణం కొనసాగింది. మంగళవారం రాష్ట్రంలో అతి తక్కువచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని, తర్వాత కొద్దిరోజులు వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశముందని వాతావరణ నిపుణుడు ఒకరు తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడేంత వరకు రాష్ట్రంలో ఎక్కువచోట్ల పొడి వాతావరణమే ఉంటుందని వివరించారు.

15 రోజులు.. 7 వేల ఫిర్యాదులు!

- టీడీపీ నేతలకు వినతుల వరద
- వీటిలో 4 వేలు భూసమస్యలపైనే
- వీటి పరిష్కారంపై అధికారుల నుంచి నివేదిక కోరే యోచనలో సీఎం?


ప్రజాదర్బార్‌లో అర్జీలు తీసుకుంటున్న పార్టీ నేతలు కంభంపాటి రామ్మోహన్‌రావు, శ్రీదేవి

అమరావతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలకు వివిధ వర్గాల నుంచి వరద ప్రవాహంలా వినతులు వస్తున్నాయి. కేవలం గత 15 రోజుల్లోనే వారికి అందిన ఫిర్యాదులు, వినతులు 7 వేల వరకూ ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణ ప్రజల నుంచి రెండు మార్గాల్లో ఆ పార్టీకి ప్రస్తుతం విజ్ఞప్తులు అందుతున్నాయి. పార్టీ యువనేత, మంత్రి లోకేశ్ ప్రతి రోజూ ఉదయం తన నివాసం వద్ద ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నారు. ఉదయం ఏడు గంటలలోపు ఎంత మంది వస్తే అంత మందినీ ఆయన కలిసి వినతిపత్రాలు తీసుకుంటున్నారు. ఆయన స్థానికంగా అందుబాటులో ఉన్న రోజుల్లో ప్రజాదర్బార్ జరుగుతోంది. దీనికి సమాంతరంగా టీడీపీ కేంద్ర కార్యాలయంలో కూడా మంత్రులు, పార్టీ ముఖ్యులు ప్రతి రోజూ ప్రజల నుంచి వినతిపత్రాలు తీసుకుంటున్నారు. 7 వేల వినతుల్లో 4 వేల వరకూ భూముల ఆక్రమణ, భూ రికార్డుల్లో సమస్యలు, స్థలాల కబ్జా, ఇతరత్రా ప్రజా సమస్యలు ఉన్నాయి. మరో రెండు వేల వరకూ.. అనారోగ్యం, ఆర్థిక సాయం, ఉపాధి కల్పన, రహదారుల సమస్య, ఇళ్ల కేటాయింపునకు వినతులు, పింఛను కోసం దరఖాస్తుల వంటివి ఉన్నాయి. ఉపాధి కల్పన కోసం వచ్చిన వారిలో కొందరికి పార్టీ కార్యాలయంలోనే నైపుణ్య శిక్షణకు అవకాశం కల్పిస్తున్నారు. శిక్షణ పొందితే తర్వాత ఎక్కడైనా ఉపాధి దొరుకుతుందని పార్టీనేతలు చెబుతున్నారు.

మంత్రులకు డ్యూటీ..

గతంలో చంద్రబాబు మాత్రమే పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వీటిని స్వీకరించేవారు. ఈసారి పద్ధతి మార్చారు. రోజుకొక మంత్రికి పార్టీ కార్యాలయం డ్యూటీ వేసి వారు వినతి పత్రాలు తీసుకునే ఏర్పాటు చేశారు. పార్టీకి చెందిన మరో ముఖ్య నేతను కూడా వారికి జతచేశారు. వీటిని ఏ రోజుకా రోజు కంప్యూటర్లలో నమోదు చేసి ఫిర్యాదు ప్రతులను ముఖ్యమంత్రి కార్యాలయానికి.. అక్కడి నుంచి సంబంధిత శాఖలకు పంపుతున్నారు. ప్రతి ఫిర్యాదుకు ఒక నంబర్ ఇస్తున్నారు. కొన్ని రోజుల తర్వాత ఆయా శాఖల నుంచి వీటి పరిష్కారంపై నివేదిక కోరే యోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు సమాచారం. అలాగే తాము పంపిన ఫిర్యాదులు, వినతులను ప్రభుత్వ శాఖలు ఏ మేరకు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాయో పరిశీలించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో టీడీపీ నేతలు ఉన్నారు.

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై నేడే ఆర్డినెన్స్

- రూ.96 వేల కోట్లకు ఆమోదించే అవకాశం

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ గడువు బుధవారం(జూలై 31)తో ముగిసిపోతోంది. దీంతో మరో 4 నెలల వ్యవధికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆమోదిస్తూ బుధవారం ఆర్డినెన్స్ జారీ చేసే అవకాశాలున్నాయి. ఈ మేరకు సిద్ధం చేసిన ఫైలును మంగళవారం షార్ట్ సర్క్యులేషన్ విధానంలో కేబినెట్ ఆమోదానికి పంపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2.86 లక్షల కోట్లతో గత ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను రూపొందించింది. ఇందులో రూ.96,000 కోట్ల బడ్జెట్‌ను 4 నెలల కోసం ఆమోదించారు. మరో 4 నెలలకు ఇప్పుడు ఆమోదించే బడ్జెట్ కూడా సుమారు అంతే ఉండే అవకాశాలున్నాయి.

జరిగింది నాలుగు రాజకీయ హత్యలు

- చనిపోయినవారిలో ముగ్గురు టీడీపీవారే
- ఆ వివరాలు ఇవ్వడానికి మేం సిద్ధం
- శాంతిభద్రతలపై జగన్‌వన్నీ అబద్ధాలే: అనిత



విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో కూటమి ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో నాలుగు రాజకీయ హత్యలు జరిగితే, అందులో ముగ్గురు తెలుగుదేశం పార్టీ వారేనన్నారు. ఆ వివరాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. 36 రాజకీయ హత్యలు జరిగాయని జగన్ చేస్తున్న ప్రచారం పచ్చి అబద్ధమన్నారు. విశాఖ పోలీస్ కమిషనరేట్ నుంచి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ విభాగాధిపతులతో మంగళవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడారు. "రాజకీయ హత్యలపై జగన్ పూటకు ఒక మాట్లాడుతున్నారు. ఢిల్లీ ధర్నా సమయంలో 36 హత్యలు అన్నారు. గవర్నర్‌కు పంపిన లేఖలో 31 మంది హత్యకు గురయ్యారని చెప్పారు. జగన్ ఆరోపణల్లో పస లేదని ఈ పొంతన లేని లెక్కలు చూస్తేనే అర్థమైపోతోంది" అని హోంమంత్రి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఏ ఘటన జరిగినా దానివెనుక గంజాయి పాత్ర ఉంటోందని అనిత తెలిపారు. గంజాయి సాగుకు అడ్డుకట్ట వేసేందుకు తానే స్వయంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటిస్తానని పేర్కొన్నారు.

ఫసల్ బీమాను వైసీపీ ప్రభుత్వం నిలిపేసింది: కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఏపీలో పీఎంఎఫ్‌బీవై(ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన) పథకం అమలును గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2020 ఏడాది ఖరీఫ్ నుంచి ఏపీలో పీఎంఎఫ్‌బీవై పథకాన్ని అమలు చేయకూడదని నాటి ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొంది. లోక్‌సభలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అడిగిన ప్రశ్నకు మంగళవారం కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమశాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.

నక్కపల్లి బల్క్‌డ్రగ్ పార్కుకు వెయ్యి కోట్లు: కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): నక్కపల్లి(అనకాపల్లి జిల్లా)లోని బల్క్ డ్రగ్ పార్కులో కామన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫెసిలిటీస్(సీఐఎఫ్) ఏర్పాటుకు రూ.వెయ్యి కోట్ల ఆర్థిక సాయానికి గతేడాది డిసెంబరులో ఆమోదం తెలిపినట్లు కేంద్రం వెల్లడించింది. రాజ్యసభలో వైసీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంగళవారం కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. నక్కపల్లి బల్క్‌డ్రగ్ పార్కును ఎన్‌హెచ్ 16కు అనుసంధానించే 4.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి స్థానిక యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

30న విశాఖ 'స్థానిక' ఎమ్మెల్సీ ఉపఎన్నిక

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఆగస్టు నెల 6వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు పేర్కొంది. ఆగస్టు 30వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, సెప్టెంబరు 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వెల్లడించింది.

'ఎనీవేర్'.. భూముల చోర్!

(మొదటి పేజీ తరువాయి)

అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. వీటిపై ప్రభుత్వం దృష్టిసారించి అక్రమాలు సరిదిద్దకపోతే గ్రామాల్లో యుద్ధవాతావరణం నెలకొనే ప్రమాదం ఉంది. ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానాన్ని 2015లో చంద్రబాబు ప్రవేశపెట్టారు. ఈ విధానంలో విజయవాడలోని గుణదల పరిధిలో ఉన్న ఆస్తిని ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇందుకోసం ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఆ ఆస్తి తాలూకు డాక్యుమెంట్లు, లింక్ డాక్యుమెంట్లు, ఇరుపార్టీలకు చెందిన ఇతర సర్టిఫికేట్లన్నింటినీ గుణదల సబ్‌రిజిస్ట్రార్‌కు పంపుతారు. ఆ వివరాలు సరైనవో, కావోనని చెప్పడానికి 48 గంటల సమయం ఇస్తారు. సరైనవే అయితే ఒంగోలులో రిజిస్ట్రేషన్ జరిగిపోతుంది. ఒకవేళ ఏవైనా వివాదాలుంటే దాన్ని పెండింగ్‌లో పెడతారు. కానీ, జగన్ ఏం చేశారంటే, డాక్యుమెంట్ల పరిశీలన వ్యవధిని కేవలం ఒక గంటకు తగ్గించారు. పైగా ఆ ఆస్తి ఉన్న ప్రాంతం సబ్ రిజిస్ట్రార్‌కు డాక్యుమెంట్లు పంపరు. ఏ ప్రాంతంలోని భూమి, సర్వే నెంబర్ లాంటి కొన్ని వివరాలను ఒక ఫారంలో నింపి పంపుతారు. అసైన్డ్, నిషేధిత జాబితాలోని భూములైతే ఈ విధానంలో తెలుసుకోవచ్చు. కానీ, గ్రామకంఠాలకు రికార్డులుండవు. ఈ విధానంలో కేవలం ఒక గంటలో వాటిని గుర్తించడం అసాధ్యం. లింకు డాక్యుమెంట్లు, ఇతర సంబంధిత సర్టిఫికెట్లు ఏవీ ఉండకపోవడంతో ఎవరి భూమి ఎవరు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారన్న విషయం కూడా సబ్‌రిజిస్ట్రార్లకు తెలీదు. పైగా గంటలో ఓకే చేయాలి. ఓకే చేయకపోతే ఆ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సేవలు నిలిచిపోతాయి. ప్రజలు సబ్‌రిజిస్ట్రార్లపై ఒత్తిడి పెంచుతారు. దీంతో ఏ వివరాలు తెలియకపోయినా సరే తప్పనిసరిగా ఆ ఎనీవేర్ ప్రతిపాదనలకు సబ్‌రిజిస్ట్రార్లు ఓకే చేయాల్సిన తప్పనిపరిస్థితిలోకి జగన్ నెట్టేశారు.

PRATHIBHA INNOWIS IAS
DEGREE+IAS
(3 YEARS INTEGRATED PROGRAM)
B.B.A | B.Com | B.C.A | B.A | B.Sc
A/C.CAMPUS 7375837937
A/C.HOSTEL 9618254567
ప్రతిభ DEGREE COLLEGES KUKATPALLY, HYD.

48 గంటలు.. తప్పేముంది?

ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌లో రిజిస్ట్రేషన్ జరిగేది ఒక ప్రాంతంలో అయితే ఆస్తి మరో ప్రాంతంలో ఉంటుంది. అందువల్ల వెరిఫికేషన్‌కి సమయం పడుతుంది. అందుకే చంద్రబాబు హయాంలో 48 గంటల వ్యవధి ఇచ్చారు. రెండ్రోజుల తర్వాత రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ తీసుకోవడం వల్ల నష్టం జరగదు కదా! ఒక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఆస్తి ఉన్న వ్యక్తి రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా సదరు వ్యక్తికి అనుకూలమైన ఏ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అయినా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్న ప్రాంతం సమీపంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది వెళ్లి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయవచ్చు. దూరంలో ఉన్న వ్యక్తి ఇతరులకు పవర్ అటార్నీ చేయాల్సిన అవసరం తగ్గుతుంది.

జవహర్ రెడ్డిని విచారించాలి!

ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఒక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను తన వద్దే ఉంచుకోవడం ఎప్పుడూ జరగలేదు. కానీ, జగన్ హయాంలో సీఎస్‌గా పనిచేసిన జవహర్‌రెడ్డి మాత్రం ఆ శాఖను తన వద్దే ఉంచుకున్నారు. అప్పటి ఆ శాఖ ఐజీ వి.రామకృష్ణ సీఎస్ కార్యాలయంలో ఒక సీటు వేసుకుని కూర్చునేవారు. ఎనీవేర్ ముసుగులో విశాఖ, తూర్పుగోదావరి, విజయవాడల్లో వేల ఎకరాలు కొల్లగొట్టారు. అసైన్డ్ భూములను, 22ఏ భూములను కొట్టేయడానికి ప్రత్యేక మాడ్యూల్ తయారుచేసుకుని దోచేశారు. ధనుంజయ్ రెడ్డి, విజయసాయి రెడ్డి, జవహర్ రెడ్డి కలిసి విశాఖ, విజయవాడ, తూర్పు గోదావరి జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్తులతోపాటు జనాల ఆస్తులు కూడా సొంత బీరువాలో పెట్టుకున్నారు. ఈ అక్రమాల గుట్టు బయటపడాలంటే జవహర్ రెడ్డిని, ఐజీ రామకృష్ణను విచారించాల్సిందేన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

1.70 లక్షల ఎకరాలు కొట్టేశారు!

- పెద్దిరెడ్డి ముఠా చేతిలో 20 వేల ఎకరాలు
- రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆరోపణ
- ఒక్క పులిచర్లలోనే 970 ఎకరాలు స్వాహా
- పెద్దిరెడ్డి భార్య పేరుతో హైవే పక్కన ఐదెకరాల ఆక్రమణ
- మదనపల్లె ఆర్డీవో పరిధిలోని 14 మండలాల్లో కబ్జాలు
- అవి బయటకు రాకుండా రికార్డుల దహనం
- 14 వేల ఎకరాల '22ఏ' ఫైళ్లు బుగ్గి: మంత్రి

అమరావతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జగన్ కేబినెట్‌లో 'నంబర్ టూ'గా వెలిగిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఠా చేతిలో 15-20 వేల ఎకరాల భూమి ఉందని రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో లక్షా 70 వేల ఎకరాల భూమిని వైసీపీ నేతలు కొట్టేశారని.. వీటి విలువ రూ.45 వేల కోట్లకుపైనేనని తెలిపారు. మొత్తం భూదోపిడీ వెలుగు చూస్తే ఈ సంఖ్య ఇంకా పెరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. మంగళవారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, తెలుగునాడు విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్‌తో కలిసి మంత్రి విలేకరులతో మాట్లాడారు. 'తిరుపతి, పుంగనూరు, తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాల్లో 15 నుంచి 20 వేల ఎకరాల భూమి పెద్దిరెడ్డి, ఆయన అనుయాయుల చేతిలో ఉంది. ఇవన్నీ అక్రమంగా ఆక్రమించుకున్న భూములే. పెద్ద కాంట్రాక్టర్ల వద్ద సబ్ కాంట్రాక్టులు చేసుకుని చిన్న కాంట్రాక్టర్‌గా జీవితం ప్రారంభించిన పెద్దిరెడ్డి ఇప్పుడు భారీగా సంపాదించారు. ఒక్క పులిచర్ల మండలంలోనే 970 ఎకరాలు కొట్టేశారు. పెద్దిరెడ్డి సతీమణి పేరుతో జాతీయ రహదారి పక్కన ఐదు ఎకరాలు ఆక్రమించారు. చివరకు చెరువులను కూడా ఆక్రమించుకుని వాటికి పట్టాలు పుట్టించారు. అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పది నియోజకవర్గాల్లో వారి భూ దోపిడీ జరిగింది. మదనపల్లె ఆర్డీవో పరిధిలోని మొత్తం 14 మండలాల్లో భూకబ్జాలు చేశారు. అవి బయటపడకుండా చూడడానికే మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో రికార్డులు తగులబెట్టారు. మొత్తం 14 వేల ఎకరాలకు సంబంధించిన 22ఏ రికార్డులను కావాలనే దహనం చేశారు. కావలసిన వారికి భూములు కట్టబెట్టి ఎన్‌వోసీలు ఇప్పించి వాటిని కప్పిపుచ్చడానికి అగ్ని ప్రమాదం నాటకమాడారు. ఇంత దారుణంగా దోచుకోవడం వల్లే పెద్దిరెడ్డి బాధితులు వందల సంఖ్యలో వస్తున్నారు. వేల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి' అని మంత్రి చెప్పారు. పెద్దిరెడ్డికి చెందిన కంపెనీ పీఎల్‌ఆర్‌కు చెందిన టిప్పర్లపై విచారణ జరపబోతున్నట్లు తెలిపారు. ఒకే నంబర్‌తో ఈ కంపెనీకి చెందిన టిప్పర్లు 2-3 తిరిగినట్లు ఫిర్యాదులు అందాయని, ఇప్పుడు వాటన్నింటినీ దాచిపెట్టారని ఆరోపించారు. భూముల రికార్డులు తగలబెట్టిన మదనపల్లెకు వైసీపీ నేత జగన్ వస్తానంటే ఆహ్వానిస్తామని, ఆయనకు భద్రత కూడా కల్పిస్తామని తెలిపారు. వైసీపీ నేతలు అధికారంలో ఉన్నప్పుడు ఒక బెటాలియన్ పోలీసులను భద్రతగా పెట్టుకుని తిరిగారని, టీడీపీ నేతలకు గన్‌మెన్‌ను తొలగించారని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారం పోయాక కేవలం పది రోజుల కిందట భద్రత తగ్గిస్తే తట్టుకోలేకపోతున్నారని ఆక్షేపించారు.

నెలకో హామీ అమలు..

ప్రజలకు ఇచ్చిన హామీలను నెలకొకటి చొప్పున అమలు చేయాలన్నది తమ ఆలోచనని, ఆగస్టులో అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామని మంత్రి తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీని ఆపై నెలలో ప్రారంభించే వీలుందన్నారు.



హంద్రీ-నీవా కాలువపై వేసిన డైవర్షన్ రోడ్డు

హంద్రీ-నీవా కాలువపై.. డైవర్షన్ రోడ్డు గుండా తాత్కాలిక పైపులు!

- నేటి సాయంత్రంలోగా ఏర్పాటుకు చర్యలు
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై పయ్యావుల స్పందన
- ఆయన ఆదేశాలతో తాత్కాలిక ఏర్పాట్లు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కర్నూలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువపై నిర్మించిన డైవర్షన్ రోడ్డు గుండా తాత్కాలిక పైపులు వేసి కృష్ణా జలాలు సాఫీగా ప్రవహించేలా చేసేందుకు ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రంలోగా ఈ పనులు పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులకు, పీఎస్‌కే నిర్మాణ సంస్థకు గడువు పెట్టారు. సీఎం చంద్రబాబు గురువారం (ఆగస్టు 1న) మల్యాల ఎత్తిపోతల పథకం పంపులు ఆన్ చేసి హంద్రీ-నీవా కాలువకు కృష్ణా జలాలు ఎత్తిపోయాలని సంకల్పించారు. అయితే కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి(340సీ) నిర్మాణంలో భాగంగా నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు సమీపంలో ఈ కాలువపై వంతెన నిర్మాణం చేపట్టారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా కాలువను కొంతవరకు పూడ్చి డైవర్షన్ రోడ్డు నిర్మించారు. జూన్ ఆఖరులోగా వంతెన పనులు పూర్తిచేసి కాలువకు అడ్డంగా నిర్మించిన డైవర్షన్ రోడ్డును తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా చేయాలని హంద్రీ-నీవా ప్రాజెక్టు ఇంజనీర్లు ముందే గడువు పెట్టారు. అయితే ఇప్పటి వరకు బ్రిడ్జి, రోడ్డు పనులు పూర్తి కాలేదు. దీనికితోడు కృష్ణా నదికి ముందుగానే వరద రావడం, శ్రీశైలం జలాశయం గరిష్ఠ నీటిమట్టానికి చేరుకోవడంతో డ్యాం గేట్లు ఎత్తి నాగార్జున సాగర్ డ్యాంకు ఆదివారం నీటిని విడుదల చేశారు. వాస్తవంగా డ్యాంలో వరద నీరు 834 అడుగుల మట్టం దాటగానే మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీనీవా కాలువకు నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉంది. కానీ కాలువపై వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో డైవర్షన్ రోడ్డును కూడా తొలగించలేదు. ఫలితంగా హంద్రీ-నీవా కాలువ ద్వారా అనంతపురం జిల్లా వరకు కృష్ణా జలాలు ఇవ్వలేని పరిస్థితిపై 'నీళ్లున్నా.. కన్నీళ్లే!' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మంగళవారం కథనం ప్రచురించింది. దీనిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో హంద్రీ-నీవా ప్రాజెక్టు సీఈ నాగరాజు, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) గోవర్ధన్‌తో.. కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సమావేశమయ్యారు. డైవర్షన్ రోడ్డు గుండా తాత్కాలిక పైపులు ఏర్పాటుచేసి కాలువ నుంచి నీరు పారించేలా చేస్తామని, రాయలసీమ రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని సీఈ, పీడీ ఆయనకు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం శ్రీశైలం చేరుకుని కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు చేసి జలహారతి ఇస్తారు. అదే సమయంలో మల్యాల ఎత్తిపోతల నుంచి హంద్రీ-నీవా కాలువకు కృష్ణా జలాలు ఎత్తిపోసి సీమ రైతులకు తీపికబురు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పం.

'సెబ్'తో కుమ్మేశారు

- ఇసుక, మద్యంలో భారీ దోపిడీకి నాడు పక్కా స్కెచ్
- యథేచ్ఛగా రాష్ట్రంలోకి ప్రవేశించిన ఎన్‌డీపీఎల్
- గ్రామ స్థాయికీ చేరిపోయిన గంజాయి వినియోగం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వైసీపీలోని కొందరు పెద్దల ఆలోచన వల్ల నాడు ఎక్సైజ్ శాఖ రెండుగా చీలిపోయి కోరల్లేని పాములా మారింది. గతంలో ఎక్సైజ్ అంటే మద్యం సంబంధిత నేరాలపై ఉక్కుపాదం మోపే శాఖగా పేరుంది. అలాంటి శాఖను రెండుగా చీల్చి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను(సెబ్) ఏర్పాటుచేసిన వైసీపీ పెద్దలు, తద్వారా యథేచ్ఛగా అక్రమాలు కొనసాగించారు. సెబ్‌కు ఇసుక, గుట్కా, గ్యాంబ్లింగ్ అంటూ రకరకాల బాధ్యతలు అప్పగించినా కేసులు పెట్టే అధికారం ఇవ్వకుండా నిర్వీర్యం చేశారు. మరోవైపు కొత్తగా చేర్చిన బాధ్యతల కారణంగా మద్యం నేరాలపై సెబ్ అధికారులు దృష్టి పెట్టలేకపోయారు. దీంతో అసలు సెబ్ ఎందుకనేది అర్థంకాని పరిస్థితి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2020 మేలో సెబ్‌ను పక్కా ప్లాన్‌తోనే ఏర్పాటుచేసింది. దీనిద్వారా అటు ఇసుక అక్రమ రవాణా, ఇటు మద్యం నేరాలపై నిఘా రెండూ నియంత్రించలేకుండా చేసింది. సెబ్ అధికారులు ఇసుక లారీలను పట్టుకుని సివిల్ పోలీసులకు అప్పగించే విధానాన్ని అమలుచేశారు. మరోవైపు మద్యం కాకుండా ఇతరత్రా నేరాల విషయంలో ఎక్సైజ్ సిబ్బంది పట్ల అక్రమార్కుల్లో భయం లేకుండా పోయింది. పలుచోట్ల సెబ్ అధికారులు ఇసుక లారీలను పట్టుకున్న సందర్భాల్లో తిరిగి వారినే బెదిరించిన సందర్భాలూ ఉన్నాయి. సెబ్ అధికారులు, కానిస్టేబుళ్లు మద్యం షాపుల్లో తనిఖీలు చేయకూడదనే నిబంధన పెట్టారు. దీంతో మద్యం షాపుల్లో జరిగే ఎమ్మార్పీ ఉల్లంఘనలు, బ్రాండ్ల గోల్‌మాల్ వైపు కన్నెత్తి చూడలేకపోయారు. చివరికి ప్రభుత్వ మద్యం షాపుల్లోనే ఎన్‌డీపీఎల్ విక్రయించే స్థాయిలో అక్రమాలు పెరిగాయి. ఇసుక, గుట్కా, గ్యాంబ్లింగ్ అంటూ రకరకాల బాధ్యతలు అప్పగించడంతో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, నాటుసారా, గంజాయిపై దృష్టిపెట్టలేదు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాలకూ గంజాయి సంస్కృతి విస్తరించింది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గనుల శాఖ శ్వేతపత్రంలో రూ.20వేల కోట్ల అవినీతి జరిగినట్లు ప్రకటించింది. అందులో ఎక్కువ వాటా ఇసుకలోనే ఉంది. సెబ్‌ను ఏర్పాటుచేసినా ఇంత అవినీతి ఎలా జరిగిందో, వైసీపీ పెద్దల ప్లాన్‌ను గమనిస్తే అర్థమవుతుంది. మరోవైపు మద్యం కేసులపై కమీషన్ రూపంలో రూ.3113 కోట్లు వైసీపీ పెద్దలకు వెళ్లాయి. దీనిని సెబ్ నియంత్రించలేదు. కానీ రాష్ట్రానికి రావాల్సిన మద్యం ఆదాయంలో రూ.18800 కోట్లు నష్టం వాటిల్లింది. అంటే పక్క రాష్ట్రాల నుంచి ఎన్‌డీపీఎల్, రాష్ట్రంలో నాటుసారా తయారీ, గంజాయి వినియోగం అక్రమాలు భారీగా పెరిగాయి. వాటిని నియంత్రించడంలో సెబ్ విఫలం కావడంతో అమ్మకాలు పడిపోయి, ఆదాయం తగ్గిపోయింది. సెబ్‌ను మాజీ సీఎం జగన్ తన మానస పుత్రికగా ప్రకటించుకున్నారు. ఈ ఒక్క విభాగంతో దాదాపుగా సగం నేరాలు నియంత్రించవచ్చన్నారు. అయితే నేరాలు తగ్గకపోగా పెరిగాయి. సీఎం చెప్పిందే తడవుగా అప్పట్లో అధికారులు హడావిడిగా సెబ్ ఏర్పాటుచేశారు. దానిపై అధ్యయనం, ఎక్సైజ్ ఉద్యోగులతో చర్చించడం లాంటివి లేకుండా ఏకపక్షంగా సెబ్ సృష్టించారు. దీంతో సెబ్ ఎటూకాకుండా పోయిందనే భావన ఉద్యోగుల్లో ఉంది.





ప్రైవేటు పాలసీ పెడితే...

ప్రభుత్వం ప్రైవేటు మద్యం షాపుల పాలసీని తీసుకొచ్చేందుకు ఎక్కువ అవకాశాలున్నాయి. ప్రైవేటు పాలసీ వస్తే ఎక్సైజ్ సిబ్బంది అవసరం పెరుగుతుంది. ప్రైవేటు షాపుల పాలసీని అమలుచేస్తే షాపుల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనలు, ఎన్‌డీపీఎల్, నాటుసారా తదితర నేరాలపై నిఘా పెంచాల్సిన అవసరం ఉంటుంది. గతంలో ప్రైవేటు పాలసీ ఉన్నప్పుడు కూడా ఇదే తరహాలో నేరాలకు అడ్డుకట్ట వేశారు. ఇప్పుడు ప్రైవేటు పాలసీ తెచ్చాక సెబ్ ద్వారా వాటిని నియంత్రించడం కష్టమవుతుంది. అందుకే ఎక్సైజ్ శాఖ పునర్వ్యవస్థీకరణ అంశాన్ని కూడా ప్రభుత్వం శ్వేతపత్రంలో పెట్టింది. సెబ్‌ను రద్దుచేసి ఎక్సైజ్ శాఖను పూర్వపు స్థితికి తేవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సెప్టెంబరులోగా నూతన మద్యం పాలసీ రాబోతున్నందున ఆలోపే సెబ్‌ను రద్దు చేసే అవకాశం కనిపిస్తోంది.

> కొత్త వ్యవస్థను ఏర్పాటుచేస్తే ప్రజలకు మరింత మేలు జరగాలి. ఈ పరిస్థితి లేనప్పుడు ఉన్న వ్యవస్థనే కొంత మెరుగ్గా పనిచేసేలా చూడాలి. ఈ రెండూ కాకుండా ఒక సూపర్ వ్యవస్థను ఏర్పాటుచేశానని అనిపించుకోవాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనుకున్నారు.
>
> ఇసుక దందా, మద్యం మాఫియాను యథేచ్ఛగా సాగించుకునేందుకు ఈ వ్యవస్థను వాడుకోవాలనుకున్నారు. అలా వచ్చిందే సెబ్ విభాగం. అప్పటికి బాగా పనిచేస్తున్న ఎక్సైజ్ శాఖను చీల్చి కొత్తగా ఏర్పాటుచేసిన దీన్ని ఆరంభంలోనే నిర్వీర్యం చేసేశారు. ఏది అడిగినా.. 'ఆ ఒక్కటీ అడక్కు...' అని ఓ సినిమాలో డైలాగ్. సరిగ్గా సెబ్‌ను అలాగే తయారుచేశారు. ఇసుక అక్రమ రవాణాపై కేసులు పెట్టకుండా సెబ్ చేతులు కట్టేశారు. సర్కారీ మద్యంషాపుల్లోకి తొంగి చూడకుండా కళ్లకు గంతలు చుట్టేశారు. చివరకు సెబ్ సూపర్ ఫ్లాప్ అయింది. చివరకు ఎలుకను కూడా పట్టలేని నిస్సహాయ స్థితికి చేరుకుంది.

కదులుతున్న బస్సులో మహిళపై అత్యాచారం!

- హైదరాబాద్‌లో ఘోరం.. నిందితుడు ఆ బస్సు అదనపు డ్రైవరే
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు.. ఇద్దరు డ్రైవర్ల అరెస్టు.. బస్సు సీజ్

తార్నాక, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నిర్భయ ఘటనను తలపించేలా హైదరాబాద్‌లో దారుణం జరిగింది. కదులుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో మహిళపై ఆ వాహన డ్రైవర్లలో ఒకడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఓయూ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర వెల్లడించిన వివరాల ప్రకారం.. హరిక్రిష్ణ ట్రావెల్స్‌కు చెందిన బస్సు 35 ప్రయాణికులతో సోమవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ నుంచి హైదరాబాద్ మీదుగా ప్రకాశం జిల్లా పామూరుకు బయలుదేరింది. బస్సులో ఇద్దరు డ్రైవర్లు సిద్ధయ్య, కృష్ణ (40) ఉన్నారు. నిర్మల్ నుంచి వాహనాన్ని సిద్ధయ్య నడిపాడు. అక్కడ తొమ్మిదేళ్ల కూతురుతో కలిసి 27 ఏళ్ల మహిళ బస్సెక్కింది. అప్పుడే ఆమెపై అదనపు డ్రైవర్ కృష్ణ కన్నేశాడు. ఆమె తనకు మాత్రమే టికెట్ తీసుకోవడం, కూతురుకు తీసుకోకపోవడాన్ని గమనించి మాటల్లో పెట్టాడు. మధ్య సీట్లలో కాకుండా బస్సు చివరి సీట్లోకి వెళ్లి కూర్చుంటే పాపను పడుకోబెట్టడానికి ఇబ్బంది ఉండదంటూ సలహా ఇచ్చాడు. అతడు చెప్పినట్లే పాపతో కలిసి ఆమె చివరి సీట్లోకి వెళ్లి పడుకుంది. అర్ధరాత్రి 12:15 గంటలకు బస్సు హైదరాబాద్ సమీపంలోకి చేరుకుంది. బస్సులో ప్రయాణికులంతా గాఢనిద్రలో ఉన్నారు. ఆ సమయంలో అదనపు డ్రైవర్ కృష్ణ, వెనుక సీట్లోకి వెళ్లాడు. అక్కడ బాలికతో కలిసి నిద్రిస్తున్న మహిళపై అత్యాచారానికి యత్నించాడు. నిద్రలోంచి లేచిన ఆమె.. షాక్‌లోంచి తేరుకునేలోపే నోట్లో బెడ్‌షీట్‌ను కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం.. ఏమీ ఎరగనట్లు బస్సు నడుపుతున్న సిద్ధయ్య వద్ద కొచ్చి పక్కసీట్లో కూర్చున్నాడు. కొద్దిసేపటికి దిగ్భ్రాంతి నుంచి తేరుకున్న బాధితురాలు.. తన పట్ల జరిగిన ఘోరాన్ని చెప్పుకొని, వారి సాయంతో డయల్-100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారమిచ్చింది. అప్రమత్తమైన పోలీసులు ఆ బస్సును ఛేజ్ చేసి తార్నాక మెట్రో స్టేషన్ వద్ద పట్టుకున్నారు. అప్పటికే నిందితుడు కృష్ణ మెట్టుగూడ చౌరస్తాలో బస్సులో నుంచి దూకి పారిపోయాడని ప్రయాణికులు చెప్పారు. బస్సు నడుపుతున్న సిద్ధయ్యను అదుపులోకి తీసుకుని బస్సును సీజ్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన ఓయూ పోలీసులు వైద్యపరీక్షల నిమిత్తం బాధితురాలిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కృష్ణను పట్టుకునేందుకు రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం అతడిని మంగళవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుంది.

లోకేశ్ ప్రజాదర్బార్‌కు పోటెత్తిన ప్రజలు

- 20వ రోజూ భారీగా విచ్చేసిన అర్జీదారులు

తాడేపల్లి, జూలై 30: గత ప్రభుత్వ హయాంలో సమస్యలు పరిష్కారం కాక కష్టాలు, కన్నీళ్లతో కాలం వెళ్లదీసిన బాధితులకు మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్ భరోసా ఇస్తోంది. ప్రజల విన్నపాలపై తక్షణమే స్పందిస్తున్న ఆయన.. అప్పటికప్పుడు పలు సమస్యలు పరిష్కరిస్తున్నారు. దీంతో జనం కొండంత ఆశతో ప్రజాదర్బార్‌కు తరలివస్తున్నారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో మంగళవారం 20వ రోజు కూడా ప్రజాదర్బార్‌కు పోటెత్తారు. వారందరి నుంచీ ఆయన అర్జీలు స్వీకరించారు. పలువురు దివ్యాంగుల వద్దకు తానే వెళ్లి ఆప్యాయంగా పలుకరించి.. చేతిలో చేయి వేసి మాట్లాడారు. అర్జీలు తీసుకుని వారి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

- విశాఖ మధురవాడలో నేషనల్ హైవే 5, బీచ్ రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయామని.. తగిన నష్ట పరిహారం ఇప్పించాలని మంగళగిరి నియోజకవర్గం శృంగారపురానికి చెందిన మొవ్వ చంద్రశేఖర్ రావు, పొట్లూరి గౌతం, కావూరి నరసింహారావు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు.
- నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం సిద్దాపురానికి చెందిన ఇరుగుదిండ్ల నాగమ్మ లోకేశ్‌ను కలిసి.. గ్రామంలో దశాబ్దాలుగా తన భర్త పేరుతో ఉన్న 5 ఎకరాల 73 సెంట్ల భూమిని వైసీపీ నేతలు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు, నకిలీ పాస్‌పుస్తకాలు సృష్టించారని కన్నీటిపర్యంతమయ్యారు. చర్యలు తీసుకుంటానని మంత్రి భరోసా ఇచ్చారు.
- కర్నూలు జిల్లా గుండ్లకొండలో 2014-19 మధ్య అంగన్‌వాడీ పాఠశాల భవనం, సీసీరోడ్డు, ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్డి నిర్మించానని.. వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని.. ప్రజా ప్రభుత్వంలోనైనా బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని వడ్డే తిరుపాలు అభ్యర్థించారు.
- ఆర్టీసీలో విజిలెన్స్ సెక్యూరిటీ విభాగంలో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న తమకు 11వ వేతన సవరణ ద్వారా జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని ఏపీఎస్ ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.
- విజయనగరం జిల్లా రాజాం మండలం పొగిరి గ్రామానికి చెందిన హేమలత... 17ఏళ్ల తన కుమారుడు 2నెలల కింద అదృశ్యమయ్యాడని ఎంత వెతికినా జాడ లేదని కన్నీటిపర్యంతమయ్యారు.



దివ్యాంగుడి నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న లోకేశ్

ప్రజాదర్బార్‌కు ఆరోజులు సెలవు

బుధవారం నుంచి ఆగస్టు 5 వరకు ప్రజాదర్బార్ నిర్వహించడం లేదని లోకేశ్ కార్యాలయం ప్రకటించింది. తదుపరి ఎప్పుడు నిర్వహించేదీ ఒక రోజు ముందుగానే తెలియజేస్తామని వెల్లడించింది.



ఎస్ఐ శివ ప్రసాద్‌ను తోసేస్తున్న వైసీపీ నాయకుడు

జగన్ సాక్షిగా వైసీపీ మూకల హల్‌చల్

- గన్నవరంలో ఎస్ఐను తోసేసి దురుసు..

గన్నవరం, జూలై 30: గన్నవరం విమానాశ్రయంలో వైసీపీ మూకలు పోలీసులపై తిరగబడ్డారు. బెంగళూరు నుంచి ఇండిగో విమానంలో మంగళవారం మాజీ సీఎం జగన్ సతీసమేతంగా వచ్చారు. ఆయన బయటకు వస్తుండగా వైసీపీ శ్రేణులు ఎరైవల్ వద్దకు తోసుకువచ్చారు. జగన్‌కు భద్రత విధులు నిర్వహిస్తున్న గన్నవరం ఎస్ఐ శివప్రసాద్‌తో పాటు కానిస్టేబుళ్లను తోసివేశారు. ఎస్ఐపై తిరగబడిన వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా కాన్వాయ్‌లో పారిపోయారు. కేసు నమోదు చేసేందుకు అతడి ఆచూకీ కోసం చూస్తున్నట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

జగన్ 'హోదా' పిటిషన్.. విచారణార్హతపై కౌంటర్ వేయండి

- న్యాయ శాఖ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశం
- అసెంబ్లీ, స్పీకర్ కార్యదర్శులకు నోటీసులు

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): శాసనసభలో తనకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేలా ఆదేశించాలని కోరుతూ మాజీ సీఎం జగన్ దాఖలు చేసిన వ్యాజ్యం విచారణార్హతపై కౌంటర్ దాఖలు చేయాలని శాసన వ్యవహారాలు, న్యాయశాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. ప్రతిపక్ష నేత హోదా కోసం స్పీకర్‌కు వినతి సమర్పించామని, దానిపై ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదని ఆయన తరఫు సీనియర్ న్యాయవాది చెబుతున్నారని గుర్తుచేసింది. ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించాలని అసెంబ్లీ కార్యదర్శికి, స్పీకర్ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. వ్యాజ్యం విచారణార్హతకు లోబడి ఉత్తర్వులు ఉంటాయని స్పష్టం చేసింది. పిటిషన్‌లో వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా పేర్కొన్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌కు నోటీసులిచ్చేందుకు నిరాకరించింది. విచారణను మూడువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనకు ప్రతిపక్ష నేత హోదా కల్పించేలా అసెంబ్లీ కార్యదర్శి, అసెంబ్లీ స్పీకర్ కార్యదర్శిని ఆదేశించాలని కోరుతూ జగన్ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రాగా, ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, జగన్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



స్టేడియాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

నగరం మొత్తం సైన్ బోర్డులు పెట్టాలి

● వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

లబ్బీపేట, జూలై 30: ప్రజల సౌకర్యార్థం నగరం మొత్తం సైన్ బోర్డులు పెట్టాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం బందర్ రోడ్డు, పటమట ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ కల్పిస్తున్న వసతులను ప్రజలకు తెలిపే సైన్‌బోర్డులను నగరం మొత్తం అమలు చేయాలని, దానిద్వారా ప్రజలకు పబ్లిక్ టాయిలెట్స్, అన్న క్యాంటీన్లు ఇతర సౌకర్యాలు గురించి తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఐజీఎంసీ స్టేడియంలో ఆగష్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు తీసుకోవాల్సిన చర్యలను, ఎలాంటి లోపం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నవళి, జోనల్ కమిషనర్లు కే ప్రభుదాస్, శివరామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



అనుమోలు ప్రభాకరరావుకు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ అధ్యక్షుడు కోయ ఆనంద్ ప్రసాద్

కిలిమంజారో పర్వత అధిరోహకుడు

అనుమోలుకు ఎమ్మెల్యే అభినందన

పెనమలూరు, జూలై 30: దక్షిణాఫ్రికా టాంజానియాలోని కిలిమంజారో పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించి అక్కడ జాతీయ, టీడీ పీ జెండాలను ఎగురవేసి జన్మభూమికి విచ్చేసిన టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావుకు ఘనస్వాగతం లభించింది. మంగళవారం స్వస్థలానికి విచ్చేసిన ఆయనకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు కోయ ఆనంద్ ప్రసాద్ స్వాగతం పలికి పోరంకి టీడీపీ కార్యాలయంలో అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా అనుమోలు మాట్లాడుతూ గతంలో సైకో జగన్‌రెడ్డి చంద్రబాబును అక్రమంగా జైలులో నిర్బంధించినందుకు నిరసనగా, దాన్ని లోకానికి చాటేందుకు తాము ఎవరెస్టు బేస్‌మెంట్ వరకు వెళ్లి సైకో నిర్వాకాన్ని ప్రపంచానికి చాటి చెప్పామని, చంద్రబాబు తిరిగి అధికారంలోకి వచ్చిన సందర్భంగా మళ్లీ దక్షిణాఫ్రికా టాంజానియాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి చంద్రబాబుకు, స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు, రాష్ట్ర ప్రజలకు శుభాభినందనలు తెలిపామన్నారు. టాంజానియాలోని వాతావరణ పరిస్థితులు, తమ పర్వతారోహణ సందర్భంగా అనుభవాలను ఆయన అందరితో పంచుకొన్నారు.



రైఫిల్ షూటింగ్ అకాడమీలో సంబరాలు చేసుకుంటున్న షూటర్లు

ఒలింపిక్స్‌లో విజయాలపై షూటర్ల సంబరాలు

విజయవాడ స్పోర్ట్స్, జూలై 30: పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో షూటింగ్ విభాగంలో భారత్ రెండు కాంస్యాలను వశం చేసుకోవడంపై తాడిగడప ఎల్‌వీ గార్డెన్స్‌లోని ది ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ వద్ద శిక్షణ పొందుతున్న పలువురు షూటర్లు బాణాసంచా కాల్చి, కేక్‌కట్ చేసి మంగళవారం సంబరాలు చేసుకున్నారు. 10 మీటర్ల పిస్టల్ విభాగంలో మనూ బాకర్ కాంస్యం వశం చేసుకోగా, మంగళవారం మిక్స్‌డ్ విభాగంలో భారత్ తరపున మనూ బాకర్ సర్బ్‌జ్యోత్ సింగ్ రెండో కాంస్యాన్ని సాధించడంపై క్రీడాకారులు సంబరాలు చేసుకున్నా రు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్, చీఫ్ కోచ్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ 2024 ఒలింపిక్స్‌లో ఇండియాకు షూటింగ్ స్పోర్ట్స్ నుంచి ఇప్పటికే రెండు కాంస్యాలు రావడం ఆనందం ఉందన్నారు.

కేడీసీఏ సీనియర్ పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్, జూలై 30: 2024-25 క్రికెట్ సీజన్‌లో మల్టీడే మ్యాచ్‌లు ఆడే ఉమ్మడి కృష్ణా సీనియర్ పురుషుల క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్టు కేడీసీఏ సెక్రటరీ ఎం. రవీంద్ర చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. జట్టు వివరాలిలా ఉన్నాయి. వై.సందీప్ (కెప్టెన్), ఎ బ్రహ్మతేజ, టి.శివకుమార్, వై ప్రమోద్, వి విశాల్, ఏ లలిత్ మోహన్, ఎంఏ ప్రణీత్, పీవీ దుర్గారావు, ఎం శ్యామ్, సీహెచ్ సూర్యకుమార్, టీ భాగ్యరాజ్, ఎం శుశాంత్ నాయుడు, జీ చంటి, పీ రూకేష్‌బాబు, పీ వెంకటేష్‌తో పాటు స్టాండ్‌బైలుగా అమిత్ చాత్రి, ఎం మానస్, పీ అనంత కార్తికేయ, సీహెచ్ యోచన్ రాజేష్ మాలిక్‌ను ఎంపిక చేసినట్టు వివరించారు.



గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ మహాలక్ష్మీ తదితరులు

తైక్వాండో పోటీల్లో భాష్యం బ్లూమ్స్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు (విద్య), జూలై 30: జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో పోరంకి భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు బహుమతులు సాధించారని ప్రిన్సిపల్ మహాలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న ఆంధ్రాలయోలా కళాశాలలో నిర్వహించిన కృష్ణాజిల్లా సబ్ జూనియర్, క్యాడెట్ చాంపియన్‌షిప్ పోటీల్లో భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు 47 మంది పాల్గొన్నారని, ఇందులో ఆరు గోల్డ్‌మెడల్స్, అయిదు సిల్వర్, 10 బ్రాంజ్‌మెడల్స్ సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, కోచ్ వీ విక్టర్ ఆదిత్య, కృష్ణాజిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శులు ఎం అంకమ్మరావు అభినందించారు.

వస్త్ర వ్యాపారుల ధర్నా

జగ్గయ్యపేట, జూలై 30: చిన్న వ్యాపారుల మనుగడకు ప్రభుత్వం చట్టం తేవాలని పట్టణ రెడీమేడ్ అండ్ గార్మెంట్స్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దుల ఉమామహేశ్వరరావు కోరారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో మంగళవారం చిరు వ్యాపారులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పట్టణాల్లో షాపింగ్ మాల్స్ గుత్తాధిపత్యం వల్ల తమ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నెహ్రూ చౌక్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు రెడీమేడ్ వస్త్ర దుకాణాల వ్యాపారులు ప్రదర్శన నిర్వహించారు. అసోసియేషన్ నేతలు నరేంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.







శానిటేషన్ సిబ్బంది సారెలో పాల్గొన్న ఈవో రామారావు, కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి) బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఈఈ రమాదేవి, కేశఖండన శాల ఉద్యోగుల సారె సందర్భంగా పూజలు చేస్తున్న ఈవో

దుర్గగుడి మాస్టర్‌ప్లాన్‌పై కమిషనరేట్‌లో చర్చ

వన్‌టౌన్, జూలై 30: దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌పై సాంకేతిక నిపుణుల బృందం మంగళవారం దేవదాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో చర్చించారు. దేవదాయ కమిషనర్ ఆదేశాల మేరకు దుర్గగుడి, ద్వారకాతిరుమల, శ్రీకాళహస్తి దేవస్థానాల మాస్టర్‌ప్లాన్లపై చర్చించారు. దుర్గగుడిలో జరుగుతున్న లడ్డూ ప్రసాదం పోటు భవనం, అన్నదాన భవనం, ఎలివేషన్ క్యూలు, పూజా మండపాలు, యాగశాల నిర్మాణం, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు వంటి అంశాలపై ఈవో రామారావు, ఇంజనీరింగ్ అధికారులు ప్రగతి నివేదికను సమర్పించారు. అనంతరం కమిటీ నిపుణుల బృందం దేవదాయ కమిషనర్‌ను కలిశారు. సాంకేతిక నిపుణుడు ఆర్ కొండలరావు నేతృత్వంలో సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ సివిల్ విభాగం డీన్ ప్రొఫెసర్ పాండురంగారావు, ప్రొఫెసర్ రమేష్‌కుమార్, దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ శేఖర్, స్థపతి పరమేశ్వరప్ప పాల్గొన్నారు,

నిపుణుల బృందం పనుల పరిశీలన

ఇంద్రకీలాద్రి కొండ దిగువన, ఎగువన జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం నిపుణుల బృందం పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలిచ్చారు. సాంకేతిక నిపుణుడు ఆర్ కొండలరావు ఆధ్వర్యంలో నగరంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ సివిల్ డిపార్ట్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ పాండురంగారావు, ప్రొఫెసర్ రమేష్‌కుమార్, దేవదాయశాఖ చీఫ్ ఇంజనీర్ శేఖర్, దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప పనులను పరిశీలించిన వారిలో ఉన్నారు. ఈవో రామారావు, ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి పనుల ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా నిపుణుల కమిటీ పలు సూచనలు చేసింది.





కొండ పనులను పరిశీలించిన నిపుణుల బృందం, హైకోర్టు జడ్జి శ్రీనివాస్ దంపతులకు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఈవో రామారావు

కేశఖండనశాల విభాగం సారె సమర్పణ

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు మంగళవారం కేశఖండనశాల సిబ్బంది సారె సమర్పించారు. తొలుత ఈవో రామారావు దంపతులకు కేశఖండనశాలలో సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వారిని సత్కరించారు. ఈవో దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం ఏఈవోలు చంద్రశేఖర్, రమేష్‌బాబులను సత్కరించి ఆనందోత్సాహాలతో కొండపైన కొలువైన అమ్మవారికి సారె సమర్పించారు.

శానిటేషన్ సిబ్బంది సారె సమర్పణ

ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు ఆలయ శానిటేషన్ సిబ్బంది సారె సమర్పించారు. ఈవో రామారావు దంపతులు, ఈఈ రమాదేవి, 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, శానిటేషన్ విభాగం అధికారులు, ఏఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు. తొలుత జమ్మిదొడ్డి వద్ద పూజలు నిర్వహించి ఊరేగింపుగా కొండపైకి చేరుకున్నారు. జై భవానీ అంటూ నినాదాలు చేస్తూ అమ్మవారిని శరణు కోరుతూ ఊరేగింపుగా వచ్చిన సిబ్బంది మహామండ పం ఆరో అంతస్తులో వేదిక వద్ద అమ్మవారికి సారె సమర్పించి అర్చనలు నిర్వహించారు. అర్చకులు ఆశీస్సులు అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో రాష్ట్ర హైకోర్టు జడ్జి

కనకదుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు జడ్జి వి.శ్రీనివాస్ దంపతులు దర్శించుకున్నారు. తొలుత ఆయనకు అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఈవో రామారావు వారికి ప్రసాదం, శేషవస్త్రం అమ్మవారి చిత్రపటం అందజేయగా, అర్చకులు ఆశీర్వదించారు.

మానవ అక్రమరవాణా నేరం: కలెక్టర్



విద్యార్థినులతో ప్రమాణం చేస్తున్న కలెక్టర్ సృజన, కాలేజ్ యాజమాన్యం

పటమట, జూలై 30: మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని, దీనివల్ల బాలికలు, పిల్లలు ఎక్కువగా బలవుతున్నారని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆవేదన వ్యక్తం చేశారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ సృజన మాట్లాడుతూ పరిచయం లేని వ్యక్తులను నమ్మవద్దని, కష్టపడి పనిచేసి పొందే ఫలితాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్‌ను మలచుకోవడంలో ఎవరి ప్రలోభాలకు, మాయమాటలకు గురి కారాదని, సాంఘిక అరాచకాలను ఎదుర్కోవడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలన్నారు. ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఫోరమ్ ఫర్ చైల్డ్‌రైట్స్ సంస్థ ప్రతినిధి కోటేశ్వరరావు మాట్లాడుతూ బాలలు, మహిళల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సృజన మానవ అక్రమ రవాణా అరికట్టడంలో యువత, విద్యార్థినులు భాగస్వామ్యం అవుతామనే ప్రతిజ్ఞ చేయించి, మానవ అక్రమ రవాణాకు వ్యతిరేక పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ పీడీ ఉమాదేవి, దిశ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ అనూష, కరస్పాండెంట్ లీనా క్వాడ్రస్, డాక్టర్ ఇన్నాసియా, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషకుమారి, ఇంటర్ వైస్ ప్రిన్సిపల్ స్వప్న, డాక్టర్ లావణ్య, మంగాదేవి, చైల్డ్‌రైట్స్ ఫోరమ్ సభ్యులు రమేష్, ప్రకాష్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి: విముక్తి

ధర్నాచౌక్: రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా నిరోధించడానికి కఠిన చర్యలు తీసుకుకోవాలని అక్రమ రవాణా బాధిత మహిళల రాష్ట్ర సమాఖ్య 'విముక్తి' అధ్యక్ష, కార్యదర్శులు అపూర్వ, పుష్పకుమారి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బాధిత మహిళలకు నష్ట పరిహారం అందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కమ్యూనిటీ ఆధారిత పునరావాసం పేరుతో ప్రత్యేకంగా ఒక పథకం రూపొందించాలన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. బాధితుల సమస్యలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంశాఖ మంత్రి అనిత దృష్టి సారించాలన్నారు. అక్రమ రవాణాలో బయటపడిన వారిని నేరస్థుల్లా షెల్టర్‌హోమ్‌లో ఏళ్ల తరబడి పాటు నిర్బంధంలో ఉంచకుండా సమాజంలో జీవించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల

సమస్యలు పరిష్కరించాలి

ట్రెజరీలు, అకౌంట్స్ సంచాలకుడికి సీపీఎస్ ఉద్యోగుల వినతి



ట్రెజరీలు, అకౌంట్స్ సంచాలకుడు మోహనరావుకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

వన్‌టౌన్, జూలై 30: సీపీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ట్రెజరీలు, అకౌంట్స్ సంచాలకుడు ఎన్.మోహనరావుకు సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ (సతీష్), జిల్లా అధ్యక్షుడు కె.ప్రభాకరరావులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల ఎన్‌పీఎస్ ఖాతాల నుంచి మూడుసార్లు పాక్షిక ఉపసంహరణకు అనుమతిచ్చినా జిల్లా ట్రెజరీల్లో సెల్ఫ్ డిక్లరేషన్లతో అనుమతి ఇవ్వడం లేదన్నారు. కరోనా సమయంలో అనుమతి ఇచ్చిన విధంగానే ఆన్‌లైన్‌లో పాక్షిక ఉపసంహరణకు వీలు కల్పించాలన్నారు. రిటైర్ అయిన సీపీఎస్ ఉద్యోగులకు 6 నెలలుగా పెండింగులో ఉన్న గ్రాట్యుటీ పేమెంట్లను క్లియర్ చేయాలన్నారు. పాత పెన్షన్ విధానంలో ఉన్న ఉద్యోగులకు సంబంధించి పీఎఫ్ అకౌంట్లో పడిన జమలను ఎన్‌పీఎస్ ఖాతాల్లో జమ చేయాలన్నారు. ప్రాన్ అకౌంట్లలోని మాస్టర్ వివరాల మార్పు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. జీపీఎస్‌ను నిలుపుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, ఎన్‌పీఎస్ పెన్షన్ సెటిల్‌మెంట్ కోసం జిల్లా ట్రెజరీలకు తగు ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. 8 నెలలుగా మ్యాచింగ్ గ్రాంట్ జమ కావడం లేదని ఇటువంటి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వారు కోరారు.



రైల్వే స్టేషన్‌లో అనధికార విక్రేతలను పట్టుకున్న తనిఖీ బృందం

రైల్వేస్టేషన్‌లో అనధికార విక్రేతల పట్టివేత

రైల్వేస్టేషన్, జూలై 30: స్థానిక ప్రధాన రైల్వేస్టేషన్‌లో డీసీఎం ఎండీ అలీఖాన్ పర్యవేక్షణలో మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో నలుగురు అనధికార విక్రేతలను పట్టుకున్నారు. వారి నుంచి రూ.20వేలు జరిమానా వసూలే చేశారు. క్యాటరింగ్ విక్రేతలు ఎంఆర్‌పీ ధరలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పరిశుభ్రత పాటించాలని, ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. అదనపు చార్జీలు వసూలు చేస్తే ప్రయాణికులు రైలు మదద్ 139 నెంబరుకు ఫోన్ చేయాలని సీనియర్ డీసీఎం వీ రాంబాబు తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలిక

● 3 గంటల్లో గుర్తించిన పోలీసులు

విజయవాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): హోంవర్క్ చేయలేదని తల్లి మందలించినందుకు ఓ బాలిక ఇంటి నుంచి పారిపోయింది. ఫిర్యాదు అందుకున్న 3 గంటల్లో ఆ బాలికను గుర్తించిన పోలీసులు తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. నగరంలోని పాయకాపురం ప్రశాంతినగర్‌కు చెందిన బోయిన రాంబాబు కుమార్తె ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువుతోంది. సోమవారం ఇచ్చిన హోంవర్క్‌ను చేయలేదని ఆయన భార్య కుమార్తెను మందలించింది. మంగళవారం ఉదయం ఆమె పాల ప్యాకెట్ కోసం బయటకు వెళ్లగా బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి బాలిక కనిపించలేదు. దీనితో భార్యభర్తలు కుమార్తె కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో నున్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీసీపీ టి.హరికృష్ణ ఆధ్వర్యంలో మొత్తం ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లిన మార్గంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాలిక ముందుగా అక్కడే గాంధీపురంలో ఉన్న ఓ ఇంటికి పని ఇప్పించమని అడిగింది. తర్వాత మరో ఇంటికి నీరసంగా ఉందని చెప్పడంతో వారు ఇడ్లీ పెట్టారు. సీసీ కెమెరాల్లో బాలికను గుర్తించిన పోలీసులు ఇంటింటికీ వెళ్లి విచారణ చేయగా ఆచూకీ తెలిసింది. బాలిక గాంధీపురంలో ఉందని గ్రహించిన పోలీసులు ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టి గుర్తించారు. తల్లిదండ్రులు బాలిక పాత ఫొటోను ఇవ్వడంతో పోలీసులు గుర్తించలేకపోయారు. తర్వాత బాలిక ఫొటోను తీసి వాట్సాప్‌లో తల్లిదండ్రులకు పంపారు. ఆ బాలిక తమ కుమార్తెనని వారు నిర్ధారించడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీసీపీ హరికృష్ణ, నున్న ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

సీపీని కలిసిన వైసీపీ నేతలు

విజయవాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబును వైసీపీ నేతలు కలిశారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైసీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాశ్, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా కమిషనర్ కార్యాలయంలో మంగళవారం కలిసి ఇండోర్స్‌మెంట్‌ను అందజేశారు.

అరకొర జీతాలతో

ఇబ్బందులు పడుతున్నాం

● ఏపీ రెవెన్యూ అసోసియేషన్ నేతలు

కృష్ణలంక, జూలై 30: ఆరేళ్లలో రూపాయి కూడా జీతాల పెంపు లేక గ్రామ రెవెన్యూ సహాయకులు ఇబ్బందులు పడుతున్నారని ఏపీ రెవెన్యూ అసోసియేషన్ నేతలు బొప్పరాజు వెంకటేశ్వర్లు, గ్రామ రెవెన్యూ సహాయకులు గరికపాటి బ్రహ్మయ్య, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు విన్నవించారు. ఈ మేరకు ఒక వినతిపత్రం సమర్పించారు. కనీసం రేషన్ షాపులకు బియ్యం రవాణా చేసే ఆపరేటర్ కంటే తక్కువ వేతనాలను గ్రామ రెవెన్యూ సహాయకులు పొందుతున్నారన్నారు. జీతాలు పెంచకపోగా 2018 నుంచి 2021 వరకు చెల్లిస్తున్న డీఏను గత ప్రభుత్వం వెనక్కి తీసుకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వెనక్కి తీసుకొన్న డీఏ డబ్బులు తిరిగి చెల్లించాలని, రెవెన్యూశాఖకు పట్టుకొమ్మగా ఉన్న గ్రామ స్థాయి వ్యవస్థలో 24 గంటలూ విధి నిర్వహణలో ఉండే ఉద్యోగులే గ్రామ రెవెన్యూ సహాయకులన్నారు. ఆర్.వి.రాజేష్, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



మంత్రి సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న బొప్పరాజు, గరికపాటి

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

నందిగామ రూరల్: కంచికచర్ల మండలం కీసరలోని ఆర్‌సీఎం చర్చిలో ప్రేమ జంట వివాహం చేసుకుని రక్షణ కల్పించాలని సోమవారం రాత్రి పోలీసులను ఆశ్రయించారు. సోమవరం గ్రామానికి చెందిన జిల్లేపల్లి సతీష్ అదే గ్రామానికి చెందిన సరళ ప్రేమ వివాహం చేసుకున్నారు. వారి వివాహాన్ని కుటుంబ సభ్యులు అంగీకరించకపోవటంతో రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించగా ఎస్సై పండుదొర ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

గ్రామాల్లో జలజీవన్ మిషన్ ప్రతినిధుల పర్యటన

వీరులపాడు: ఇంటింటికీ కుళాయిలో భాగంగా పొన్నవరం, తిమ్మాపురం గ్రామాల్లో మంగళవారం జాతీయ జలజీవన్‌మిషన్ ప్రతినిధులు పి.ముసలిరెడ్డి, ఎన్.భారత్ పర్యటించారు. నీటి నాణ్యత, పీహెచ్ క్లోరిన్ పరీక్షలను చేశారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, పలు ఇళ్లలో తనిఖీలు చేశారు. సర్పంచ్ పొడగిరి రాజశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం: వెన్నుపూస నొప్పి భరించలేక గడ్డిమందు తాగి ఆత్మహ త్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందా డు. తుమ్మలపాలెం గ్రామానికి చెందిన ఇసుకపల్లి ఏసుబాబు (30) ఎలక్ట్రీషి యన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి వెన్నుపూస నొప్పి అధికంగా కావడంతో బాధ భరించలేక గడ్డిమందు తాగాడు. సోదరుడు గమనించి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వెల్ఫేర్ ఫండ్‌పై పునరాలోచించండి

● బార్ కౌన్సిల్‌కు రాజా విన్నపం

విజయవాడ లీగల్, జూలై 30: ఇటీవల బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 35ఏళ్ల పైబడి 60ఏళ్ల లోబడి ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదుల సౌలభ్యానికి వెల్ఫేర్ ఫండ్ చెల్లించుకొనే అవకాశం కల్పించారని, ఇలాంటి నిర్ణయం తీసుకొన్న ఛైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డి, సభ్యులకు ముందుగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు బెజవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరిగల శివరాం ప్రసాద్ (రాజా) తెలిపారు. గతంలో 35ఏళ్లు పైబడిన న్యాయవాదులు వెల్ఫేర్ ఫండ్ కట్టేందుకు అనర్హులని, వారికి ఎలాంటి ప్రయోజనాలు వర్తించేవి కావన్నారు. నిబంధనలు సవరించిన బార్ కౌన్సిల్ 36 నుంచి 40 ఏళ్లు కల్గిగిన న్యాయవాదులు రూ.35 వేలు, 46 నుంచి 50 ఏళ్లున్న వారు రూ.40 వేలు, 51 నుంచి 55 ఏళ్లున్న వారు రూ.45 వేలు, 55 నుంచి 60 మధ్య వయస్సున్న న్యాయవాదులు రూ.55 వేలు కట్టాలని నిర్ణయించారన్నారు. ఈ మొత్తాలను కట్టడం న్యాయవాదులకు తలకు మించిన భారంగా ఉందని, కావున బార్ కౌన్సిల్ ఛైర్మన్, సభ్యులు పెద్దమనస్సుతో పునరాలోచించి పై మొత్తాలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని రాజా విన్నవించారు. ఈ మేరకు బార్ కౌన్సిల్ ఛైర్మన్, సభ్యులకు వినతిపత్రాన్ని అందజేయనన్నట్టు తెలిపారు.

విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యనిర్వాహక వర్గం

అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా రవికుమార్, వక్కలగడ్డ శ్రీకాంత్



ధర్నాచౌక్, జూలై 30: విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నూతన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా గడ్డం బాల వెంకట రవికుమార్, వక్కలగడ్డ శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి కేవీవీ పరమేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశా రు. ఉపాధ్యక్షులుగా వీవీకే నరసింహారావు, దర్శి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలుగా ఈమని దామోదరరావు, బాలకృష్ణ లోయ, కోశాధికారిగా తమ్మన శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిపారు. ఈ కార్యనిర్వహక వర్గ సభ్యులు 1 ఆగస్టు నుంచి 31 మార్చి 2026 వరకు పదవిలో ఉంటారన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర పురోభివృద్ధి

● ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

జి.కొండూరు, జూలై 30: అపార అనుభవం, దార్శనికత ఉన్న సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం పురోగమించడం ఖాయమని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. జి.కొండూరు కమ్యూనిటీ హాల్లో మంగళవారం జరిగిన మహా కూటమి నేతల ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ ప్రజల కలల రాజధాని అమరావతికి కేంద్రం రూ.15 వేల కోట్లు ఇచ్చింది అంటే అందులో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల పాత్ర గొప్పదన్నారు. పోలవరం ప్రాజెక్టును సైతం ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. పేదవానికి మూడు సెంట్ల స్థలం ఇచ్చి పక్కా గృహ నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని చంద్రబాబు ప్రకటించడం పేదలకు వరంలాంటిదన్నారు. మండలానికి రూ.5 కోట్లు నిధులు మంజూరయ్యాయని వాటితో అవసరమైన చోట సీసీ రోడ్లు, పక్కా డ్రెయినేజీల నిర్మాణం చేపడతామన్నారు. గ్రామాల్లో భూ సేకరణ చేసి నివేశన స్థలాలు ఇస్తామన్నారు. జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాలకు తన ప్రతినిధిగా పంచాయతీరాజ్ విశ్రాంత ఏఈ శేషగిరిరావును నియమిస్తున్నట్లు తెలిపారు. గడ్డమణుగు లోయలో పంట పొలాల్లో బోర్ల నుంచి కలుషిత వాటర్ వస్తుందని బాటిల్‌లో పట్టిన నీటిని గడ్డమణుగు టీడీపీ నాయకుడు నూతక్కి రాజారావు ఎమ్మెల్యేకు చూపించారు. మూతపడిన కెమికల్ ఫ్యాక్టరీ వ్యర్థాలు అక్కడే వదిలేయడం వల్ల అవి భూగర్భ జలాల్లో ఇంకిపోయి ఇలా రంగుమారిన నీరు వస్తుందని, ఆనీరు వాడితే పంట పొలాలు పాడవుతున్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ఆర్టీసీలో సమస్యలు పరిష్కరిస్తాం

▸ ఈయూకు రవాణా మంత్రి రాంప్రసాద్ రెడ్డి హామీ


టీడీపీ కేంద్ర కార్యాలయంలో అర్జీలు తీసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): 'ఆర్టీసీ కోసం గడిచిన ఐదేళ్లలో ఒక్క కొత్త బస్సు కొనలేదు. అంతకు ముందున్న నాలుగు వేల బస్సులు రద్దు చేశారు. కొత్త బస్సులు కొనాలి. ఉద్యోగుల ఖాళీలు భర్తీ చేయాలి' అంటూ రవాణాశాఖ మంత్రి రాం ప్రసాద్ రెడ్డి ముందు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ సమస్యలు ఏకరువు పెట్టింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ రావు నేతృత్వంలోని ఈయూ బృందం మంగళవారం విజయవాడలో మంత్రితో భేటీ అయింది. రవాణా సంస్థలో సమస్యలు, సిబ్బంది కొరత, మెడికల్ అన్‌ఫిట్ సిబ్బందికి ప్రత్యామ్నాయం, బస్సుల దుస్థితి, అలవెన్సుల పునరుద్ధరణ, అర్హులకు పదోన్నతులు తదితర అంశాలపై చర్చించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు కల్పించడంలో సిబ్బంది, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, సమస్యలు ఒక్కొక్కటిగా ప్రభుత్వం పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుందని హామీ ఇచ్చారు.

ఏపీలో 75వేల క్యాన్సర్ కేసులు..

ఏపీలో 2023 సంవత్సరం నాటికి 75,086 క్యాన్సర్ కేసులు ఉన్నట్లు కేంద్రం అంచనా వేసింది. రాజ్యసభ సభ్యుడు మదన్ రాథోడ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ ఈ మేర లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అలాగే, తమకున్న అంచనాల మేరకు తెలంగాణలో 51,145 క్యాన్సర్ కేసులున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా 14,96,972 క్యాన్సర్ కేసులున్నాయన్నారు.

'జల్ జీవన్'లో కలుషిత నీరు

▸ లోక్‌సభలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని

న్యూఢిల్లీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జల్ జీవన్ మిషన్ కింద అర్హులైన 2.67 లక్షల గ్రామీణ గృహాలు ఉంటే, గత ఐదేళ్లలో వాటిలో 59శాతం ఇళ్లకు మాత్రమే నీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చారని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే జలజీవన్ పనుల్లో పురోగతి లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం, లోక్‌సభలో ఎంపీ కేశినేని రూల్ 377 కింద మాట్లాడారు. తన నియోజకవర్గ పరిధిలో జల్ జీవన్ మిషన్ కింద సరఫరా అయ్యే తాగునీరు కలుషితంగా మారిందని తెలిపారు. దాదాపు 300 మంది డయేరియా బారినపడ్డారని, ఇందులో కొంతమంది మరణించారని తెలిపారు. కలుషిత నీటి సరాఫరాతో ప్రజలు తీవ్రభయాందోళనలకు లోనవుతున్నారని తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద సరాఫరా చేసే నీటిని నిరంతరం పరీక్షించాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. ఎన్టీఆర్ జిల్లాపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ విద్యార్థులకూ ఐటీ కొలువులు!

▸ టెక్బీ ప్రోగ్రాం ద్వారా హెచ్‌సీఎల్ టెక్ డిజిటల్ సపోర్టు ఎడ్యుకేషన్

▸ జిల్లాలవారీగా విద్యార్థుల ఎంపికకు ప్రత్యేక డ్రైవ్

▸ ఏపీ ఐటీ అకాడమీ సీఈవో సుర్జీత్‌సింగ్ వెల్లడి

అమరావతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఒకేషనల్, సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ విద్యార్థులకు ఐటీ రంగంలో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలకు తోడ్పడే విధంగా ఏడాది పాటు టెక్బీ ప్రోగ్రాం ద్వారా హెచ్‌సీఎల్ టెక్ డిజిటల్ సపోర్టు ఎడ్యుకేషన్ అందించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సీఈవో ఎన్.సుర్జీత్‌సింగ్ తెలిపారు. 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో ఇంటర్ తత్సమాన కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ఈ ఐటీ విద్య పొందడానికి అర్హులని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణకు జిల్లాల వారీగా విద్యార్థులను ఎంపిక చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. ఆగస్టు 6న కృష్ణా, 8న నెల్లూరు, 9న గుంటూరు,. ప్రకాశం, చిత్తూరు, 10న కడప, 13న కర్నూలు, 17న అనంతపురం, 19న పశ్చిమగోదావరి, 20న తూర్పుగోదావరి, 22న విశాఖ, 23న విజయనగరం, 24న శ్రీకాకుళం జిల్లాల్లో విద్యార్థుల ఎంపికకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని వివరించారు. ఇందులో ఎంపికైన విద్యార్థులకు మధురై, చెన్నై నగరాల్లోని హెచ్‌సీఎల్ కేంద్రాల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఉపాధి పొందడానికి తొలుత హెచ్‌సీఎల్ కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఉంటుందని, అందులో ప్రతిభ చూపినవారికి ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియల్లో విజయం సాధించినవారికి నియామక పత్రాలు అందజేస్తామని సుర్జీత్‌సింగ్ పేర్కొన్నారు. పూర్తిస్థాయి ఉద్యోగులుగా ఎంపికైనవారికి సంవత్సరానికి రూ. 1.7 లక్షల వేతనం, తర్వాత పనితీరు ఆధారంగా ప్రతి ఏటా వేతనంలో పెంపు ఉంటుందని వివరించారు. హెచ్‌సీఎల్‌లో ఉద్యోగం చేస్తూనే శస్త్ర, అమిటీ, కేఎల్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. 2024 విద్యా సంవత్సరానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ కోసం registrations.hcltechbee.com లో వీక్షించాలని సూచించారు.

హంద్రీ-నీవా ద్వారా రాయలసీమకు నీరందించాలి: సీపీఐ

అమరావతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం జలాశయం నీటితో నిండినప్పటికీ రాయలసీమకు నీళ్లిచ్చే పరిస్థితి లేకపోవడం విచారకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విచారం వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్‌ఏఐ డైవర్షన్ రోడ్డును తక్షణమే తొలగించి హంద్రీ-నీవా ద్వారా రాయలసీమ ప్రాంతానికి నీరందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంగళవారం ఆయన లేఖ రాశారు. కర్నూలు-ఆత్మకూరు హైవేలో బ్రిడ్జి కోసం హంద్రీ-నీవా కాలువను పూడ్చివేశారని, మరోవైపు రాయలసీమ ప్రాంతంలో వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆగస్టు ఒకటో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో రాయలసీమ కరువు ప్రాంతాల్లో పర్యటించాలని రామకృష్ణ కోరారు.

విద్యావిధానంతో క్రీడలను అనుసంధానించాలి

▸ అప్పుడే ప్రపంచ స్థాయి అథ్లెట్లను తయారు చేయగలం: ఏఎఫ్‌పీఐ

న్యూఢిల్లీ, జూలై 30: ఫుట్‌బాల్ వంటి క్రీడలను ప్రధాన అకడమిక్ విభాగంలోకి మార్చాలని, గణితం, సైన్స్ వంటి సబ్జెక్టులతో సమానంగా క్రీడలను కూడా అర్హతగా పరిగణించాలని అకాడమీ ఆఫ్ ఫ్యామిలీ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా(ఏఎఫ్‌పీఐ) సూచించింది. భారతీయ విద్యావిధానం అగ్రశ్రేణి ప్రపంచ స్థాయి నాయకులను తయారు చేసినప్పటికీ ఒలింపిక్స్‌లో మన దేశ ప్రదర్శన నామమాత్రంగానే ఉందని తెలిపింది. 'బిల్డింగ్ ఏ హెల్తీ నేషన్: ఒలింపిక్ క్రీడలు, భారత విద్యావ్యవస్థపై శ్వేతపత్రం' పేరిట ఏఎఫ్‌పీఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రమణ కుమార్ రచించిన శ్వేతపత్రాన్ని ఇటీవల విడుదల చేశారు. భారత ఒలింపిక్స్ ప్రదర్శనకు ఆటంకం కలిగిస్తున్న వ్యవస్థాగత సమస్యలను పరిశీలించి, క్రీడలను విద్యావిధానంతో అనుసంధానించడానికి వినూత్న సంస్కరణలను ప్రతిపాదించారు. 'జర్నల్ ఆఫ్ ఫ్యామిలీ మెడిసిన్ అండ్ ప్రైమరీ కేర్'లో ఈ శ్వేతపత్రం ప్రచురితమైంది. క్రీడారంగంలో తగిన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన కోచింగ్ లేకపోవడం, నిధుల కొరత వంటి కీలక సవాళ్ల గురించి వివరించారు. ఒలింపిక్ క్రీడలను సాధారణ విద్యతో సమానంగా పరిగణించాలని సూచించారు. ఈ సమస్యల పరిష్కారానికి పాఠశాల వ్యవస్థ, విద్యాసంస్థలు, ప్రభుత్వం, క్రీడా సంస్థలు, కార్పొరేట్ స్పాన్సర్లు సహా వివిధ భాగస్వాముల సమష్టి కృషి అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. మన విద్యావిధానం ఎందరో మేధావులను ప్రపంచానికి అందించిందని, అందులో క్రీడలను విలీనం చేయడం ద్వారా ప్రపంచ స్థాయి అథ్లెట్లను తయారు చేయవచ్చని పేర్కొన్నారు. దీనికోసం నేషనల్ స్పోర్ట్స్ ఓపెన్ స్కూల్ ఎగ్జామినేషన్ బోర్డు, నేషనల్ స్పోర్ట్స్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని రమణ కుమార్ కోరారు.

దేశంలో 1,12,112 ఎంబీబీఎస్ సీట్లు: కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): దేశంలో 2014కు ముందు 387 మెడికల్ కళాశాలలు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 731కి చేరిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2014కు ముందు 51,348 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, ఇప్పుడు ప్రస్తుతం 1,12,112 సీట్లు ఉన్నాయని వెల్లడించింది. రాజ్యసభలో వైసీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు మంగళవారం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి అనుప్రియ పటేల్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2014కు ముందు వైద్య కళాశాలల్లో 31,185 పీజీ సీట్లు ఉండగా, ప్రస్తుతం 72,627 సీట్లు ఉన్నాయని తెలిపారు. వైద్య కళాశాలల్లో 88 శాతం, ఎంబీబీఎస్ సీట్లలో 118 శాతం, పీజీ సీట్లలో 133 శాతం వృద్ధి జరిగిందన్నారు.

సర్కారు మారినా 'రివర్సే'నా!?

▸ అస్మదీయుల కోసమే నాడు రివర్స్ టెండర్లు

▸ వేరేవారు బిడ్‌లు వేయకుండా బెదిరింపులు

▸ రివర్స్ విధానాన్ని గట్టిగా వ్యతిరేకించిన టీడీపీ

▸ సర్కారు మారింది.. కానీ, అదే తరహా ప్రక్రియ

▸ చంద్రబాబు హయాంలో ఆన్‌లైన్ విధానం

▸ రివర్స్‌లో రింగై ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రివర్స్ టెండరింగ్! అప్పటికే పనులు చేస్తున్న కాంట్రాక్టర్లను మార్చి, అస్మదీయులకు పనులు అప్పగించి, కొత్తగా కమీషన్లు దండుకునేందుకు గత ప్రభుత్వం సరికొత్తగా తెచ్చిన విధానమిది! ఇందులో 'రింగు లీడర్లే' చక్రం తిప్పారు. ఈ విధానాన్ని అప్పట్లో టీడీపీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇప్పుడు... ప్రభుత్వం మారింది! అయినప్పటికీ రివర్స్ టెండరింగ్ పద్ధతే కొనసాగుతోంది. దీనిపై కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. తిరిగి పాత విధానాన్ని తీసుకురావాలని అభ్యర్థిస్తున్నారు.

ఇదీ నష్టం?

గతంలో ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా టెండర్లు పిలిచేవాళ్లు. రివర్స్ టెండరింగ్ ప్రక్రియ కూడా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. ఆన్‌లైన్‌లో టెండర్లు పిలుస్తారు. కాంట్రాక్టర్లు బిడ్‌లు కోట్ చేస్తారు. ఆ తర్వాత శాఖల అధికారులు బిడ్లు దాఖలు చేసిన కాంట్రాక్టర్లందరినీ ఆన్‌లైన్‌లోకి పిలుస్తారు. అందరికంటే తక్కువ (ఎల్1) ఎంతో చెప్పి... అంతకంటే తక్కువకు ఎవరైనా కోట్ చేస్తారా అని మిగిలిన కాంట్రాక్టర్లను అడుగుతారు. ఎవరైనా అందుకు ముందుకొస్తే వారికి టెండర్ కట్టబెడతారు. పైకి ఇదంతా పకడ్బందీగా జరుగుతున్నట్లు కనిపిస్తుంది. కానీ, కాంట్రాక్టర్లు అందరూ ముందే రింగ్ అవుతారు. టెండరు అప్పగించాలనుకున్న వ్యక్తికి అనుగుణంగా మిగిలిన వారు బిడ్డింగ్ వేస్తున్నారు. అన్నింటికీ మించి... తాము అధికారంలోకి వచ్చినప్పటికి జరుగుతున్న బడా కాంట్రాక్టర్లను బెదిరించేందుకు, గిట్టని వారిని పంపేసి సొంత సంస్థలకు పనులు అప్పగించేందుకే జగన్ సర్కారు 'రివర్స్' టెండరింగ్‌ను తీసుకొచ్చిందనే బలమైన ఆరోపణలున్నాయి.

బెదిరింపులు.. ఒత్తిళ్లు...

అంతకుముందు బిడ్ తెరిచిన తర్వాత 'ఎల్1'గా ఎవరు ఉంటే వారికే కాంట్రాక్టు దక్కేది. కనిష్ఠంగా 'కోట్' చేసిన మొత్తం కూడా రహస్యమే. ఇక్కడ అలా కాదు. ఎల్1ను ఎవరో, కోట్ చేసింది ఎంతో చెప్పేసి... అంతకంటే తక్కువ కోట్ చేస్తారా అని అడుగుతారు. 'రింగ్'లో భాగంగా ఒప్పందం ప్రకారం కాంట్రాక్టు ఇస్తారు. అలాకాదని ఎవరైనా పోటీకి వస్తే... బెదిరింపులూ, హెచ్చరికలే! బిడ్లు దాఖలు చేస్తే ఇబ్బందులు తప్పవని, వర్క్‌లు ఎలా చేస్తారో చూస్తామని హెచ్చరించేవారు. ఒకవేళ ఎక్కడైనా కాంట్రాక్టర్లు ధైర్యంగా బిడ్లు దాఖలు చేసినా అధికారులు బెదిరించేవారు. ఏదో ఒక అడ్డంకి కల్పించి, అర్హత లేదంటూ తప్పించేవాళ్లు! ఐదేళ్లు ఇదే దందా సాగింది. ఇకనైనా కొత్త ప్రభుత్వం మళ్లీ ఆన్‌లైన్ టెండర్ల విధానాన్ని అమలు చేయాలని, రివర్స్ టెండరింగ్‌ను ఎత్తేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

దేవదాయ శాఖ

రెండు ఆలయాల నిర్మాణం కోసం దేవదాయ శాఖ అధికారులు ఇటీవల టెండర్లు ఆహ్వానించారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో ఈ ఆలయాలను ఏర్పాటుచేసేందుకు పిలిచిన టెండరులో కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యారు. అందరూ కలిసిపోయి, ఎవరెక్కువ ముడుపులిస్తే ఆ కాంట్రాక్టర్‌కు టెండర్ దక్కేలా ఒప్పందం కుదిరిపోయిందని చెబుతున్నారు. దేవదాయ శాఖలో ప్రతి టెండరు కూడా ఇదే విధానంలో ఖరారు అవుతోందని చెబుతున్నారు.

నాకు బిడ్.. మీకు గిఫ్ట్

రాజమండ్రిలోని హోమియోపతి కాలేజీ నిర్మాణం పనుల కోసం నలుగురైదుగురు కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. అందరూ కూర్చుని మాట్లాడుకున్నారు. మిగతావారితో ఒప్పందాలు పూర్తిచేసుకుని, ఒకరు టెండర్ దక్కించుకున్నారు. ఒప్పందం ప్రకారం వారికి బహుమతులు సమకూర్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) పరిధిలో ఈ వ్యవహారం నడిచింది. కార్పొరేషన్ పరిధిలో గత ఐదేళ్లు ప్రతి టెండర్‌లో ఇదే పద్ధతి సాగిందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

పాత పద్ధతే..

ఆన్‌లైన్ విధానం అందుబాటులో లేని పాత రోజుల్లో బాక్స్ టెండర్లు ఉండేవి. బాక్స్ టెండర్లు ఉన్నప్పుడు ఏం జరిగిందో... ఆ తర్వాత రివర్స్ టెండరింగ్‌లో అదే జరుగుతోంది. అప్పుడూ ఇలాగే కాంట్రాక్టర్లంతా ముందే కుమ్మక్కయ్యేవారు. టెండర్లు ఎవరు వేస్తున్నారనేది ముందు తెలుసుకుని, వారికి కొంత మొత్తం చెల్లించి టెండర్లు దాఖలు చేయకుండా చూసుకునేవారు. ఒకే కాంట్రాక్టర్ రెండు, మూడు కంపెనీల పేరుతో బిడ్లు దాఖలు చేసేవాడు. తనకు ఏ కంపెనీ పేరు మీద టెండర్ రావాలో దాని పేరుతో తక్కువ కోడ్ చేసేసి, టెండర్ దక్కించుకునేవారు. దీనివల్ల ప్రభుత్వానికి తీవ్ర నష్టం వచ్చేది. ఈ విషయాన్ని గుర్తించిన అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఆన్‌లైన్ విధాన్ని తీసుకువచ్చింది. టెండర్ ప్రక్రియ నిజాయితీగా జరగాలని, అర్హత కలిగిన కాంట్రాక్టర్‌కు టెండర్ దక్కాలని ఈ విధానం తెచ్చారు. ఆ తర్వాత వచ్చిన గత వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండర్ తెచ్చి.. మళ్లీ ఆ పాత బాక్స్ పద్ధతినే ఐదేళ్లు కొనసాగించింది.

ఇరిగేషన్‌లో ఈఎన్‌సీ కోసం అన్వేషణ!

▸ నారాయణరెడ్డి రిటైర్మెంట్‌తో మూడు పోస్టులు ఖాళీ

▸ అందుబాటులో ఉంది కేవలం ఇద్దరు చీఫ్ ఇంజనీర్లే

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖలో ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) పోస్టును భర్తీ చేయడం కోసం అన్వేషణ సాగుతోంది. మేజర్ ఇరిగేషన్, కమిషనర్ ఆఫ్ టెండర్స్ ఇంజనీర్ ఇన్ చీఫ్‌తో పాటు కృష్ణా డెల్టా చీఫ్ ఇంజనీర్ బాధ్యతలను నిర్వహిస్తున్న సి.నారాయణ రెడ్డి 31న (బుధవారం) పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఈ మూడు ప్రధాన పోస్టుల్లో సీనియర్ చీఫ్ ఇంజనీరును నియమించాల్సి ఉంది. ప్రస్తుతం చీఫ్ ఇంజనీరుగా ఉన్న శ్రీనివాస్ కందికళ్లను ఇంజనీర్ ఇన్ చీఫ్(పరిపాలన)గా నియమించారు. రెగ్యులర్ చీఫ్ ఇంజనీర్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకట నాగేంద్ర అంజి రత్నకుమార్ తోట, వెంకటాచార్యులు శ్రీనాథ్ కొలికండడయ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ పోస్టుకు అర్హులేనని ఆ శాఖ ఉన్నతాధికారులు అంగీకరిస్తున్నారు. అయితే ఈఎన్‌సీ పోస్టులో నియమించేందుకు సీనియారిటీని కాకుండా ప్రాంతం, కులం పరిగణనలోకి తీసుకోవాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిపై ఇంజనీరింగ్ అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఖాళీలు ఏర్పడిన వెంటనే కిందిస్థాయిలో సీనియారిటీ కలిగిన వారికి పదోన్నతి కల్పించడం ఆనవాయితీ. గత ఐదేళ్లుగా ఈ విధానానికి ఫుల్‌స్టాప్ పెట్టారు. భారీ నీటి పారుదల, కమిషనర్ ఆఫ్ టెండర్స్ ఇంజనీర్ ఇన్ చీఫ్‌గానూ, కృష్ణా డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీరుగానూ ఒకే అధికారిని కొనసాగించడంతో పదోన్నతుల చైన్‌కు బ్రేక్ పడింది. దీంతో ఇప్పుడు అత్యంత కీలకమైన మేజర్ ఇరిగేషన్, కమిషనర్ ఆఫ్ టెండర్ పోస్టులకు ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా ఎవరిని నియమించాలో తెలియక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇదే సమయంలో ప్రస్తుత ఈఎన్‌సీ సి.నారాయణ రెడ్డిని కొనసాగించాలంటూ ఒక కాంట్రాక్టు సంస్థ ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తెస్తోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈఎన్‌సీ నియామక బాధ్యతలను మంత్రి నిమ్మల రామానాయుడుకే అప్పగించినట్లు జల వనరుల శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ శాఖ ఉద్యోగుల సీనియారిటీని 2017లో ప్రభుత్వం కొలిక్కి తెచ్చింది. ఈ జాబితాపై ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కొందరు అధికారులు కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం జాబితాను రద్దు చేయడంతో ఇంజనీరింగ్ అధికారుల సీనియారిటీ అంశం గందరగోళంగా మారింది. ప్రస్తుతం ఈఎన్‌సీ పోస్టులో అడ్మినిస్ట్రేషన్ విభాగంలో శ్రీనివాస్ బాధ్యతలు నిర్వహిస్తుండగా నారాయణరెడ్డి బుధవారం రిటైర్ అవుతుండటంతో మేజర్ ఇరిగేషన్, కమిషనర్ ఆఫ్ టెండర్స్ ఈఎన్‌సీ పోస్టులు ఖాళీ అవుతున్నాయి. రాష్ట్రంలో 19 చీఫ్ ఇంజనీర్లు, 52 ఎస్ఈ, 161 ఈఈ, 291 డీఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పదోన్నతుల ద్వారా వీటిని భర్తీ చేస్తే తప్ప శాఖలో పాలన గాడిలో పడదని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఆ దిశగా గత ఐదేళ్లుగా అడుగులు వేయలేదు. ఇప్పటికైనా అత్యంత కీలకమైన ఇరిగేషన్ శాఖలో ఖాళీలు భర్తీ చేస్తారా, లేదా అనే సందేహాలు నెలకొన్నాయి. సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పిస్తూ, ఖాళీలను భర్తీ చేయడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తేనే జల వనరుల శాఖలో సమస్యలకు చెక్ పడుతుందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

డొనేషన్ల సేకరణ ఒక్కటే టీటీడీ పని కాదు: ఎల్వీ


తిరుమల ఆలయం ముందు ఎల్వీ సుబ్రహ్మణ్యం

తిరుమల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): 'డొనేషన్లు సేకరించడమే టీటీడీ పని కాదు. ఈ విషయాన్ని నేను చాలాసార్లు చెబుతూ వచ్చా. ఆ కార్యాన్ని స్వామి చూసుకుంటాడు. వచ్చినదాంతో భక్తులకు ఎలా సేవలందించాలి, సంప్రదాయాలను ఎలా నిలబెట్టాలి, స్వామి ఉత్సవాలను ఎంత చక్కగా నిర్వహించాలి, ఇతర ప్రాంతాలకు స్వామి వైభవాన్ని ఎలా విస్తరింపజేయాలి అనే అంశాలపై టీటీడీ ఈవో, అదనపు ఈవో దృష్టిసారించాలి' అని టీటీడీ మాజీ ఈవో, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం అభిప్రాయపడ్డారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరూ స్వామికి చక్కని కైంకర్యాలు, భక్తులకు సేవలందించడంలో జాగ్రత్తగా వ్యవహరించాలని మనవి చేసుకుంటున్నానన్నారు. ప్రభుత్వ పక్షాన మరిన్ని సేవలు అందాల్సిన అవసరముందన్నారు. ధర్మ ప్రచారానికి ప్రధాన వేదిక టీటీడీ కావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. పలువురు పండితులు రాసిన అనేక గ్రంథాలు టీటీడీ వద్ద ఉన్నాయని, వాటిని అనేక భాషల్లో ముద్రించి సరసమైన ధరకు విక్రయించాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు.

పెనాల్టీల పేరుతో సామాన్యుల జేబులు గుల్ల

▸ బ్యాంకులు, మోదీపై రాహుల్ ఫైర్



న్యూఢిల్లీ, జూలై 30: తమ ఖాతాల్లో కనీస మొత్తం ఉంచని ఖాతాదారులపై ప్రభుత్వ రంగ బ్యాంకులు పెనాల్టీలు విధించడంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. ప్రధాని మోదీ 'అమృత కాల్'లో పెనాల్టీల పేరిట సామాన్యుల జేబులు గుల్ల చేస్తున్నారని మంగళవారం 'ఎక్స్'లో ధ్వజమెత్తారు.2019-20 నుంచి 23-24 వరకు ఐదేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులు పెనాల్టీల కింద ఖాతాదారుల నుంచి రూ.8,500 కోట్లు వసూలు చేశాయని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో చెప్పారు. దీనిపై రాహుల్ స్పందించారు. 'తమ మిత్రులైన పారిశ్రామికవేత్తలకు రూ.16 లక్షల కోట్లు మాఫీ చేసిన మోదీ ప్రభుత్వం.. ఖాతాల్లో కనీస నిల్వ ఉంచలేని పేదల నుంచి రూ.8,500 కోట్లు వసూలుచేసింది. మోదీ చక్రవ్యూహానికి ఈ జరిమానా విధానం ద్వారం వంటిది. దీని ద్వారా జనం నడ్డి విరుస్తున్నారు. గుర్తుంచుకోండి.. భారతీయులు అభిమన్యులు కాదు.. అర్జునులు. మోదీ చక్రవ్యూహాన్ని ఛేదించి మీ అత్యాచారాలకు సమాధానమివ్వడం వారికి తెలుసు' అని వ్యాఖ్యానించారు.

నిస్తేజంలో రవాణా శాఖ

▸ ప్రజల సహనానికి 'వాహన్-పరివాహన్' పరీక్ష

▸ ఆన్‌లైన్ సేవల్లో గందరగోళం.. ఆగిపోయిన ఈ ప్రగతి

▸ ఆగిన ఐటీ ప్రాజెక్టులు.. తిరోగమనంలో రవాణా రంగం



అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): కోటిన్నరకు పైగా వాహనాలు... నాలుగున్నర వేల కోట్ల ఆదాయం... ఐదు కోట్ల మంది ప్రజలకు రవాణా సర్వీసులు... వేలాది రోడ్డు ప్రమాదాల కట్టడికి చర్యలు.. ఇంతటి కీలకమైన రవాణా శాఖ ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అనాథలా ఉంది. ఆన్‌లైన్‌లో సేవలు గందరగోళంగా తయారయ్యాయి. గత ప్రభుత్వం సర్వీసు చార్జీ చెల్లించక పోవడంతో ఐటీ విభాగం అస్తవ్యస్తమైంది.. వాహన్-పరివాహన్ మూడేళ్లుగా విజయవాడలో పైలట్‌కే పరిమితం కావడంతో సేవల పొందాలంటే తల ప్రాణం తోకలోకి వస్తోంది. 2019కు ముందు చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో ఏకంగా 83రకాలా ఆర్టీఏ సేవలు ఆన్‌లైన్లో అందేవి.. డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే ట్రాక్‌లో టెస్ట్ కోసం దరఖాస్తుదారు వెళ్లాలి. వాహనమైతే ఫిట్ నెస్ కోసమే ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. మిగతా అనుమతులు, పన్నులు, ఇతర సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉండేవి. ప్రజలు వాటికి అలవాటు పడి ఇప్పుడు ఈ ప్రగతి ద్వారానే చెల్లింపులు, సర్వీసులు పొందేవారు. వాహన డీలర్లు, ఫైనాన్షియర్లు, ఉత్పత్తిదారులు అందరూ ఆన్‌లైన్‌లోనే అన్నీ పూర్తి చేసేవారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రగతిని ఆపేసింది. డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఆర్‌సీ కార్డుల సరఫరా నిలిపేసింది. రాష్ట్రంలో రవాణా రంగమే తిరోగమనం బాట పట్టింది. ఇటు రవాణా శాఖ కమిషనర్ ఎం.కె. సిన్హా హైదరాబాద్ నుంచి విజయవాడలోని ఆఫీసుకు మంగళవారం వచ్చి శుక్రవారం మధ్యాహ్నం నుంచే వెళ్లిపోతుండటం, సంబంధిత శాఖ మంత్రి కూడా సమీక్షించక పోవడంతో ఆ ప్రభావం రవాణా సిబ్బంది పనితీరుపై చూపుతోంది. లారీ యజమానులు కమిషనర్ వద్దకెళ్లి తమ సమస్య చెబితే అవన్నీ భరించాలి తప్పదని ఆయన సమాధనం ఇవ్వడంతో దిక్కుతోచక వెనక్కి తిరిగొచ్చారు. ఐటీ విభాగంలో మ్యాన్ పవర్ సర్వీసెస్‌కు డబ్బులు ఇవ్వకపోగా ఏడాది నుంచి కనీసం రెగ్యులర్ చేయట్లేదు. ఫలితంగా మెన్‌పవర్ సర్వీసులో ఉద్యోగులు మానేసి వెళ్లిపోతుండటంతో రవాణా సేవలకు బ్రేక్ పడింది.

ఐటీ ప్రాజెక్టులన్నీ బంద్...

రవాణా సేవలన్నీ ఇంటి నుంచే ప్రజలు పొందేందుకు ఆ శాఖలో ఐటీ విభాగం కీలకంగా పనిచేసేది. రవాణా వాహన యజమానులు తాత్కాలిక అనుమతి తీసుకోవాలన్నా, త్రైమాసిక పన్నులు చెల్లించాలన్నా ఐటీ విభాగం పనితీరుతోనే ముడిపడి ఉండేది. ఇలా ఐటీకి అధిక ప్రాధాన్యం ఇచ్చే చంద్రబాబు ప్రభుత్వంలో వాహన ట్రాకింగ్ సిస్టమ్ తీసుకొచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా కేంద్రం కూడా కోట్లాది రూపాయల నిధులు తమ వాటాగా ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసి ఐదు కోట్ల రూపాయలు మూడేళ్ల క్రితమే విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయక పోవడంతో ఏ వాహనం ఎక్కడుందో తెలిసేలా ఆర్టీఏ తీసుకు రావాలనుకున్న ప్రాజెక్టు పెద్దుకు చేరింది.

ఆగిపోయిన అభయ

ఆడబిడ్డలకు ఆపదొస్తే గన్ కన్నా ముందుగా జగన్ వస్తాడంటూ ఆయన అనుయాయులు పదే పదే చెప్పేవారు. అయితే ఆటోల్లో ప్రయాణించే మహిళలు, యువతుల రక్షణ కోసం అభయ(ఆటో, ట్యాక్సీ ప్రయాణాల్లో ఆపదొస్తే నొక్కే బటన్) ప్రాజెక్టు కోసం కేంద్రం 50కోట్లు విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వం కొంత మ్యాచింగ్ ఇచ్చేందుకు మన సురాక ప్రాజెక్టునే పట్టించుకోకుండా వదిలేసింది. ఇలాంటివి చూసుకోవాల్సిన ఐటీ విభాగం అధికారి శ్రీదేవి ఏడాది పాటు సెలవులో వెళ్లారు. డబ్బులివ్వకుంటే నేను సర్వీసు ఇవ్వలేనంటూ ఐటీ మెన్‌పవర్ కాంట్రాక్టరు గోడు వెల్లబోసుకొంటున్నట్లు సమాచారం. మరోవైపు వాహన్-పరివాహన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకుండానే ఈ ప్రగతి ఆపేయడంపై విజయవాడలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పొమ్మన్నా పోరు.. వద్దన్నా వినరు!

▸ రాజీనామా చేయని ఆగ్రోస్ చైర్మన్... నేడు బోర్డు మీటింగ్ ఏర్పాటు

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆగ్రోస్ చైర్మన్ తీరు ఆ సంస్థ ఉద్యోగులకే విస్మయం కలిగిస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా.. గత ప్రభుత్వంలో నియమితుడైన ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ ఇంకా పదవిలో కొనసాగడం వివాదాంశమవుతోంది. నామినేటెడ్ పదవుల్లో నియమితులయ్యే వారు తమకు అనుకూల ప్రభుత్వం వస్తేనే.. గడువు దాకా కొనసాగుతారు. ప్రభుత్వం మారితే పదవులకు రాజీనామాలు చేయడం సహజం. లేకపోతే అధికార పార్టీ వారిని తొలగిస్తూ, ఆర్డినెన్స్ జారీ చేస్తారు. ఈ క్రమంలో రాష్ట్రంలో వైసీపీ అధికారం కోల్పోయి, ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక.. గత ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టుల్లో నియమితులైన నేతలంతా ఆయా పదవులకు రాజీనామాలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. దీంతో గత ప్రభుత్వంలో నియమితులైన అనేక కార్పొరేషన్లు, బోర్డులు, అకాడమీలు, మార్కెట్ కమిటీలు, సహకార సంఘాలు, ఇతర స్వతంత్ర ప్రతిపత్తి సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యులు చాలా మంది ఇప్పటికే రాజీనామాలు సమర్పించారు. ఆయా సంస్థలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమిస్తోంది. అయితే ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ మాత్రం రాజీనామా చేయలేదు. తన పదవీ కాలం ఇంకొన్నాళ్లు ఉందంటూ, రాజీనామాకు ససేమిరా అంటున్నారని అధికారులు చెప్తున్నారు. ఆగ్రోస్ చైర్మన్ రాజీనామా చేయకపోగా, బుధవారం 301వ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ మీటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఆగ్రోస్ డైరెక్టర్లకు మీటింగ్ సమాచారం పంపారు. దీనిపై ఆగ్రోస్ ఉద్యోగుల సంఘం ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసింది. అయితే తనకు గత ప్రభుత్వం ఇచ్చిన నియామక ఉత్తర్వు ప్రకారం ఆగస్టు నెల వరకు పదవీ కాలం ఉందని చైర్మన్ నవీన్ నిశ్చల్ వాదిస్తున్నారు. కాగా, ఏపీ ఆగ్రోస్‌లో ముఖ్య అధికారికి వైసీపీ ప్రభుత్వం దొడ్డిదారిలో రెండు పదోన్నతులు కల్పించడం చర్చనీయాంశమైంది. రిజిస్టర్ కాని ఉద్యోగ సంఘాన్ని, సామాజిక వర్గ నేపథ్యాన్ని అడ్డం పెట్టుకుని, ఆగ్రోస్‌లో ముఖ్య పాత్ర పోషిస్తున్న సదరు అధికారి వ్యవహారంపై ప్రభుత్వం ఆరా తీస్తున్నట్లు సమాచారం. జూనియర్ మార్కెటింగ్ ఆఫీసర్‌గా ఉన్నప్పటి నుంచే అవినీతి ఆరోపణలున్న ఆ అధికారి గత ప్రభుత్వంలో రైతులకు ఎరువులు, పురుగుమందుల పంపిణీకి కేటాయించిన సొమ్ము దారి మళ్లించారన్న ఆరోపణలున్నాయి. 2022లో ఒక కంపెనీకి రూ.70లక్షల అడ్వాన్స్‌గా చెల్లించారన్న విమర్శలున్నాయి. దీంతో ఆ అధికారి విచారణను ఎదుర్కొంటున్నారు. ఆ అధికారికి పదోన్నతి ఇవ్వాలని ఎంపీ అవినాశ్‌రెడ్డితో పాటు పలువురు వైసీపీ ప్రభుత్వ పెద్దలు సిఫారసు లేఖలు ఇచ్చారు. దీంతో వైసీపీ ప్రభుత్వం ఈ అధికారికి అడ్డగోలుగా పదోన్నతిని కల్పించింది. అగ్రికల్చర్ ఇంజనీరింగ్ డిగ్రీ లేకున్నా.. వైసీపీ ప్రభుత్వంలో రెండుసార్లు పదోన్నతులు తీసుకున్నారు. ఇప్పుడు అంతకన్నా పై పోస్టుకు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. సంస్థలో గిట్టని వాళ్లపై తరచూ ఆరోపణలు చేసే ఆ అధికారి.. ఇటీవల ఆగ్రోస్‌లో క్రమశిక్షణ చర్యల కింద బదిలీ అయిన సిబ్బందికి అనుకూలంగా లేఖలు రాయడంపై ఆగ్రోస్ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

హైదరాబాద్‌లో గ్యాంగ్ రేప్!

▸ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై బాల్యస్నేహితుడి అఘాయిత్యం

▸ ఒకరి అరెస్టు, పరారీలో మరొకరు

వనస్థలిపురం, జూలై 30(ఆంధ్ర జ్యోతి): హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సామూహిక అత్యాచారానికి గురైంది. ఉద్యోగం వచ్చింది కదా.. పార్టీ ఇవ్వు అని బాల్య స్నేహితుడు అడిగితే.. సరే అనడమే ఆమె చేసిన తప్పయింది. తనని నమ్మి వచ్చిన స్నేహితురాలితో బలవంతంగా మద్యం తాగించిన స్నేహితుడు ఆమె అపస్మారక స్థితిలో ఉండగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆపై, తన స్నేహితుడిని పిలిపించి మరీ అత్యాచారం చేయించి ఆమె జీవితాన్ని నాశనం చేశాడు. వనస్థలిపురం పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటన మంగళవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ యువతి(24)కి ఓ ఐటీ కంపెనీలో ఇటీవల ఉద్యోగం వచ్చింది. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆమెతో కలిసి చదువుకున్న హయాత్‌నగర్‌కు చెందిన ఎడ్ల గౌతమ్ రెడ్డి(24) ఆమెకు శుభాకాంక్షలు చెప్పి పార్టీ అడిగాడు. సోమవారం రాత్రి ఇరువురు కలిసి సాగర్ రింగ్ రోడ్డు సమీపంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. అక్కడ గౌతమ్‌రెడ్డి బలవంతంగా మద్యం తాగించగా ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో ఆ రెస్టారెంట్ భవనంలో ఉన్న హోటల్‌లో గది అద్దెకు తీసుకున్న గౌతమ్ రెడ్డి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం తన స్నేహితుడు, చౌటుప్పల్‌కు చెందిన మునగాల శివాజి రెడ్డి అలియాస్ చింటు రెడ్డి(30)కి ఫోన్ చేసి అక్కడికి పిలిపించాడు. అతను కూడా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో బాధితురాలు కేకలు వేయడంతో గౌతమ్‌రెడ్డి, చింటురెడ్డి పరారయ్యారు. అనంతరం బాధితురాలు మరో స్నేహితుడికి ఫోన్ చేయగా, ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించి, ఆమె సోదరునికి సమాచారం ఇచ్చాడు. యువతి సోదరుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, గౌతమ్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఏపీలో పెట్టుబడులు పెట్టండి

▸ పరిశ్రమల ఏర్పాటుకు సహాయ సహకారాలు

▸ కర్ణాటక పారిశ్రామికవేత్తలకు మంత్రి సవిత ఆహ్వానం



పెనుకొండ టౌన్/అనంతపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఏపీలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం నూతన పరిశ్రమల ఏర్పాటుకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తుందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖల మంత్రి సవిత చెప్పారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని, అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టాలని కర్ణాటక పారిశ్రామికవేత్తలను ఆమె కోరారు. మంగళవారం బెంగళూరులోని తాజ్ హోటల్‌లో టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ తదితర పరిశ్రమల నిర్వాహకులతో ఆమె భేటీ అయ్యారు. ఏపీలో సుస్థిర పాలన ఉందని, అనువైన భూములు కూడా ఉన్నాయని వారికి వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఏపీలో నైపుణ్యం కలిగిన యువత ఉందని, ప్రతిభకు తగిన అవకాశాల కోసం వారు ఎదురుచూస్తున్నారని తెలిపారు. 13 మంది పారిశ్రామికవేత్తలు, సీఈవోలతో మంత్రి మాట్లాడగా, పరిశ్రమల స్థాపనకు వారు సానుకూలంగా స్పందించారు. కర్ణాటకలోని తమ పరిశ్రమలలో తక్కువ విద్యార్హత ఉన్న గ్రామీణ మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని పలువురు పారిశ్రామికవేత్తలు మంత్రికి వివరించారు. అదే తరహాలోనే ఏపీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో 2018, 2023లో టెక్స్‌టైల్స్ పాలసీని ప్రవేశపెట్టారని, వేతన రీయింబర్స్‌మెంట్, పవర్ సబ్సిడీ సహా వివిధ ప్రోత్సాహకాలను అందించడానికి అనువుగా పాలసీని రూపొందించారని వారు గుర్తు చేశారు. ప్రస్తుతం కర్ణాటకలో 25 వేల మందికిపైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, ఏపీ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తే రాబోయే రెండేళ్లలో 25 వేల మందికి ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు. సమావేశంలో టెక్స్‌పోర్ట్, ఓవర్‌విజన్ ప్రైవేట్ లిమిటెడ్, ఇండియన్ డిజైన్ ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, కాటన్‌వరల్డ్, అరవింద్ లిమిటెడ్, సేవ్ అర్త్ ప్రైవేట్ లిమిటెడ్, ఆదిత్య బిర్లా రిటైల్ ఫ్యాషన్స్ కంపెనీల సీఈవోలు పాల్గొన్నారు.

‘క్యాట్’కు వేళాయె!

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● బుధవారం 31 జూలై 2024
diksuchi@andhrajyothy.com

మేనేజ్‌మెంట్ కోర్సు చదవాలి అనుకునే ప్రతి ఒక్కరూ పేరొందిన కాలేజీల్లో చదవాలనుకుంటారు. అలాంటి మేనేజ్‌మెంట్ కోర్సుల అడ్మిషన్ల తొలి అంచెకు ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో మంచి పర్సంటైల్ సాధించిన అభ్యర్థులు ఆయా అడ్మిషన్లలో ముందు వరుసలో ఉంటారు.



కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)-2024 నోటిఫికేషన్ వెలువడింది. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. దేశ వ్యాప్తంగా 170 నగరాల్లో నవంబరు 24న పరీక్షను నిర్వహించనున్నారు.

ఐఐఎంలు: అహ్మదాబాద్, ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. గతంలో నిర్వహించిన క్యాట్ పరీక్షల ప్రకారం... మొత్తం 198 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ విభాగాల నుంచి మొత్తం 66 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు 3 మార్కులు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తాయి.

2023 క్యాట్ పరీక్షను పరిశీలిస్తే... సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు కింది విధంగా ఉన్నాయి

సెక్షన్	ఎంసీక్యూస్	నాన్ ఎంసీక్యూస్	ప్రశ్నలు	సమయం
వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ)	21	3	24	40ని
డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఅండ్ఎల్ఆర్)	14	6	20	40ని
క్వాంటిటేటివ్ ఎబిలిటీ(క్యూఏ)	14	8	22	40ని
మొత్తం	**49**	**17**	**66**	**120ని**

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

ముఖ్య సమాచారం:

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తేదీలు:** ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 13 వరకు
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** నవంబరు 5 నుంచి
- **పరీక్ష తేదీ:** నవంబరు 24
- **ఫలితాల ప్రకటన:** జనవరి 2025
- **వెబ్‌సైట్:** https://iimcat.ac.in/

సిలబస్

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: ఇందులో న్యూమరికల్ బేస్డ్ ప్రశ్నలు ఉంటాయి. బేసిక్ అర్థమెటిక్, నంబర్ సిస్టమ్, ఆల్జీబ్రా, జామెట్రీ అండ్ మెన్సురేషన్, మోడర్న్ మేథ్స్ ప్రధాన టాపిక్‌లు.

వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ): అభ్యర్థికున్న ఆంగ్ల భాష పరిజ్ఞానాన్ని పరీక్షించేలా ప్రశ్నలు ఉంటాయి. సెంటెన్స్ కరెక్షన్ అండ్ కంప్లీషన్, ప్యారా జంబల్స్, సమ్మరీ బేస్డ్, వెర్బల్ ఎబిలీటీ ముఖ్యమైన అంశాలు.

డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఅండ్ఎల్ఆర్): అభ్యర్థులు ఇచ్చిన డేటాను అవగాహన చేసుకుని దాని నుంచి మూల్యాంకనాన్ని రాబట్టే సామర్థ్యాన్ని ఈ విభాగం ద్వారా పరీక్షిస్తారు. మల్టిపుల్ గ్రాఫ్స్ టేబుల్, డయాగ్రమ్స్, క్లాక్స్ అండ్ క్యాలెండర్, అరేంజ్‌మెంట్స్ ఇందులోని ముఖ్యమైన అంశాలు.

ఇవి గుర్తుంచుకోండి..

ఇన్ని మార్కులు వస్తే చాలు అనే భావన వద్దు: క్యాట్ మిగతా అన్ని పోటీ పరీక్షల కంటే భిన్నమైనది. కనీస మార్కులు సంపాదిస్తే చాలు అనే భావన సరి కాదు. ఎందుకంటే లక్షలాది మంది రాసే ఈ పరీక్షలో మీ దృష్టి అంతా కనీస మార్కులు, పర్సంటైల్ మీద కంటే అత్యధిక స్కోరు సాధించడంపైనే ఉండాలి. ఎందుకంటే పేపర్ సులువుగా వస్తే కనీస మార్కులే మిమ్మల్ని గట్టెక్కిస్తాయి, కానీ ప్రశ్నలు కఠినంగా ఉన్నట్లయితే పరీక్షలో మీరు ఒత్తిడికిలోనై చదివింది కూడా మర్చిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి మీ లక్ష్యం ఎక్కువ మార్కులు సంపాదించుకోవడమే అయి ఉండాలి.

సెక్షనల్ కటాఫ్ మాయలో పడొద్దు: చాలామంది అభ్యర్థులు పరీక్షకు ముందు గతేడాది కటాఫ్ మార్కులను పరిగణనలోకి తీసుకొంటారు. ఏ సెక్షన్‌లో ఎన్ని కటాఫ్ మార్కులున్నాయో పరిశీలించి ఆ మేరకు తమ అధ్యయనాన్ని కొనసాగిస్తారు. కానీ ఇది సరైన విధానం కాదు. ఎందుకంటే పరీక్ష పూర్తయిన తర్వాతే నిర్వాహకులు ఏ సెక్షన్‌కు ఎన్ని కటాఫ్ మార్కులు ఇవ్వాలనేది నిర్ణయిస్తారు తప్ప నోటిఫికేషన్ సమయంలో గానీ, పరీక్ష నిర్వహణ సమయంలో గానీ కాదు.

రుణాత్మక మార్కులు తగ్గించుకోవాలి: గత క్యాట్ ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే ఈసారి కూడా TITA(Type in the Answer) లేదా నాన్-ఎంసీక్యూ ప్రశ్నలు వచ్చే అవకాశమున్నప్పటికీ అవి ఎంత శాతం వరకు ఉంటాయనేది ఊహించడం కష్టం. అయితే ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే TITA ప్రశ్నలకు ఎలాంటి రుణాత్మక మార్కులు ఉండవు. కానీ ఎంసిక్యూలకు మాత్రం తప్పుడు సమాధానానికి మార్కులు కట్ చేస్తారు. కాబట్టి అభ్యర్థులు పరీక్షను రాసేటప్పుడు రుణాత్మక మార్కులను దృష్టిలో ఉంచుకోవాలి. వీలైనంత వరకు అలాంటి ప్రశ్నలకు కచ్చితంగా సమాధానం తెలిస్తే తప్ప వదిలి వేయడమే మంచిది. ఎన్ని రుణాత్మక మార్కులు తగ్గించుకొంటే విజయావకాశాలు అంత మెరుగవుతాయి.

TITA ప్రశ్నలపై అధిక సమయం: నెగెటివ్ మార్కుల ప్రమాదం లేనప్పటికీ ఎక్కువ మంది అభ్యర్థులు తమ సమయాన్నంతా ఈ ప్రశ్నలకే వెచ్చిస్తుంటారు. కాబట్టి ఈ ప్రశ్నలకు కచ్చితమైన టైమును నిర్దేశించుకోవాలి. మార్కులు, సమయం విషయంలో సమతుల్యతను పాటించాలి

కచ్చితత్వం కోసం ఎక్కువ సమయం తీసుకోవద్దు: నెగెటివ్ మార్కింగ్ ఉంది కాబట్టి కచ్చితమైన సమాధానాలను గుర్తిస్తే తమ విజయావకాశాలు మెరుగవుతాయని ఎక్కువ మంది విద్యార్థులు భావిస్తారు. కాబట్టి ఇక్కడ అభ్యర్థులు గుర్తించాల్సింది ఏమిటంటే తెలియని ప్రశ్నకు కచ్చితత్వాన్ని కనుక్కోవడంలో ఎక్కువ సమయం వృథా చేసుకోవద్దు. కచ్చితమైన సమాధానాన్ని గుర్తించాల్సిందే, అదే సమయంలో మనచేతిలో టైమ్‌ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రశ్నను చదివి అర్థం చేసుకోగానే తక్కున సమాధానం గుర్తుకొస్తే పరవాలేదు, అలా కాకుండా 70 నుంచి 80 శాతం ఆ ప్రశ్న మీకు కఠినంగా ఉందని అనిపించినప్పుడు వదిలివేయడం ఉత్తమం.

సెక్షన్‌ను స్కాన్ చేయండి: పరీక్ష ప్రారంభం కాగానే సంబంధిత సెక్షన్‌ను స్కానింగ్ చేయడాన్ని ఎక్కువ మంది అభ్యర్థులు విస్మరిస్తుంటారు. ఇది సరైన విధానం కాదు. స్కానింగ్ చేయడం అంటే ప్రశ్న పత్రాన్ని మొత్తం చదవడమన్నమాట. అప్పుడే సులువైన, కఠినమైన ప్రశ్నలపై ఒక అవగాహన కలుగుతుంది. క్యాట్ ఆన్‌లైన్ పరీక్ష కాబట్టి కంప్యూటర్ స్క్రీన్‌పైన కుడివైపున సంబంధిత ప్రశ్న పత్రం సెక్షన్ మొత్తం కనిపిస్తుంది. దాని ద్వారా డబుల్ సెట్స్ ప్యాసేజెస్, ప్రశ్నలను ఎంపిక చేసుకోవచ్చు. అయితే ఈ ప్రక్రియను పరీక్ష ప్రారంభంలోనే పూర్తి చేయాలి.

ఎన్ఐఈపీఐడీలో డిప్లొమా

సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- ‘డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)’ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి 1200 గంటలు చొప్పున మొత్తం 2400 గంటల బోధన ఉంటుంది. ఇండియన్ సైన్ లాంగ్వేజ్, ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో తరగతులు నిర్వహిస్తారు. ప్రాంతీయ భాషల్లో కూడా వివరణ ఇస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ఈ కోర్సులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు నెలకు రూ.2,000ల స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్/హిందీ భాషలో ప్రావీణ్యం తప్పనిసరి. సాధారణ స్థాయిలో వినికిడి సామర్థ్యం ఉండాలి.

ఉద్యోగావకాశాలు: ఈ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థల్లో సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌గా చేరవచ్చు. మూగ-చెవిటి పిల్లలకు, సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌కు ఇన్‌స్ట్రక్టర్లుగా అవకాశాలు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** ఏడాదికి రూ.14,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.200(దివ్యాంగులకు, వారి తల్లిదండ్రులకు దరఖాస్తు ఫీజు లేదు)
- **స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 20
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** ఆగస్టు 26
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2 నుంచి
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ఇన్‌చార్జ్-అకడమిక్స్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ), మనోవికాస్‌నగర్, సికింద్రాబాద్-500009.
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in



లిటిల్స్

కష్టానికి గుర్తింపు

ఒక ఊరిలో గోపయ్య అనే వడ్రంగి ఉండేవాడు. అతనికి ఏ పని అప్పజెప్పినా, ఎంతో శ్రద్ధగా నిజాయితీగా అంకితభావంతో చేస్తాడని మంచి పేరుండేది. ఒక రోజు ఆ ఊరి జమీందారు తన పడవకు రంగులు వేయమని గోపయ్యను పిలిపించాడు. జమీందారు ఇచ్చిన రంగులు తీసుకుని, పడవ దగ్గరికి వెళ్లిన గోపయ్యకు ఆ పడవకు రంధ్రం కనిపించింది. దాన్ని పూడ్చకుండా రంగులు వేయడం వల్ల ఉపయోగం లేదనుకున్న గోపయ్య ముందు ఆ చిల్లును పూడ్చి ఆ తర్వాత రంగులు వేసాడు. జమీందారు ఆ మర్నాడు గోపయ్యను వచ్చి డబ్బు తీసుకెళ్లమని చెప్పి పంపేసాడు. ఆ రోజు జమీందారు



ఒక ఊరికి, అతని కుటుంబ సభ్యులు మరో ఊరికి వెళ్లవలసి వచ్చింది. సాయంత్రం జమీందారు పొరుగూరినుండి తిరిగి వచ్చేసరికి తనత కుటుంబం కొత్తగా రంగులు వేసిన పడవలో నది అవతల ఊరికి వెళ్లారని తెలిసి, జమీందారు ఎంతో కంగారుగా నది వద్దకు పరిగెత్తుకుని వచ్చి పడవకు పడిన రంధ్రం గురించి అడిగాడు. అది చక్కగా మూసివేసిఉండటం గమనించి, గోపయ్యను పిలాచాఅడగగా, గోపయ్య తానే ఆ రంధ్రాన్ని మూసివేసి, ఆ తరువాతే పడవకు రంగులు వేసానని చెప్పాడు, అదివిన్న జమీందారు ‘నేను చెప్పిన పనితో పాటు చెప్పని పని కూడా చేసిపెట్టి, ఈ రోజు నాకుటుంబ సభ్యుల ప్రాణాలు కాపాడావు గోపయ్యా’ అని మెచ్చుకొని, ముందు మాట ఇచ్చిన దానికంటే ఎక్కువ డబ్బు గోపయ్యకు ఇచ్చి ‘ఇది నీ మంచిమనసుకు, పడిన కష్టానికి గుర్తింపు అనుకో’ అని చెప్పాడు.


10 తేడాలను గుర్తించండి?




సరైన నీడ ఏది?



ఎన్ని పక్షులు ఉన్నాయి?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 371

					7	6		
	7		1	3		5	2	
			2	5	6			9
		7	8			4	3	1
3		4				7		5
6	5	1			4	8		
4			7	1	3			
	2	5		8	9		4	
		8	5					

సుడోకు - 370 సమాధానం

1	5	6	2
3	4	2	6
2	1	5	3
4	6	3	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

SCHOLARSHIP ALERT

Muskaan Scholarship Program

Description: A CSR initiative by Valvoline Cummins to offer financial assistance and mentorship support to children of commercial drivers (LMV/ HMV), mechanics and individuals from the Economically Weaker Section (EWS) category, ensuring continuity in their education.

Eligibility: Students studying in Classes 9 to 12 from the southern, eastern, and north-eastern states (Assam, Manipur, Nagaland, Mizoram, Tripura, Arunachal Pradesh, Sikkim, Odisha, Bihar, Puducherry, Chhattisgarh, Kerala, Telangana, Andhra Pradesh, Jharkhand, Karnataka, Meghalaya, Tamil Nadu, and West Bengal) are eligible to apply. The scholarship is available to children of commercial drivers (LMV/ HMV), mechanics and children from the Economically Weaker Section (EWS) category. Applicants must have scored 60% or above in their previous class to be eligible. The total family income from all sources should not exceed INR 8 lakh per annum.

Prizes & Rewards: Scholarship of up to INR 12,000 and mentorship support

Last Date to Apply: 03-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/MKSP1

Mohan T Advani Centennial Scholarship Programme

Description: Blue Star Foundation aims at supporting and empowering underprivileged undergraduate and diploma students enrolled in Architecture and Engineering programmes at select private or government colleges across India through their flagship initiative, i.e. Mohan T Advani Centennial Scholarship Programme.

Eligibility: First and second-year students enrolled in a degree programme in architecture and engineering, such as Electronics Engineering, Mechanical Engineering, Information Technology (IT), Computer Science (CS), and related STEM fields, excluding Civil Engineer ing. Applicants must have scored a minimum of 80% in Class 10 and Class 12 for first-year students, and at least 80% in Class 12 and 75% in the 1st year for second-year students. Students enrolled in specified colleges* will be eligible to apply. Applicants' annual family income from all sources must be less than INR 6 lakh. Recipients should not be beneficiaries of any other scholarship.

Prizes & Rewards: For engineering and architecture students: INR 75,000 or 50% of the annual fees (whichever is less)

For Diploma Students: INR 30,000 or 75% of the annual fees (whichever is less)

Last Date to Apply: 20-08-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/BSFS2

HOPE Engineering Scholarship by Schaeffler India

Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students and preference will be given to students with physical disabilities. The applicants must have scored more than 60% marks in Class 12 (science) in the academic year 2023-24. They must be enrolled in the first year of an engineering program at any recognized college in India. The annual family income of the applicants should be less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000 *Last Date to Apply:* 15-08-2024

Application mode: Online only *Short Url:* www.b4s.in/aj/SIHE15



buddy4study.com